# దేవుడు తీసిన సినిమా - 1

ప్రియులారా! ఈ అంశాన్ని మొట్టమొదట కరపత్రాల ద్వారా, వాల్‌పోస్టర్ల ద్వారా, హోర్డింగ్‌ల ద్వారా, టి.వి. యాడ్స్ ద్వారా ప్రచురించి, అనేకమంది చెంతకు తీసుకుని వెళుతున్నప్పుడు ప్రతీ ఒక్కరిమదిలో పుట్టిన ఆలోచన ఏమిటంటే, 'దేవుడు తీసిన సినిమా' అని అంటున్నారు కదా! దేవుడు సినిమాను ఎలా తీస్తాడు? ఆయన దగ్గర కెమెరా ఎక్కడ ఉంది? ఆయన దగ్గర నటీనటులెవరున్నారు? ఆయన దగ్గర ఏ ప్రొడక్షన్ యూనిట్ ఉంది? ఆయన ఎప్పుడు రిలీజ్ చేస్తాడు? అని అనుకున్నారు. మరికొంతమంది అయితే అసలు సినిమా అనేది దేవునికి సంబంధించిన పదము కాదు కదా! దేవుడు తీసిన సినిమా ఏమిటి? సినిమా అనేది ఒక చెడు పదము. అది ఒక వినకూడని పదము. అలాంటప్పుడు దేవుడు సినిమాను ఎలా తీస్తాడు? అని అనుకున్నారు. ఈ పాఠము ద్వారా ఈ ప్రశ్నలన్నింటికీ మీకు సమాధానము చెప్పి, దేవుడు తీసిన సినిమాను చూపిస్తాను. మీరు శ్రద్ధగా చదవండి. జాగ్రత్తగా ఆలోచించండి. ఈ పుస్తకమును చదవనంత మాత్రాన మీకేమీ ఒరగదు. మీ అమూల్యమైన సమయాన్ని కొద్ది నిమిషములపాటు మీరు దీనిని చదువుటలో వెచ్చించండి. నిజంగా మీరు దేవునికి భయభక్తులు కలిగినవారైతే, దేవుడు తీసిన సినిమా చూడాలనే ఆశ మీకు ఉన్నట్టయితే నా మాటనుబట్టి కొద్ది నిమిషాలు మీరు దీనిని ఓపికతో చదవాలి. నేను మీకు అవాస్తవమును చెప్పడం లేదు. ఒక అబద్ధాన్ని ప్రకటించి మిమ్ములను నేను మోసం చేయడంలేదు. నిజంగానే దేవుడు సినిమా తీసాడు. ప్రపంచంలో ఇప్పటి వరకూ ఎవ్వరికీ తెలియక, ఎవ్వరూ దీనిని ప్రయోగించక చాలామందికి ఇది క్రొత్తగా ఉంది.

భూమి గోళాకారంగా ఉంటుందని ఒక శాస్త్రవేత్త ప్రజలకు చెప్పినప్పుడు అందరూ అతనిని చూచి అపహసించారు. ఎందుకంటే అతడు చెప్పిన ఆ నిజం అప్పటివరకూ ఎవ్వరూ చెప్పలేదు. అంటే ఏదైనా ఒక విషయాన్ని క్రొత్తగా చెప్పినప్పుడు చాలామంది అపహసిస్తారు. ఎందుకంటే అది అంతకుమునుపు ఉన్నవారు వినలేదు. అయినంత మాత్రాన అందులో వాస్తవం లేదు, అది

నిజం కాదు, అది అబద్ధం అనుకోవటం చాలా పొరపాటు. అందుకే మీరు ఈ మాటలన్నీ చదవండి. దేవుడు సినిమా తీసాడో, లేదో – నేను కాదు, మీరే చెప్పాలి. ఇది ఒక వ్యాపారానికి సంబంధించిన కార్యక్రమము కాదు. మీ దగ్గర పైసలు తీసుకుని నేనేదో లాభము సంపాదించుకోవాలని వ్రాయుచున్న రచన కాదు. నేను ఎప్పుడూ నిజాన్నే చెప్పాలి. తెలియని అనేకమంది అభాగ్యులకు, అమాయకులకు ఈ సమాజములో ఉన్న నా తోటి సోదరులకు, సోదరీమణులకు వాస్తవాన్నే చెప్పాలి. అందుకే ఈ మహా ప్రయత్నాన్ని జరిగిస్తున్నాను. దేవుడు తీసిన సినిమాను చూపించనివ్వకుండా చేయటానికి ఎంతోమంది బెదిరింపులు, ఎన్నో అవాంతరాలు, ఎన్నో కష్టాలు, ప్రకృతిపరంగా ఇబ్బందులు, నా చుట్టూ ఉన్న కపట సహోదరుల వలన కూడా అపాయాలు... నాకు ఎదురయ్యాయి. వీటన్నింటినీ అధిగమించి ధైర్యముతో మన తండ్రియైన దేవుడు తీసిన సినిమాను ఈ పుస్తకముద్వారా చూపించుటకు సరిపోయిన కృపను దేవుడు నాకు అనుగ్రహించాడు. దయుంచి నా మాటనుబట్టి మీ మనస్సును దేవుడు తీసిన సినిమా మీద కేంద్రీకరించండి. ఇప్పటి వరకూ మీరు చాలా సినిమాలను చూసి ఉంటారు. ఎంతోమంది దర్శకులు తీసిన, నటీనటులు నటించిన, ఎన్నో దేశాలలో చిత్రీకరించిన సినిమాలు ఇప్పటివరకూ తిలకించి ఉంటారు. వాటిని మీరు చూసినందుకు మిమ్ములను పాపాత్ములని నేను మిమ్మును ద్వేషించుట లేదు.

దేవుడు తీసిన సినిమా అర్థమవ్వాలంటే సినిమాపై కొద్దిపాటి పరిజ్ఞానము మీకుండాలి. అసలు సినిమా అంటే ఏమిటో మీకు తెలియాలి. అప్పుడే దేవుడు తీసిన సినిమా ఏమిటో మీకు అర్థమౌతుంది. ఈ రోజు ఆరిన నేలమీద తల్లిగర్భములోనుంచి బయటకు రాగానే పసిగుడ్డు మొదలుకొని, కాటికి కాలు చాపుకున్న ముసలి తాతయ్య వరకూ ప్రతీ ఒక్కరికీ పరిచయమైనదే ఈ లోకసంబంధమైన సినిమా! టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవి తెలియనివారెవ్వరూ లేరు. కాకినాడ పట్టణంలో, తూర్పుగోదావరి జిల్లాలో, ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలో, తమిళనాడులో సూపర్‌స్టార్ రజనీకాంత్ తెలియనివారెవ్వరూ లేరు. కండలవీరుడు సల్మాన్‌ఖాన్ తెలియనివారు ఎవ్వరూ లేరు. కానీ పింగళి వెంకయ్య ఎవరికైనా తెలుసా? ఆయన మన భారతదేశ జాతీయ జెండాను

చిత్రీకరించిన ఒక స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయనను గూర్చి చాలామందికి తెలియదు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ చాలామందికి తెలియదు. అంతెందుకండీ, మన జాతిపిత గాంధీ గారు కూడా చాలామందికి తెలియదు. పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ మాత్రం చాలామందికి తెలుసు. దీనినిబట్టి, లోకసంబంధమైన సినిమా ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ప్రతీ మనిషి నరనరాలలోనికి వెళ్ళిపోయింది. లోకసంబంధమైన సినిమాను గూర్చి తెలియనివారికి, అసలు దానిమీద పరిజ్ఞానము లేనివారికి, ఈ సినిమాను గూర్చి కొన్ని సంగతులను చెప్పిన తరువాత, దేవుడు తీసిన సినిమాలోనికి మిమ్ములను తీసుకుని వెళతాను. సినిమా అనగానే అదొక బూతుపదం కాదు. అది ఒక వినకూడని పదమేమీ కాదు. శాస్త్రపరంగా మనము మాట్లాడుకుంటే, సినిమా అనేది ఒక చిత్రాలమాలిక. పరిభాషలో దీనిని 24 ఫ్రేములు అంటారు. అనగా, ఒక సెకను కాలములో, మన రెప్పపాటు కాలములో 24 ఫ్రేములు కలిగిన చిత్రాలు మన కళ్ళముందు కదిలితే అది ఒక చిత్రమాలిక అవుతుంది. అప్పుడది ఒక వీడియో అవుతుంది. దానినే సినిమా అన్నారు. దీనికున్న చరిత్ర సుమారు 100 యేళ్ల కాలము. సినిమా అనేది మనుష్యుల మధ్య క్రీస్తు శకం 1890 లో ప్రారంభమైంది. నలుపు, తెలుపు రంగులతో ప్రారంభమైంది. సెకనుకు 24 ఫ్రేములు అమర్చుకుంటూ, రీళ్ళు త్రిప్పుకుంటూ కొన్ని నిమిషములపాటు వారికి నచ్చిన, వారు అనుకున్న, వారు వ్రాసుకున్న కథను చిత్రీకరించి, ఒక దర్శకునిగా, దానికి ధనాన్ని ఖర్చుపెట్టిన నిర్మాతగా, సినిమాలను లోకానికి పరిచయం చేసారు ఆనాటి కాలములోని మన పూర్వీకులు. ఇది కాలక్రమేణా చాలా సాంకేతికతను అందిపుచ్చుకుంది. ఒకప్పుడు నలుపు, తెలుపు రంగులలో మాత్రమే ఉండే ఈ సినిమా ఇప్పుడు మల్టిపుల్ కలర్ సినిమాగా మారింది. ఈస్ట్‌మన్ కలర్ నుండి ఇప్పుడు హెచ్.డి. కలర్‌లోనికి మారిపోయింది. ఒకప్పుడు వినటానికి చాలా ఇబ్బందికరంగా ఉండేటటువంటి శబ్దాలు ఇప్పుడు డి.టి.ఎస్. సౌండ్‌సిస్టమ్‌లోనికి మారిపోయాయి. శబ్దములో పురోగతిని సంపాదించారు. రంగులో అభివృద్ధిని సంపాదించారు. నటనలో అభివృద్ధిని సంపాదించారు. ఆదాయంలో కూడా అభివృద్ధిని సంపాదించారు. నిన్న మొన్న మన తెలుగులో చిత్రీకరింపబడిన ఒక సినిమా కోట్లరూపాయల

ఆదాయాన్ని నిర్మాతలకు అందించింది. ఇది మీ అందరికీ తెలుసు. అన్నింటిలో అభివృద్ధిని సాధించిన ఈ లోకసంబంధమైన చలనచిత్రరంగం లేక సినీ ఇండస్ట్రీ, సమాజానికి మంచిని అందించే పనిలో మాత్రం దిగజారిపోయింది. అందుకే చాలామంది క్రైస్తవ సోదర, సోదరీమణులు దేవుడు తీసిన సినిమా ఏమిటండి? అన్నారు. సినిమా అనగానే అది ఒక బూతు, అది చూడకూడనిది, అది మనకు సంబంధించినది కాదు అనుకున్నారు. అలాంటి వారికి దీని చరిత్ర తెలియదు. దీనికి కారణం, సినిమా అనే వ్యవస్థను ఉపయోగించుకుని చాలామంది చేతకాని దర్శకులు, నాలుగు రాళ్లు సంపాదించుకోవాలనుకునే నిర్మాతలు అసభ్యతను తెరకెక్కించడమే. అది నేను కూడా ఒప్పుకుంటున్నాను. కానీ, సినిమా అంటే పూర్తిగా అసభ్యత మాత్రమే కాదు. పోనీ, సినిమా అంటే ఒక బూతు అనే విషయాన్ని మీరు లోకములో ఎవరికి చెప్పినా, వారు ఒప్పుకోరు. వారికి సినిమా అనేది ఒక ఎంటర్‌టైన్‌మెంట్. సినిమా అనేది వారికొక కాలక్షేపమని ఈ రోజు సమాజమంతా దానికే ఓటు వేసింది. ప్రభుత్వాలు మొదలుకొని, శాస్త్రవేత్తలు మొదలుకొని ఎవ్వరూ దీనిని అసహ్యించుకోలేదు. అందరూ దీనికి మంచి పట్టంగట్టారు. ఇలాంటి పరిస్థితులలో దేవుని ఆత్మ కలిగినవాడనుగా, దేవునిజ్ఞానాన్ని నా తరములో అనేకమందికి ప్రకటించాలనే ఆలోచన కలిగినవాడనుగా, దేవునియొక్క మనసేమిటో నేను తెలుసుకున్నాను. ఆ మనసులో ఆయనకు ఒక ఆలోచన పుట్టింది. అదేమిటంటే, ఈ ప్రపంచంలో దాదాపు అన్ని భాషలలోని మనుష్యులందరూ వారిపుట్టుక నుండి చావువరకూ ఎవ్వరూ చూపించని, ఎవ్వరూ ప్రకటించని, ఎవ్వరూ చెప్పని సినిమాను దేవుడు చూపించాలనుకున్నాడు. తెలుగు దర్శకులు తీసిన సినిమాలు, తమిళ దర్శకులు తీసిన సినిమాలు, హిందీ దర్శకులు తీసిన సినిమాలు, ఇంగ్లీషు దర్శకులు తీసిన సినిమాలు, ఇలా చాలా భాషలలో సినిమాలు వెలువడుతున్నాయి. కానీ, దేవుడు తీసిన సినిమా ఇంకా ప్రపంచంలో విడుదలకు నోచుకోలేదు. అది ఇంకా మరుగున ఉండిపోయింది. నేను దానిని విడుదల చేయాలనుకున్నాను. నా దగ్గరున్న ధనముతో, ఈ తరములో ఉన్న అమాయకులైన ప్రజలకు దేవుని సినిమా చూపించాలనుకున్నాను. అందులో నాకు కష్టాలెదురౌతాయి. అనేకమంది నన్ను ద్వేషిస్తారు. అనేకమంది నా మీద చెడ్డమాటలు పలుకుతారు. నేను

ఎవ్వరి దగ్గరా పైసాకూడా తీసుకోకపోయినా నన్ను నిందిస్తారు. అలాగని ఎవ్వరినీ నేను నిందించలేదే. ఎవ్వరిమీద నేను చెడు మాటలు పలుకలేదే. అయినాసరే, దేవుడు తీసిన సినిమాను చూపించినందుకు నన్ను ద్వేషిస్తున్నారు. హైదరాబాద్‌లో సినీఇండస్ట్రీ ఉంది. ఎవడైనా అక్కడికి వెళ్ళి, ఏ దర్శకుడినైనా నిలదీసాడా? ఎందుకయ్యా ఇలాంటి సినిమా తీస్తున్నావు? ఎందుకు ఈ సమాజాన్ని పాడుచేస్తున్నావు? అని అడిగాడా? లేదు. నా దగ్గరకొచ్చి దేవుడు తీసిన సినిమాను మేము చూడము, చదవము అంటున్నారే, అసలు దీనిని తెలుసుకోకపోతే మీరే నష్టపోతారు. దీనివల్ల నాకేమీ పైసలు రావు. దీనిని తెలుసుకున్నవారికి దేవుడు తీసిన సినిమా ఏమిటో కనిపిస్తుంది, వినిపిస్తుంది, అర్థమవుతుంది.

ప్రియులారా, ఆయన సినిమా మనకోసం వేచి చూస్తోంది. ఇప్పటివరకు మీకు ఉపోద్ఘాతము చెప్పాను. ప్రారంభపు సంగతులను మీకు తెలియజేసాను. దీనినిబట్టి లోకసంబంధమైన సినిమా మరియు దేవుడు తీసిన సినిమాలపై మీకు ఒక అవగాహన వచ్చి ఉండాలి. దేవుడు తీసిన సినిమాలోనికి మనము వెళదాం. దేవుడు తన సినిమాను ఎక్కడ తీసాడు? ఆయన సినిమాను ఎలా తీసాడు? ఒక సెకనుకు 24 ఫ్రేములు కదిలేటట్లుగా దేవుడు తన వీడియోలను ఎక్కడ చూపిస్తున్నాడు? ఆయన ఎక్కడ చిత్రీకరిస్తున్నాడు? ఈ పాఠముద్వారా మనము తెలుసుకుందాం. 4 భాగాలద్వారా తెలుసుకుందాం. లోకసంబంధమైన సినిమావారు ప్రదర్శించినట్టుగా ఒక సినిమానే 4 సార్లు లేక 40 సార్లు మీకు చూపించను. ఈ రోజు రిలీజ్ చేసిందే రేపు కూడా ప్రదర్శించి, దీనిని జెరాక్స్ తీసి మీకు చూపించను. మరొక భాగములో మరో రిలీజ్ వుంది. 4 భాగాలలో 4 సూపర్‌డూపర్ రిలీజ్‌లు ఉన్నాయి. నన్ను కూడా మామూలు సినిమావాడినే అనుకున్నారా? వాళ్ళైతే రెండున్నర గంటలపాటు సినిమా తీసి వందల రోజులు, దానినే మరల మరల చూపిస్తారు. మనము కూడా సొంగ కార్చుకుంటూ, దానినే చూస్తాము. ఉదయం ఆట, మధ్యాహ్నం ఆట, సాయంత్రం ఆట, రెండవ రాత్రి ఆట. అదే ఆటను మళ్లీ మళ్లీ చూస్తాం. దేవుడు తీసిన సినిమాలో అలా ఉండదు. మొదటి భాగములో మొదటి ప్రదర్శన, రెండవ భాగములో రెండవ ప్రదర్శన, మూడవ భాగములో మూడవ ప్రదర్శన, నాలుగవ భాగములో నాలుగవ ప్రదర్శన! మీరు నిజంగా ఆశ్చర్యపోతారు. దేవుడు మన కొరకు

సినిమా తీసాడా? నిజంగా మీరు ఆనంద పడతారు. ఇక ఆయన సినిమాలోనికి మనం వెళదాం. ఏ సినిమాకైనా ఒక పునాది, ఒక మూలం, ఒక స్తంభం లాంటిదే, కథ! దీనినే స్టోరీ లేక స్క్రిప్టు లేక రచన అంటారని మీ అందరికీ తెలుసు. చాలా సినిమాలలో ఆ సినిమాను ప్రారంభించేటప్పుడు, దానికి సంబంధించిన కథను ఎవరు రచించారో మీకు చెబుతారు. స్క్రిప్టు ఎవరు వ్రాసారో మీకు చెబుతారు. భాస్కరభట్ల, విజయేంద్రప్రసాద్ లాంటి చాలా మంది కథలు రచించేవారు తెలుగులో ఉన్నారు. అలాగే బాలీవుడ్‌లో కొంతమంది, హాలీవుడ్‌లో మరికొంతమంది ఉన్నారు. దేవుడుకూడా తాను తీయబోయే సినిమాకు ముందుగా ఒక కథను వ్రాసుకోవాలనుకున్నాడు. రచనను చేసుకోవాలి అనుకున్నాడు. స్క్రిప్ట్‌ను వ్రాసుకోవాలి అనుకున్నాడు. దానినే 66 పుస్తకాలలో వ్రాయించాడు. కానీ దేవుడు ఈ భూమి మీద మనుష్యులకు అర్థమయ్యేలా స్క్రిప్ట్‌ను వ్రాయించి ఇవ్వాలంటే ఆయనేమో పరలోకములో నివశిస్తున్నాడు. ఆయనకు మనలాంటి దేహము లేదు. ఆయన దగ్గర మనలాంటి పెన్నులు లేవు. పుస్తకాలు లేవు. తాళపత్ర గ్రంథాలు లేవు. అందుకే ఆయన రచన చేయాలి, స్క్రిప్ట్ వ్రాయాలి అంటే ఆయనకు కొంతమంది ప్రవక్తలు కావాలి. ఈ ప్రవక్తల చేత దేవుడు తన మనసులో వున్నదంతటినీ స్క్రిప్ట్‌గా వ్రాయించాలి అనుకున్నాడు. తన మనస్సులో ఉన్నదంతా ఒక స్టోరీలైన్‌గా వ్రాయాలనుకున్నాడు. అలా పరిశుద్ధాత్మ ప్రేరణచేత వ్రాయించబడిన పుస్తకమే ఆదికాండముతో ప్రారంభమై ప్రకటన గ్రంథముతో ముగింపబడి 66 పుస్తకాల బైబిల్ అనే దేవుని స్క్రిప్ట్‌గా మన చేతుల్లో కనిపిస్తుంది. బైబిలంతా దేవుడు వ్రాసిన స్క్రిప్ట్! దేవుడు తన గ్రంథములో ఇలాగే వ్రాయించాడో లేదో చూద్దాం. నేనేదో కిట్టింపు వ్యవహారంతో సినిమాను మీకు చూపించాలని ఈ మాటలు నా స్వజ్ఞానంతో మాట్లాడుతున్నానని అనుకోకండి. ప్రతీదానికి మీకు దేవుని వివరణను బైబిల్‌లో చూపిస్తాను. ఎందుకంటే ఇది దేవుడు తీయాలనుకున్న సినిమా. ఆయన వ్రాయించిన మంచిమాటను చూడండి.

**2తిమోతి 3 : 16, 17–** "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష

చేయుటకును ప్రయోజనకరమైయున్నది". ఏమిటండి, దేవుని సినిమా అని చెప్పి బైబిల్ చెప్పేస్తున్నారేంటి, అనుకుంటున్నారా? అవును. వాక్యమంటే ఏమనుకున్నారు? ఇది ఒక స్క్రిప్టు. వాక్యమంటే రచన. వాక్యమంటే ఒక స్టోరీలైన్. ఆ స్టోరీలైన్ గురించి దేవుడేమంటున్నాడో చూడండి. దైవజనుడు సన్నద్ధుడవ్వాలి. రెడీ అవ్వాలి. ఎందుకంటే దేవుడు ఒక సినిమాకు దర్శకత్వం చేయాలనుకుంటున్నాడు. దైవజనులు ఎంతమందున్నారో వారందరినీ దేవుడు సిద్ధపరుస్తున్నాడు. "మోషే, దావీదు, సొలొమోను, ఎజ్రా, యెషయా, యిర్మీయా, జెకర్యా, మత్తయి, యోహాను, పౌలు..."

లేఖనము దైవావేశము వలన వ్రాయబడింది. పరలోకమందున్న దేవుడు, సినిమా తీయటానికి ముందు ఒక రచనను రచించుకున్నాడు. అందుకే ఆయన ఏమనుకున్నాడో దానినే దైవజనులందరూ వ్రాయాలి. వారు తమ మనస్సులో అనుకున్నది వ్రాయకూడదు. వారి మనసులో ఉన్నది పుస్తకంలో పెట్టకూడదు. కేవలం దేవుని మనసులో ఏమున్నదో దానినే స్క్రిప్టుగా వ్రాయాలి. ఎందుకంటే ఇది దేవుని సినిమా. *{This is God's movie. This is not a Paul's movie. This is not a David's movie. This is not a Moses' movie. This is Almighty's Movie}* ఇది దేవుని సినిమా గనుక ఆయన ఆవేశము వలన కలిగినదానినే వారు వ్రాయాలి. లేఖనము అనగా ఆంగ్లభాషలో *{Scriptures}*. *Script* అంటే రచన. దేవుని వలన లిఖింపబడినదే *{Scriptures}* చూసారా! దేవుడు ఒక రచన చేసుకున్నాడు. ఆయన వ్రాసుకున్నాడు. అలాగని ఆయన దగ్గర పుస్తకాలు లేవు. కలము లేదు. ఆయన మనలాంటి శరీరాన్ని ధరించుకుని ఇక్కడ లేడు. దేవుడు ఆత్మ గనుక, ఆయన స్క్రిప్ట్ వ్రాయడానికి భూమి మీద ఉన్న దైవజనులను ఎన్నుకున్నాడు. వారిచేత వ్రాయించాడు. అంటే ఇప్పుడు క్రైస్తవుల చేతుల్లో కనిపిస్తున్న బైబిల్, ఆదికాండము నుంచి ప్రకటన గ్రంథము వరకూ వ్రాయబడిన ప్రతీ మాట, ప్రతీ లేఖనము – దేవుని స్క్రిప్ట్ అన్న మాట! ఇప్పటి వరకూ దీనిని చూచి మీరేమనుకున్నారు? ఆదివారపు మతగ్రంథము అనుకున్నారా? దెయ్యాలు కలలోకి రాకుండా ఉండటానికి తలగడ క్రింద పెట్టుకుని పడుకునేది అనుకున్నారా? ఆశీర్వాద వచనాల కోసం అప్పుడప్పుడూ తెరిచే పుస్తకము అనుకున్నారా? ఏమనుకున్నారు బైబిల్ అంటే? *{This is Script of God's*

*Movie}* దేవుని సినిమాకు ఇదే రచన. స్టోరీ లైన్ అంతా ఇక్కడే ఉంది. ఇప్పుడు కథ ఎక్కడుందో మనకు అర్థమయింది. ఆయన చేసుకున్న రచన ఎక్కడుందో మనకు తెలిసింది. ఇప్పుడు మరొక అడుగు ముందుకు వేద్దాం. దేవుడు రచన చేయించుకున్నాడు. 40 మంది ప్రవక్తల చేత, సుమారు 1600 సంవత్సరాల కాలములో, వివిధ ప్రాంతాలలో దేవుడు ఈ స్క్రిప్టంతా వ్రాయిస్తే, దీనిని సరిగ్గా కూర్చాలి. ఒక మంచి కూర్పు ఉండాలి. ఎడిటింగ్ చక్కగా ఉండాలి. లోకసంబంధమైన సినిమాలో అవసరమైతే ఒక దర్శకుడు సింగపూర్ వెళ్తాడు. ఒక బిట్ అక్కడ చిత్రీకరిస్తాడు. ఆ తరువాత అవసరాన్ని బట్టి థాయ్‌లాండ్ వెళతాడు. అక్కడొక బిట్ చిత్రీకరిస్తాడు. ఆ తరువాత ఇంకా అవసరమైతే కేరళ వెళతాడు. అక్కడొక బిట్ చిత్రీకరిస్తాడు. దేవుడు కూడా ఆయా కాలాలలో, ఆయా ప్రజల దగ్గరకు వెళ్ళాడు, వారిచేత వ్రాయించాడు. అలా మనుష్యుల చేత దేవుడు వ్రాయించిన ఈ స్క్రిప్టును ఇప్పుడు మనము కూర్చాలి. ఒక మంచి కూర్పు చేయాలి. ఇందులో చక్కని ఎడిటింగ్ వుండాలి. దేవుని మాటలను గూర్చి, ఆయన స్క్రిప్టును గూర్చి ఎడిటింగ్ ఎలా చేయాలో ఆయనే మరలా చెప్పాడు.

**యెషయా 28 : 3–** "ఆజ్ఞ వెంబడి ఆజ్ఞ, ఆజ్ఞ వెంబడి ఆజ్ఞ. సూత్రము వెంబడి సూత్రము, సూత్రము వెంబడి సూత్రము. కొంత ఇచ్చట కొంత అచ్చట యెహోవా వాక్యము మీకు వచ్చును." దేవుడు తన సినిమాను చిత్రీకరిస్తున్నప్పుడు, ముందుగా ఆయన అనుకున్నదంతా వ్రాయిస్తున్నపుడు, 'ఆజ్ఞ వెంబడి ఆజ్ఞ' అంటే ఈ స్క్రిప్చర్స్‌లోని దేవుని మాటలన్నీ ముక్కలు ముక్కలుగా పడున్నాయి. కూర్పు చేయబడలేదు. దేవుని సినిమాను చూపించాలి అంటే నేను మంచి కూర్పును చేయాలి. అందుకే దేవుడు చెబుతున్నాడు. ఆయన వ్రాయించుకున్న ప్రతీ సంగతి ఎలా ఉంటుందంటే, అది ఒక ఆజ్ఞ వెంబడి ఆజ్ఞ. మోషే కొంత వ్రాసాడు. దావీదు కొంత వ్రాసాడు. సొలొమోను కొంత వ్రాసాడు. ప్రవక్తలూ, నీతిమంతులూ అందరూ కొంత కొంత వ్రాసారు. అలా ప్రవక్తలందరి చేత ముక్కలు ముక్కలుగా దేవుడు తన రచనను వ్రాయించాడు.

యెహోవా వాక్యము అంతా ఒకే వరుస క్రమములో వచ్చేది కాదు. నీవు పరిశోధించి మంచి కూర్పును చేస్తే తప్ప అది అర్థం కాదు. చాలామంది ఈ

కూర్పును ఎలా చేయాలో తెలియక (అర్థం కాక) ఇందులో తలమునకలై దేవుని వాక్యాన్ని కుక్కలు చింపిన విస్తరిగా మార్చేసారు. ఈరోజు క్రైస్తవ్యం ప్రపంచానికి మహాజ్ఞానాన్ని తెలిపేదిగా ఉందా? లేదు. 'మహాజ్ఞానమా'? అంటే ఏమిటి? అనే పరిస్థితులలో ఉంది. ప్రపంచ మనుష్యులకు వెలుగును చూపే పరిస్థితులలో లేదు. 'వెలుగా'? అదెక్కడ ఉంటుంది? అనే పరిస్థితులలోనికి వచ్చేసింది. ఎందుకో తెలుసా? కొంత ఇచ్చట, కొంత అచ్చట ఉన్న దేవుని వాక్యమును కూర్పు చేయాలి. సరైన ఎడిటింగ్ చేయాలి. అప్పుడు దేవుడు తీసిన సినిమా మనుష్యులకు చాలా చక్కగా అర్థమవుతుంది. అందరికీ తెలుస్తుంది. ప్రియులారా, దేవుడు తన స్క్రిప్టు వ్రాయించుకున్నాడు. ఆ స్క్రిప్టు కొంత ఇచ్చట, కొంత అచ్చట ఉంచాడు. ఇప్పుడు మనము దానిని కలుపుకుంటూ ముందుకు వెళ్ళాలి. కలిపేటప్పుడు చాలా జాగ్రత్తగా కలపాలి. ప్రారంభం ఏదో, ముగింపు ఏదో, అన్నీ జాగ్రత్తగా తెలియాలి. లేకపోతే సినిమా అర్థం కాదు. కూర్పు చాలా చక్కగా ఉన్నప్పుడే సినిమా బాగా అర్థమవుతుంది. అందరికీ నచ్చుతుంది. దేవుడు తీసిన సినిమా మీ అందరికీ నచ్చాలి, ప్రపంచమానవాళికి అందరికీ నచ్చాలి. అందుకే చక్కగా దీన్ని కూర్పు చేద్దాం. కొంత ఇచ్చట, కొంత అచ్చట పడియున్నటువంటి ఈ వాక్యాన్ని బాగా కూర్చుదాం. మంచి ఎడిటింగ్ చేద్దాం. ఇప్పుడు దేవుని సినిమా తీయడానికి కథ సిద్ధమైపోయింది. ఎడిటర్ సిద్ధమైపోయాడు. అన్నీ సిద్ధముగా ఉన్నపుడు ఆయన చేయవలసిన మొట్టమొదటి పనేమిటో తెలుసా? లొకేషన్ చూసుకోవాలి. చక్కని సెట్టింగ్ వేసుకోవాలి. ఈ సినిమాకు లొకేషన్ చాలా ముఖ్యం. దానిని చిత్రీకరించే ప్రదేశం చాలా ముఖ్యం. లోక సంబంధంగా సినిమా తీయాలనుకున్న ప్రతీ దర్శకుడు లొకేషన్స్ కోసం చూస్తున్నాడు. దేవుడు కూడా ఒక మంచి లొకేషన్ చూడాలనుకున్నాడు. ఆయనకు కూడా ఒక మంచి సెట్టింగ్ కావాలి.

**యోబు 9 : 8–** "ఆయన ఒక్కడే ఆకాశమండలమును విశాలపరచువాడు". ఆయన ఒక తెరను పరిచాడు. ఎందుకు?ఆయన తీసే సినిమాకు లొకేషన్ సిద్ధం చేయాలి. ఆ లొకేషన్ ఎక్కడ? ఆకాశం! మొట్టమొదట ఆకాశంలో ఆయన తన పనిని జరిగించాడు. మీ కళ్ళముందు మీరు కళ్ళు పైకెత్తితే, మీ తల పైకెత్తితే విశాలముగా కనిపిస్తున్న ఆ ఆకాశము ఏమిటో తెలుసా? అది

దేవుడు ఏర్పరచుకున్న లొకేషన్. అది ఆయన వేసిన సెట్టింగ్. బైబిల్ అంటే ఏమనుకుంటున్నారు? ఆయన స్క్రిప్ట్ ఇది. మన ఒంటి మీద ఏదో ఒక చిన్న కురుపు వేస్తే తగ్గించుకోడానికి యేసుక్రీస్తు దగ్గరకు వెళదాం అనుకునే బోధ కాదు ఇది. ఒంటిలోపల ఏదో చిన్న రోగం, చిన్న జ్వరం, ఏదో కుటుంబ సంబంధమైనటువంటి సమస్య వస్తే దేవుని దగ్గర తీర్చుకుందాం అని మీరు వస్తే, అటువంటి పుస్తకము కాదిది. మీ కళ్ళ ముందు మీరు దేవుని సినిమాను చూడాలి. రియల్ 3డి పిక్చర్ మీరు చూడాలి. మీ తలలు పైకెత్తితే కనిపించే దానిని దేవుడు వ్రాయించాడు. ఇది భూటకమా? ఇది నటనా? ఇదేమైనా లేనిదా? కానిదా? లోకములో మీకు తెరల మీద, రంగు రంగులతో నాలుగు గోడల మధ్య థియేటర్‌లో చూపించేదంతా భూటకమే. ఎందుకంటే చేసేవన్నీ హీరో చేయడు. వాని స్థానములో ఒక డూప్ చేస్తాడు. తర్వాత హీరో వెళ్ళి, నేనే చేసాను, నేను చేసాను అంటాడు. మీ హీరో బయటకు వచ్చిన తర్వాత నిజంగా ఒక గుద్దు గుద్దండి. అపోలో ఆసుపత్రికి వెళ్ళిపోతాడు. మరి హీరో కదా, 100 మందిని చితక బాదేసాడు. సింగిల్ హ్యాండ్‌తో 100 మందిని చంపేసాడు. నేను చిన్న గుద్దు గుద్దితే ఇలా అయిపోయాడేంటి? అనుకుంటున్నారా! వాడే డూపు హీరో. అదంతా కేవలం నటన. అందులో అవాస్తవాలు పుష్కలంగా ఉన్నాయి. అది కేవలం మిమ్మును రెండున్నర గంటలపాటు నవ్వించటానికి ఉపయోగపడేదే తప్ప, వాస్తవాలను తెరకెక్కించేది మాత్రం కాదు. కానీ, దేవుడు అవాస్తవాలను చెప్పటం లేదు. 66 పుస్తకాలంటే ఏమనుకుంటున్నారండి? అది ఆయన వ్రాయించుకున్న స్క్రిప్ట్. అది ఎంత గొప్పదో తెలుసా? అందులో కీర్తనలున్నాయి, యుద్ధాలున్నాయి. ప్రేమానురాగాలు, రాగద్వేషాలున్నాయి. అందులో నటీనటులున్నారు. ఇది పూర్తిగా దేవుడు వ్రాసుకున్న స్క్రిప్టు. మొట్టమొదట ఆయన లొకేషన్ సిద్ధపరుస్తూ తన ఆకాశాన్ని విశాలపరిచాడు. ఇప్పుడు మీకు సెట్టింగ్‌ను చూపించాడు. షూటింగ్ ఎక్కడ జరుగుతుందంటే, ఇదిగో ఈ ఆకాశము క్రిందే అంతా జరుగుతుంది. ఇక ఎక్కడా జరగదు. ఎక్కడికీ మీరు వెళ్ళవద్దు. దేవుడు సెట్టింగ్ ఎక్కడ వేసాడో, లొకేషన్ ఎక్కడ నిర్ణయించాడో అక్కడే తన సినిమా చిత్రీకరింపబడుతుంది. ఆయన తీసిన సినిమాకు అన్నీ తానే! ఆయన ఒక్కడే చిత్రీకరించాడు. ఇంకెవ్వరూ ఆయనకు

ఆలోచన చెప్పలేదు. ఇంకెవ్వరి సహాయాన్ని ఆయన తీసుకోలేదు. ఈ రోజు లోకసంబంధమైన సినిమాలు చిత్రీకరించటానికి పూర్తిగా ఒక యూనిట్ కావాలి. వేల, లక్షల మంది పనివారు కావాలి. కానీ, దేవుడు పలుకుతున్న ఈ మాట చూసారా! 'నేను ఒక్కడినే దీనంతటినీ విశాలపరిచాను' అంటున్నాడాయన. ఆయన వేసిన ఈ లొకేషన్‌ను గూర్చి మరొక మాటను ఈ కూర్పులో భాగముగా చూడండి.

**కీర్తనలు 104 : 2–** "వస్త్రమువలె వెలుగును నీవు కప్పుకొనియున్నావు. తెరను పరచినట్టు ఆకాశవిశాలమును నీవు పరచియున్నావు". దేవుడు ఈ మాటను ఎందుకు వ్రాయించాడు? ఆయన ఒక సినిమా తీస్తున్నాడు గనుక. ఆయన ఒక ఆకాశమును సృష్టించాను అని చెప్పి ఊరుకోవచ్చుగా! లేదు. 'ఒక తెరను పరచినట్టుగా' అన్నాడంటే, తెరను ఎలా పరుస్తారు? అప్పటివరకూ మడతపెట్టి ఉన్నదానిని పరుస్తారు. ఒక్కొక్క మడత విప్పుకుంటూ పరుస్తారు. మన పైనున్న ఆకాశము అలా విశాలపరచబడిందా? అవును. లోకసంబంధమైన శాస్త్రవేత్తలకు ఆకాశము ఎలా విశాలపరచబడిందో అనే సంగతి తెలుసా? ఎప్పటికీ వారికి తెలియదు. ఎందుకో తెలుసా? పరిచింది వీడి బాబు కాదు. వాడి బాబుకి బాబు. ఆయనే దేవుడు. ఆయనే నా కన్న తండ్రి, మీ కన్న తండ్రి! సినిమా తీసిన ఆ దేవుడు ఏమంటున్నాడో చూడండి. 'ఒక వస్త్రము పరచినట్టుగా నేను ఆకాశమును ఒక తెరవలె పరిచాను' అన్నాడు. ఎందుకంటే, అదే ఆయన లొకేషన్. కూర్పులో మరొక మంచిమాటను పరిశీలిద్దాం.

**యెషయా 40 : 22–** "ఆయన భూమండలము మీద ఆసీనుడైయున్నాడు. దాని నివాసులు మిడతలవలె కనబడుచున్నారు. ఒకడు తెరను విప్పినట్లు ఆయన ఆకాశ వైశాల్యమును వ్యాపింపజేసెను. ఒకడు గుడారము వేసినట్లు ఆయన దానిని నివాస స్థలముగా ఏర్పరచెను." భూమిమీద లోక సంబంధమైన ఒక సినిమా తీసేటప్పుడు అందులోని నటీనటులందరూ ఆ లొకేషన్‌లోనే ఉండాలి. బయటికి వెళ్ళిపోకూడదు. చుట్టూ బారికేడ్లు కట్టేయాలి. అలాగే, దేవుని సినిమాలో నటించేవారందరూ, అందులో పాలిభాగస్తులందరూ ఆయన ఏర్పరచిన లొకేషన్‌లోనే ఉండాలి. వారు ఫైట్‌లు చేసేవారు కావచ్చు, హీరోలు కావచ్చు, విలన్‌లు కావచ్చు, హీరోయిన్‌లు కావచ్చు, బాలనటులు కావచ్చు, రోగిష్టులు

కావచ్చు, మరణించేవారు కావచ్చు, పాత్ర ముగింపబడినవారు కావచ్చు. ఎవ్వరైనా సరే, ఎక్కడ ఉండాలన్నాడు దేవుడు? 'ఆయన వేసిన ఆ లొకేషన్ క్రింద మాత్రమే పాత్రధారులుండాలి. ఎందుకు? ఇది ఆయన సినిమా! ఆయన ఏమంటున్నాడో చూడండి. "ఒకడు తెరను విప్పినట్లుగా ఆయన ఆకాశ వైశాల్యమును వ్యాపింపజేసెను. దయచేసి మీరు తలలు పైకెత్తి చూడండి. మీ పరలోకపు తండ్రి మీకోసం చేసిన ఆ సినిమాలో మొట్టమొదటి సన్నివేశం మీకు కనిపిస్తుంది. ఇది భూటకం కాదు. ఇది వాస్తవం. మీ కన్నులు పైకెత్తి చూడాలి. దేవుడు పరచిన ఆ ఆకాశ వైశాల్యత మీకు కనిపించేస్తుంది. ఎందుకు అంత భారీ సెట్టింగ్ వేసాడో తెలుసా? ఈ ఆకాశము క్రింద మాత్రమే ఆయన సృష్టించిన వారందరూ ఉండాలి. ఆయన తీయబోయే సినిమా ఇక్కడే చిత్రీకరించబడాలి. అది ఎక్కడో తీయబోయేది కాదు. ఏ లోకానికో సంబంధించినది కాదు. అది భూలోకానికి సంబంధించినదే. మొట్టమొదట ఆకాశ విశాలాన్ని ఆయన నిర్ణయించినప్పుడు, తెరను పరచినట్టుగా దానిని పరిచిన తరువాత అందరూ వుండటానికి, సినిమా జరగటానికి ఇప్పుడు ఒక స్థలాన్ని నిర్ణయించబోతున్నాడు. అదే భూమండలం. అదే మీరు నిలుచున్న భూమి. ఆయన నిర్ణయించిన స్థలమిది. దీని మీద ఆయన తన సినిమాను తీయాలనుకున్నాడు. ఈ భూమి ఎవరిదో తెలుసా? ఈ భూమిని ఆయన ఎందుకు సృష్టించాడో తెలుసా? ఆయన వ్రాసుకున్న స్క్రిప్ట్ అంతా ఈ భూమి మీద నెరవేరటానికి మరియు చిత్రీకరించటానికి. అందరినీ ఇందులో పాత్రధారులుగా చేయటానికి, భూమిని దేవుడు సృష్టించాడు. అందుకే తన స్క్రిప్టులో, ప్రారంభములో, మొట్టమొదట ఆయన ఏమన్నాడో తెలుసా? ఆదియందు దేవుడు భూమిని ఆకాశమును సృజించెను. ఎందుకంటే ఆయన లొకేషన్ సిద్ధం చేసాడు. ఆకాశమును పరిచాడు. అందరూ నివసించటానికి, మనమందరము ఉనికి కలిగి యుండటానికి ఈ భూమిని సిద్ధపరిచాడు. ఈ భూమిని స్థిరపరిచాడు. దానిని ఇప్పుడు బైబిల్ అనే స్క్రిప్టులో ఆయన మాటలుగా చూడండి.

**యోబు 38 : 33–** "ఆకాశమండలపు కట్టడలను నీవెరుగుదువా? దానికి భూమిమీదగల ప్రభుత్వమును నీవు స్థాపింపగలవా?" ఇక్కడ దేవుడు

ఏమన్నాడో చూడండి. ఆయన ఆకాశమండలమంతటికి కొన్ని రూల్స్ పెట్టాడు. ఆయన తీయబోయే సినిమా ప్రారంభం అయినప్పటినుండి, ఆ సినిమాను ముగించేంతవరకూ, ఆకాశమండలములో కొన్ని నియమాలను, కొన్ని కట్టడలను ఆయన నిర్ధేశించాడు. అందుకే ఆ ఆకాశమండలపు కట్టడలు(రూల్స్) మీకు తెలుసా? అన్నాడు దేవుడు. ఈ కట్టడలన్నిటికీ ప్రభుత్వాన్ని ఎక్కడ పెట్టాడో చూడండి. "దానికి భూమిమీద గల ప్రభుత్వమును నీవు స్థాపింపలేవు. అది దేవుడు తీసిన సినిమా గనుక, అది ఆయన గవర్నమెంట్ అన్నాడు. ఆకాశమండలములో జరిగే ప్రతీది ఆయన ఆధీనములో జరగాలి. ఎందుకంటే ఇది ఆయన ప్రభుత్వం. ఈ ప్రభుత్వాన్ని ఆయన అనుకున్నట్టుగా జరిగించాలి. అలాగని ఆయన దగ్గర మంత్రివర్గము/అధికారులు/పోలీసు సిబ్బంది ఎక్కడున్నారు? అనుకుంటున్నారా? అయన సిబ్బంది చాలా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. బైబిల్ పరిభాషలో వారి సంఖ్య కోటానుకోట్లు. వారే దేవదూతలు! ఈ ప్రకృతి ఆయన అనుకున్నట్టుగా వర్షించాలి. ఆయన దగ్గర చాలా నీళ్ళున్నాయి. అలాగని ఆయనేమీ ఇంకుడుగుంతలు తీసి, నీటిని పొదుపుచేసి దాచుకోవడం లేదు. ఆయన అనుకున్నట్లుగా ఆకాశములో వున్న మేఘములు ధ్వనులను సృష్టించాలి. అలాగని ఆయన దగ్గర మన దగ్గరున్న మైక్‌లు లేవు. ఆయన దగ్గర స్క్రిప్చర్ సౌండ్‌సిస్టమ్ ఉంది. ఆయన అనుకున్నట్టుగా వెలుగు పుట్టాలి. అలాగని ఆయన దగ్గర థామస్ ఆల్వా ఎడిసన్ కనిపెట్టిన బల్బులు లేవుగా! ఆయన దగ్గర సెపరేట్ లైటింగ్ సిస్టమ్ ఉంది. ఆయన దగ్గర ఆక్వాగార్డ్ వాటర్ లేదు, కిన్‌లే వాటర్ బాటిల్స్ లేవు. ఆయన దగ్గర సెపరేట్‌గా ప్యూర్ వాటర్, జలాశయాల రూపములో వర్షించే మేఘముల రూపములో ఉంది. దేవుడు తన సినిమాను ఎంత గొప్పగా చిత్రీకరించుకోవాలి అనుకుంటున్నాడో చూడండి.

దేవుడు తీసిన సినిమా ఎందుకండీ రిలీజ్ కాలేదు? ఎందుకండీ ప్రపంచానికి ఈ సంగతి తెలియలేదు? అందుకేనండీ మీరు చూడాలి, మీరు తెలుసుకోవాలి. ఆకాశమండలమునకున్న కట్టడలకు ఈ భూమి మీదనే ప్రభుత్వముంది. అంటే ఆయన సినిమా ఎక్కడ జరుగుతుంది? ఈ భూమి మీదే జరుగుతుంది. అందుకే తన ప్రభుత్వాన్నే ఇక్కడకు దించాడు దేవుడు. తన గవర్నమెంటునే ఇక్కడికి తీసుకొచ్చేసాడాయన. కానీ, ఈ సినిమాను గూర్చి

తెలియని చాలామంది పిచ్చి శాస్త్రవేత్తలు ఇప్పటికీ భూమండలాన్ని విడిచిపెట్టి ఆకాశమండలములోనికి ఎగిరిపోతున్నారు. ఏమిటయ్యా నీ పిచ్చితనం? దేవుడు తీసే సినిమా భూమి మీద ఉంటే నువ్వు ఎక్కడికి ఎగిరిపోతున్నావు? చిన్ని రాకెట్ తయారు చేసుకుని, చిన్ని ఉపగ్రహం తయారు చేసుకుని నువ్వు ఎక్కడికో వెళ్ళిపోతున్నావా! సెట్టింగ్ ఎలా ఉందో చూద్దామనుకుంటున్నావా? పిచ్చివాడా! కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నావా? దౌర్భాగ్యుడా! శాస్త్రవేత్తలను ఇలా అనకూడదా? దేవుని వాక్యాన్ని బట్టి వారికి బుద్ధి చెప్పకూడదా? దేవుని వాక్యాన్ని బట్టి వారిని గద్దించకూడదా? ఎంతకాలం తప్పు చేస్తుంది ఈ సమాజం? దేవుడు వ్రాయించిన ఆయన స్క్రిప్టు అర్ధంకాని ఈ సమాజం ఎన్నాళ్ళు తమనుతామే మోసగించుకుంటుంది? అంతరిక్షములోనికి వెళ్ళిపోయి, చంద్ర మండలము మీద ప్లాట్లు కొనుక్కోమని చెబుతారా ప్రజలకు? అంతరిక్షములో రెండు, మూడు వీడియోలు చిత్రీకరించుకుని వచ్చి, ఈ శాస్త్రవేత్తలు తామేదో ఘనతను సాధించామని చెప్పుకుంటారా ప్రపంచానికి? అందుకే దేవుడు వ్రాయించిన స్క్రిప్టు ప్రతి ఒక్కడికీ తెలియాలి. ఆయన ఏమంటున్నాడో తెలుసా? ఆకాశమండలమంతటికీ, ఈ విశ్వమంతటికీ ప్రభుత్వాన్ని ఈ భూమండలము మీద పెట్టాడు. ఎందుకంటే భూమి మీద ఆయన సినిమా జరుగుతుంది. ఆయన తన సినిమాను ఈ భూమి మీదే తీస్తున్నాడు. మీరు ఎక్కడికీ పోవద్దు. చంద్రమండలము మీదకి వెళ్ళకండి. వెళితే మీకు నాశనం తప్పదు. దేవుని సినిమాను విడిచి వెళ్ళిపోతే దేవుడు ఊరుకోడు. లోకసంబంధమైన దర్శకుడు ఊరుకుంటాడేమో! మహా అయితే నిర్మాత అలాంటి వారికి పేమెంట్ ఆపివేయవచ్చు. కానీ దేవుడు మాత్రం ఊరుకోడు. లిస్ట్‌లో నుంచి మీ పేరు తీసాడా, వెనువెంటనే మీ శరీరము ఈ భూమిలో కప్పెట్టబడి, ఆత్మగా మీరు వెళ్ళి, చేతులు కట్టుకుని నుంచోవాలి దేవుని ముందు. దేవుని సినిమాను నీవు మధ్యలో ఆపి ఎందుకయ్యా వచ్చేసావు? ఉరి వేసుకుని ఒకడు వచ్చేసాడు, పురుగులమందు తాగి ఒకడు వచ్చేసాడు, ఆకాశమండలములోనికి వెళ్ళిపోతానని మరొకడు వచ్చేసాడు. ఏమిటయ్యా, నీకు దేవుని సినిమా తెలీదా? ఎవ్వరూ నీతో చెప్పలేదా? పోనీ ఏ చర్చిలోనూ నీకు దీనిని వివరించలేదా? కనీసం బైబిలు చదివినపుడు నీకు అర్థం కాలేదా దేవుని స్క్రిప్ట్ అంటే ఏమిటో? స్క్రిప్చర్స్

అని వాటిని ఎందుకన్నాడో? యేసుక్రీస్తువారు ఏమన్నారో చూడండి – 'లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని వాటిని పరిశోధించుచున్నారు' **(యోహాను 5:39).** దేవుని లేఖనములలో నిత్యజీవముంది. ఆయన వ్రాయించిన స్క్రిప్టులో నిత్యజీవముంది. దేవుని సినిమాలో నటనను జాగ్రత్తగా చేసినవారికి, దేవుని సినిమా అర్థమైనవారికి దేవుడు ఒక మంచి బహుమానమును ఇవ్వబోతున్నాడు. ఒకవేళ ఆయన సినిమా అర్థం కాలేదా, ఒకవేళ దేవుని సినిమాలో మీరు పాలిభాగస్తులు కాలేకపోయారా, అయితే మీకు శిక్ష తప్పదు. అందుకే ఇంత వ్యయప్రయాసలకు ఓర్చి, ఎంతో కష్టపడి, మీకందరికీ ఈ సంగతిని చెప్పాలనుకున్నాను. మీరు వింటే విన్నారు, వినకపోతే పోతారు. కానీ, చెప్పటం నా ధర్మం. ప్రకటించటం, తెలియజేయటం నా కర్తవ్యం. అవును! భూమిని గూర్చి ఆయన వ్రాయించిన మరో మంచిమాట. ఆయన తన సినిమాను ఎక్కడ తీస్తున్నాడో చెబుతున్నాడు చూడండి.

**ఆమోసు 9 : 6–** ''ఆకాశమందు తనకొరకై మేడగదులు కట్టుకొనువాడును, ఆకాశమండలమునకు భూమియందు పునాదులు వేయువాడును ఆయనే, సముద్రజలములను పిలిచి వాటిని భూమిమీద ప్రవహింపజేయువాడును ఆయనే; ఆయన పేరు యెహోవా''. ఇది ఆయన సినిమా కదా. అందుకే ఆయనే స్థలమును సిద్ధం చేసుకుంటున్నాడు. నటీనటులు ఎక్కడికీ వెళ్ళిపోకూడదు. దేవుడు వారి వారి పాత్రలను ముగించేంతవరకు అందరూ భూమి మీదే ఉండాలి. మీ జీవితం ఈ భూమి మీద మొదలైనప్పుడు, మీ పాత్ర విషయంలో ఆయన సినిమా మీకు ప్రారంభమౌతుంది. ఆకాశ మండలము ఆయనది. అక్కడకు మీరు వెళ్ళకండి. ఆయన ప్రోపర్టీని మీరు కేప్చర్ చేయకండి. ఆక్రమించకండి. ఆకాశమండలములో ఆయన గదులు కట్టుకుంటాడు. మీకు కేవలం భూమి సరిపోతుంది. ఎందుకంటే ఆయన సినిమా తీయడానికి నిర్ణయించిన స్థలం ఇదే. నీవు ఎక్కడికో వెళ్ళిపోతున్నావేంటి? నీవిక్కడ ఆయన సినిమాలో ఆయన స్క్రిప్ట్ ప్రకారం ఉంటావని, నీకోసం ఈ భూమిమీద దేవుడు సకల సౌకర్యాలను పెట్టాడు. పీల్చటానికి గాలి, త్రాగటానికి నీరు, తినటానికి ఆహారపదార్థాలు! అందులోనూ మరల వెజ్, నాన్‌వెజ్. ఓ మనిషీ, నీవు ఎక్కడికి వెళ్ళిపోతున్నావు? చంద్రమండలం మీద పెట్టాడా ఇవన్నీ?

గురుగ్రహం మీద పెట్టాడా ఇవన్నీ? పాలపుంతలలో ఎక్కడైనా పెట్టాడా ఇవన్నీ? లేదే. భూమిని మాత్రమే నివాసయోగ్యమైనదిగా ఎందుకు చేసాడంటే, ఇక్కడ మాత్రమే ఆయన సినిమా తయారు చేయబడుతుంది. అవును, ఆకాశమండలమందు మేడగదులు కట్టుకునే దేవుడు చెప్పేదేమిటంటే భూమండలము మీద మాత్రమే మీరు ఉండాలి. తన సినిమా అంతటికీ గవర్నమెంటు అక్కడే ఉంది.

**కీర్తనలు 115 : 16–** "ఆకాశములు యెహోవా వశము. భూమిని ఆయన నరులకిచ్చియున్నాడు". చూడండి, ఆకాశము కేవలం దేవునిది. దానిని మీరు ముట్టుకోకూడదు. అందులోనికి మీరు రాకెట్లు వేసుకుని వెళ్ళకూడదు. అందులోనికి మీరు ఉపగ్రహాలను పంపించకూడదు. అందులో మీరు రోదసీయాత్రలు, అంతరిక్షయాత్రలు చేయకూడదు. ఎందుకంటే ఆకాశము యెహోవా వశము. మీరు పుట్టినప్పటినుండీ మీకు ఎవ్వరూ చెప్పలేదా? చిన్నప్పుడు పాఠ్య పుస్తకాలలో ఈ విషయం లేదా? అయితే దేవుని స్క్రిప్టులో (బైబిల్‌లో) ఉందిగా. అదికూడా మీ చెంతనే ఉందిగా. మీ భాషలోనే ఉందిగా. ఆకాశములు దేవుని వశము అని అర్థంచేసుకోవాలి. ఇప్పటికీ అనేకమంది ఆకాశములోనికి వెళ్ళినవారందరూ గాంభీర్యమును ప్రదర్శించటం లేదా? గొప్పలు చెప్పుకోవటం లేదా? వారందరూ మన శాస్త్రవేత్తలేనండి. నింగిలోనికి దూసుకునిపోయాం అని చెప్పుకుంటున్నారు. ఎందుకు ఇదంతా? పేదవాడికి పట్టెడన్నం పెట్టలేని మనం నింగిలోనికి దూసుకునిపోవటం ఎందుకు? ఎన్నో సమస్యలచేత ఈ రోజు ప్రపంచ మానవళి దారిద్ర్యరేఖకు దిగువన అల్లాడుతుంటే, అంతరిక్షయాత్రలు మనకు అవసరమా? అలాంటివాటిలో మన భారతదేశం కూడా ఒక దేశం. మనమూ అంతరిక్షములోనికి దూసుకునిపోవాలా? నింగిలోనికి వెళ్ళిపోవాలా? 'అదే అభివృద్ధి' అని మీరు చెబుతారా? దేవుడు ఏమంటున్నాడో చూడండి, 'ఆకాశము నా వశము'. మీపైనున్న ఆకాశమును దేవుడే తన సినిమా కొరకు పరిచాడు. ఆయనొక్కడనే దానిని పరిచాడు. అది ఆయనది, అది ఆయన వశము. మరి మీరు దేనిని ఆక్రమించుకోవాలి? భూమిని మాత్రమే అని చెప్పాడు. ఈ విశ్వంలో అతి చిన్న గోళమైన భూమిని, దేవుడు తన సినిమా తీయటానికి ఒక ప్రదేశముగా నిర్ణయించాడు. ఆ ప్రదేశాన్ని విడిచి

ఎవ్వరినీ వెళ్ళవద్దంటున్నాడు. “ఆకాశము నా వశము, భూమిని ఆయన నరులకిచ్చియున్నాడు”. అందుకే ఈ రోజు ఎన్ని కోట్లమంది మనుష్యులు ఈ భూమిపై నివశిస్తున్నారో చూడండి. ప్రస్తుత జనాభా సుమారుగా 750 కోట్లమంది మనుష్యులు అనుకుంటే, ఈ 750 కోట్లమంది మనుష్యులూ ఇదిగో ఈ భూమి మీద మాత్రమే ఉండగలుగుతున్నారు. మరోగ్రహం మనుష్యులకు ఆవాసమైనది కాదు. భూమి తప్ప ఈ విశ్వంలో మరేదీ మనిషికి యోగ్యమైనది కాదు. అలాగైతే ఇప్పటికే వెళ్ళిపోదురుగా! ధనాన్ని ఖర్చుచేసి, అంతరిక్ష ప్రయాణాలు చేసి, తిరిగి వట్టిచేతులతో వచ్చేస్తున్నారు. వారి చేతకానితనాన్ని ప్రజలకు చెప్పుకోలేక, ఏదో అభివృద్ధి అనే పేరు చెప్పి కొంతవరకు ప్రజలకు నూనె రాస్తున్నారు తప్ప, ఏమి సాధించారు చెప్పండి? ఇలాంటి వారందరికీ దేవుని తరపున నా లైఫ్‌టైమ్ ఛాలెంజ్ ఏమిటో తెలుసా? ఒకే ఒక్క గ్రహాన్ని, ఎన్నింటినో అక్కరలేదు, ఒకే ఒక్క గ్రహాన్ని నరులకు ఆవాస యోగ్యమైనదిగా మార్చమనండి చూద్దాం. ఏదో పెద్దగ్రహాన్ని మార్చనక్కరలేదు. భూమికి ఒక చిన్న ఉపగ్రహమైన చంద్రమండలాన్ని మనిషికి ఆవాసయోగ్యమైనదిగా, అచ్చం భూమిలాగే మార్చమనండి చూద్దాం. అక్కడ గాలి పెట్టాలి, నీరు పెట్టాలి, మొక్కలు నాటాలి, పంటలు పండాలి, జీవులన్నీ జీవించాలి. మనుష్యులు సుఖశాంతులతో ఇదిగో ఈ భూమి మీద చల్లగా బ్రతికినట్టుగా, అక్కడ కూడా బ్రతకమనండి చూద్దాం. అలా ఒక్క గ్రహాన్ని అయినా తయారు చేయమనండి చూద్దాం. అది వాడి తరం కాదు. ఒకవేళ వాడు అలా చేయగలిగితే వెంటనే దేవుడు వ్రాసుకున్న ఈ స్క్రిప్టు తప్పు అని ఒప్పుకుందాం. వాడు చేయలేడు గనుక వాడు చేయలేనంత వరకూ ఈ స్క్రిప్టే 100% రైట్. ఈ స్క్రిప్టే 100% కరెక్ట్. ఈ స్క్రిప్టే ఎవర్‌గ్రీన్. వేల సంవత్సరాలుగా దేవుడు వ్రాసుకున్న ఆ స్క్రిప్ట్ చాలా గొప్పగా ఈ భూమిపై జరుగుచున్నది. ఆయనే చిత్రీకరిస్తున్నాడు. ఆయన తన సినిమా తీస్తున్నాడు. ఈ భూమి మీద ఆయన ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నాడో చూడండి. భూమి మీద వెలుగుండాలి. అలాగే, చీకటీ ఉండాలి. పగలంతా మీకు వెలుగుండాలి. రాత్రివేళ మీకు చీకటుండాలి. అందుకే ఆయన తన సినిమాకు తన సెట్టింగ్‌లో ఒక భాగముగా లైట్లు పెట్టుకోవాలి. అవి మనం పెట్టుకున్న లైట్ల వంటివి అనుకున్నారా? ఇవన్నీ జెనరేటర్‌లో డీజిల్ అయిపోతే అలా

ఆగిపోతాయి. ఓవర్‌లోడ్ అయితే వీటిలోపలున్న ఫిలమెంటు వెంటనే కాలిపోతుంది. దేవుని దగ్గరున్న ఆ లైటు ఎలాంటిదో తెలుసా? ఇప్పుడు చూడండి.

ఆదికాండము 1 : 14– "దేవుడు– పగటిని, రాత్రిని వేరుపరచునట్లు ఆకాశ విశాలమందు జ్యోతులు కలుగును గాకనియు, అవి సూచనలను, కాలములను, దిన సంవత్సరములను సూచించుటకై యుండుగాకనియు, భూమిమీద వెలుగిచ్చుటకును, పగటిని రాత్రిని ఏలుటకును, వెలుగును చీకటిని వేరుపరచుటకును దేవుడు ఆకాశ విశాలమందు వాటినుంచెను". నేను మీకు తప్పు చెప్పటం లేదు. అందుకే లైట్స్ అన్నాను. తెలుగులో జ్యోతులు అన్నాడాయన. భూమిపై తన సినిమాలో లైటింగ్ పెట్టాడాయన. ఆకాశ విశాలమందు జ్యోతులను ఉంచాడు. ఎందుకండీ ఇదంతా? ఎందుకు పరిచాడు ఈ ఆకాశ విశాలాన్ని? సెట్టింగ్‌గా ఎందుకు వేసాడు దీనంతటినీ? ఆకాశములో లైట్లు పెట్టుకోవాలి. అందులోనే వాటర్ పెట్టుకోవాలి, అందులోనే గాలి పెట్టుకోవాలి. అందులో మెరుపులు పెట్టుకోవాలి, అన్నీ ఆకాశములోనే పెట్టుకోవాలి. భూమి మీద మాత్రం మనుష్యులను పెట్టాలి. ఆ తర్వాత ఏమి జరుగుతుంది. ఆకాశము నుండి సూర్యుడనే ఆ లైట్ ఎంతో దూరము నుంచి మనిషి మీదకి ఫోకస్ అవుతుంది. లైట్ దగ్గర మనిషి ఉండదు. లైటు ఎక్కడో దూరంగా ఉండాలి. అది మనిషికి సరిపడా వెలుగునివ్వాలి. అందుకే దేవుడు ఆయన స్క్రిప్ట్‌లో వ్రాయిస్తున్నాడు చూడండి.

కీర్తనలు 148 : 3– "సూర్యచంద్రులారా, ఆయనను స్తుతించుడి. కాంతిగల నక్షత్రములారా, మీరందరూ ఆయనను స్తుతించుడి". సినిమాలో భాగముగా ఆయన నిర్ణయించిన జ్యోతులు(లైట్స్) గనుక సూర్యచంద్రులారా ఆయనను స్తుతించుడి అన్నాడు. వీటన్నింటికీ దేవుడు కొన్ని కట్టడలను నియమించాడు. ఏమిటా కట్టడలు? సూర్యుడు ప్రతిరోజు తూర్పుదిక్కునే ఉదయించాలి, పడమర దిక్కున అస్తమించాలి మరియు భూమండలాన్ని చుట్టాలి. దేవుడు పెట్టింది ఒకే ఒక లైట్. అది కాకినాడకు మాత్రమే సరిపోతే ఎలా? అమెరికాకు కూడా అదే లైటు, ఆస్ట్రేలియాకు కూడా అదే లైటు, చైనాకు కూడా అదే లైటు, సౌతాఫ్రికాకు కూడా అదే లైటు. కనుక సూర్యుడా, నీవు తిరగాలి. ఈ చుట్టు నుంచి ఆ చుట్టు వరకు రోజూ సూర్యుడు తిరిగేయాలి.

మరియు సూర్యుని చుట్టూ భూమి తిరిగేస్తుంది. వాటి చుట్టూ అవి అలుపెరుగకుండా తిరిగేయాలి. ఇలా తిరుగుతూ ఒక మంచి కట్టడను అవన్నీ కలిగియుండాలి. ఆయన సినిమాకు ఎటువంటి అంతరాయమును అవి కలిగించకూడదు. ఎక్కడా సాంకేతిక లోపము ఉండకూడదు. మన దగ్గర చిన్నపాటి వర్షం వస్తేనే మనము తయారుచేసుకున్న మైక్ పనిచేయదు. కానీ, దేవుని దగ్గర అలా ఉండదు. ఆయన చాలామంచి కట్టడలను నియమించాడు. ఆయన ఆగమంటే సూర్యుడనే ఆ లైట్ ఆగాలి. 'లైట్స్ ఆఫ్' అంటే లైట్స్ ఆగాలి. 'లైట్స్ ఆన్' అంటే లైట్స్ వెలగాలి. దానికి మించి ఈ ప్రకృతిలో ఏదీ ఎక్కువ చేయకూడదు. సూర్యుడు ఎప్పుడూ ఆయన సేవలోనే ఉండాలి. ఆయన తీస్తున్న ఈ సినిమాలో ఎప్పుడూ వెలుగుతూ, ఆరుతూ ఉండాలి. నక్షత్రాలు, చంద్రుడు, సూర్యుడు వీరందరికీ ఇది దేవుడు నియమించిన కట్టడ. ఆయన సినిమాకు కావలిసినట్టుగా, భూమి మీద మనుష్యులకు తగ్గట్టుగా ఆయన నియమించిన కట్టడలివన్నీ. అందుకే ఆయన అన్నట్టుగా భూమి మీద ఒక ప్రభుత్వం ఉంది. ఈ దేవుని ప్రణాళిక అంతా ఏదో ఫ్లూటో గ్రహం గూర్చి కాదు, శుక్ర గ్రహం కోసం కాదు,  బుధుడు కోసం కాదు. సృష్టిలోని ప్రతి అణువూ ఈ భూమిని ఎల్లప్పుడూ కాపాడుతూ ఉండాలి. భూమి కోసమే అన్నీ ఉన్నాయి. రాత్రివేళ వెలుగిచ్చుటకు, వెన్నెల నిచ్చుటకు చంద్రుడున్నాడు.

దిసీజ్ గాడ్స్ మూవీ. ఇది ఆయన తీసిన సినిమా. అందులో లైట్లుండాలి. అవి చాలా ప్రకాశమానముగా ఉండాలి. నటీనటులు ఒకవేళ సరిగ్గా నటించకపోతే వాటి తీవ్రతను పెంచుతాడు. అప్పుడే మనకు ఎండలు బాగా దంచేస్తాయి. వడదెబ్బ తినేస్తాము. అంతేకదండీ, నటీనటులు సరిగ్గా పనిచేయకపోతే డైరెక్టరు శిక్ష విధిస్తాడు. వారు సరిగా నటించకపోతే బెత్తం వాడతాడు. ఇక్కడ దేవుడు బెత్తం వాడుతున్నాడు. ఎండాకాలం వచ్చినప్పుడు $40^0$ సెంటీగ్రేడు ఉష్ణోగ్రత ఎందుకనుకుంటున్నారు? దేవుడు సూర్యుని తీవ్రత పెంచాడు. నటుడు సరిగ్గా నటించటం లేదు. తోక జాడిస్తున్నాడు. అసలు వీడికి దేవుని సినిమాలో వున్నాడన్న విషయమే వాడికి తెలియటం లేదు. భజన చేసుకుని పోతున్నాడు. దేవునికి భజన చేసుకుని వెళ్ళిపోతావా? నీవు బహుమానం కోసం వచ్చావు. జీతం కోసం పనిచేయాలి నీవు. ఇదొక మంచిపాత్ర. ఆ పాత్ర

సరిగా చేయకపోతే దేవుడు ఊరుకోడు. సూర్యచంద్ర నక్షత్రములకే ఆయన విధులు ఇచ్చాడు. కట్టడలను నియమిస్తున్నాడు. దేవుని సినిమా అర్థమైన తరువాత మీరు ప్రతీరోజు మీ ఇంటి తలుపు తెరవగానే తూర్పున సూర్యుని చూడండి. ఆ సూర్యుడు దేవుడు పెట్టిన వెలుగు. అది దేవుడు నియమించిన లైట్. ఇప్పటి వరకూ మీరు ఏమనుకున్నారో నాకు తెలియదు. కానీ, ఇక్కడ నుంచి మాత్రం మీరు ఈ దేవుని స్క్రిప్టు ప్రకారమే ఆలోచించాలి. దేవుడు నియమించిన లైటు తూర్పున వెలుగుతున్నాడు. పడమటికి వెళ్ళి అస్తమిస్తున్నాడు. మరలా మరుసటి దినమున ఉదయమయ్యేసరికి తూర్పుకు ఎలా వచ్చేస్తున్నాడు? ఆయననే అడగాలి. ఎలా పెట్టావు నాయనా ఈ సెట్టింగు? అసలు పైన ఎవరున్నారు ఇవన్నీ తిప్పటానికి, ఇవన్నీ చేయటానికి? ఆయన తన స్క్రిప్టును చాలా ఆశ్చర్యంగా వ్రాయించాడు చూడండి.

ప్రసంగి 1 : 5– “సూర్యుడుదయించును, సూర్యుడు అస్తమించును, తానుదయించు స్థలము మరల చేరుటకు త్వరపడును.” సాయంత్రం పడమటికి వెళ్ళిపోయిన సూర్యుడు అక్కడ ఏమాత్రం రెస్ట్ తీసుకోడు. ఎందుకంటే దేవుని సినిమా ఆగిపోకూడదు. ఆయన సినిమా భూమి మీద ఉన్న మనుష్యులలో ఎవ్వరికీ తెలియకపోయినా, సూర్యుని పని సూర్యుడు చేయాలి కనుక సూర్యుడు రోజూ తూర్పున ఉదయించి, పడమటికి ప్రయాణించి, మరలా ఉదయానికి తూర్పుదిక్కునకు పరిగెట్టుకుని వెళ్ళిపోతున్నాడు.

కీర్తనలు 19 : 5– “అతడు తన అంత:పురములో నుండి బయలుదేరు పెండ్లి కుమారుని వలె ఉన్నాడు. శూరుడు పరుగెత్త నుల్లసించునట్లు తన పథమునందు పరుగెత్త నుల్లసించుచున్నాడు. అతడు ఆకాశమున ఈ దిక్కునుండి బయలుదేరి ఆ దిక్కువరకు దానిచుట్టు తిరిగి వచ్చుచున్నాడు. అతని వేడిమికి మరుగైనది ఏదియు లేదు”. ఆ సూర్యునికి తన ప్రయాణ మార్గము తెలుసు. దేవుడు నియమించిన కట్టడ అతనికి తెలుసు. అందుకే ఆ లైటింగ్‌లో నటీనటులందరూ దేవునికి కనిపిస్తున్నారు. మనిషి చేసే అక్రమకార్యక్రమాలు ఎవ్వరూ చూడటం లేదని, తానెలా బ్రతుకుతున్నాడో ఎవ్వరూ చూడటం లేదని, అందరి కళ్ళు గప్పి తాను చాలా చాకచక్యంగా అటు దేవుణ్ణి, ఇటు సమాజాన్ని మోసగిస్తున్నాను అనుకుంటున్నారా? మీ పైనున్న సూర్యునికి మరుగైనదేదీ

లేదు. ఎవరనుకుంటున్నారు ఇంతకీ ఆ సూర్యుడు? దేవునికి నమ్మకమైన ఏజెంట్. చంద్రుడు ఎవరనుకుంటున్నారు. హీ ఈజ్ సూపర్ ఏజెంట్ ఫర్ హిమ్. చీకటి క్రియలు చేసేవారందరూ చంద్రునికి బాగా ఎరుకే. చంద్రుడు వెంటవెంటనే దేవునికి చెప్పేస్తున్నాడు. 'తండ్రీ! నీవు తీస్తున్న సినిమాలో ఇదిగో వీడున్నాడు చూసావా! చాలా భయంకరుడు. రోజూ చీకటిలో వీడు చేస్తున్నటువంటి చిందులు నేను చూస్తున్నాను. నక్షత్రాలు, మేఘములు, వర్షము - ఏమనుకున్నారండీ! దేవుడు పెట్టిన సెట్టింగ్ ఇదంతా. దేవుడు నిర్ణయించుకున్న విధి విధానాలను పాటిస్తున్నాయి ఇవన్నీ. మీ చుట్టూ ఉన్నవి, మీకు సేవ చేస్తున్నవి, మిమ్మును పరీక్షిస్తున్నవి, మీ నుండి వచ్చిన రిపోర్ట్ దేవునికి అందిస్తున్నవి. మీరు దేవుని సినిమాలో జాగ్రత్తగా నటించాలి. దర్శకుడు చూడటం లేదు కదా అని అనుకోకూడదు. ఎందుకంటే మిమ్మును చూడటానికి, మిమ్మును పరీక్షించటానికి, మీకు వెలుగునిచ్చినా ఒక కంట మిమ్మును కనిపెడుతూ ఉండటానికి దేవుడు చాలా కట్టడలను నియమించాడు. వీటన్నింటినీ దేవుడు జరిగిస్తున్నాడు కదా! లోక సంబంధమైన ఒక సినిమాలో అయితే ఈ సెట్టింగులన్నీ వేయడానికి, మార్చటానికి చాలామంది టెక్నీషియన్స్ ఉంటారు, చాలామంది పనివారుంటారు. దర్శకుడు కేవలం కుర్చీలో కూర్చుని చెబుతాడు. మిగిలినవారందరూ పనులు చేస్తారుగా! మరి ఇక్కడ ఎవరూ కనిపించడం లేదేమిటీ? అని మీరు అనుకోవచ్చు. మీకు మంచి ప్రశ్నే వచ్చింది. మీకు కనిపించటం లేదు అంతే! కానీ, ఇక్కడ కూడా సెట్టింగ్ వేసేవారు అందరూ ఉన్నారు. ఇక్కడ కూడా తెరలు వేసేవారు, ఇక్కడ కూడా సూర్యున్ని పరుగెత్తించేవారు, ఇక్కడ కూడా వర్షాన్ని రప్పించేవారు, ఇక్కడ కూడా భూమిని త్రిప్పేవారు, ఇక్కడ కూడా భూమి పై పంటను మొలిపించేవారు అందరూ ఉన్నారు. కానీ, వారు తెరమీద కనిపించరు. వారిని చిత్రీకరించకూడదు. వారంతా ఉన్నా మీకు కనిపించరు. మీకు గాలి విసిరింపజేస్తున్నవాడున్నాడు. కానీ, మీకు కనిపించడు. ఎందుకంటే, తెర మీదకి వాడు రాకూడదు. దేవుడి సినిమాలో వాడు మరుగైయుండాలి. చాలామంది టెక్నీషియన్లు లాంటి వారున్నారు. అందుకే ఆయన తన గ్రంథములో అనగా తన స్క్రిప్టులో వీరిని గూర్చి కూడా వ్రాయిస్తూ, ఆయన దగ్గరున్న టెక్నీషియన్ల సంఖ్య ఎంతంటే కోట్ల కొలదిగా ఉంది. (ప్రకటన 5:11). వందలకొద్దీ కాదా?

లక్షల కొలదీ కాదా? కాదు కాదు. కోట్ల కొలదిగా ఉన్నారు. వీరు తెర మీదకు రారు కానీ, మీ ప్రక్కనే వున్నారు. ఈ దేవుని స్క్రీన్ మీద(భూమిమీద) మాత్రం మీకు కనిపించరు. కానీ, ఆ స్క్రీన్ దాటి వెళితే కనిపించేస్తారు. మీరు పాత్రలో ఉన్నంతవరకూ మీకు కనిపించరు. కానీ, మీ పాత్రను మీరు ముగించగానే మీకందరూ కనిపిస్తారు. దేవుడు తీసే సినిమా అంతా మీకు ప్రత్యక్షమైపోతుంది. కానీ, అప్పుడు ప్రత్యక్షమైతే మీకు లాభం లేదు. మీరు భూమిమీద నటనను బాగా జరిగించాలి. దేవుడు వ్రాయించిన ఆ స్క్రిప్టు అర్థం కావాలి. దేవుడు ఎందుకు వ్రాయించాడో తెలియాలి. దేవుడు తన సినిమాకు ప్రారంభాన్ని ఎలా చేస్తున్నాడో చూడండి. ఆకాశాన్ని విశాలపరిచాడు, భూమిని నివాసస్థలముగా చేసాడు. దానికి సూర్యచంద్ర నక్షత్రాలను వెలుగుగా నిర్ణయించాడు.

ప్రసంగి **1 : 6–** "గాలి దక్షిణమునకు పోయి ఉత్తరమునకు తిరుగును; ఇట్లు మరల మరల తిరుగుచు తన సంచారమార్గమున తిరిగి వచ్చును." సూర్యుడు మాత్రమే, నక్షత్రాలు మాత్రమే అనుకున్నారా? చంద్రుడు మాత్రమే భూమి మాత్రమే అనుకున్నారా? కనిపించని గాలి కూడా దేవుని కట్టడలను పాటిస్తోంది. ఈ దేవుని సెట్టింగ్‌లో సూర్యుడు కనిపిస్తున్నాడు, చంద్రుడు కనిపిస్తున్నాడు, నక్షత్రాలు కనిపిస్తున్నాయి. కానీ మీరు నమ్మలేదు. ఇంకా మీరు నమ్మవలసింది మరొకటి వుంది. అదే కనిపించని గాలి! ఈ గాలిని గూర్చి ఆయన ఏమంటున్నాడో చూడండి. లోకసంబంధమైన చిత్రాలలో కూడా గాలిని పెడతారు. పెద్ద పెద్ద ఫ్యానులు వాడతారు. ఒకవేళ ఆ గాలి సరిగా తగలకపోతే వచ్చి విసురుతారు. ఎందుకు? నటీనటులు బాగా నటించాలి. సినిమా రక్తి కట్టాలి. 100 రోజులు ఆడాలి. మరి, దేవుని సినిమా? ఈయన కూడా నటీనటులకు గాలి పెడుతున్నాడు. యేసుక్రీస్తు చెప్పే మాటలు చూడండి. దేవుడు గాలిని ఎలా పెడుతున్నాడో! ఈ గాలిని గూర్చి, దేవుడు తీసే సినిమాను గూర్చి ఆయన కూడా చెప్పాడు.

**యోహాను 3 : 8–** "గాలి తనకిష్టమైన చోటను విసరును; నీవు దాని శబ్దము విందువేగాని అది యెక్కడనుండి వచ్చునో యెక్కడికి పోవునో నీకు తెలియదు. ఆత్మ మూలముగా జన్మించిన ప్రతివాడును ఆలాగే యున్నాడనెను". గాలి ఎక్కడికి పోవునో మీకు తెలియదు. ఎందుకంటే వాటి వెనుక ఉన్నది

దేవదూతలు. భూమి మీద చిన్న ఉషా ఫ్యాన్ నుంచి వచ్చే గాలి అనుకున్నారా? ఈ గాలైతే మీకు బాగా తెలుసు. ఎక్కడ నుంచి వస్తుందో, ఎక్కడికి పోతుందో! కానీ దేవుడు వీయించే ఆ గాలి, ఆయన సినిమాలో ఆయన పెట్టిన గాలి ఎలా ఉందో చూడండి. ఎక్కడ నుంచి వచ్చునో, అది ఎక్కడికి వెళ్ళునో మీకు తెలియదు. కేవలం శబ్ధమును వింటారంతే. దాని రాకడ, దాని పోకడ మీకు తెలీదు. ఎందుకంటే ఇది దేవుని మూవీ. ఇది దేవుని సినిమా. ఆకాశమనే ఈ తెర క్రింద, భూమి మీద మనుష్యులుగా ఉన్న మీరు దేవుని సినిమాను గూర్చి ఆలోచించాలి. ఆ స్క్రిప్టు మీకు అర్ధం కావాలి. దేవుని రచన మీకు తెలియాలి. ఎంత భారీ వ్యయం పెట్టాడో ఆలోచించండి. ఇప్పటికీ ఎంత కష్టపడుతున్నాడో చూడండి. ఆయన సినిమా అందరికీ అర్థమవ్వడంకోసం ఇప్పటికీ ఆయన ఎంతో కష్టపడుతున్నాడు. ఎవ్వరూ అడుగకపోయినా ఆయన సినిమా ఆయన తీసుకుంటూ వెళ్ళిపోతున్నాడు. సూర్యుని మండిస్తున్నాడు. ఆయనకు చాలా ఖర్చు అవుతుంది. చంద్రున్ని వెలిగిస్తున్నాడు. చాలా ఖర్చు అవుతుంది. నక్షత్రాలను వెలిగిస్తున్నాడు. చాలా ఖర్చవుతుంది దేవునికి. గాలిని పంపిస్తున్నాడు. ఆయనకు చాలా ఖర్చు అవుతుంది. ఇంకా, సముద్రములు, నదులు, జీవరాశులు, ... ఇలా ఎన్నెన్నో చూడండి. మనము ఈ భూమిమీద విత్తనాలను జల్లితే భూమి పంటనివ్వాలా చెప్పండి? దేవుడు దీనంతటికీ నిర్మాత కదా! అందుకే భారీగా ఖర్చుపెడుతున్నాడు. మనుష్యులకు హామీ ఇచ్చాడు. వీరందరినీ నటనలోనికి తీసుకున్నాడు. వీరందరికొరకు దేవుడు ఖర్చు పెట్టాలి. అందుకే నీవు ఒక గింజను విత్తితే, వందలకొద్దీ గింజలను భూమి నీకు మరల ఇస్తుంది. ఎందుకంటే దేవుడు భూమికి ఆ విధానాన్ని నియమించాడు. ఇక్కడ జరిగేదంతా దేవుని సినిమా! మనుష్యులకు ఆహారం కావాలా? భూమిని అడగండి. మీకు దప్పికవుతుందా? సరస్సులను, నదులను అడగండి. మీకు ఉప్పు నీరు, చేపలు విస్తారంగా కావాలా? సముద్రాల దగ్గరకు వెళ్ళండి. ఎందుకంటే ఇది దేవుడు పెట్టిన ఆహారం. ఇది ఆయన సినిమా, ఇక్కడ జరుగుచున్నదంతా ఆయన చిత్రీకరణ!

**కీర్తనలు 104 : 6–** "దానిమీద అగాధ జలములను నీవు వస్త్రమువలె కప్పితివి. కొండలకుపైగా నీళ్లు నిలిచెను. నీవు గద్దింపగానే అవి పారిపోయెను.

నీ ఉరుము శబ్దము విని అవి త్వరగా పారిపోయెను. నీవు వాటికి నియమించిన చోటికి పోవుటకై అవి పర్వతములెక్కెను. పల్లములకు దిగెను. అవి మరలి వచ్చి భూమిని కప్పకయుండునట్లు అవి దాటలేని సరిహద్దులు నీవు వాటికి నియమించితివి.” భూమి మీద జలప్రవాహములను గూర్చి ఆయన చెబుతున్నాడు. అవి కొండలు ఎక్కాలి, కొండలు దిగాలి. ఆ జలపాతములను చూసినపుడు ప్రకృతి అందాలని మురిసిపోయారు తప్ప ఇది దేవుడు తీస్తున్న సినిమా అని ఎవరికైనా గుర్తొచ్చిందా? కెమెరాతో ఒక ఫోటో తీసుకున్నావు, ఒక సెల్ఫీ తీసుకున్నావు తప్ప, ఇది దేవుడు తీస్తున్న సినిమా అని తెలిసిందా? ఆ సోయగాలు, ఆ జలపాతాలు, ఆ నదులు, ఆ హిమాలయాలు, ప్రకృతి అందాలన్నీ ఏమిటో తెలుసా? అవి దేవుడు నిర్ణయించినవి. దేవుడు నియమించినవి. తాను చిత్రీకరించేటటువంటి సినిమాకు దేవుడు నిర్ణయించుకున్న ప్రతీ వస్తువు, ప్రతీ శక్తి తన కట్టడను అది పాటిస్తుంది. దేని విధిని అది నెరవేరుస్తుంది. ఎందుకంటే ఆయన సినిమా పూర్తి కావాలి. మనుష్యులందరినీ నిత్యత్వములో బ్రతికించటానికి ఆయన సినిమా తీసాడు. నిత్యజీవాన్ని అనుగ్రహించటానికి ఆయన స్క్రిప్టు వ్రాసుకున్నాడు. లేఖనాలు వ్రాయించాడు. ఆకాశానికి నోరు లేదు. మీరు నిలుచున్న ఈ భూమికి నోరు లేదు. మీకు ప్రాణవాయువైన ఈ గాలికి నోరు లేదు. మణికుమార్‌గా నాకు మాత్రమే నోరుంది. ఈ మాటలను నేనే చెప్పగలుగుతున్నాను. వాటికే నోరుంటే ఏమని చెబుతాయో తెలుసా? దేవుడు తీసిన సినిమానే చెబుతాయి. ఆకాశానికి నోరిస్తే, భూమికి నోరిస్తే, నదులకి నోరిస్తే, సముద్రాలకు నోరిస్తే – ఎవ్వడినీ మాట్లాడనివ్వకుండా, ఎవ్వడినీ సినిమా తీయనివ్వకుండా, ముందు నువ్వు ‘దేవుడు తీసిన సినిమా’ చూడరా అని చెబుతాయి. ఆ తర్వాత చెప్పుకో! నీ సినిమా గురించి చెప్పుకుంటావో, నీ బాబు సినిమా గురించి చెప్పుకుంటావో. దేవుడు తీసిన సినిమా తెలుసా నీకు? దేవుడు వ్రాయించిన లేఖనము తెలుసా నీకు? దానిని చిత్తు కాగితముగా చేసావా? నీవు వ్రాసుకున్న ఆ చెత్త కథను మహాజ్ఞానమని ఈ లోకానికి చూపించావా? ధనవంతులు మొదలుకొని, పేదవారి వరకు ఈ రోజు లోకసంబంధమైన చెత్త సినిమాలను చూడటానికి తొక్కిసలాట. టిక్కెట్లు కొనుక్కోడానికి తొక్కిసలాట. మూర్ఖుడు తీసిన ఆ దౌర్భాగ్యపు సినిమాని

తొక్కించుకుని మరీ చెత్తను చూస్తున్నావా? దేవుడు తీసిన సినిమాను చూడవా? వినవా? గ్రహించవా? అందులో చక్కగా నటించవా? తెలుసుకోవా? ఆయనను ఆరాధించవా? ఆయన ఇచ్చే నిత్యజీవములోనికి ప్రవేశింపవా?

**కీర్తనలు 19 : 1-** "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది. పగటికి పగలు బోధ చేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది." ఆకాశములు దేవుని మహిమను వివరిస్తున్నా మీ చెవులకు అది వినిపించదు. చెప్పానుగా! మీ చెవి వినేటట్టుగా చెప్పడానికి వాటికి అలాంటి నోరు లేదు. కానీ, అవి వివరించుచున్నవి. చూపిస్తున్నాయి. మనిషి తీసిన ఆ చిన్న సినిమాను మీరు చూసి నేర్చుకుంటున్నారే, గ్రహిస్తున్నారే! మరి పరలోకపు తండ్రియైన దేవుడు తీసిన సినిమాను మీరు గ్రహించరా? ఆయన చెబుతున్నా మీరు చూడరా? ఏమంటున్నాడో చూడండి. దేవునికి పబ్లిసిటీ అంతరిక్షము చేస్తోంది. నీ పైనున్న యూనివర్స్ నీవు తిరగటానికి కాదు. ఈ యూనివర్స్ రాకెట్లు పంపడానికి అస్సలు కాదు. ఈ ఆకాశము దేవుని మహిమను చెప్పటానికి, దేవుడు తీసే సినిమాను ప్రపంచ వ్యాప్తంగా పబ్లిసిటీ చేయటానికి నిరంతరము శ్రమిస్తున్నాయి. ఆకాశము, అంతరిక్షము అందుకే వున్నాయి. పగలు రాగానే మీకు పనులు గుర్తుకొస్తాయి. కానీ, దేవుడు తీసిన సినిమా మీకు గుర్తుకు వస్తుందా?

**కీర్తనలు 19 : 2-** "పగటికి పగలు బోధ చేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికి భాషలేదు, మాటలులేవు, వాటి స్వరము వినబడదు. వాటి కొలనూలు భూమియందంతట వ్యాపించియున్నది. లోకదిగంతములవరకు వాటి ప్రకటనలు బయలు వెళ్లుచున్నవి". వాటికి భాష వుందా? లేదు. అందుకే మీకు వినిపించలేదు. అయినా, మేమేదో దేవుని కోసం చేయాలి. దేవుడు ఇంత భారీ ప్రణాళికతో ఆయన నిర్మించే సినిమాను మేము చూపించాలి. ప్రపంచవ్యాప్తం చేయాలి. విన్నవాడు గ్రహిస్తాడు. మనోనేత్రంతో చూచినవాడికి ఆ సినిమా అర్థమవుతుంది. అని వాటి ప్రయత్నాన్ని అవి చేస్తున్నాయి. ఆకాశము, అంతరిక్షము, పగలు, రాత్రి, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, నదులు, భూమి, పంట, పర్వతములు, కొండలు, పశుపక్ష్యాదులు – ఇవన్నీ ఏమిటో తెలుసా? దేవుని సినిమా మీకు చెప్పటానికి, చూపించటానికి

విశ్వప్రయత్నం చేస్తున్నాయి. మనిషి అడవిలోనికి వెళ్ళిపోగానే మృగాలను చూస్తున్నాడు, వాటిని కెమెరాలో బంధిస్తున్నాడు, వస్తున్నాడు, దానినే డిస్కవరీ అంటున్నాడు. దేనిని డిస్కవరీ చేసావురా? బడుద్దాయ్! దేనిని డిస్కవర్ చేసావు నువ్వు? సింహాన్నా? పులినా? చీమనా? పామునా? దేవుణ్ణి కాదా? ఆ సింహము నీకు దేవుణ్ణి చూపించటానికేరా పరుగెడుతుంది. ఆ జింక దేవుణ్ణి తెలియజేయటానికేరా బలైపోతుంది. ఆ పాము దేవుని గూర్చి ప్రపంచానికి తెలియజెప్పటానికేరా తన జీవితాన్ని చూపిస్తుంది. ఆ పక్షి ప్రపంచానికి దేవుని సినిమా తెలియజేయటానికేరా తన అందమంతటినీ, తన రెక్కలలో దాగియున్న రంగులన్నింటినీ నీ కెమెరాలకు చూపిస్తున్నది. యానిమల్ ప్లానెట్ / డిస్కవరీ / నేషనల్ జియోగ్రఫీ ఛానెల్స్ కోసం కాదు. అదంతా దేవుడు తీసే సినిమా. మీకర్థం కావాలని ఈ ప్రకృతి అంతా చాలా ప్రయత్నిస్తోంది. ఈ సినిమాను పాఠముగా చదువుచున్న మీలో ఎంతమందికి అర్ధమయిందో నాకు తెలియదు. మీలో ఎంతమందికి ఈ విషయం మనస్సు లోతులకు వెళ్ళిందో నాకు తెలియదు. ఈ విషయం లోపలికి వెళ్ళకపోతే, ఇక మిగిలిన భాగాలలో నేను రచించిన దేవుని అసలైన సినిమాను మీ దేహము ఇక చదవనివ్వదు. ఎందుకంటే ఈ మణికుమార్ ఏదో చెబుతున్నాడు. నువ్వు మోసపోతావేమో అని నిన్ను భ్రమపరుస్తుంది! కానీ, ఇది మిమ్మల్ని మోసగించేది కాదు. మిమ్మల్ని మోసగిస్తే నాకేమి వస్తుంది? ఈ ప్రపంచాన్ని నేను మోసగించటం లేదు. దేవుడు చెప్పమన్నది నేను నిర్భయంగా చెబుతున్నాను. దేవుడు తీసిన సినిమాను, నేను ఈ ప్రపంచానికి తెలియజేస్తున్నాను. ఇప్పటి వరకు ఉపోద్ఘాతాన్ని విన్నారు. ఇక తదుపరి భాగాలలో మిగిలిన దేవుని సినిమాను చూడండి!

ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్

క్రైస్ట్ చర్చ్ – సామర్లకోట – 8978414178.

## దేవుడు తీసిన సినిమా - 2

ఈ రోజు భూమి మీద మనుష్యులు తమ కాలక్షేపం కోసం సినిమాను చూస్తారు. సాయంత్రం వేళ వారికి ఏమీ తోచకపోతే, జేబులో ఒక 100 రూపాయలుంటే సినిమా థియేటర్‌కు వెళ్ళిపోతారు. కానీ, మీరు కాలక్షేపం కోసం దేవుని సినిమాను చూడలేరు. ఇందులో జరిగేది కాలక్షేపం కాదు. కాసేపు టైమ్‌పాస్ కాదు. పైగా, నిర్మాత మీ దగ్గర నుండి ధనాన్ని సేకరించే పని అంతకన్నా కాదు. విడుదలకు నోచుకోని దేవుని యొక్క సినిమాను, ఆయన వ్రాసుకున్న రచనను మీకు పూర్తిగా తెలియజేయాలి. తద్వారా మిమ్మును బట్టి మిగిలిన సమాజానికి అందజేయాలి. కన్ను మూస్తే ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. దేహాన్ని విడిచిపెడితే ఏ లోకానికి వారి ఆత్మ వెళ్ళిపోతుందో ఎవరికీ తెలీదు. అలాంటి పరిస్థితులలో ఒక అసభ్యకరమైన సినిమాను మీకు చూపించమంటారా? వాస్తవమే లేని డూపు సినిమాను మీకు చూపించమంటారా? లేక పూర్తిగా యదార్ధాన్ని చూపించమంటారా? దేవుడంటే ఎందుకయ్యా అంత చులకన? మీకు దేవుడు ఎందుకు అంత చిన్నవాడుగా మారిపోయాడు. ఆయన మీ దృష్టిలో మీ కంటికి కనిపించటం లేదు. వెనువెంటనే మీకు శిక్ష విధించటం లేదు. అందుకేనా? తస్మాత్ జాగ్రత్త! దేవుడు అతి భయంకరుడు. దేవుడు చాలా శక్తివంతుడు. ఆకాశమహాకాశాలు పట్టజాలనంత భారీ ఆకారము కలిగిన దేవుడు మనుష్యుల కొరకు ఎంతో ప్రణాళిక చేసాడు. ఆయన తన సంకల్పముతో, ఎంతో గొప్ప రచన చేసి, ఒక మంచి సినిమాను తీయాలనుకున్నాడు. అది మనిషికి నచ్చకపోవచ్చు. దానిని చూచిన వారి శరీరం గెంతకపోవచ్చు. అందుకే దేవుడు తీసిన సినిమా అనగానే చాలామంది విడిచి వెళ్ళిపోతారు. వెళ్ళిపోనివ్వండి. కానీ, దేవుని యొక్క కార్యక్రమం, దేవునియొక్క ఈ భారీ ప్రణాళికలోనికి మీరు అడుగుపెట్టారు. ఈ క్షణమందే యేసుక్రీస్తు రెండవ రాకడ జరిగితే (అనగా ఈ విశ్వవినాశనం జరిగితే) నీతిమంతులుగా ఈ దేవుని సినిమాను తెలుసుకున్నవారు మాత్రమే దేవునిచేత అంగీకరింపబడతారు. అదే దేవుని సినిమాను తెలుసుకుంటున్న మీ గొప్పతనం.

లోకమందు అందరూ వారి వారి సొంతకార్యములను చూచుకుంటున్న వారే. మనిషి తీసిన సినిమా మనిషి చూడాలనుకుంటున్నాడు. అలాంటివారా మహాలోకానికి వెళ్ళేది? అలాంటి వారిని దేవుడు అంగీకరిస్తాడా? కనుక ప్రియులారా, ఆయన తీసిన సినిమాలో ఒక చక్కని అంకాన్ని, మంచి సన్నివేశాన్ని, ఆయన వ్రాయించిన స్క్రిప్టులో మంచి భాగాన్ని మీకు తెలియజేస్తాను. చాలా సంతోషంతో, చాలా ఆనందంతో మీరు ఈ సినిమాను తెలుసుకోండి. దేవుడు ఒక రచన చేసాడు. ఆయన ఒక స్క్రిప్టు వ్రాసుకున్నాడు. అదే ఈరోజు ప్రపంచవ్యాప్తంగా, గ్రంధరాజముగా, ఆరిన నేల మీద ప్రతీ భాషలోనికి తర్జుమా అయ్యి, అనేక మందికి గొప్ప పుస్తకముగా చెలామణి అవుతున్న "ది బైబిల్". జాన్‌గ్యూటన్‌బర్గ్ అచ్చు యంత్రాన్ని కనుగొన్న తర్వాత, నేను కనుగొన్న యంత్రము ద్వారా మొట్టమొదట ముద్రించవలసిన పుస్తకం బైబిల్ అన్నాడు ఆ గొప్ప శాస్త్రవేత్త. థామస్ ఆల్వా ఎడిసన్ బల్బు కనుగొన్న తర్వాత, ఆ వెలుగులో నేను చదవాల్సిన మొట్టమొదటి పుస్తకం బైబిల్ అన్నాడు ఆ గొప్ప శాస్త్రవేత్త. ఇలా తరాలన్నింటిలో అనేకమందికి నిత్యజీవ మార్గాన్ని చూపిస్తూ, వెలుగును ప్రసాదిస్తున్న ఈ వాక్యము ఏదో అనుకోకండి. అదే దేవుడు వ్రాసుకున్న రచన. ఆయన వేసిన ఈ సెట్టింగులో ఏరోజైనా తన భూమి ఆలస్యంగా తిరిగిందా? మీ గడియారం ఆలస్యంగా తిరిగి ఉండవచ్చు. ఎందుకంటే అందులో జపాన్ వాడు తయారుచేసిన బ్యాటరీ అయిపోయింది. మీరు చూస్తున్న, మీరు ఉనికి కలిగియున్న ఈ భూమి ఏ రోజూ ఆలస్యం చేయలేదు. 24 గంటలలో క్షణాలతో సహా తన చుట్టూ తాను తిరుగుతోంది. ఏ రోజూ సూర్యుడు ఆలస్యం చేయలేదు. ఈ విశ్వంలో ఏ రోజూ ఏదీ ఆలస్యం చేయలేదు. ఎందుకంటే దీని వెనుక ఆ మహాశక్తి ఉన్నాడు. అతనే ఈ సినిమాకు దర్శకుడు. *{He is Director}* అతడు తాను వేసిన సెట్టింగులో దేనినీ ఆలస్యంగా తిరగనివ్వడు. ఆయన చాలా గొప్పవాడు. ఆయన కట్టడ *{Rule}* పెట్టాడంటే దానిని ఏదీ అతిక్రమించకూడదు. ఇక ముందుకు వెళదాం.

**కీర్తనలు 148 : 6-** "ఆయన వాటిని నిత్యస్థాయువులుగా స్థిరపరచియున్నాడు. ఆయన వాటికి కట్టడ నియమించెను. ఏదియు దానినతిక్రమింపదు." వేటిననుకుంటున్నారు? దేవుడు తన సినిమాకు వేసిన

లొకేషన్‌ను గూర్చి ఈ మాటలు చెప్పాడు! సూర్యుడా, చంద్రుడా, నక్షత్రములా, ఆవిరా, హిమమా, తుఫానా, వర్షమా, మేఘములా, భూమా, గ్రహములా, నక్షత్రాలా, పాలపుంతలా? {There is a Rule} ఏదైనా సరే. కంటికి కనిపించనంత సూక్ష్మాకారంలో ఉన్నా సరే, ఖగోళదర్శినితో చూచినా కనిపించని భారీ ఆకారంలో ఉన్నదైనా సరే. ఆయన నియమించినది ఏదైనా ఎలా ఉండాలంటే, దేవుని కట్టడను అతిక్రమించకూడదు. ఏది? మన సైంటిస్ట్‌ని విశ్వంలోని పదార్థాలకున్న ఒక్క రూల్ చెప్పమనండి. వీడు కేవలం ఫ్లెమింగ్ సూత్రం చెప్తాడు. ఫ్లెమింగ్ కుడిచేతి సూత్రం, ఆర్కిమెడిస్ సూత్రం లాంటివి చెబుతాడు. దేవుని ప్రిన్సిపల్ నాకు కావాలి, ఎవరైనా చెప్పగలరా? {Where is god's Principle?} రూథర్‌ఫోర్డ్ నమూనా, బోర్ పరమాణు నమూనా చెబుతారా? అది ఎప్పుడూ బోరింగే. ఈ శాస్త్రవేత్తలు ఏవో చిన్న చిన్నవి వ్రాసారు. దేవుడు కలిగించిన ఈ ప్రకృతిని చూచి చిన్న చిన్న విషయాలను వ్రాసినవారే శాస్త్రవేత్తలు. {He is Scientist} సైంటిస్ట్ మీకు గొప్పవాడు కావచ్చు కానీ దేవునికి గొప్ప కాదు, దేవుని కుమారునికీ గొప్ప కాదు. "ఆయన వాటికి కట్టడ నియమించెను." ఈ విశ్వంలో దేవునియొక్క రూల్స్, ప్రిన్సిపల్స్ ఉన్నాయి. సూత్రాలు వున్నాయి. "ఏదియు దానిని అతిక్రమింపదు" అన్నాడు చూడండి. అందుకే భూమి ఖచ్చితంగా తిరుగుతుంది. నీకు కాలాన్ని ఇస్తుంది. అందుకే చంద్రుడు ఖచ్చితంగా తిరుగుతున్నాడు. నీకు ఋతువులను ఏర్పరుస్తున్నాడు. అందుకే సూర్యుడు ఖచ్చితంగా తిరుగుతున్నాడు. వీటి వలన ఏర్పడే కాలము చాలా ముఖ్యమైనది. ఈ సమాజానికి కావలసినది. చాలా అవసరమైనది. దేవుడు తీసే సినిమాలో ఏదీ దేవుని కట్టడను అతిక్రమింపకూడదు. మీకాయన స్క్రిప్టు అర్ధమౌతుందా? ఆయన ఏమి వ్రాసుకున్నాడో గ్రహిస్తున్నారా? చిన్న చిన్న మనుష్యులు వ్రాసుకున్న స్క్రిప్టు కాదు కదా ఇది. మహాదేవుడు వ్రాయించిన స్క్రిప్టు ఇది. {This is God's Movie} ఒకవేళ భూమి మీద ఉన్న మనుష్యులు దేవుని వాక్యము దగ్గరకు రాకుండా, ఆయన స్క్రిప్టు చదవకుండా ఒకవేళ సూక్ష్మదర్శినో, ఖగోళదర్శినో పట్టుకుని ఈ విశ్వాన్ని పరిశీలించి, ఇంత ఖచ్చితమైన సమయాన్ని ఈ ప్రకృతి ఎందుకు పాటించుచున్నదో ఆలోచించగలిగారా? అసలు ఎలా జరుగుతుందిదంతా? ఎవరున్నారు దీని వెనుక? రైల్వేశాఖ వెనుక రైల్వేమంత్రి

ఉన్నాడు. అతని క్రింద సహాయమంత్రులు మరియు చాలా మంది అధికారులు, సిబ్బంది ఉన్నారు. అయినాగాని, ఏ ఒక్క రైలు బండీ ఏ రోజూ దాని దాని సమయానికి రాలేదు. మరి అలాంటప్పుడు, ఈ ప్రకృతి వెనుక ఎవరున్నారు? అని ఎవరైనా ఒకవేళ ఆలోచింప మొదలుపెడితే, ఈ దేవుని స్క్రిప్టు దగ్గరికి రానిపక్షంలో వారికి ఎన్నటికీ అర్థం కాదన్నాడాయన. నీ సంగతిని కూడా ఆయన తన స్రిప్టులోనే వ్రాయించేసాడు. దేవుడు తీసిన సినిమాకు మూలకథ బైబిల్ గనుక, దీని దగ్గరకు రావాలి తప్ప, నీవు వ్రాసుకున్న పుస్తకాల దగ్గరకు వెళ్ళి సృష్టిని పరిశీలిస్తే, సృష్టి ఏమి చెబుతుంది? ఒక మొట్టికాయ వేసి పంపిస్తుంది. వేయలేదా మొట్టికాయ? చాలా మందికి చాలాసార్లు సృష్టి మొట్టికాయలు వేసింది. మీరు చాలా సార్లు విన్నారు. చెన్నై మెరీనా బీచ్‌లో ప్రకృతి ప్రేమికులు ఆహ్లాదంగా ఆడుకుందామని వెళ్ళారు. దేవుని యొక్క లొకేషన్, ఆయన వేసిన సెట్టింగ్ వారికి ఒక మొట్టికాయ వేసి పంపించింది. అదే సునామి! ఏమనుకుంటున్నారు సునామి అంటే? దానంతట అదే వచ్చేసింది అంటారా దీనిని కూడా? ఏదీ దానంతట అది రాదు. మీ ఇంటి దగ్గర నుండి మరొకచోటికి వెళ్ళాలంటే ప్రణాళిక లేకుండా, పని చేయకుండా ఊరకనే వెళ్ళిపోగలరా? ఇంటి దగ్గర కుర్చీలో కూర్చుని నేను ఫలానా శంషాబాద్ విమానాశ్రయంలో ప్రత్యక్షమవ్వాలి, ఊరకనే వెళ్ళిపోవాలి అనుకుంటే వెళ్ళిపోతారా? లేదు. మీరు అక్కడికి వెళ్ళాలంటే మీ ఇంటినుంచి మీరు బయటకు రావాలి. ఒక వాహనాన్ని మీరు సిద్ధపరుచుకోవాలి. అందులో ఇంధనం (పెట్రోల్/డీజిల్) ఉండాలి. జాగ్రత్తగా ట్రాఫిక్ అంతా ఛేదించుకుని వెళ్ళగలిగితే, పనిచేస్తే, మీరు శంషాబాద్ విమానాశ్రయంలో ఉండగలరు. ఏదీ దానంతట జరగదు. ఈ సృష్టిని గూర్చి ఒకవేళ ఆలోచిస్తే ఈ సెట్టింగ్ యొక్క వివరము మీకు అర్థం కావాలంటే మీరు దేవుని స్క్రిప్టు దగ్గరికి రావాలి. ఆయన రచనలో ప్రసంగి గ్రంథమును ఇప్పుడు చూడండి. వండర్ అయిపోతారు మీరు. దేవుడు వ్రాయించిన మాటలు ఆయన స్క్రిప్టులో ఆయన సినిమాను గూర్చి ఆయన తెలుపుతున్న సంగతులను చూడండి.

ప్రసంగి **8 : 17–** "దేవుడు జరిగించునదంతయు నేను కనుగొంటిని. మరియు సూర్యుని క్రింద జరుగు క్రియలు మనుష్యులు కనుగొనలేరనియు, కనుగొనవలెనని మనుష్యులు ఎంత ప్రయత్నించినను వారు కనుగొనుట

లేదనియు, దాని తెలుసుకొనవలెనని జ్ఞానులు పూనుకొనినను వారైన కనుగొనజాలరనియు నేను తెలిసికొంటిని." ఎవరు జరిగిస్తున్నారు దీనిని? పరిశుద్ధాత్మ ప్రేరణ కలిగిన ఆ భక్తునికి అర్థమైపోయింది. సొలొమోను అనే ఆ మహాజ్ఞానికి అర్థమైపోయింది. అతడే కింగ్ సొలోమోను. మీరు చిన్నప్పుడు చరిత్రలో చదువుకొని ఉండాలి. జ్ఞానము కలిగిన ఒక మంచి రాజును దేవుడు, 'నీకు ఏమి కావాలి నాయనా' అని అడిగితే 'నాకు ఐశ్వర్యము వద్దు, సంపద వద్దు, నాకు నీ జ్ఞానమే కావాలి అని అడిగినటువంటి ఒక గొప్ప భక్తుడు వ్రాస్తున్న మాట ఇది. అతడు ఏమని అంటున్నాడో చూడండి. "సూర్యుని క్రింద జరుగు క్రియలు మనుష్యులు కనుగొనలేరు" – ఈ శాస్త్రవేత్తలు, దర్శక, నిర్మాతలు ఏమనుకుంటారు? మేమొక సినిమా తీసుకుంటాము. ఆ సినిమా చూడటానికి ఒక థియేటర్‌లోకి దూరిపోతాము. దేవుడు తీసే సినిమాతో మాకు పనేంటి? అనుకుంటున్నారు వీరందరు. వారి యొక్క మనసులోని భావాన్ని సొలోమోను చెబుతున్నాడు. ఈ ప్రకృతి వెనుక ఎవరి హస్తము ఉందో తెలుసుకొనుట చాలా కష్టం. అది స్టీఫెన్ హాకింగ్స్ కావచ్చు, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కావచ్చు, ఐజక్ న్యూటన్ కావచ్చు! ఇంకా ఎవరెవరు శాస్త్రవేత్తలు, ఎవరెవరు పేరెన్నిక కలిగినవారో, వారందరిని గూర్చి ఇక్కడ చెప్పాడు. జ్ఞానులైనా ఒకవేళ ఆ మహాశక్తిని కనుగొంటారేమో, దేవుడు తీసే సినిమాను వారైనా తెలుసుకుంటారేమో అనుకున్నారా? కానీ, వారికి కూడా తెలియదన్నాడు. ఎవ్వరూ ఛేధించలేని ఆ గొప్ప సంగతిని ఈ రోజు దేవుడు మీకిచ్చాడు. మీరు చదువుచున్నది, మీరు గ్రహిస్తున్నది, మీరు చూస్తున్నది సామాన్యమైనదనుకున్నారా? కాదు! *No. This is Wonder.* ప్రపంచంలో ఎవరికీ తెలియని ఈ రహస్యం, ఈ సృష్టిరహస్యం ఈ రోజు మీకు అర్థమైంది. నిజమండి. ఏదోనండి, దేవుని గూర్చి వ్రాస్తున్నారు గనుక మీరీమాట చెబుతున్నారు అని అనుకుంటున్నారేమో! అందుకే యేసుక్రీస్తు చేత చెప్పించాలి మీకు. ఒక్కసారి చూద్దాం.

**మత్తయి 11 : 25–** "ఆ సమయమున యేసు చెప్పినదేమనగా – తండ్రీ, ఆకాశమునకు భూమికిని ప్రభువా, నీవు జ్ఞానులకును వివేకులకును ఈ సంగతులను మరుగుచేసి పసిబాలురకు బయలుపరిచినావని నిన్ను స్తుతించుచున్నాను." నీ సినిమా తీయటానికి ఆకాశాన్ని పరిచావు. భూమిని

స్థలంగా సిద్ధపరిచావు. ఇదంతా నీ సెట్టింగ్. ఆయన సినిమా ఎలా జరుగుచున్నదో చూడండి. రీలు ఎలా కదులుతున్నదో చూడండి. ఈ సృష్టి రహస్యమును గూర్చి సృష్టి కార్యక్రమమును గూర్చి ఆకాశమునకు, భూమికిని ప్రభువైన ఆయనను గూర్చి, ఆయన తీసే సినిమాను గూర్చి ఎవ్వరికీ తెలియదు అన్నాడు. ఈ లోకపు జనులకు దేవుడు మరుగు చేసాడు. ఈ సంగతులను వారికి తెలియనివ్వలేదు. జ్ఞానులకు, వివేకులకు ఈ సంగతులు మరుగు చేసిన దేవుడు, మరి ఎవరికి అనుగ్రహించాడు? పసిబాలురైన మనకే అనుగ్రహించాడు. వీరే లోకములో ఎన్నిక లేనివారు, దేవుని నమ్ముకున్నవారు, దేవుని కొరకు తమ ప్రాణాలను ఇవ్వడానికి సైతం లెక్కచేయని వారు! వారికి మాత్రమే ఇచ్చావు తండ్రీ అన్నాడు యేసు ఆనాడు. కనుక ప్రియులారా! దేవుడు తాను తీయబోయే ఈ మహా కార్యక్రమానికి, ఈ మంచి సినిమాకి స్థలాన్ని సిద్ధపరిచాడు. ఆకాశాన్ని తెరగా పరిచాడు. ఇక మనము లోతులకు వెళ్ళి మాట్లాడుకుంటే, ఎందుకు ఆయన భూమిని మాత్రమే ఎన్నుకున్నాడు? భూమిని మాత్రమే ప్రధానమైన స్థలముగా ఎందుకు మార్చాడు. తన సినిమాను తీయటానికి, తాను వ్రాసుకున్న స్క్రిప్టు అంతటినీ కేవలం భూమి మీద మాత్రమే జరిగించటానికి, ఆయన ఎందుకు సంకల్పించాడు అని మనము ఆలోచిస్తే, భూమి మీద తన కుమారులైన మనుష్యులను దేవుడు ప్రవేశపెట్టబోతున్నాడు. ఆయన తీస్తున్న సినిమాలో వారే ప్రధాన పాత్రధారులు. వారే లేకపోతే ఆయన సినిమా లేదు. వారే లేకపోతే ఈ సృష్టి లేదు. వారే లేకపోతే ఇంత భారీ ప్రణాళిక లేదు. వారే లేకపోతే ఈ స్క్రిప్టు లేదు. దేవుడు తన కుమారుల కొరకు ఎంతగా ఆలోచించాడో చూడండి. ఎంత ప్రణాళికను రచించాడో చూడండి. ఒకసారి మీ మనసారా ఆలోచించండి! ఇంత భారీ సృష్టి నా కొరకా? ఆకాశంలోనికి వెళ్ళిపోతే నేనొక చిన్న నలకలా కనిపిస్తాను. నా కొరకు దేవుడు ఇంత ప్రణాళికను కలిగియున్నాడా? అవును. ఇది ఈ ప్రపంచం నమ్మలేని నిజం. దేవుని యొక్క సినిమాలో ఆయన వ్రాయించిన వాస్తవమిది. మిమ్మును బట్టే ఆయన సినిమాను తీస్తున్నాడు. ఆయనకు మీరే ప్రధానం. భూమి మీద దేవుని పిల్లలు రావాలని, వారి కోసమే దేవుడు ఈ కార్యక్రమమంతటినీ జరిగించాడు. "ఏవండీ, మన కొరకు మాత్రమే అయితే కేవలం ఒక భూమిని తయారుచేస్తే సరిపోతుంది కదా! మరి ఈ విశ్వమంతా

ఎందుకు? విశ్వంలో ఇంకా మాకు తెలియవలసింది 90 శాతం చీకటి పదార్థం (డార్క్ మ్యాటర్) ఉందే! మరి దీనినంతటినీ దేవుడు ఎందుకు తయారుచేసాడు? భూమికంటే భారీ ఆకారంతో ఉన్న నక్షత్రాలు, పాలపుంతలు, గ్రహమండలాలు... వీటన్నింటినీ దేవుడు ఎందుకు తయారుచేసాడు? అని మీరు ప్రశ్నిస్తే, ఈ భూమిని ఇలా నడిపించటానికి అవన్నీ అవసరం. ఉదాహరణకు, మీరు బస్సులో ప్రయాణించేటప్పుడు మీ సీటులో మీరు కూర్చుంటారు. కానీ, మీరు గమ్యానికి వెళ్ళటానికి, సజావుగా మీ ప్రయాణం జరగటానికి కేవలం మీరు కూర్చున్న సీటు మాత్రమే ఉంటే సరిపోదు. మీ సీటు క్రింద భారీ సైజులో ఉన్న బస్సు ఇంజను కావాలి, యాక్సిల్ కావాలి, బ్రేకులు కావాలి, 6 చక్రాలు కావాలి, ఇంధనం కావాలి, డ్రైవరు కావాలి. ఇంకా చాలా యాంత్రిక భాగాలు కావాలి. వీటన్నింటినీ సమకూర్చితేనే ఒకడి ప్రయాణం సజావుగా జరుగుతుంది. అవును! ఒక విమానంలో కేవలం మీ సీటు గురించి మాత్రమే మీరు ఆలోచిస్తే – మీ సీటు ఒక్కటే ఉంటే సరిపోతుందా? లేదు. చాలా భారీ శబ్దంతో, చాలా భారీ ఆకారంతో, పెద్ద పెద్ద ఇంజన్లు పనిచేస్తే అప్పుడే ఆ భారీ ఆకారం కలిగిన ఆ విమానం అలా... గాలిలో తేలుతుంది. సువిశాలము మరియు నివాసయోగ్యమైన ఈ భూగోళము మనకు బ్రతుకునివ్వాలి అంటే, మనకు ఉనికి నివ్వాలి అంటే ఖచ్చితంగా ఇంత భారీ ప్రణాళిక అవసరం. అందుకే ఈ విశ్వంలో పాలపుంతలు ఉన్నాయి. నక్షత్ర మండలాలు ఉన్నాయి. దేవుడు ఈ విశ్వమంతటినీ తన సినిమా కొరకు తయారుచేసాడు. ఈ భూమిని ప్రధానమైనదిగా దేవుడు తయారుచేసాడు. ఈ భూమి మీద మీరు చాలా సంతోషంగా బ్రతకాలి. సుఖంగా బ్రతకాలి. ఈ భూమి పాత్రధారులందరికీ బ్రతుకునివ్వాలి. అందుకే, ఈ ప్రణాళిక అంతా మీకోసమే అంటున్నాడు. 5 లేక 6 అడుగులు ఎత్తు ఉన్న ఒక మనిషి కోసమే ఈ ప్రణాళిక అంతా!

**యాకోబు 1 : 18–** “ఆయన తాను సృష్టించిన వాటిలో మనము ప్రథమఫలముగా ఉండునట్లు సత్యవాక్యము వలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను.” దేవుడు సృష్టించినవాటిలో చాలానే ఉన్నాయి. ఆయన అనేకమైన గ్రహాలను, నక్షత్ర మండలాలను సృష్టించాడు. భూమండలము మట్టుకు మనము ఆలోచిస్తే ఆయన సృష్టించినవి ఇక్కడే ఎన్నో ఉన్నాయి.

అయితే ఆయన సృష్టించినదంతా ఒక ప్రక్కన పెట్టి, ఆయన ఏమంటున్నాడో చూడండి. అన్నింటికంటె మనిషే ప్రధానమైనవాడు అంటున్నాడు. సృష్టించినదంతా మనిషినిబట్టే సృష్టించాను అంటున్నాడు. ఇప్పుడైనా అర్థమైందా ఆయన గోడు? ఓ మనిషీ, ఆయన మనసులోని భావాలు నీకు ఎప్పుడైనా అర్థమయ్యాయా? ఈ ప్రపంచ మానవాళికి ఆయన యొక్క సంకల్పం తెలిసిందా? ఆయన స్క్రిప్టు, ఆయన రచనను ఎవరైనా పట్టించుకున్నారా? మనందరి నిమిత్తం ఇంత విశ్వం, మన కొరకే ఆయన నిరంతరము ఆలోచిస్తున్నాడనీ ఏరోజైనా మీరు తెలుసుకున్నారా? మీ ఆలోచనలో ఎప్పుడూ మీ భర్త ఉంటాడు, మీ భార్య ఉంటుంది, మీ పిల్లలుంటారు. మీ తల్లిదండ్రులుంటారు, మీ బంధువులు ఉంటారు. స్నేహితులుంటారు, ప్రజలు ఉంటారు. కానీ, ఎవరి ఆలోచనలలోనూ దేవుడు లేడండి. దేవుడు లేనే లేడు! లోకంలో దర్శకులందరూ తీసిన సినిమాలను మీ మైండ్‌లో మీరు ఉంచుకున్నారు. మీ సెల్‌ఫోన్ చిప్ కార్డులో ఉంచుకున్నారు. మరి దేవుని సినిమా? పట్టించుకోలేదా ఈనాటివరకూ? అందుకే ఆయన నాద్వారా వ్రాయించాడు. అందుకే ఆయన నా ద్వారా చూపించాడు. తాను సృష్టించిన వాటిలో మనము ప్రధమఫలముగా ఉండాలి. {You are the Number One!} నీవే నెంబర్ వన్ - అన్నాడు దేవుడు. తన సృష్టి కార్యక్రమంలో 6వ దినాన దేవుడు ఆదాము, హవ్వలను ఎందుకు సృష్టించాడు అంటే, వారిద్దరి నిమిత్తమే సృష్టి తయారుచేయబడింది. అన్నింటినీ తయారు చేసి, ముగించి, అలంకరించిన తరువాత అప్పుడు వారిద్దరిని ప్రవేశపెట్టాడు. మానవాళి కొరకు ఈ సృష్టి తయారుచేయబడింది. మీరు భూమిని విడిచి ఎక్కడికీ వెళ్ళకండి. ఈ భూమి మీద సకలసౌకర్యాలను దేవుడు కల్పించాడు. మీరు ఆయన స్క్రిప్టు ప్రకారం వచ్చారు. సత్యవాక్యము వలన, ఆయన తన సంకల్పానుసారంగా పుట్టినవారు మీరు. ఈ భూమిపై మన పుట్టుక వెనుక అంత రహస్యం దాగి ఉందా? మన ఉనికి వెనుక దేవుడు ఇంత భారీ ప్రణాళిక జరిగించాడా? ఇంత ఖర్చు చేసాడా? ఇంత ఆలోచన కలిగి ఉన్నాడా? Yes అవును. అమాయకుడైన మనిషికి ఇది అర్థం కాలేదండి. అందుకే తన జీవితమనే ఈ పోరాటంలో చిన్ని చిన్ని సమస్యలు వచ్చేసరికి అర్థాంతరంగా తన బ్రతుకును ముగించుకోవాలి అనుకుంటున్నాడు. నిజంగా మనిషి చాలా అమాయకుడు.

మన జన్మ వెనుక ఒక మహా సంకల్పం ఉంది. ఒక మహా ప్రణాళిక ఉంది. దానిని తన రచనలో దేవుడు చాలా గొప్పదిగా వ్రాయించాడు. తన సినిమాలో మీరే ప్రధములు అన్నాడు. మీరు లేకపోతే సృష్టే లేదన్నాడు.

**ఎఫెసీయులకు 1 : 4-6** "ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయా సంకల్పము చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమ చేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను." *{This is His Script}* ఇది ఆయన సంకల్పం. ఆయన సంకల్పానుసారంగా సూర్యుడు తిరుగుతున్నాడు. ఆయన సంకల్పానుసారంగా గాలి వీస్తుంది. ఆయన సంకల్పానుసారంగా నదులు, సముద్రాలు ప్రవాహం చేస్తున్నాయి. ఆయన సంకల్పానుసారంగా భూమిలో విత్తనములు మొలకలెత్తి పంట పండుతుంది. ఆయన సంకల్పానుసారంగా నీవు, నేను బ్రతికి ఉన్నాము. ఒక గొప్ప సినిమా ఆయన తీయాలనుకున్నాడు. పూర్వికులు, మొట్టమొదటి మనుష్యులు, ఆది తల్లిదండ్రులైన ఆదాము, హవ్వలతో దానిని ప్రారంభించాడు. జగత్తు పునాది వేయబడక మునుపే అనగా, ఇంకా సూర్యుని కలుగజేయలేదు, ఇంకా చంద్రుని కలుగజేయలేదు. విశ్వంలో ఇంకా ఏదీ తయారుచేయక మునుపే మన పరలోకమందున్న తండ్రి మనలను గూర్చి స్క్రిప్టు రాసుకున్నాడు. జగత్తు పునాది వేయబడక ముందే మనమందరము ఆయన స్క్రిప్టులో ఒక ప్రధాన భాగము. అవునండి. ఇది ముమ్మాటికీ నిజం!

నేను 1970 లో పుట్టాను కదా! నేను 1980 లో పుట్టాను కదా! జగత్తు పునాది వేయబడక మునుపు, సృష్టి ప్రారంభం కాక మునుపు నేను దేవుని ఆలోచనలలో ఉన్నానా? నేను దేవుని మదిలో ఉన్నానా? నేను దేవుడు వ్రాసుకున్న స్క్రిప్టులో ఉన్నానా? అని మీరు అనుకోవచ్చు. అవును, మీరున్నారు. *{Yes! You are there}* మీరు ఆయన స్క్రిప్టులో ఉన్నారు. అందుచేతనే మీరు భూమి మీద అడుగు పెట్టారు. అంటే ఆయన స్క్రిప్టులో మీ పేరు ఉండుటనుబట్టి,

మీకు ఆ అర్హత కల్పించబడినది. అందుకే మీరు ఇక్కడికి వచ్చారు. తల్లి గర్భంలో అందుకే నిలబడ్డారు. అందుకే 9 నెలలు ఆ రక్తపు మడుగులో నుంచి మీరు బయటకు వచ్చారు. జీవం పోసుకున్నారు. ఊపిరి పీల్చగలుగుతున్నారు. ఆయన స్క్రిప్టు ఏమి చెప్పిందో తెలుసా? ఆయన సినిమాలో మీరందరు ఒక మంచి నటవర్గం కావాలి. మంచి పాత్రలు పోషించాలి. ఆయన సినిమా మీకు పూర్తిగా అర్థం కావాలి. ఆయన స్క్రిప్టు మీకు క్షుణ్ణంగా తెలియాలి. ఆ స్క్రిప్టులో మీ పాత్ర ఏమిటో మీకు బాగా అర్థం కావాలి. మీరు ఈ పాత్రను ఎలా పోషించాలో మీకు చక్కగా తెలియాలి. మీకు ఆయన సినిమాలో ఒక మంచి పాత్ర ఉంది. ఆ దర్శకుని క్రింద మీరు పని చేస్తున్నారు. అందుకే మీకు వెలుగునిస్తున్నాడు. అందుకే మీకు గాలినిస్తున్నాడు. అందుకే మీకు నీరునిస్తున్నాడు. మీరు ఆయన వలన ఒక బ్రతుకును కలిగియున్నారు. పోనీ, దేవుడు తప్ప ఎవరైనా ఇస్తున్నారా? ఒకవేళ ఎవరి వలనైనా మీరు బ్రతుకుతున్నరా? లేదు కదా. మనం బ్రతికేది దేవుని వలన తప్ప, ఈ భూమి మీద మనుష్యుల వలన కాదు. అలాగైతే ఈపాటికి మనుష్యులు మనలను చంపేద్దురండి. మనల్ని బ్రతకనిద్దురా? ఈ రోజు మనుష్యులు క్రూరమృగాలు. అరణ్యంలో ఉన్న క్రూరమృగాలే కాస్త నయమేమో! కానీ, దేవుడు తీసిన సినిమా తెలియని నేటి మనుష్యులు భయంకరమైన విషసర్పాలు. మీరు చూస్తున్నారుగా! మీరు వార్తలలో చదువుతున్నారుగా. చాలా భయంకరులుగా మారిపోయారు. మన ఇంటిలోని వారు అలాంటి వారే, మన పాలకులు అలాంటివారే. మనకు విద్య నేర్పించేవారు అలాంటివారే, విద్య నేర్చుకుంటున్నవారు అలాంటివారే. ఈ రోజు యువతీ యువకులు డ్రగ్స్ మత్తులో పడిపోయారు. సినీ మత్తులో పడిపోయారు. ఎవరిని మార్చగలం చెప్పండి? ఎవరికైనా ఈ దేవుని రచనను చెబితే 'నా ఇష్టం' అంటున్నాడు. నీవు దేవుని సినిమాలో ఒక పాత్ర అంటే, "ఈ జీవితం నా ఇష్టం, నీకేంటి అన్నాయ్?" అంటున్నాడు. ఈ దేహాన్ని విడిచిపెట్టిన తరువాత అర్థమవుతుంది అన్నాయ్, నాకేంటో, నీకేంటో. దేహంలో ఉన్నారుగా, ఇప్పుడు అర్థంకాదు నీకు. పరీక్ష ముగిసిన తరువాత, విడుదల వచ్చిన తరువాత రిజల్ట్స్‌లో అర్థమవుతుంది అన్నాయ్, నీవేంటో నేనేంటో. పరీక్షలకు ముందు తరగతి గదిలో ఉన్నప్పుడు నీవు చాలా గొప్పవాడివే. అప్పుడు నీవు హీరో. సిగరెట్ కాలుస్తావు, పేక

ఆడుతావు, అమ్మాయిల్ని ఏడిపిస్తావు. నీవు అస్సలు చదవవు. ఇప్పుడు తరగతి గదిలో ఉన్నావు కదా. నీవు ఇప్పుడు హీరో. పరీక్షలు అయిపోయిన తరువాత, రిజల్ట్స్ వస్తాయి చూడండి. అప్పుడు చదివిన వాడు హీరో, చదవని వాడు నెత్తిన చెంగును కప్పుకుంటాడు. అప్పుడు ఒక గోనెపట్ట కప్పుకుంటాడు. "ఎంత దౌర్భాగ్యుడను అయిపోయాను నేను. వాడిలా ఒక్కరోజు పుస్తకం పట్టుకున్నా, పాస్ అవుదును కదా." అనుకుంటాడు. మరి ఆ రోజు వాడి ప్రగల్భపు మాటలు చూస్తే, కాలర్ ఎగరేస్తాడు, సిగిరెట్ కాల్చాడు, ఫ్యాంటు మీద ఫ్యాంటు వేసాడు. గుండీలు పెట్టలేదు. అబ్బో...వాడి హీరోయిజం ఆరోజు చూస్తే, ఎవడూ వాడిని పట్టుకోలేక పోయాడు. ఈ రోజు ఎందుకూ పనికి రాకుండా పోయాడు. భూమి మీద ఒక చిన్న ఉదాహరణ ద్వారా మీకు అర్థమైపోతుంది. బ్రతుకు అనే ఈ పరీక్షలో, మీరు దేవుడు తీసే ఈ సినిమాలో మంచి పాత్రను పోషించకపోతే చాలా నష్టపోతారు. ఎందుకంటే మీ కొరకు ఆయన పడిన కష్టం ఏమిటనుకున్నారండి? మీరు ఈ సృష్టిలో ఆ కష్టాన్ని చూడాలి! ఆహార పదార్థాలను చూడాలి. పరిశీలన చేయాలి. ఆయన మీ కొరకు చాలా కష్టపడ్డాడు. తన కష్టంతో ఇప్పటికీ మీ బ్రతుకును పండిస్తున్నాడు. మీరు కేవలం ఆయన స్క్రిప్టులో భాగమవ్వాలని. మీ పాత్రను మీరు చక్కగా పోషించాలని.

ఏవండి ఈ దేవుని స్క్రిప్టులో, ఈ పాత్రను పోషిస్తున్నటువంటి మీరందరు లోకంలో ఉన్న వాటినన్నింటిని చూసి మురిసిపోతున్నారా? ఇది నాది, అది నాది అని అనుకుంటున్నారా? ఆయన మీకిచ్చిన పాత్రను మరిచిపోయారా? ఆయన లేఖనాన్ని మరిచిపోయారా? ఈ రోజు మనుష్యులందరూ అలాంటివారే కదండి. కనిపించిన భూమి  అంతా నాదే అంటున్నాడు. కనిపించిన బంగారం అంతా నాదే అంటున్నాడు. కనిపించిన పదవి నాదంటున్నాడు. కనిపించిన బంగ్లా నాది, కనిపించే కారు నాది అంటున్నాడు. నీవు భూమి మీదకు వచ్చింది వీటికోసం కాదు నాయనా. మీరు అప్పుడప్పుడు లోక సంబంధమైన సినిమాలు చూస్తుంటారు. నటన జరిగించే వారికి నటనలో భాగంగా చాలా వస్తువులు ఇవ్వబడతాయి. నటించే వారికి సన్నివేశాన్ని బట్టి నటనలో దర్శకుడు చాలా వస్తువులు ఇస్తాడు. 'అమ్మా నువ్వు ఈ బంగారు నక్లెస్ పెట్టుకొని నటించు.' 'అయ్యా నీవు ఈ జీపు తీసుకొని వెళ్ళిపో' అని చెబుతాడు. ఎంత వరకు?

కెమెరా ముందు నీవు నటించినంత వరకే! ఆ తర్వాత ఆ బంగారు నక్లెస్‌ను, ఆ జీపును అక్కడ విడిచిపెట్టి నటీనటులు వచ్చేయాలి. వారు తిరిగి నటన పూర్తిచేసుకుని వెళ్ళిపోవాలి. నీ ఇంటికి ఆ జీపులో వెళ్ళకు. నువ్వు ఏ వాహనంతో వస్తే ఆ వాహనంతో వెళ్ళు. అమ్మగారు, నటనలో ఇచ్చిన 'నగ' బాగుంది కదా అని, నటన అయిపోయిన తరువాత నగ నా దగ్గరే ఉంచుకుంటానండి, ఇలాగే ఇంటికి వెళ్ళిపోతానండి అంటే నిర్మాత, దర్శకుడు ఊరుకుంటారా? ఆ 'నగ' నాది. నీకు వేసిన మేకప్ నాది. అంతా తీసి అలాపెట్టు. బట్టలతో సహా అలా వారి దగ్గర పెట్టాలి. కట్టుబట్టలతో నువ్వు ఎలా వచ్చావో అలాగే తిరిగి వెళ్ళిపోవాలి. లోక సంబంధమైన సినిమా మీకు బాగా అర్ధమవుతుంది.

ఈ భూమి మీద దేవుడు మీకు కొన్ని వస్తువులను ఇచ్చాడు. లోక సంబంధమైన దర్శకుడు నటులకు ఎలా బట్టలు, వస్తువులు, కార్లు, బంగ్లాలు, పెద్ద పెద్ద విమానాలు ఇస్తున్నాడో, ఈ భూమి మీద దేవుడు ప్రకృతిలో తన యొక్క సొత్తు, తన ఆస్తి, తన కష్టం చేత సంపాదించిన, తయారు చేసిన ఈ సృష్టిలో ఉన్న వస్తువులన్నింటిని మీరు పాత్రలో ఉన్నంత సేపు మీకు ఇచ్చాడు. ఆ తరువాత వాటిని ఆయన తీసేసుకుంటున్నాడు. కాదంటారా? మీరు ధరించుకున్న దేహంతో సహా తీసేసుకుంటున్నాడు. దీనిని చూసే కదా ఈరోజు మీరు మురిసిపోతున్నారు. అద్దం ముందుకు వెళ్ళి మీ శరీరాన్ని చూసుకొని పొంగిపోతున్నారు. నాకున్న అందం ఎవ్వరికీ లేదు అనుకుంటున్నారు. తన సినిమాలో నీవు నటించటానికి అది దేవుడు నీకిచ్చిన వస్తువు. నీవు వెళ్ళిపోయేటప్పుడు ఈ మట్టిలోనే దానిని పాతేస్తారు లేక కట్టెలపై కాల్చేస్తారు. ఆ సమయానికి ఒకవేళ నీ చేతికి బంగారపు ఉంగరాలు, మెడలో బంగారపు గొలుసులు, చేతి మండలు ఏమైనా ఉంటే వాటన్నింటిని ఒలిచేస్తారు! ఎవరు? ఇంకా భూమిపై దేవుని సినిమాలో పాత్రలో ఉన్నవారు. నీ పాత్ర అయిపోయిన తరువాత నీవు విగత జీవిగా మారిపోతావు. నా శరీరంపై ఉన్నవన్నీ మీకే. అన్నీ తీసుకోండి అనే పరిస్థితి! నీవు సంపాదించిన ఆస్తులన్ని ఇక్కడున్నవారికే. పెద్ద బంగ్లా కట్టించాను, పెద్ద అపార్ట్‌మెంట్ కట్టించాను, పెద్ద భూమి కొనేసాను అనుకుంటున్నారా? ఇది నీదా? ఇవన్నీ నీవా?.... దేవుడు ఇచ్చిన ఈ సృష్టిలో ఆయన వ్రాసిన స్క్రిప్టులో నీవు కేవలం ఒక పాత్రధారుడువు. నీ పాత్రను

మరిచిపోయిన ఓ నటుడా! నీ జీవితం ముగియగానే పాత్రకు సంబంధించిన వస్తువులను నీవు ఇక్కడే విడిచిపెట్టి వెళ్ళిపోవాలి. దేవుని గ్రంథంలో ఆ మాట ఇప్పుడు మీరు చూడాలి! ఆయన ఏమి మాట్లాడాడో, తన స్క్రిప్టులో ఏమి వ్రాయించాడో, అది ఇప్పటికీ జరుగుతున్నదో, లేదో మీరు వినాలి. మీరు చూడాలి. ఆయన సినిమాలో మీరు పాలిభాగస్తులు కావాలి.

ప్రసంగి **6 : 1–** "సూర్యుని క్రింద దురవస్థ ఒకటి నాకు కనబడెను. అది మనుష్యులకు బహు విశేషముగా కలుగుచున్నది. ఏమనగా దేవుడు ఒకనికి ధనధాన్య సమృద్ధిని ఘనతను అనుగ్రహించును. అతడేమేమి కోరినను అది అతనికి తక్కువ కాకుండును. అయినను దాని ననుభవించుటకు దేవుడు వానికి శక్తి ననుగ్రహింపడు, అన్యుడు దాని ననుభవించును. ఇది వ్యర్థముగాను గొప్ప దురవస్థగాను కనబడుచున్నది." మనుష్యులు అష్టైశ్వర్యాలను కలిగి ఉండటం ఒక దురవస్థ వంటిది అని వ్రాయబడింది. అది ఆశీర్వాదం కాదు. దీనిని బట్టి మనుష్యులు చాలా అమాయకులని తెలుసుకోవాలి. ఇది నీ అపార్ట్‌మెంట్ కాదు. ఇది నీ భూమి కాదు. నీ పేరు దస్తావేజులలో ఉందేమో. పరలోకమనే ఆ లోకంలో, అక్కడ కూడా కొన్ని దస్తావేజులున్నాయి. అక్కడ కూడా కొన్ని స్క్రిప్టులున్నాయి. అక్కడ కూడా కొన్ని రచనలున్నాయి. అవే అసలైనవి. ఈ భూమి మీద ఉన్న ఈ చిన్న దస్తావేజు మీకెలా వచ్చింది? ఎవరి దగ్గర నుండో కొనుక్కున్నారు. మీరు ఎవరి దగ్గర కొనుక్కున్నారో వాడికి ఇది ఎలా వచ్చింది? అతను మరొకరి దగ్గర కొనుక్కున్నాడు. అలా మీరు వెనక్కి వెళ్ళిపోతే భూమి మీద మిగిలేది ఇద్దరే ఇద్దరు. వారే ఆదాము, హవ్వలు. వారికెలా వచ్చింది ఇది? దీనినే లింక్ డాక్యుమెంట్ అంటారు. లింక్ డాక్యుమెంట్ అంటే 30 సంవత్సరాలు మాత్రమే కాదు నువ్వు వెనక్కి వెల్లాల్సింది. ఇంకా వెనక్కి వెళ్ళాలి... ఎక్కడి వరకు అంటే, ఈ భూమిపై మానవుని ఉనికి ప్రారంభమైన రోజు వరకు వెనక్కి వెళ్ళి లెక్క కట్టాలి. అప్పుడు ఆదాము హవ్వలు తెర మీదకు వస్తారు. వారికి ఈ భూమినిచ్చినదెవరో తెలుసా? దేవుడు! రిజిస్టరు ఆఫీసు వారికి కూడా తల పగిలిపోతుంది ఈ మాట వింటే. ఇప్పుడు దేవుని తరపున, దేవుని పేరున ఎవరు రిజిస్టరు చేస్తారు చెప్పండి? అందుకే 'సమస్త భూమి నాదే' అన్నాడు దేవుడు ఆయన స్క్రిప్టులో. అందుకే ఆయన ఏమంటున్నాడో తెలుసా!

నా దగ్గర ఎవరు పాత్ర ధరించినా, వారు ఎన్ని సంపాదించినా, నేను వారికి వాటిని అనుభవించుటకు శక్తినివ్వను. అన్యుడు దానిని అనుభవించును. అది వ్యర్ధముగాను, గొప్ప దురవస్థగాను నాకు కనబడుచున్నది అన్నాడు. ఎంత గొప్ప దురవస్థో చూడండి ఇది. మనమేమి అనుకున్నాం? భూమి మీదకు రాగానే, 30 ఏళ్ళు రాగానే, ఉద్యోగం రాగానే, పెళ్ళి కాగానే, ఏదో సంపాదించాలి. ఏదో వెనుక వేసుకోవాలి అనుకున్నాం. జీవితమనే ఈ పోరాటంలో నేను నిరంతరం దాని కొరకే ఆలోచించాలి. సంపాదన, అధికారం, పదవి, గొప్పతనం... వీటి కోసమే పరుగులు తీస్తున్నాం. నీ నటన ముగింపబడే కాలం ఆసన్నమవుతున్నదని తెలుసుకున్నావా ఎప్పుడైనా? దేవుడు నీకిచ్చిన కాలం, దేవుడు నీకిచ్చిన సమయం చాలా తక్కువ. ఈ తక్కువ కాలంలో నీ పాత్రను నీవు పోషించాలి తప్ప వేటినో సంపాదించుకుంటానని, వాటికోసం నీ జీవితమంతా ధారపోస్తావా? ప్రాచీన కాలంలో ప్రవక్తయైన మోషే ఏమంటున్నాడో చూడండి. నేను ఈ భూమి మీదకి వచ్చిన తరువాత, మనుష్యులుగా ఈ భూమి మీద మేము జీవించటం మొదలుపెట్టిన తర్వాత 'తండ్రీ నీ సినిమాలోకి వచ్చేసాము గనుక నీవు మాకిచ్చిన గడువు ఎంతంటే, నీవు నిర్ణయించిన ఈ లోకేషన్‌లో, నీవు వేసిన ఈ సెట్టింగ్స్ క్రింద, ఈ సూర్యున్ని అనుభవించటానికి, చంద్రకాంతిని అనుభవించటానికి, ఈ భూమి పంటను ఆరగించటానికి, నీవు మాకిచ్చిన సమయమెంత అంటే???

**కీర్తనలు 90 : 10–** "మా ఆయుష్కాలము డెబ్బది సంవత్సరములు". అంటే మీరు ఆయన సినిమాలో పాత్రధారులుగా ఎంతకాలం ఉంటారన్నమాట? సగటుగా ఒక 70 సంవత్సరములు మీరు ఉండచ్చు లేదా అంతకంటే ముందే వెళ్ళిపోవచ్చు. ఒకవేళ అంతకంటే కొద్దిగా ఎక్కువ ఉండవచ్చు. ఆ కాలము మీ పాత్రను బట్టి ఆధారపడి ఉంటుంది. ఆయన స్క్రిప్టులో మీ పేరిట ఆయన ఎంత నటనను ఇచ్చాడో, దానినిబట్టి ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, విశాఖపట్నంలో 'అతిధి' చిన్న అమ్మాయి 6 సంవత్సరముల పాప అదృశ్యమై, ఒక వారం రోజుల తర్వాత శవంగా దొరికింది. విశాఖపట్టణానికి 70 కి॥మీ॥ దూరంలో బీచ్ ఒడ్డున ఇప్పుడు దొరికింది. ప్రభుత్వం ఈ పాపను వెదకటానికి చాలా నరకయాతన అనుభవించింది. వీరికి చిన్నపిల్ల ఆచూకీ దొరకలేదు.

ఇది దేవుడిచ్చిన ప్రకృతి కదా, అంత సుళువుగా మనము ఆచూకీని పొందలేము. ఆ పాపకు దేవుడిచ్చిన ఆయుష్షు ఆరేళ్ళు మాత్రమే. ఇలా కొంతమందికి తక్కువ. కొంతమందికి ఎక్కువ. కాని సరాసరిగా మనుష్యులకు ఆయుష్కాలాన్ని ఎంతిచ్చాడోచూడండి. "మా ఆయుష్కాలము డెబ్బది సంవత్సరములు, అధిక బలమున్న యెడల ఎనుబది సంవత్సరములు." మనం ఇప్పుడు మాట్లాడుకున్నదే ఆయన చెప్పాడు. తన స్క్రిప్టులో రాయించాడు. ఒకవేళ నీవు ఫాస్ట్‌ఫుడ్ తింటే, చాలా ఫాస్ట్‌గా వెళ్ళిపోతావు. రోడ్డు మీద ఫాస్ట్‌ఫుడ్, న్యూడిల్స్, పాములు, జెర్రిలు ఇలాంటివన్నీ తింటే చాలా త్వరగా వెళ్ళిపోతావు నువ్వు. దేవుడు ఇచ్చిన ప్రకృతి మంచిది. మనిషి అందులో చెయ్యిపెట్టాడా, అది పాడవుతుంది. అందుకే నూడిల్స్ తయారుచేసాడు. మ్యాగీ నూడిల్స్‌ను గూర్చి మీరందరు విన్నారు. తింటే చచ్చిపోతారు అని ప్రభుత్వం వాటిని నిషేధించేసింది. ఈ రోజు అలాంటి ఆహార పదార్థాలు చాలా ఉన్నాయి. దేవుడిచ్చిన ప్రకృతి చాలా శ్రేష్ఠమైనది. దేవుడిచ్చిన ప్రకృతి చాలా మంచిది. "మా ఆయుష్కాలము డెబ్బది సంవత్సరములు". మేము నీ సినిమాలో ఉండే కాలం దాదాపుగా డెబ్బై సంవత్సరాలు. ఆయన దృష్టికి ఇది చాలా తక్కువ. ఎందుకంటే భూమిమీద పుట్టుకొచ్చిన ఎంతో మందికి డెబ్బై ఏళ్ళు చొప్పున ఇచ్చేసాడు ఆయన. వేల సంవత్సరాలుగా వస్తున్నారు, వెళ్ళిపోతున్నారు. తమ పాత్రను పోషించి వెళ్ళిపోతున్నారు కాని, ఎవ్వరికీ దేవుని స్క్రిప్టు తెలియదు. ఎవ్వరూ తమ తమ పాత్రను సరిగ్గా పోషించలేదు. భార్య కోసం బ్రతికిన వారు కొంతమంది. భర్త కోసం బ్రతికిన వారు కొంతమంది. సమాజం కోసం బ్రతికిన వారు కొంతమంది. దేశం కోసం బ్రతికిన వారు మరి కొంతమంది. దేవుని కోసం, దేవుడు తీసిన ఆయన సినిమాలో తన స్రిప్టు ఏమిటో, తన పేరిట దేవుడు ఏమి వ్రాసుకున్నాడో దాని ప్రకారం జరిగించిన వారు, నెరవేర్చిన వారు ఎవ్వరూ లేరు. ఉన్నా చాలా తక్కువ మంది ఉన్నారు. ఆయా తరాలలో వేళ్ళమీద లెక్కపెట్టగలిగినంత మంది మాత్రమే ఉన్నారు. అయినా, కోట్లకొలదిగా చెడిపోతున్న ఈ మనుష్యసమాజాన్ని కాపాడటం కోసమే దేవుడు ఈ ప్రకృతిని ఇంకా కాపాడుతున్నాడు. వారికోసమే దేవుడు ఇదిగో ఈ సినిమాను చూపిస్తున్నాడు. వారి బాధ్యతను వారు తెలుసుకోవాలి. వారు ఎందునిమిత్తం వచ్చారో వారు గ్రహించాలి. ఇంత భారీ సృష్టి వారి కొరకే

జరిగిందన్న విషయం వారికి అర్థం కావాలి. వారి పాత్ర ఏమిటో బైబిల్ అనే తన స్క్రిప్టులో వ్రాయించాడు. మీ పాత్ర ఈ స్క్రిప్టులోనే వ్రాయబడినది. మీరేం చేయాలో, సగటు మనిషి భూమి మీదకు వచ్చిన తరువాత దేవుడిచ్చిన ప్రకృతిని అనుభవిస్తున్న మనిషి, దేవుడు వ్రాసుకున్న ఆ రచన ద్వారా, ఆ రచనలను బట్టి ఎలా బ్రతకాలో ఆయన వ్రాయించాడు. మనము ఎందుకొరకు వచ్చాం? దేనిని ముగించటానికి మనము వచ్చాం. మనల్ని బట్టి దేవుడు తన స్క్రిప్టులో వ్రాసుకున్న మాట ఏమిటి? మనము ఏమి చేయాలి? ఆయన యొక్క సంకల్పంలో ఉన్న ఆ సంగతి ఏమిటి? మనము దేనిని నెరవేర్చాలి? ఇక దానికి సమాధానమును చూడండి.

**ఎఫెసీయులకు 2 : 10-** "మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసు నందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము." జాగ్రత్తగా ఓపికతో వినండి. అసలు కథ ఇక్కడే ప్రారంభమవుతుంది. చదివే మీకు చాలా ఆనందంగా ఉంటుంది. ఆయన తన సినిమాను గూర్చి మీకు చక్కగా చెప్పాలనుకుంటున్నాడు. ఎఫెసీ 2 : 10 లో పౌలు భూమి మీదకి వచ్చిన ప్రతీ మనిషి ఎలాంటి కార్యక్రమాలలో ఉండాలో, ఆయన స్క్రిప్టులో ఏమి వ్రాసాడో చెబుతున్నాడు చూడండి. ఈ భూమిపై పుట్టిన ప్రతి మనిషీ దేవుని పనిని కలిగినవాడే! ఏ ఒక్కరూ దీనికి అతీతులు కారు. కేవలం పాస్టర్లు దేవుని వాక్యమును ప్రకటించాలని ఎక్కడా లేదు. కేవలం పిలుపును కలిగినవారు మాత్రమే దేవుని కొరకు బ్రతకాలని ఎవరు చెప్పారు? అందరూ ఆయన సినిమాలో నటీనటులైనప్పుడు, ఎవరో ఒక్కరే ఆ దేవుని సత్క్రియలు చేయాలని ఎవడు చెప్పాడు? *{Not Only Reverands, Not Only Bishops, Not Only Pastors, Not Only Swamijis, Not Only Babas}* ఏ? వారు మాత్రమే సృష్టి అనుభవిస్తున్నారా? వారు మాత్రమే దేవుని యొక్క ఈ సృష్టిలో పాత్రధారులుగా ఉన్నారా? మీరు లేరా? నేను లేనా? చాలా మంది ఇలాంటి దొంగ మాటలు చెబుతారు. అవి పచ్చి అబద్దాలు. "దేవుని సేవ మీరు చేయకూడదని, చేయాలంటే మీకు పిలుపు ఉండాలని తప్పుడు మాటలు చెబుతారు." ఎవడు చెప్పాడు మీకు. అలాంటి వారిని నాదగ్గరకు తీసుకొని

రండి! తోలు తీసేస్తాను. దేవుని కోసం ప్రజలను బ్రతికించవలసింది పోయి, పిలుపు ఉండాలని చెప్పి అందరిని అడ్డగిస్తారా? పోనీ వారికుందా దేవుని పిలుపు? ఏదీ, చూపించు? వీడియోలో నిన్ను పిలిచిన పిలుపును చూపించు. డూపు మాటలు కాదు. రాత్రి కలలో దేవుడు నీకు కనిపించాడు అంటే నేను నమ్మాలా? నేను కూడా నీ కంటె ఎక్కువ చెప్తాను. నువ్వు చెప్పిందంతా తప్పని దేవుడు నాకు చెప్పాడు. ఈ రోజే నాకు కూడా కలలలో చెప్పాడని నేను చెప్తాను. ఏమిటి దానికి ఆధారం? వీడియో తీయాలి. సి.సి కెమెరా పెట్టాలి. నిన్ను పిలవడానికి వచ్చిన దేవదూతకు సి.సి కెమెరా పెట్టు. లేకపోతే వాయిస్ రికార్డింగ్ చెయ్యి. కలలో వచ్చిందండి, మరి నేను వాయిస్ రికార్డింగ్ చేయలేనంటావా? ఇప్పుడు దానికి  కూడా అత్యాధునిక పరికరాలు వచ్చేసాయి. "లై డిటెక్టర్స్." తెలుసా మీకు? లై డిటెక్టర్స్ ను గూర్చి? నువ్వు అబద్దం చెబితే టింగ్ టింగ్ అని మోగేస్తుంది అది. సాంకేతిక పరిజ్ఞానం ఉంది మన దగ్గర. ఎవడికి దేవుడు దర్శనంలో కనిపించాడు అని చెప్పుకుంటున్నాడో, లై డిటెక్టర్‌ని అసలు అలాంటి వాడికి పెట్టాలండి. స్క్రిప్టు అంతా దేవుడు ముందుగానే వ్రాయించేస్తే, మరల నీకు దర్శనం ఏమిటి? 66 పుస్తకాలలో దేవుడు తన స్క్రిప్టు వ్రాయించాడు. స్క్రిప్టును బట్టి ఫాలో అవ్వాలా? నీ సొంత జ్ఞానంతో ఫాలో అవ్వాలా? తప్పు చేస్తుంది ఈ సమాజం. లై డిటెక్టరు పెడితే నీ అబద్దాలన్నీ బయటికి వచ్చేస్తాయి. ఆ అబద్దాలను తట్టుకోలేక కంప్యూటర్ పేలిపోద్దేమో! నరునితో నరుడు చేసే తప్పులు, నరునికి నరుడు చెప్పే అబద్ధాలు ఒక ఎత్తు అయితే, దేవునితో కూడా ఆయన విషయములో కూడా అబద్ధమా? ఇక్కడ ఏమన్నాడో చూడండి. కేవలం కొంతమందికే చెబుతున్నాడా ఈ మాట? కాదు. ఎఫెసీ సంఘానికి చెబుతున్నాడు. ఆ సంఘము ద్వారా తన స్క్రిప్టులో వ్రాయించి, ఇదిగో దేవుని సినిమా ద్వారా ప్రకటిస్తున్నాడు మీ అందరికీ. ఏమన్నాడో చూడండి. "మరియు వాటి యందు మనము నడుచుకొనవలెనని" మనము అంటే, ఆ పదం ఎవరికోతెలుసా? "నీకు, నాకు, భూమి మీద దేవుని సృష్టిని అనుభవిస్తున్న ప్రతీ ఒక్కరికి, పాత్రధారుడుగా వచ్చిన ప్రతీ ఒక్కరికి!" మరియు వాటి యందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్‌క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసు నందు సృష్టింపబడినవారమై, ఆయన చేసిన

పనిగా ఉన్నాము.” అని చెప్పాడు. మీ కొరకు దేవుడు ఒక పనిని నిర్ణయించాడు. మీరు చేస్తున్న ఉద్యోగం ఆయన నిర్ణయించిన పని కాదు . మీరు చేసుకునే పెండ్లి ఆయన నిర్ణయించిన పని కాదు. పొలంలో నారు నాటుకోవడం ఆయన నిర్ణయించిన పని కాదు. పొలం సేద్యపరచటం ఆయన నిర్ణయించిన పని కాదు. రాజకీయంతో ప్రజలను పాలించటం ఆయన నిర్ణయించిన పని కాదు. వీటన్నింటికీ మించినది, నీవు చేయవలసినది, ఆయన ఇచ్చినటువంటి ఈ సృష్టిలో బ్రతుకుతున్న మీరు పోషించవలసినది మరొకటి ఉంది. అదే అయన చెప్పిన సత్క్రియ. “మరియు వాటి యందు మనము నడుచుకొనవలెనని, దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు.” ముందుగా తన స్క్రిప్టులో దేవుడు వ్రాసుకున్నాడు. వాటిని మీరు చేయాలనే ఆ కన్నతండ్రి అయిన దేవుడు మిమ్మును సృష్టించాడు. మరి మనుష్యులు ఎలా ఉన్నారు? చరిత్రలో నోవహు దినములలోనికి మనం వెళ్ళిపోతే జలప్రళయానికి ముందు మనుష్యులు ఎలా ఉన్నారో తెలుసా? లోకాన్ని వారిష్టమొచ్చినట్టుగా అనుభవిస్తున్నారు. లోకం చెప్పిందే పాటిస్తున్నారు. దేవుని సినిమాలో తమ పాత్రను పోషించటం లేదు. అలాగే సొదొమ గొమొఱ్ఱా అనే ప్రదేశంలో జరిగినటువంటి ఆ చరిత్రను మనం ఒక్కసారి చూస్తే అక్కడున్న ప్రజలు ఎలా ఉన్నారు? వారు సత్క్రియలలో లేరు. పర శరీరాన్ని అనుభవించేవారుగా, దేవుని చట్టాన్ని అతిక్రమించేవారుగా, దేవుడు వ్రాసుకున్న స్క్రిప్టు ఎందుకూ పనికిరాకుండా చేసినవారుగా ఉన్నారు. అందుకే ఆనాడు దేవుడు వారికి శిక్ష విధించాడు. లూకా సువార్తలో ఈ మంచిమాట చరిత్రను తెలుపుతూ వారిని గూర్చి వ్రాయబడింది. ఈ రోజు లోకం తీరును ఆనాటి ప్రజల తీరుతో పోల్చి దేవుడు వ్రాయించాడు. లోకం ఇప్పటికీ అనుకుంటున్న పద్ధతిని దేవుడు వ్రాయించాడు. ఆయన స్క్రిప్టు చదువుతాను చూడండి.

**లూకా 17 : 26-** ‘‘నోవహు దినములలో జరిగినట్టు మనుష్యకుమారుని దినములలోనూ జరుగును.” అప్పుడు జరిగినదే ఇప్పుడు మరలా జరగబోతోంది. నోవహు ఓడలోనికి వెళ్ళిన దినము వరకు జనులు ఎలా ఉన్నారంటే, అని చెబుతూ ఏదో ఒక భయంకరమైన పాపాన్ని దేవుడు ఇక్కడ వ్రాయటం లేదు. మరి ఏమి వ్రాస్తున్నాడో చూడండి. ప్రజలందరూ

ఎలా ఉన్నారు? నేను తీస్తున్న ఈ సినిమాలో పాత్రధారులైన ఈ ప్రజలు ఎలా ఉన్నారు? తినుచూ, త్రాగుచూ, పెండ్లాడుచూ, పెండ్లికి ఇయ్యబడుచు ఉండిరి. ఇది నేరమా? తినటం నేరమా? త్రాగటం నేరమా? పెండ్లి చేసుకోవటం నేరమా? పెండ్లికి ఇవ్వబడటం నేరమా? నేరము కాదు గానీ, దేవుడు వ్రాయించిన స్క్రిప్టులో సత్క్రియలు చేయాలన్న విషయాన్ని మర్చిపోయావు చూసావా, అదే నీవు చేసిన, ఇప్పటికీ చేస్తున్న నేరం. అందుకే ఏమన్నాడో చూడండి. 'జనులు తినుచు, త్రాగుచు, పెండ్లికియ్యబడుచు, పెండ్లికిచ్చుచు నుండిరి. అంతలో జలప్రళయం వచ్చి వారందరినీ నాశనం చేసెను.' ఆనాడు దానికి ముగింపు పలికాడు దేవుడు. స్క్రిప్టు తెలియదా బిడ్డా నీకు? నీకొరకు ఏమి వ్రాయబడిందో నీకర్థం కాలేదా? అందుకే ఆనాడు నిన్ను జలప్రళయం నాశనం చేసింది అన్నాడు. ఆ తర్వాత సొదొమ గొమొఱ్ఱా అనే ప్రాంతంలో లోతు అనే నీతిమంతుడు నివశిస్తున్న దినాలు వచ్చాయి. 'లోతు దినములలో జరిగినట్టును జరుగును.' అప్పుడు జనులు ఎలా ఉన్నారో చూడండి. జనులు తినుచు, త్రాగుచూ..! మారలేదు వీరు. నోవహు జలప్రళయాన్ని చూసారు. అప్పటికే ముందు జరిగిన చరిత్రను విన్నారు. నేర్చుకున్నారు. మరి వీరంతా మారిపోవాలి కదండి. ఈ భూమిపై బ్రతుకంటే ఎవరికి లెక్కండి. పోతాం. పోతే పోతాం. స్పీడుగా మోటారు బైకు మీద వెళ్ళిపోతున్నాడు. కొంచెం నెమ్మదిగా వెళ్ళవయ్యా లేకపోతే చచ్చిపోతావ్ అని చెబితే, పోతాం. పైకి పోతాం అంతేగా! అంటున్నాడు. లోకంలో ఉన్న మనుష్యుల తీరు ఎలా ఉందో చెప్పండి. మరొకడు తాను తీసిన సినిమాలో ఏమి అంటున్నాడో తెలుసా? 'చస్తే ఏ గొడవ లేదు అని పాట పాడుతున్నాడు'. చస్తే ఏ గొడవ లేదా? మీ హీరో పాడిన పాటే అది. నా హీరో(దేవుడు) నీవు చచ్చిన తర్వాత పెడతాడు అసలు గొడవ. {He is GOD} ఇది దేవుడు తీసిన సినిమా. బెండకాయ ముదిరినట్టు మనిషి బాగా ముదిరిపోయాడు గనుక, ఇక దేవునికి పనిచేయడు. అందుకే వాడి టైటిలే 'ముదురు'. చస్తే ఏ గొడవా లేదని ప్రపంచానికి నేర్పించావా! అందుకేనా, చచ్చిపోతున్నారు చాలామంది. కాదు కాదు. నీవు చస్తేనే నీకు అసలు సినిమా ప్రారంభమవుతుంది. ఈ భూమి మీద నీ పాత్ర తెలియకపోతే, చచ్చిన తర్వాత 70 ఎమ్.ఎమ్. స్క్రీన్‌లో 3డి లో కనిపిస్తుంది అంతా. నువ్వెలా బ్రతికావో, ఎలా బ్రతకాలో, దేవుని స్క్రిప్టు ఏమిటో,

నువ్వు ఎక్కడికి వెళ్ళిపోతున్నావో, తప్పింపబడలేని ఆ లోకానికి ఎందుకు ఆహుతి అయిపోతున్నావో అప్పుడు నీకు పూర్తిగా అర్థమైపోతుంది. కానీ, అప్పుడు ప్రయోజనం లేదు. ఆయన స్క్రిప్టునంతటినీ నీవు ముందే తెలుసుకోవాలి. 'లోతు దినములలో జరిగినట్టు జరుగును.' జనులు ఎలా ఉన్నారో చూడండి. 'తినుచు, త్రాగుచు, కొనుచు, అమ్ముచు, నారు నాటుచూ, ఇండ్లు కట్టుచు ఉండిరి.' కొన్ని ఉదాహరణలు చెప్పాడు. ఆనాటి ప్రజలు ఎలా ఉన్నారట? తినటం, త్రాగటం, నారు నాటుకోవటం, మళ్ళీకాలం కోసం ఎదురు చూడటం. పంటకాలం వచ్చేసిందా, భూమిని దున్నేయండి, మళ్ళీ విత్తనాలను జల్లేయండి. నారునాటుచు, కొనుచు, అమ్ముచు – ఎక్కడ చూసినా ఇదే కదండి. అదే కొనడం, అమ్మడం! ఫ్లిప్‌కార్ట్‌లో కొను ఓఎల్ఎక్స్‌లో అమ్మేయ్. స్నాప్‌డీల్‌లో కొను క్వికర్‌లో అమ్మేయ్. కొనుచు, అమ్ముచు ఉన్నారా? ప్రజలందరు ఇలాగే ఉన్నారా? లేక దేవుని సత్క్రియలు చేస్తున్నారా? చెప్పండి. దేవుని స్క్రిప్టులో వ్రాయబడినది ఎవరికైనా అర్థమైందా? సత్క్రియలు ఎవరైనా చేయగలుగుతున్నారా? లేదండి. లోకములో ఉన్న సిద్ధాంతం, లోకములో ఉన్న పద్ధతి ఏమిటంటే, మనిషిగా నీవు పుట్టాలి. పుట్టిన తరువాత నీవు చదువుకోవాలి. చదువుకున్న తరువాత నీవు ఉద్యోగం సంపాదించాలి. తరువాత పెళ్ళి చేసుకోవాలి. ఆ తరువాత పిల్లలను కనాలి. ఆ పిల్లలను పెంచి పెద్ద చేయాలి. ఆ తరువాత వారికి పెళ్ళిళ్ళు చేయాలి. ఆ తరువాత నీవు షష్ఠిపూర్తి చేసుకోవాలి. ఆ తరువాత నీవు కాటికి కాళ్ళు చాపుకోవాలి. అన్నీ చేసిన తరువాత నిన్ను 'పో' అంది ఈ లోకం. ఇదే ఈ లోక మర్యాద. ఇది ఈ లోకానికున్న సిద్ధాంతం. ఇది ఈ లోకానికున్న నానుడి. కానీ, దేవుని పద్ధతి ఇది కాదు. దేవుని మర్యాద ఇది కాదు. దేవుని సినిమా వేరు. దేవుని స్క్రిప్టు వేరు. ఇంత భారీ ప్రణాళికను కలిగించింది దీనికోసం కాదు. పెండ్లి చేసుకుంటావనో, పెండ్లికిస్తావనో, ఇల్లు కడతావనో, నారు నాటుతావనో... దీనికోసం కాదయ్యా, సత్క్రియలు చేస్తావని! దేవుడు చెప్పినట్టు చేస్తావని. ఏమిటి ఇంతకీ ఈ సత్క్రియలు? రైల్వేస్టేషన్ దగ్గర అడుక్కుంటున్న ముసలివాళ్ళకి మామిడిపండ్లు ఇవ్వటమా? దుప్పట్లు పంపిణీ చేయటమా? అప్పుడప్పుడు చలివేంద్రంలో చల్లని మంచినీళ్ళు, మజ్జిగలు పెట్టటమా – సత్క్రియలు అంటే? కాదు! దేవుని స్క్రిప్టు తెలియకపోతే చాలా

పొరపాటు పడతారు మీరు. ఒకవేళ మీకు ఈ లోకం చెప్పి ఉండవచ్చు. సత్‌క్రియ అంటే అన్నదానం చేయటమని, వస్త్రాలు పంపిణీ చేయటమని, నేత్రదానం చేయటమని, రక్తదానం చేయటమని ఈ లోకం చెప్పింది. కానీ దేవుడు అలా వ్రాయించలేదే. ఆయన స్క్రిప్టులో ఉన్నది చెప్పాలంటే, ఆయన కుమారుడే చెప్పాలి. ప్రపంచంలో ఇక ఎవరూ చెప్పలేరు. అసలు ఇప్పటి వరకు దేవుని తరపున 'దేవుడు తీసిన సినిమా' అని ఇలాంటి టైటిల్ ఎవరైనా పెట్టారా? ఎవ్వరూ పెట్టడానికి వీలు లేదు. ఎందుకంటే, ఆ మహాదేవుడు ఆ రైట్స్ అన్నీ రిజర్వ్ చేసుకున్నాడు. సర్వహక్కులు దేవునివి. ఆయన తీసే సినిమాకు ఎవరు ప్రేక్షకులుగా ఉండాలో ఆయనే నిర్ణయిస్తాడు. స్థలం ఎక్కడో ఆయనే నిర్ణయిస్తాడు. ఏం చెప్పాలో ఆయనే నిర్ణయిస్తాడు. సత్‌క్రియ అంటే ఏమిటి తండ్రి, మాకు చెప్పు అని ప్రాథేయపడితే దేవుడు తప్పకుండా చెబుతాడు. ఇప్పటి వరకు సత్‌క్రియ అంటే... ఏదో మాకు కలిగినది, ఒక రూపాయి దానం చేయడం అనుకున్నాం. ఒక ఐదు రూపాయల కాసు వేయటమని అనుకున్నాం. కానీ, సత్‌క్రియ అంటే ఏమిటి తండ్రీ? అని దేవునిని అడిగితే, దేవుడు తన స్క్రిప్టులో చక్కగా వ్రాయించాడు. దానికి మంచి వివరణతో కూడిన నిర్వచనం చెప్పాడు.

**ఫిలిప్పీ 1 : 3 - 6** "మొదటి దినము నుండి ఇది వరకు సువార్త విషయములో మీరు నాతో పాలివారై యుండుట చూచి, మీలో ఈ సత్‌క్రియ నారంభించినవాడు యేసుక్రీస్తు దినము వరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను." అన్నాడు చూడండి. సత్‌క్రియ అంటే ఏమిటి? మొదటి దినము నుండి మీరు సువార్త పనిలో పాలిభాగస్తులు కావటమే సత్‌క్రియ! దేవుడు తీసిన సినిమాను మీరు లోకానికి తెలియజెప్పాలి. లోకానికి ప్రచురము చెయ్యాలి. ఈ సృష్టి ఎందుకో, దేవుడు రాసిన లేఖనములు అనగా ఏమిటో, ఆ స్క్రిప్టులో ఏమి వ్రాయబడి ఉందో, మనిషి జీవిత పరమార్థం ఏమిటో, మనిషి ఎందుకు బ్రతుకుతున్నాడో, మనిషి మరణిస్తే ఏమి జరుగుతుందో... వీటన్నింటినీ సామూహికంగా మీరు చెప్పి ఒక మనిషిని రక్షించగలిగితే, కాపాడగలిగితే, మీరు సత్‌క్రియ చేసినట్టు. అంతేగాని ఒక రూపాయి దానం చేస్తే కాదు. పాతాళమనే అగ్నిలో నుండి మీరు మనిషి ఆత్మను రక్షించాలి. చనిపోయే ముందు వారికి ఈ సినిమా అర్థమయ్యేలా చెప్పాలి. మీకున్న దానిని మీరు అర్పించి

అయినా సరే, మీరు దేవుని కార్యక్రమాలను ముగించాలి. మీ పాత్రకు మీరు న్యాయం చేయాలి. అప్పుడు మీకు మంచి బహుమానం కలుగుతుంది. మీ దేహం ఉన్నంత వరకు, దేవుడిచ్చిన ఆయుష్షు ఉన్నంత వరకు మీరు దేవుని క్రియలు చేయాలి.

**యోహాను 9 : 4-** యేసుక్రీస్తు- "పగలున్నంత వరకూ నన్ను పంపినవాని క్రియలు మనము చేయుచుండవలెను. రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పనిచేయలేడు." ఎవరికొరకు చెప్పబడిందీ మాట? మనకొరకే. ప్రపంచవ్యాప్తంగా దేవుని సృష్టిని అనుభవిస్తున్న వారికొరకే. మీ జీవితం, మీ ఆరోగ్యం, మీకు దేవుడిచ్చిన ఆయుష్షు - అదే పగటికాలము. పగలున్నంత వరకూ మనము లోకసంబంధమైన జీవన వ్యాపారములలో చిక్కుకొనకూడదు. జానెడు పొట్టను పోషించుకోవడానికి ఏదో ఒక పని చేసుకోండి. కాదనటం లేదు. కానీ, సత్క్రియలు మాత్రం మానకండి. ఎందుకంటే మీరొచ్చింది అందుకే. ఆ పనిని గనుక మీరు చేయకపోతే చాలా నష్టపోతారు. నిత్యాగ్ని నరకములోనికి జారిపోతారు. "పగలున్నంత వరకూ మనలను పంపినవాని క్రియలు మనము చేయుచుండవలెను, రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పనిచేయలేడు." మీ అవయవాలన్నీ సరిగా వున్నప్పుడు, అన్నీ పనిచేస్తున్నప్పుడు మీరు దేవుని కొరకు ఆలోచించాలి. మీరు దేవుని కొరకు బ్రతకాలి. రాత్రి వచ్చుచున్నది. మీ కొరకు ఆ చీకటి కాలం ఎదురుచూస్తున్నది. అదే మీరు పనిచేయలేని కాలము, మీ శరీరం మీకు సహకరించని కాలము. అప్పుడెవరు పనిచేయగలరు చెప్పండి? నా ఒంటిలో సత్తువ ఉన్నప్పుడే నేను దేవుని సినిమా చెప్పాలి. అందరికీ చూపించాలి. నేను ముసలివాడనై, లేక ఏదో ఒక అవయవమును కోల్పోతే నేను చెప్పగలనా చెప్పండి? అందుకేనండి. నేనెప్పుడూ అదే ఆలోచిస్తాను. దేవుడు నాకిచ్చిన ఈ శరీరం, దేవుడు నాకిచ్చిన ఈ అవయవాలు. దేవుడు నాకిచ్చిన చూపు, స్వరం, కాళ్ళు, చేతులూ ఇవన్నీ దేవుని సేవలో ఉపయోగపడాలి. చివరి క్షణం వరకు నేను దేవుని సేవలో వీటిని అరగదీయాలి. ఎందుకంటే నా పాత్రను నేను దేవుడు అనుకున్నట్టుగా పోషించాలి. దేవుడు తీస్తున్న సినిమాలో నా పాత్రను చూస్తున్న దేవుడు సంతోషించాలి. మీరివ్వలేరా దేవునికి ఆ సంతోషం? మీరు చేయలేరా దేవుని కొరకు ఇలాంటి కార్యక్రమం? మీరు

ప్రకటించలేరా ఈ సమాజానికి దేవునిని? దేవుని సినిమాను మీరు చెప్పలేరా? చెప్పండి. ఈ రోజు సమాజం ఎంతో భయంకరమైన మత్తులో ఉంది. వారిని రక్షించలేరా? మేల్కొలపలేరా? ఇదిగోనండి, బైబిల్ అనే ఆయన స్క్రిప్టును పట్టుకోండి. దేవుని మహాజ్ఞానాన్ని ఈ లోకానికి ప్రకటించండి. దేవుని ఇష్టాన్ని అందరికీ తెలియజేయండి. దేవుని స్క్రిప్టు చాలా మంచిది. యధార్థమైనది. ఇందులో తప్పులు లేవు. ఇందులో అసభ్యకరమైనటువంటి సంగతులు లేవు.

**కీర్తనలు 33 : 4–** "యెహోవా వాక్యము యథార్థమైనది. ఆయన చేయునదంతయు నమ్మకమైనది." ఆయన స్క్రిప్టు చాలా యధార్థమైనది. లోకసంబంధమైన సినిమాలు ఎన్నో తీసారు. మరి, దేవుని యొక్క స్క్రిప్టు గురించి భక్తుడు ఏమని రాస్తున్నాడు? ఆయన స్క్రిప్టులో ఏముందని చెబుతున్నాడు? 'యెహోవా వాక్యము యథార్థమైనది. ఆయన చేయునదంతయు నమ్మకమైనది. నమ్మదగినది. సూర్యుడు నమ్మదగినవాడు. చంద్రుడు నమ్మదగినవాడు. గాలి నమ్మదగినది, భూమి నమ్మదగినది. భూమిని నమ్మే కదండి రైతు విత్తనాలు వేస్తున్నాడు. పెట్టుబడి పెడుతున్నాడు. 'దేవుడు చేయునదంతయు నమ్మకమైనది.' ఈ నమ్మకమైన దానిలో, యధార్థమైన దానిలో చక్కగా నటించవలసిన మీరెందుకయ్యా యధార్థతను కోల్పోతున్నారు. మీరెందుకయ్యా అపనమ్మకస్తులుగా మిగిలిపోతున్నారు. ఇలాంటి వారిని దేవుడు విడిచిపెట్టడు. మీరు ఆలోచించాలి. మీ హృదయంలో ఇప్పుడు ఒక మంచి నిర్ణయం మీరు తీసుకోవాలి. ఈ లోకం బొత్తిగా చెడిపోయింది. ఈ లోకం తప్పులను ప్రకటించింది. ఈ లోకం సినిమాలు తీసి మనుషులందరినీ తనవైపు మళ్ళించుకుంది. కానీ లోకానికి దేవుడు విరోధి. దేవునిది మంచి సినిమా. దేవునిది యధార్థమైన సినిమా. దేవునిది నమ్మకమైన సినిమా. ఆయన స్క్రిప్టు చూడండి. ఆయన మాటలు చూస్తే మీరు చాలా ఆనందపడతారు.

**ప్రసంగి 7 : 29–** "ఇది యొకటి మాత్రము నేను కనుగొంటిని. ఏమనగా దేవుడు నరులను యథార్థవంతులనుగా పుట్టించెను గాని వారు వివిధమైన తంత్రములు కల్పించుకొని యున్నారు." మీరందరూ యధార్థవంతులుగా పుట్టారు. యధార్థమైన షూటింగ్‌లో ఉన్నారు మీరు. "దేవుడు

నరులను యథార్థవంతులుగా పుట్టించెను కాని, వారు వివిధమైన తంత్రములు కల్పించుకొని యున్నారు". కల్పించుకున్నారా? బోలెడు తంత్రములు. వీరికి బోలెడు నటనలు. వీరికి బోలెడు సినిమాలు. వీరికి బోలెడు పాత్రలు. వీరికి బోలెడు కథలు. దేవుడు రచించిన కథ వీరికి నచ్చలేదు. మరి దేవుడు ఏమంటున్నాడో చూడండి. నేను మనుష్యులను యథార్థవంతులుగా పుట్టించితిని. కానీ, వీరేమైపోయారు? యథార్థతలో ఉన్నారా? నమ్మకత్వంలో ఉన్నారా? లేదు. వీరు వివిధమైన తంత్రములు కల్పించుకొని యున్నారు. పోకిరి, కంత్రి, ఇడియట్... (ఇవన్నీ మనవారి సినిమా టైటిల్స్) ఏమిటండీ ఈ తంత్రములు? ఇవి చాలా భయంకరమైన తంత్రములు. మిమ్మును అలా (పోకిరిగా, దేశముదురుగా, కంత్రిగా, ఇడియట్‌గా) మార్చటానికా? లేక మిమ్మును దేవునివైపునకు మళ్లించటానికా? మీ పాత్ర జ్ఞాపకం లేకుండా చేయటానికే కదా రోజుకో కొత్త సినిమా! అందుకే దేవుడు చిట్టచివరిగా మీకొక శాసనమును విధించాడు. తన స్క్రిప్టులో దేవుడు ఒక శాసనాన్ని పొందుపరిచాడు. ఇక దేవుడు ఒక ముగింపుకు వచ్చేసాడు. దేవుడు మనుష్యులను బేరీజు వేసాడు. దేవుడు మిమ్మును యథార్థవంతులుగా, యథార్థమైన లోకంలో, యథార్థంగా అన్నీ చూపిస్తే మీరు డూపులు సహాయంతో, మేకప్‌ల సహాయంతో నటించి ఆ గదిలోనికి వెళ్ళిపోతున్నారా? మీరు రియాలిటీలో ఉండరా? నమ్మకమైనటువంటి ఈ యథార్థమైన దేవుని సినిమాలో మీరుండరా? దేవుడు అందుకే ఒక మంచి నిర్ణయానికి వచ్చాడు. చూడండి.

**రోమీయులకు 12 : 1 – 2** "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని, దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలుసుకొనునట్లు మీ మనస్సు మారి నూతన మగుటవలన రూపాంతరము పొందుడి." సహోదరులారా, దేవుని సినిమాలో పాత్రధారులారా, ఈ మీ శరీరము సజీవమైనదై, బలము కలిగినదై, దేవుని కొరకు నిలబడినదై, దేవుని సేవలో ఉన్నదై, సత్క్రియలు చేసేదియై ఉండాలి.

అదే దేవుని కోరిక. సజీవ యాగముగా నీ శరీరమును దేవుని కొరకు సమర్పించుకొనుడి. దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బ్రతిమాలుకుంటూ ఈ మాట వ్రాయవలసి వచ్చెను అని స్క్రిప్టులో దేవుడు తన మాటగా వ్రాయించాడు. ఇట్టి సేవ నీకు యుక్తమైనదన్నాడు. ఆ తరువాత ఒక మంచి మాట చెప్పాడు చూడండి. 'మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక' అన్నాడు. ఈ లోకమేమి చెప్పింది? పుట్టావు, పెరిగావు, చదువుకున్నావు, తిన్నావు, కొన్నావు, అమ్మావు. వీటిలోనే ఉండాలని చెప్పింది ఈ లోకం. దేవుని స్క్రిప్టును మరిపించింది ఈ లోకం? "మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని మర్యాదను మీరు తెలుసుకోవాలి." అన్నాడంటే, లోక మర్యాద ఎలా ఉంటుందో, లోకస్థుల మర్యాద ఎలా ఉంటుందో మీకు ఒక ఉదాహరణ ద్వారా చూపిస్తాను. నేనేదో అందరి మీద పగబట్టి, వారినేదో దూషిస్తూ మాట్లాడటం లేదు. మీరే వాస్తవాన్ని గ్రహించాలి. లోకానికి ఒక మర్యాద ఉంది. అలాగే, ఒక దర్శకుడు తీసిన లోక సంబంధమైన సినిమాలో ఒక కుటుంబానికి కూడా ఒక మర్యాద ఉంది. కుటుంబపెద్దకు ఒక మర్యాద ఉంది. ఆ గ్రామానికి ఒక మర్యాద ఉంది. ఇన్ని మర్యాదలు ఉంటాయా? ఉంటాయి. లోకానికి చాలా మర్యాదలున్నాయి. మీ గ్రామానికో మర్యాద ఉందండి. మా కుటుంబానికో మర్యాద ఉందండి. ఇలాంటి స్క్రిప్టు ఒక దర్శకుడు వ్రాసుకున్నాడు. లోకసంబంధమైన ఒక దర్శకుడు ఇలాంటి స్క్రిప్టే రాసుకున్నాడు. మర్యాద రామన్న అనే ఆ స్క్రిప్టులో ఏమి వ్రాసుకున్నాడో మీకు కొద్దిగా వివరిస్తాను.

రామినీడు అనేటటువంటి ఒక వ్యక్తి ఉన్నాడు. ఈ వ్యక్తి అతని యొక్క గ్రామానికి, అతని కుటుంబానికి పెద్ద. ఈ రామినీడుకి ఇద్దరు సుపుత్రులున్నారు. వారెవరు? మల్లుసూరి, బైరెడ్డి. అనంతపురం జిల్లా కదండి. అక్కడున్న పేర్లన్నీ అలాగే ఉంటాయి. వీరి ఇంటికొక ఆచారం ఉందటండి. వీరి ఇంటికి ఒక పద్ధతి, ఒక మర్యాద ఉంది. ఏమిటా మర్యాద? ఇంటిలో హత్యలు చేయకూడదట! అబ్బో!! ఇంట్లో చేయకపోతే ఎక్కడ చేస్తారు? గడప దాటితే చేసేస్తారట. లోకపరంగా చాలా బాగా రాసుకున్నాడు దర్శకుడు. ఇది అతని దృష్టికి ఒక మంచి స్క్రిప్ట్. లోకసంబంధమైన లోక మర్యాదకు సంబంధించిన ఒక స్క్రిప్టు

సినిమాగా తీస్తే జనాలందరు నా స్క్రిప్టుని ఎగబడి చూస్తారు అని అనుకున్నాడు. మంచి తెలివిగా, ఒక రసవత్తరమైన క్రొత్త కథను వ్రాసుకున్నాడు. ఇక ఆ కథలోనికి ఒకసారి వెళితే, రామినీడు ఇంటికి ఒక మర్యాద ఉంది. ఏమిటా మర్యాద? వారి ఇంటిలో రక్తం ఒలకకూడదు. రక్తం చిందకూడదు. వారి శత్రువు వారి ఇంటి గడప దాటితే మాత్రం వారు ప్రాణం తీసేస్తారు. ఇప్పుడు వీరి దగ్గరకి ఒక అమాయకుడు వెళ్ళాడు. అతనే హీరో. అమాయకుడైనా అక్కడ హీరో అయ్యాడు. అది దర్శకుడు వ్రాసుకున్న స్క్రిప్టులో ఒక భాగం. ఈ అమాయకుడి పేరు కోవెలముడి రాము. ఈ రాము ఎప్పుడో తన తల్లిదండ్రులు వదిలిపెట్టినటువంటి 5 ఎకరాల పొలం తనకు మరల గవర్నమెంటు తిరిగి ఇస్తుందనేటువంటి నమ్మకంతో, అతనికి వచ్చినటువంటి ఆ పోస్టుని బట్టి తిరిగి ఈ అనంతపురం జిల్లా, తాడిపత్రి మండలం, గండికోట గ్రామానికి బయలుదేరుతాడు. చూశారా! కోవెలముడి రాము అనే ఈ అమాయకపు హీరో బయలుదేరాడు. నా 5 ఎకరాల పొలం గవర్నమెంటు దగ్గరనుంచి, నా పంచాయితీ లోనుంచి నేను తెచ్చుకోవాలి అనుకుంటాడు. కానీ, సరాసరి ఈ వింత మర్యాద కలిగిన రామినీడు ఇంటికి వెళ్లిపోయాడు. అతని ఇంటికి వెళ్ళగానే, రామినీడుకి ఒకటి అర్ధమైయింది. ఏమిటంటే, ఇతడెవరో కాదు. చిన్నప్పుడు నాతో శత్రుత్వాన్ని పెంచుకున్న ఒక వ్యక్తి కొడుకు ఇతడే. కనుక ఇతడిని చంపేయాలి. చంపుదామనుకునే సరికి ఇతను ఎక్కడున్నాడో తెలుసా? ఇంటిలోపల భోజనం చేస్తూ ఉన్నాడు. ఇంటి లోపల నుంచి బయటకు అడుగు పెట్టెయ్యగానే చంపేద్దాం. ఎందుకంటే చిన్నప్పటి నుంచి మన ఇంటికో మర్యాద ఏడ్చింది. మన తల్లిదండ్రులు తమ ఆస్తితో పాటు మనకో మర్యాద ఇచ్చారు. ఆ మర్యాదను మనం జాగ్రత్తగా కాపాడుకుందాం అనుకున్నారు. అప్పుడు రామినీడు ఆ మల్లుసూరి, బైరెడ్డిలతో మీరు ఆవేశపడకండి. మీకసలే దేహం పెరిగింది తప్ప, బ్రెయిన్ పెరగలేదు. నాకు ఆ బ్రెయిన్ సమపాళ్ళలో ఉంది. కనుక గడప దాటగానే మన మర్యాద ప్రకారం వాడిని చంపేద్దాం అని చెప్పాడు. ఇది దర్శకుడు కల్పించిన ఒక లోక మర్యాద. దీనిని ఒక దర్శకుడు చూపించాడండి. ఆంధ్రరాష్ట్రం, భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది దీనికి నీరాజనాలు పలికారు. అబ్బో రామన్న గారి మర్యాద బావుంది, దీనికి

మేము ఓటు వేస్తాం అన్నారు. రామినీడు గాని మర్యాద అదిరిపోయింది అన్నారు. కానీ, నీకు రామినీడు గారి మర్యాద మాత్రమే తెలుసు. దర్శకునికి ఆ స్క్రిప్టే తెలుసు. ఇప్పుడు దేవుడు ఏమన్నాడో మీరు చూడాలి.

దేవునికి కూడా మర్యాద ఉంటుందా? లోకమర్యాదను ఈ ఉదాహరణ ద్వారా మనం విన్నాం. రామినీడు కుటుంబానికి, ఆ ఇంటికీ ఉన్న మర్యాదను విన్నాం. దేవునికి కూడా మర్యాద వుంటుందా? {Yes!} ఉంది. దేవుడు తీసిన సినిమాలో దేవునికి కూడా మర్యాద వుంది. మర్యాదరామన్న లోకానికి సంబంధించిన సినిమా అయితే, మేము కూడా అసలైన సినిమాను తీసాం. అదే "దేవుని మర్యాద." దేవునికి మర్యాద ఉంటుందా? ఉంటే ఎలా ఉంటుంది? ఆయన కూడా ఇలాగే చంపేస్తాడా? ఆయన మర్యాద ఎలా ఉంటుందో ఇప్పుడు చూడండి. ఆయన స్క్రిప్టులో చదవండి. మర్యాదరామన్న మర్యాద అంతా నకిలీ! దేవుని మర్యాదంతా వాస్తవం. ఇది రియల్. అది డూపు. ఇప్పుడు మీకు నేను వివరిస్తున్నది యధార్ధమైనది. నమ్మకమైనది. ఇందులో ఎటువంటి భేదం లేదు. తారతమ్యాలు లేవు. అబద్ధం లేదు. అసత్యం లేదు. కానీ, వాడు తీసినదానిలో అయితే ఉండాలి, ఉంటుంది. ఎందుకంటే అది కమర్షియల్ ఫిల్మ్. ఇది దేవుడు తీసిన సినిమా! {This is a Real Film} గతంలో జరిగిన చరిత్ర, యధార్ధమైన చరిత్రను ఇప్పుడు చూడండి.

**2రాజులు 17 : 24–** "అష్షూరురాజు బబులోను, కూతా, అవ్వా, హమాతు, సెపర్వయీము అను దేశముల నుండి జనులనురప్పించి, ఇశ్రాయేలు వారికి మారుగా షోమ్రోను పట్టణములలో ఉంచెను." జరిగిన సందర్భం ఏమిటో తెలుసా? ఆనాటి ఇశ్రాయేలీయులు దేవుని స్క్రిప్టు మరిచిపోయారు. వారు దేవుని యొక్క లేఖనాలను పక్కనపెట్టారు. దేవుని సినిమాలో పాత్రను సరిగా పోషించటం లేదు. అప్పుడు దేవుడు, ఇశ్రాయేలువారందరినీ అష్షూరు రాజుకు అప్పగించాడు. ఒక దేశం మరో రాజుకు, ఒక దేశం మరో దేశానికి అప్పగింపబడాలంటే, కారణం దేవుడా? భారత్ – పాకిస్తాన్ మధ్య యుద్ధం జరగాలి అంటే కారణం దేవుడా? {Yes!} అవును. రష్యా – అమెరికా మధ్య యుద్ధం జరగాలి అంటే కారణం దేవుడా? అవును. ఒక దేశానికి స్వాతంత్ర్యం

రావాలన్నా, ఒకదేశం దాస్యత్వంలోకి వెళ్ళిపోవాలన్నా కారణం దేవుడా? అవును. ఈ ప్రపంచం ఆయనను మర్చిపోయింది. ఏ దేశపు స్వాంతంత్ర్య వేడుకలలోనూ దేవుడు అనే పదం ఎక్కడా ఉండదండి. ఎక్కడా ఉండదు. ఆయన తీసిన సినిమా ఎవరికి కావాలి? కానీ, చరిత్రను చూస్తే, ఆయన వ్రాయించిన స్క్రిప్ట్‌లో చూస్తే ఇశ్రాయేలీయులందరినీ, ఆ దేశమంతటినీ అష్షూరియన్స్‌కి దేవుడు అప్పగించాడు. అలాంటప్పుడు అష్షూరు రాజు ఏమి చేసాడు? షోమ్రోను పట్టణములో ఇశ్రాయేలీయులు ఉండకూడదు అన్నాడు. కానీ ఇశ్రాయేలీయులు ఉండవలసిన పట్టణమే షోమ్రోను పట్టణం. ఆ పట్టణములో ఇశ్రాయేలీయులు ఉండకూడదు అన్నాడు ఆ రాజు. ఎందుకంటే ఆ రాజు వారిని జయించాడు. వారిని తాను ఓడించాడు. కనుక తనకిష్టమైన వారు షోమ్రోను పట్టణమునకు వెళ్ళాలనుకొని ఆ అష్షూరు రాజు ఎవరిని ప్రవేశపెట్టాడో చూడండి. బబులోను, కూతా, అవ్వా, హమాతు, సెపర్వయీము అను దేశములలో నుండి జనులనురప్పించి, ఇశ్రాయేలు వారందరినీ తోలివేసాడు. వారినందరినీ ఎక్కడికో ఒక చోటికి పంపించేయండి అని చెప్పి, షోమ్రోను పట్టణంలో ఇశ్రాయేలీయులు కానివారిని ఉండనిచ్చాడు. "గనుక వారు షోమ్రోను దేశమును స్వతంత్రించుకొని దాని పట్టణములలో కాపురము చేసిరి. అయితే వారు కాపురముండ నారంభించినప్పుడు యెహోవాయందు భయభక్తులు లేనివారు. ఇశ్రాయేలీయులు కానివారికి ఆ కాస్త దేవుని స్క్రిప్టు కూడా తెలియదు. ఇశ్రాయేలీయులు తన స్క్రిప్టు పాటించుట లేదనే, ఇశ్రాయేలీలను దేవుడు అష్షూరు రాజు చేతికి అప్పగించాడు. అయితే అష్షూరు రాజు చేతిక్రింద ఉన్న వారికి దేవుని గూర్చి అస్సలు తెలియదు గనుక ఆయన ఏమి రచించాడో చూడండి. "వారు కాపురముండ నారంభించినప్పుడు యెహోవా యందు భయభక్తులు లేనివారు గనుక యెహోవా వారి మధ్యకు సింహములను పంపెను." స్క్రిప్టు సరిగ్గా పాటించకపోతే, వ్రాయబడిన దాని ప్రకారం క్రమంగా నటించకపోతే దేవుడు సింహములను పంపించాడు. ఈ రోజు కూడా ఆయన పంపిస్తున్నాడు. ఏమిటో తెలుసా? రోగములను పంపిస్తున్నాడు, ప్రకృతి వైపరిత్యములను పంపిస్తున్నాడు, కరువు కాటకములను పంపిస్తున్నాడు. ఆ రోజు అయితే చరిత్రలో సింహములను పంపించాడు. ఆయన వ్రాసుకున్న లేఖనాలకు తగ్గట్టుగా మీ జీవితం లేకపోతే,

మీ బ్రతుకును ఈ భూమి మీద ఆయన ఉండనివ్వడు. అందుకే తన స్క్రిప్టులో ఇప్పుడే గొడ్డలి చెట్లు వేరున ఉంచబడింది అన్నాడు. ఆ రోజు అష్షూరు రాజు చేసిన ఆ ఘోరమైన పనికి దేవుడు తన మర్యాద ఏమిటో చూపించుకోవాలిగా. మనం చదివిన రామనీడు మర్యాద ఎంత? {Afterall} చులకనిది అది. ఈయన మర్యాద చూపించుకుంటున్నాడు చూడండి. అష్షూరు దేశానికి ఏం పంపించాడు? అష్షూరు దేశపు రాజు దగ్గరకు, ఆ షోమ్రోను పట్టణములలో నివసిస్తున్నటువంటి అన్ని జాతుల వారి దగ్గరకు ఏమి పంపించాడో చూడండి. "సింహములను పంపెను. అవి వారిలో కొందరిని చంపెను". "తమరు పట్టుకొనిన షోమ్రోను పట్టణములలో, తాముంచిన జనులకు ఆ దేశపు దేవుని మర్యాద తెలియకున్నది గనుక ఆయన సింహములను పంపించెను." అని రాజుతో ఒక ప్రవక్త చెప్పాడు. రాజా నీకేననుకున్నావా మర్యాద ఉన్నది? రామినీడుకేనా మర్యాద ఉన్నది? ఒక ఇంటికేనా మర్యాదుంది?ఒక దేశానికేనా మర్యాదుంది? కాదు కాదు. ఇవన్నీ చిన్ని చిన్ని మర్యాదలు. ఇవన్నీ కేవలం వారు బ్రతికి ఉన్నంతకాలమే ఉంటాయి. ఆ తరువాత పోతాయి. సమాధిలో కలిసిపోతాయి. దేవుని మర్యాద ఎల్లప్పుడూ నిలిచేది. ఆయనకు కూడా ఒక మర్యాద ఉంది. ఆయనకు కూడా ఒక పద్ధతుంది. ఇప్పుడు అర్ధమౌతుందా మీకు ఎందుకు చూపించానో, మర్యాద రామన్నను? 'దేవుని మర్యాద' అనే పేరుతో ఇప్పటివరకు ఎవడైనా తీసాడా ఈ స్క్రిప్టు? ఎవరైనా చిత్రీకరించారా? సమాజానికి ఎవరు చెబుతారు? {Nobody} ఇది ఎవ్వరికీ సాధ్యం కాదు. అష్షూరురాజు దగ్గరకు షోమ్రోను పట్టణములలోనికి దేవుడు సింహములను పంపించెను. ఎందుకంటే ఇది దేవుని మర్యాద. నా ప్రాంతంలో, నా దేశంలో, నన్ను నమ్మేవారుండాలి. నా కొరకు బ్రతికేవారుండాలి. నా స్క్రిప్టులో సరిగ్గా నటించేవారుండాలి. లేదా, ఈ భూమిమీద నేను వారిని ఉండనివ్వను. ఇది దేవుని మర్యాద {This is my tradition} చూడండి. "వారికి దేవుని మర్యాద తెలియనందున సింహములు వారిని చంపుచున్నవని వారు అష్షురురాజుతో మనవి చేయగా. అష్షురురాజు – అచ్చట నుండి తేబడిన యాజకులలో ఒకనిని అచ్చటికి మీరు తోడుకునిపోవుడి. అతడు అచ్చటికి పోయి కాపురముండి ఆ దేశపు దేవుని మర్యాదను వారికి నేర్పవలెనని ఆజ్ఞాపించెను." అష్షూరురాజు

బాగా తెలివైనవాడు, మంచివాడు. సింహముల రాకకు, సింహములు తన దేశ ప్రజలను చంపటానికి కారణం ఇదా? ఇంతకు మునుపు ఇక్కడ కాపురమున్న ఇశ్రాయేలీయులకు దేవుని మర్యాద తెలియదు గనుక వారు నాకు అప్పగింపబడ్డారు. ఇప్పుడు వచ్చిన నా ప్రజలకూ ఈ దేవుని మర్యాద తెలియదు గనుక, వీరు సింహములకు అప్పగింపబడ్డారు. అయితే నామీద ఉన్న అధికారి గొప్పవాడు, అతడే దేవుడు. నేను రాజునైనా నేను {Afterall} అన్నాడు అష్షూరు రాజు. మరిప్పుడు ఏమి చేయాలి? ఆ దేవుని మర్యాద తెలిసినవాడు ఒక్కడైనా ఉండకపోడు. వానిని తీసుకొనివచ్చి ఈ షోమ్రోను పట్టణంలో, ఆ దేశపు దేవుని మర్యాద చెప్పండి. ఆ మర్యాదను వీరందరినీ పాటించమని చెప్పండి. అప్పుడు సింహములు ఆగిపోతాయి. చూడండి. అదే జరిగింది. (28వ వచనంలో) "కాగా షోమ్రోనులో నుండి వారు పట్టుకొని వచ్చిన యాజకులలో ఒకడు వచ్చి బేతేలు ఊరిలో కాపురముండి యెహోవా యందు భయభక్తులుగా ఉండతగిన మర్యాదను వారికి బోధించెను."

దేవుడు ఏర్పరచిన భూమిలో, దేవుడు అనుగ్రహించిన సృష్టిలో మనము బ్రతికి బట్టకట్టాలంటే, ఈ దేహాన్ని విడిచి బహుమానాన్ని పొందాలి అంటే, ఆయనున్న లోకానికి వెళ్ళాలి అంటే, ఆయన మర్యాద మనకు అర్ధం కావాలి. ఆయన మర్యాద మనకు తెలియాలి. అప్పుడే మన బ్రతుకు పండుతుంది. లేదా ఈ లోకములో ఉన్న లోక మర్యాదలో ఉన్న అబద్ధాన్నే మీరు నమ్ముకుంటారా? ఈ అవాస్తవాన్నే మీరు నమ్ముకుంటారా? మనుష్యులు కల్పించిన తంత్రముల వెనుక మీరు వెళతారా? అలాంటప్పుడు మిమ్మును ఎవ్వరూ బాగుచేయలేరు. నాశనం మీ కొరకు ఎదురుచూస్తుంది కనుక వెళ్ళొద్దు. ఈ భాగములో చివరిగా దేవుని యొక్క స్క్రిప్టులో మంచిమాటను మీచేత చదివించి ముగిస్తాను.

**1కొరింథీ 7 : 29–** "సహోదరులారా, నేను చెప్పునదేమనగా, కాలము సంకుచితమై యున్నది గనుక ఇకమీదట భార్యలు కలిగినవారు భార్యలు లేనట్టును, ఏడ్చువారు ఏడ్వనట్టును, సంతోషపడువారు సంతోషపడనట్టును, కొనువారు తాము కొనినది తమది కానట్టును, ఈ లోకమును అనుభవించువారు అమితముగా అనుభవింపనట్టును ఉండవలెను. ఏలయనగా ఈ లోకపు నటన

గతించుచున్నది.” కాలము చాలా సంకుచితమై యున్నది. మీకివ్వబడిన ఆయుష్కాలము కూడా చాలా తక్కువ. సహోదరులారా లోకము వెంబడి వెళతారా? ఇంకా లోకములో ఉన్న ఆ అన్యాయాన్ని మీరు అనుకరిస్తారా? దానినే కోరుకుంటారా? దానినే ప్రేమిస్తారా? “కాలము సంకుచితమైయున్నది. కనుక ఇకమీదట భార్యలు కలిగినవారు భార్యలు లేనట్టుగా ఉండాలి” ఎప్పుడూ భార్య పూజలో, ఎప్పుడూ భార్య సేవలో కాదు. నా భార్యను చూడకపోతే నేను ఉండలేను అనుకుంటున్నారా? నా భార్య ఫోటో సెల్‌లో ఉండకపోతే నేనుండలేను అనుకుంటున్నారా? భార్య మాట నా చెవిలో పడకపోతే నాకు పూట గడవదు అనుకుంటున్నారా? అయ్యో, అమాయకుడా! నీవు ఇక్కడ ఒక పాత్రను పోషిస్తున్నావయ్యా. నీవు చస్తే నీ దేహాన్ని నీ భార్య ఇంటిలో ఉంచుకోదయ్యా. అవసరమైతే మరో వివాహం చేసుకుంటుంది. ఇంకా నిష్ట కలిగినదైతే ఒంటరిగా ఉంటుంది తప్ప, నీ దేహమును మాత్రం స్మశానానికే పంపించేస్తుంది. భర్త అయినా సరే, భార్యను ఎంత ప్రేమించినా, భార్య శవంగా మారిపోతే ఇంట ఆ శవాన్ని ఉంచుకుంటాడా? శవము దగ్గర సాయంత్రం వరకూ ఏడుస్తాడు. నా భార్యో, నా భార్యో అని గగ్గోలు పెడతాడు. “భార్యంటే ఇంత ప్రేమ ఉంది కదా, నీ పర్సులో ఫోటో పెట్టుకున్నావు. చాలా ప్రేమిస్తున్నావు, అయితే నీవే నీ భార్య శవాన్ని ఉంచుకో” అని అందరూ వెళ్ళిపోయారనుకోండి. వెంటనే చప్పట్లు కొట్టి పిలిచేస్తాడు, “బాబూ అంత మాట అనకండి. తీసుకొని వెళ్ళిపోండి. ఇదెందుకు నాకు? లోపల ఆత్మ లేనప్పుడు, నా భార్య శవం నాకక్కరలేదు.” అంటాడు. అదే మన చిట్టచివరి పరిస్థితి. “భార్యలు కలిగినవారు భార్యలు లేనట్టుగా ఉండమన్నాడు. అలాగని వారిని విడిచిపెట్టమని కాదు. భార్య సేవలో ఉండవద్దు అన్నాడు. భర్తలు కలిగినవారు భర్తలు లేనట్టుగా ఉండాలి. ఎందుకంటే మీరు ఒక మహాపాత్ర పోషించటానికి వచ్చారు. సత్క్రియలు నెరవేర్చటానికి మీరు వచ్చారు. దేవుని కార్యక్రమంలో పాలిభాగస్తులు కావటానికి మీరు వచ్చారు. “భార్యలు కలిగినవారు భార్యలు లేనట్టును, ఏడ్చువారు ఏడ్వనట్టును, సంతోషపడువారు సంతోషపడనట్టును, కొనువారు తాము కొనునది తమది కానట్టుగా, ఈ లోకమును అనుభవించువారు అమితముగా దానిని అనుభవింపనట్టుగాను ఉండవలెను.” చాలా తగ్గించుకోమంటున్నాడు చూడండి.

దేవుని పనికి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వమంటున్నాడు. ఏదైనా కొనుక్కున్నారా? రోజూ దానిని తుడిచేయడమే. సెల్‌ఫోన్ కొత్తది కొనుక్కుంటే దానిని బాగా దాన్ని కడిగి, ఎంతకాలం తుడిచేస్తావ్? క్రొత్తగా బండి కొనుక్కున్నావా? రోజూ దాన్ని కడిగి, తుడిచేస్తారు. కొనువారు తాము కొనునది తమది కాదు అన్నట్టుగా ఉండాలయ్యా. ఇంత గొప్ప మనసు ఈ రోజు ఎవ్వరికైనా ఉందా? నీకివ్వబడిన కాలం అతి తక్కువ. ఈ అల్ప కాలములో దేవుడు తీసిన సినిమాలో నీ పాత్రను సరిగ్గా ప్రారంభించు. సరిగ్గా జీవించు. సరిగ్గా ముగించు. దేవుని స్క్రిప్టు చక్కగా అర్థం చేసుకో. దేవుని లేఖనములలో నిత్యజీవం ఉన్నది. ఆ స్క్రిప్టులో యదార్థత ఉన్నది. మరి ఈ లోకంలో ఏముందో చూడండి. 'ఈ లోకంలో దీనిని అమితముగా అనుభవించువారు దానిని అనుభవింపనట్టుగా ఉండవలెను. ఏలయనగా మర్యాద రామన్నగారి మర్యాద గతించుచున్నది. రామనీడు గారి మర్యాద గతించుచున్నది. ఈ లోకపు నటన గతించుచున్నది. *{This is going to be End}* సమాధిలో కలిసిపోవటానికి సిద్ధంగా ఉంది. దేవుని "స్క్రిప్టు, దేవుడు తీసిన సినిమా ఎల్లప్పుడూ నిలుచునది. ఎప్పటికైనా మనుష్యులకు వెలుగును చూపేది, దేవుని ఇష్టాన్ని నెరవేర్చేది.

ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్

క్రైస్ట్ చర్చ్ - సామర్లకోట - 8978414178.

## దేవుడు తీసిన సినిమా - 3

నా ప్రియమైన సోదర సోదరీమణులారా! దేవుడు తీసిన సినిమా మొదటి భాగములో దేవుడు వేసుకున్న లొకేషన్, దేవుడు వేసిన సెట్టింగ్స్, అందులో ఆకాశము దానియందున్న సమస్త సమూహము, అందులో ప్రధానమైన భూమిని తెలుసుకున్నారు. ఆ భూమికి కావలసిన వెలుగు, గాలి, వేడిమి, నీరు, ఆహారపదార్ధాలు, పశుపక్ష్యాదులను గూర్చి అర్థంచేసుకున్నారు. ఇక రెండవ భాగములో మనుష్యులలో ప్రతీ ఒక్కరూ పరలోకానికి చేరాలంటే, బహుమానమును పొందాలంటే, దేవుని సత్క్రియలు చేయాలి అని నేర్చుకున్నాము. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది. ఆయన స్క్రిప్టు అద్భుతంగా ఉంది. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, భూమి మీద ఉన్న ఈ ప్రకృతి అంతా దేనిని అతిక్రమించకుండా కట్టడను పాటిస్తున్నాయి. మనిషికంటూ దేవుడు కొన్ని సత్క్రియలు చేయమని చెప్పాడు. ఆ సత్క్రియయే దేవుని యొక్క సువార్త పనిలో పాలిభాగస్తులు కావటం, దేవుని సేవలో నిమగ్నులు కావటం. మరి ఇంత గొప్పదైన దేవుని సినిమా ఎందుకు రిలీజ్ అవ్వలేదు. లోకకల్యాణము నిమిత్తం జరుగుతున్న ఈ దేవుని సినిమా ఇప్పటివరకూ ప్రపంచానికి ఎందుకు తెలియలేదు. అనేకమంది మనుష్యులు దేవుడు తీసినటువంటి ఈ సినిమాను ఎందుకు గ్రహించలేకపోయారంటే, దేవుడు తీసిన ఈ సినిమాలో ఒక విలన్ ఉండాలి. లేకపోతే బాగోదు. ఆయన సినిమా హిట్ అవ్వదు. అందుకే దేవుడు ఒక విలన్ క్యారెక్టర్‌ను కూడా ఉంచాడు. ఒక శత్రువును ఆయన పరిచయం చేస్తున్నాడు. ఈ విలన్‌ను దేవుడు ముందునుంచే శత్రువుగా సృష్టించలేదు. వాడే తనకు తాను శత్రువుగా మారిపోయాడు. ఇది కూడా ఆయన స్క్రిప్ట్‌లో ఒక భాగమే. ఆయన వ్రాసుకున్న స్క్రిప్టులో వీడు విలన్ పాత్ర పోషించటానికి విడిచిపెట్టబడ్డాడు. మీరు జాగ్రత్తగా అర్థంచేసుకోవాలి. ఇప్పుడు మీకు దేవుని యొక్క సినిమా బాగా అర్ధం కావాలి. దేవుని సినిమాలో విలన్ ఉన్నాడా? ఒక ప్రతినాయకుడు ఉన్నాడా? ఒక శత్రువున్నాడా? అవును! ఆయన వేసిన ఈ సెట్టింగులు, ఆయన వేసిన ఈ లొకేషన్, ఆ తర్వాత మనిషిని ప్రవేశపెట్టటం,

ఆ మనిషికి దేవుడు ఒక ఏదెను తోటను ఇవ్వటం జరిగిన తరువాత దేవుడు ఒక మహా భయంకరమైన శత్రువును ప్రవేశపెట్టాడు. ఆదాము తన హీరోయిజాన్ని దేవునికి చూపించాలి. శత్రువుంటేనే కదండి హీరో యొక్క గొప్పతనం తెలుస్తుంది. అంతేనా! విలన్ ఉంటేనే హీరో ఎంత గొప్పవాడో అర్థమౌతుంది. విలనే లేకపోతే వీడు హీరో అని ఎవరు చెప్పగలరు? ఎలా చెప్పగలరు? అందుకే దేవుడు, ఆదాము హవ్వలతో తమ హీరోయిజాన్ని ప్రదర్శించమన్నాడు. మనిషి దేవుని సినిమాలో ఒక హీరో కావాలి? అయితే మనిషికి తగ్గట్టుగా దేవుడొక విలన్‌ను తయారు చేయాలి. లోకసంబంధమైన సినిమాలు మీరు చూస్తుంటారు. మీరు చూడకూడదనుకున్నా వాల్‌పోస్టర్లలో మీకు సినిమా మొత్తం చూపించేస్తున్నారు ఈ లోక సంబంధమైన దర్శక నిర్మాతలు. అయ్యబాబోయ్ మేము ఇప్పటి వరకు ఏ సినిమాకు, ఏ థియేటర్‌కు మేము వెళ్ళలేదండి. పుట్టిన దగ్గరనుండి ఇప్పటివరకు ఏ సినిమా థియేటర్ గడపా మేము తొక్కలేదని మీరనుకున్నా, రోడ్డు మీద మీరు వెళుతుంటే, అటు కన్ను తిరగేస్తే సినిమా పోస్టరు, ఇటు కన్ను తిరగేస్తే సినిమా పోస్టరు. సినిమా థియేటర్‌లోనికి వెళితే సెకనుకి 24 ఫ్రేములు. ఇక్కడ సినిమా పోస్టరులో సెకనుకి ఒక ఫ్రేము మాత్రమే. అదే తేడా. ఇదీ ఫ్రేమే, ఇదీ పిక్చరే! చాలామంది నాకు ఫోన్లు చేసి, మీరు దేవుడు తీసిన సినిమా అంటారేంటి? అన్నారు. ఓరి పిచ్చివాడా! ఏమి తెలుసు నీకసలు? సినిమా అంటే అదే అనుకున్నావా? అదొక బూతు పదం అనుకున్నావా? సినిమా అంటే చిత్రం, సినిమా అంటే వీడియో. అది సెకనుకి 24 ఫ్రేములు కదిలే వీడియో. నీవు రోడ్‌మీద నడుస్తున్నప్పుడు వాల్‌పోస్టర్లు చూడటం లేదా? పెద్ద పెద్ద హోర్డింగులు చూడటం లేదా? పట్టణాల నిండా అవే. మీరు వస్తుంటే దారి పొడుగునా సినిమా రోడ్డులాగానే వుంటుంది. ఎక్కడ చూసినా వాల్‌పోస్టర్లే. సినీ థియేటర్‌కు సంబంధించిన పత్రికలే. అవును.

లోక సంబంధమైన సినిమాలో మీరు చూస్తున్నపుడు ఒక హీరోను గొప్పగా నిలబెట్టాలంటే, విలన్‌ని కూడా గొప్పగా నిలబెడతాడు ఒక దర్శకుడు. దేవున్ని చూసి దర్శకుడు కాపీ కొట్టాడు. లేకపోతే దర్శకుడికి ఎక్కడిదీ బుర్ర. దేవున్ని చూసి అందరూ కాపీ కొట్టారు. దర్శకుడు ఏమనుకుంటున్నాడంటే,

నా సినిమాలో నేను నా హీరోని గొప్పగా చూపించాలి అంటే విలన్‌ని కూడా గొప్పగా చూపించాలి. ఒళ్ళంతా ఆరిపోయినవాడిని తీసుకొచ్చి విలన్ అని చూపించాడనుకోండి. ఎలా ఉంటుంది? ఇన్‌షర్ట్ కూడా వాడికి నిలబడటం లేదు, పూర్తిగా ఆరిపోయాడు, ఎండిపోయాడు, ఎండి చేపలా ఉన్నాడు అనుకోండి. వాడిని తీసుకొచ్చి వీడే విలన్ అని అంటే మీరందరు ఏమంటారు? అబ్బే, వీడు విలన్ ఏంటి? వీడిని మా పిల్లవాడు కూడా కొట్టేస్తాడు. విలన్ అంటే హీరోకి తగ్గట్టుగా ఉండాలి. భారీగా కండలు పెంచాలి, వర్కవుట్‌లు చేయాలి. పోటాపోటీగా ఉండాలి. అప్పుడే మా హీరో ఏంటో అర్థమౌతుంది. ఇదే దేవుడు అనుకున్నాడు. మొట్టమొదట, అందుకే తన సినిమాలో ఆదాము హవ్వల దగ్గరకి ఎవరిని పంపించాడో తెలుసా? బలిష్ఠుడయిన ఒక మహాశక్తిని పంపించాడు. వాడు ఎంత కిరాతకుడో, వాడు ఎంత గొప్ప శత్రువో, వాడు ఎలాంటివాడో, వాడిని ఎలా పడగొట్టాలో ఈ భాగములో మీరు తెలుసుకోబోతున్నారు. మీ లైఫ్‌లో ఎప్పుడూ వీడిని గూర్చి వినలేదు.

అపవాదిని గూర్చి మాకెందుకండి? దెయ్యాన్ని గూర్చి మాకెందుకండీ? విలన్‌ను గూర్చి మాకు ఎందుకండీ? ఆ సెట్టింగులను గూర్చి చెప్పండి. హీరోను గూర్చి చెప్పండి. హీరోయిన్‌ను గూర్చి చెప్పండి, అంటారా! ఏది చెప్పినా, ఎన్ని చెప్పినా, విలన్‌ను గూర్చి మీకు అర్థం కాకపోతే వాడే మిమ్మల్ని మట్టుపెట్టేస్తాడు. చాలామంది స్క్రిప్టు అర్థం కానివారు ఇలాగే అనుకున్నారు. చాలామందికి ఈ స్క్రిప్టు అర్థం కాలేదు. ఎందుకంటే, అంత సుళభముగా దేవుని స్క్రిప్టు అర్థం కాదు. అందరికీ అంత సుళువుగా అర్థమైతే ఆయన దేవుడు ఎందుకు అవుతాడు? ఇది ఆయన వ్రాసింది ఎందుకవుతుంది? కొంతమందికే ఇది అర్థమవుతుంది. ఆయనయందు భయభక్తులు కలిగినవారికి దేవుడు జ్ఞానమును అనుగ్రహించును. భయభక్తులంటే మోకాళ్ళు వేసి వేసి, మోకాళ్ళ కాయలు, వాపులు చూపించటం కాదు. అది వేషధారణ అవుతుంది. భయభక్తులంటే, మీ జీవితకాలంలో దేవుని స్క్రిప్టుకు తగ్గట్టుగా నడుచుకోవడం. భయభక్తులంటే అదే. దెయ్యాన్ని గూర్చి దైవబోధకులు ఎవ్వరైనా చెప్పటం మీరిప్పటి వరకూ విన్నారా? లేదు. సో కాల్డ్ చాలామంది ఈ స్క్రిప్టు గురించి చెప్పారు. ఇప్పటివరకు మీరు దైవ సంబంధమైన చాలాపుస్తకాలు చదివి ఉండాలి. కానీ దెయ్యమే ప్రధానమైన అంశముగా ఎవ్వరూ

మాట్లాడలేదు. ఆ నరహంతకుని గూర్చి ఎవ్వరూ చెప్పలేదు. ఆ అదృశ్య శక్తిని గూర్చి ఎవ్వరూ ఇప్పటి వరకూ బోధించలేదు. ఇదే దేవుని సినిమాలో విలన్ క్యారెక్టర్. ఆ విలన్‌ను గూర్చి మీకు అర్థం కాకపోతే, వాడి తంత్రములు మీకు తెలియకపోతే, వాడు చాలా సుళువుగా తోకతోనే మిమ్మల్ని పడగొడతాడు. మిమ్మల్నే కాదు, నన్ను కూడా! ఎందుకంటే వాడిని అంత గొప్పగా దేవుడు ప్రవేశపెట్టాడు. దేవుని మహాలోకానికి రావలసిన హీరో ఎలా ఉండాలంటే, ఆ విలన్‌ని పడగొట్టి వచ్చినవాడే హీరో, వాడే పరలోకానికి రావాలి. ఆ విలన్ చేతిలో ఓడిపోయినవారందరూ పాతాళానికి బాధ పడుటకు వెళ్ళిపోవాలి. దీనినే ఆయన తన స్క్రిప్టులో వ్రాసుకున్నాడు.

ఈ స్క్రిప్టు చేతబట్టి వచ్చిన కొంతమంది మూర్ఖులు, సరిగా అర్థం కానివారు మీకు ఏమని చెబుతారు? 'ఏదెను వనంలో దేవుడు అసలు మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షాన్నే వేయకపోతే, వేయకుండా ఉంటే, అసలు ఆదాము తప్పుచేసేవాడా? అంటారు'. మరి వీడికున్నంత మహాజ్ఞానం దేవునికి లేక, వీడికున్నంత పాండిత్యం ఆ మహా తండ్రికి లేక, ఆయన స్క్రిప్టులో పొరపాటుగా వ్రాసుకున్నాడేమో అనుకుంటారా? అయ్యో, మనుష్యుడా! ఆదాము గొప్పతనం తెలియాలంటే మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షాన్ని అక్కడ తప్పని సరిగా వేయాలి. అప్పుడే ఆదాము హీరోనో, కాదో దేవునికి అర్థమౌతుంది. అప్పుడే ఆదామును ఆ తోటలో ఉంచాలో, గెంటివేయాలో దేవుడు చెబుతాడు. ఎలా ఉండాలో ఆదాముకు ముందుగానే దేవుడు చెప్పాడు. ఆ మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలాన్ని తినొద్దన్నాడు. మిగిలినవన్నీ తినమన్నాడు. అలా చెప్పి అప్పుడు విలన్‌ని ఆ తోటలో ప్రవేశపెట్టాడు. విలన్ ఎంత తెలివిగా వెళ్ళాడో తెలుసా! వాడు చాలా తెలివైనవాడు. లోకసంబంధమైన దర్శకులు తీసిన విలన్స్ లాంటి విలన్ కాదు వీడు. వీడు చాలా మెత్తగా వుంటాడు. ఈ మూడవ భాగములో మీకు వీడిని గూర్చి చెప్పేస్తాను. వాడు ఈ సమాజానికి కనిపించడు. దేవుడు తీసిన సినిమాలోనే వాడిని చూపిస్తాను. ఈ విలన్ గనుక నిజంగా ఈ రోజు పోలీస్ వ్యవస్థకి తెలిసుంటే మనుష్యులెవరినీ దోషులుగా పోలీసువారు పట్టుకోరు. ముందు వాడినే పట్టుకుంటారు తెలుసా! కానీ వాడు చిక్కడు దొరకడు. ఎకె47కి వాడు దొరకడు. గ్రెనేడ్‌లకి వాడు దొరకడు. మీ దగ్గరున్న కంప్యూటర్

పరిజ్ఞానానికి వాడు దొరకడు. వాడు ఒక అదృశ్య శక్తి, వాడు ఒక మహాశక్తి. మన తాతముత్తాతలకు తండ్రియైన ఆదామునే బోల్తా కొట్టించాడు వాడు. చాలా సుపీయర్ పవర్ వాడిది. అది వాడికి దేవుడే ఇచ్చాడు. ఏ మనిషైతే వాడిని అధిగమిస్తాడో, వాడిని ఓడిస్తాడో, వాడే విజయుడు. ఆ మనిషే పరలోకము వెళతాడు. ఈ సంగతి దేశ విదేశాలకు కూడా తెలియదు. ఉగ్రవాదం వెనుక ఉన్న ఆ శక్తి ఎవరిదో తెలుసా! వీడిదే. ఇప్పుడు మీరు చదువబోయేది వాడిని గూర్చే. ఈ రోజు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్నటువంటి ఎన్నో రుగ్మతలున్నాయి. వాటి వెనుక ఉన్న ఆ అదృశ్యశక్తి ఎవరో తెలుసా? ఇదిగో ఇప్పుడు మీరు తెలుసుకుంటున్న ఒక ఇన్‌విజిబుల్ పవర్. వాడిని మీరు సెంట్రల్ జైల్‌లో బంధించలేరు. వాడిని మీరు ఉరి తీయలేరు. వాడిని మీరు కాల్చలేరు. వాడిని పట్టాలంటే దేవుని స్క్రిప్టు కావాలి. దీనిలోనే ఉంది వాడి ఆయువుపట్టు. చిన్నప్పుడు విఠలాచారి కథ వ్రాసాడు. రాజు ప్రాణం ఎక్కడుందంటే 7 సముద్రాలు దాటిన తర్వాత ఒక పంజరం, ఆ పంజరంలో ఒక చిన్ని రామచిలుక, ఆ రామచిలుక గుండెల్లో ఉందట. ఆ రామచిలుకను చంపితే ఇక్కడ వీడు, అనగా దుష్టుడు చచ్చిపోతాడట. ఈ రోజు ప్రపంచ రాజ్యాలన్నిటినీ గడగడలాడిస్తున్నటువంటి ఆ మహాశక్తి ప్రాణం ఎక్కడుందో తెలుసా? వాడి ఉనికిపట్టు ఎక్కడుందో తెలుసా? చిలక రహస్యం, వాడి ప్రాణ రహస్యం, ప్రపంచ దేశాలకు తెలియనిది, శాస్త్రవేత్తలకు తెలియనిది, ఎంతటి గొప్ప జ్యోతిష్యుడైనా వాడికీ తెలియనిది, ఇదిగో జీవగ్రంథం అనే దేవుడు వ్రాసుకున్న ఈ స్క్రిప్టులో ఉంది. అవును, ఇప్పుడు మీరు చదవాలి.

మీరు నిజంగా వాడిని తెలుసుకుంటే చాలా అప్రమత్తం అవుతారు. మిమ్మల్ని మీరు రక్షించుకుంటారు. కనీసం మీ కుటుంబం వారినైనా రక్షిస్తారు. మీ బంధువులనైనా కనీసం మీరు కాపాడతారు. మీ గ్రామన్నైనా మీరు రక్షిస్తారు. గ్రామానికి రోడ్డేసినవాడు, స్కూలు బిల్డింగ్‌కి సున్నం వేసినవాడు, నీళ్ళ ట్యాంకు కట్టించినవాడు, మరుగుదొడ్డి కట్టించినవాడు కాదు శ్రీమంతుడు. మీ గ్రామంలో ఉన్న మనుష్యులకు జీవవాక్యాన్ని నేర్పించి, వారి మనసులను మార్చినవాడే అసలైన శ్రీమంతుడు. డైరెక్టర్‌కి తెలియక అలా తీసేసాడు తన సినిమాని. దేవుడు తీసిన సినిమా దగ్గరకు అందరూ రావాలి. ఎవ్వడైనా సరే, ఇందులో

ఎవ్వరూ అతీతులు కారు. దేవుని సినిమాలో విలనే ఒక అదృశ్యశక్తి. ఏదెను వనములోనికి ఆ అపవాదిని దేవుడు పంపించకుండా ఉంటే నా ఆది తల్లిదండ్రులు పాపం చేయకుండా ఉండేవారు కదా! అనే ఉచిత సలహా ఇస్తావా దేవునికి? దేవుడు కావాలనే పంపించాడు. ఆ వినాశకర శక్తిని మనిషి దగ్గరకు దేవుడు కావాలనే పంపించాడు. 'నువ్వు వెళ్ళు, నా కుమారుడు నీ ముందు ఎలా నిలబడతాడో చూస్తాను. నా కుమారుడి హీరోయిజాన్ని నేను చూస్తాను' అన్నాడు దేవుడు. కానీ ఆ రోజు దేవుని కుమారుడు విఫలమైపోయాడు. ఆదాము తన పాత్రను సరిగా పోషించలేదు. దేవుని స్క్రిప్టును ఆదాము అధిగమించాడు. దేవుని మాటను అతిక్రమించాడు. ఆ ఏదెను తోటలో నుంచి వెళ్ళిపోయాడు. అపవాదిని గూర్చి మాకెందుకండి? దెయ్యాన్ని గూర్చి మాకెందుకండీ? మాకేదో కొన్ని ఆశీర్వాదాలుంటే చెప్పండి అంటారా? అలా అయితే దేవుని స్క్రిప్టు మీకు అర్ధం కాలేదనే చెప్పాలి. నిజానికి ముందు ఆ విలన్‌ని గూర్చి మీకు అర్ధమైపోవాలి. వాడెక్కడున్నాడో తెలియాలి. ఎలా పసిగట్టాలో, వాడిని మీనుండి ఎలా పారద్రోలాలో, ఎదుటి వారిని వాడి బారి నుండి ఎలా రక్షించాలో మీకు అర్ధం కావాలి. దేవుడు వ్రాసుకున్న స్క్రిప్టు దగ్గరకు వెళదాం. ఆయనేమి చెప్పాడో చూడండి. దెయ్యాన్ని గూర్చి, విలన్‌ని గూర్చి మీరు అర్ధం చేసుకోవాలన్నాడో, లేదో ఈ కళ్ళరా మీరే చూడండి.

**2కొరింథీ 2 : 11–** "నేనేమైనను క్షమించియుంటే, సాతాను మనలను మోసపరచకుండునట్లు, మీ నిమిత్తము, క్రీస్తు సముఖమునందు క్షమించియున్నాను. సాతాను తంత్రములను మనము ఎరుగనివారము కాము". అపొస్తలుడైన పౌలు కొరింథీయులతో ఏమంటున్నాడో చూడండి. ఆయన స్క్రిప్టుకి తగ్గటుగా మనము ఆలోచించాలి, బ్రతకాలి అని మాట్లాడుతున్నాడు. "నేనేమైననూ మిమ్మల్ని క్షమించియుంటే" ఎందుకోసం క్షమించానో తెలుసా? "సాతాను మనలను మోసపరచకుండునట్లు" అన్నాడు. వాడు చాలా మోసగాడు. వాడిని గూర్చి మీకు అర్ధం కావాలి. దేవుని దగ్గరకు వచ్చినప్పుడు ముందు మీరు అడగవలసింది వాగ్దాన వాక్యాలో, ఆశీర్వాదాలో, బిస్కెట్లో, చాక్లెట్లో కాదు. మిమ్మల్ని సమాధి చేసి మిమ్మల్ని మట్టుబెట్టి, మిమ్మల్ని మరలా దేవుని వైపు చూడనివ్వకుండా చేసే ఆ అదృశ్య శక్తిని గూర్చి మీరు ఆలోచించాలి. వాడి

చేతిలో మీరు మోసపోకూడదు అని చెబుతున్న పౌలు ఏమంటున్నాడో చూడండి.

"సాతాను తంత్రములను మనము ఎరుగని వారము కాము" అన్నాడు. స్క్రిప్టులో ఏమి చెప్పాడు దేవుడు? విలన్‌ను గూర్చి నీకు అర్థం కావాలన్నాడా? లేదా? ఆ రోజు పౌలు క్రీ.శ. మొదటి శతాబ్దంలో, మొదటి వందేళ్ళలో పౌలు ఎలా ఉన్నాడో చూడండి. సాతాను తంత్రములు తెలిసినవాడుగా ఉన్నాడు. విలన్ చాలా తంత్రగాడు. ప్రత్యక్షంగా మీ దగ్గరకు రాడు. కుస్తీ పోటీలలో వచ్చినట్లుగా మీ ముందుకి రాడు. మీలోనికి చాలా నెమ్మదిగా వెళతాడు. మిమ్మల్ని ప్రేమించినట్టుగా నటిస్తాడు. తర్వాత మిమ్మును ఆవహిస్తాడు. మిమ్ములను నాశనానికి తీసుకుని వెళతాడు. మిమ్మును బాగుచేసేవాడు కాదు వాడు. మీ ప్రాణాన్ని రక్షించేవాడు కాదు వాడు. వాడు మీ శత్రువు. మీకే కాదు ప్రపంచ వ్యాప్తంగా దేవుని కుమారులుగా పుట్టిన ప్రతీ ఒక్కరికీ వాడు శత్రువే. ఈ రోజు వాడి శత్రుత్వాన్ని తెలియక, అమాయకులై ఇదిగో ప్రపంచంలో బ్రతుకుతున్నారు, వాడికి బలైపోతున్నారు. వాడి మత్తులో ఉన్న వీరు ఇక దేవుని వాక్యమును విననంటున్నారు. దేవుడు తీసిన సినిమాను వారు చూడనంటున్నారు. ఇదిగో మీరు తెలుసుకుంటున్నారు. మీకు ఆ శత్రువు గురించి ఇప్పుడు అర్థమౌతుంది. ఎందుకంటే మీరు హీరోలు కాబోతున్నారు. వారందరూ ఓడిపోబోతున్నారు. వారందరూ నాశనం కాబోతున్నారు. ఈ మహాశక్తి యొక్క పట్టు మీకు అర్థం కావాలి. ఆ రోజు పౌలు ఏమన్నాడో చూడండి. "సాతాను తంత్రములు మాకు తెలుసు. మేము వాడిని బాగా ఎదిరించగలం. వాడి కుయుక్తి మాకు తెలుసు. మేము ఎరుగనివారము కాము". అన్నాడు.

ప్రకటన గ్రంథంలో యోహాను తుయతైర సంఘానికి వ్రాస్తూ ఏమంటున్నాడో తెలుసా? **ప్రకటన 2 : 24–** "అయితే తుయతైరలో కడమవారైన మీతో, అనగా ఈ బోధను అంగీకరింపక సాతాను యొక్క గూఢమైన సంగతులను ఎరుగమని చెప్పుకొను వారందరితో నేను చెప్పుచున్నదేమనగా – మీపైని మరి ఏ భారమును పెట్టను". తుయతైరలో ఉన్న మిగిలినవారందరూ ఈ బోధను అంటే దేవుని స్క్రిప్టును అంగీకరించుటలేదు. అంతేగాక 'సాతాను యొక్క

గూఢమైన సంగతులు ఎరుగము' అని చెప్పుకుంటున్నారు వాళ్ళు. ఇలా చెప్పుకుంటే మీకు పరలోకం రాదు. దేవుని బోధ అంగీకరించకుండా, సాతాను యొక్క గూఢమైన సంగతులు ఎరుగము అని మీరు చెప్పుకుంటే, మీకు ఆ మహాలోకం ఎలా వస్తుంది చెప్పండి? వాడు మిమ్మల్ని ఓడించేస్తాడు. సృష్టి ప్రకారం మిమ్మల్ని బ్రతకనివ్వడు. దేవుని సృష్టను అతిక్రమింపచేస్తాడు. దేవుడు తీసిన ఈ సినిమాను అధిగమింపచేస్తాడు.

వాడిని ఇప్పుడు మీకు పరిచయం చేస్తాను. వాడిని ఈ రోజు మీకు అర్ధమయ్యేలా, ఆ దేవుని సినిమాలో చూపిస్తాను. మీరు వాడిని గూర్చి తెలుసుకోవాలి. ప్రపంచంలో ఎవరూ తెలుసుకోలేకపోయినా మీరు తెలుసుకోవాలి. వాడు చాలా చమత్కారి. వాడు చాలా తంత్రగొట్టి. వాడు చాలా భయంకరుడు. ప్రజలందరినీ మోసం చేసాడు. ఈ రోజు అపవాది ప్రజలందరినీ మోసం చేసాడు అని నేను చెప్పగలుగుతున్నాను అంటే, ప్రధానమైన కారణమేమిటో తెలుసా? దెయ్యం లేక అపవాది లేక సాతాను అనగానే మీరందరూ ఏమి అనుకుంటారో చెప్పండి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వారందరూ ఏమనుకుంటారో చెప్పండి? ఒక మనిషి చచ్చిపోతే, ఆ దేహాన్ని విడిచిపెట్టిన ఆత్మ ఎక్కడికీ వెళ్ళకపోతే, ఇక్కడిక్కడే మనమధ్య తిరుగుతూ ఉంటే, అదే దెయ్యం అనుకున్నారు మీరు. అవునా? ప్రపంచం కూడా ఏకగ్రీవంగా అదే అనుకుందా? అవును. అదే అనుకుంది. దెయ్యాన్ని గూర్చి ప్రపంచానికి తెలిసినదెంత? చింతచెట్టు మీద దెయ్యమే కదా వీరికి తెలిసింది. దెయ్యాన్ని గూర్చి ఈ ప్రపంచానికి తెలిసిందెంత? కోరిక తీరకుండా ఒక వ్యక్తి చనిపోతే, ఆ దేహాన్ని ఇక్కడే మనం పాతిపెడతాం లేక కట్టెల మీద కాలుస్తాం. అయితే ఆత్మను ఏమీ చేయలేరు గనుక, ఆత్మ ఇక్కడిక్కడే తిరుగుతూ ఉంటుంది, పాడుబడిన బంగ్లాలోనికి వెళ్ళిపోతుంది లేక స్మశానంలో ఉంటుంది లేక ఎండిన చెట్టు ఎక్కుతుంది లేక మనం ఎప్పటినుంచో తీయని గదిలో ఉండిపోతుంది అనుకున్నారు. చంద్రముఖిని మీకు చూపించాడుగా! ముగ్గు వేసి నిమ్మకాయలు పెడితే అందులోనికి వెళుతుంది, బొమ్మలోనికి వెళుతుంది. దెయ్యం అంటే నీవు నేర్చుకున్న జ్ఞానమంతా ఇదా? ఔరా... వండర్‌ఫుల్ రా సాతాను! ఈ ప్రజలతో బాగా ఆడుకుంటున్నావు. హ్యాట్స్‌ఆఫ్ రా దెయ్యం. ఈ ప్రజలను ఎంత

మోసగించావురా! దేవుని యొక్క స్క్రిప్టు తెలియకుండా చాలా గొప్పగా ఈ ప్రజలను మార్చేసావు. నిన్ను గూర్చి ఎవ్వరికీ తెలియలేదు. కానీ, మనిషి ఒక ఆత్మ అని మనిషికి తెలియవలసిన అసలైనటువంటి సంగతి సమాధి చేయబడింది. ఏది తెలియకూడదో, ఏదైతే అవాస్తవమో, ఏదైతే యథార్థం కాదో అదే ఈ రోజు మనిషి గొప్పగా నమ్మాడు. దీనిని బట్టి ఈ విలన్ ఎంత గొప్పవాడో చూడండి. వాడిని గూర్చిన అసలు రంగును వాడు ఎవ్వరికీ చెప్పలేదు. అందరికీ, చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకూ, సినిమా దర్శకుల నుంచి నటీనటుల వరకూ, ప్రభుత్వాల నుంచి జ్యోతిష్యుల వరకూ, శాస్త్రవేత్తల నుంచి దైవబోధకుల వరకూ, ఎవరెవరికైనా సరే, ప్రతీ ఒక్కరికీ ఏమి నేర్పించాడో తెలుసా? మనిషే కోరిక తీరకుండా చనిపోతే వాడు దెయ్యం అయిపోతాడు. ఇదే నమ్ము అని చెప్పాడు. వాడిని గూర్చిన అసలైన సంగతిని ఈ ప్రపంచానికి తెలియనివ్వలేదు. మనుష్యుల దగ్గరకు వాడు వెళ్ళి, వారినందరినీ తన వారినిగా మార్చేయాలి. వారందరినీ నేను నశింపచేయాలి. వారిని నేనొక భ్రమలో ఉంచాలి అనుకున్నాడు వాడు. ఆ భ్రమ ఏమిటంటే, మనిషి ఒకవేళ కోరికలు తీరకుండా మరణిస్తే, ఆ మనిషి ఆత్మే దెయ్యం అవుతుందని వారికి చెప్పాలి, చూపించాలి, నేర్పించాలి, సినీ దర్శకుల ద్వారా కూడా నేను ఈ యొక్క సిద్ధాంతాన్ని బాగా జనులపై రుద్దాలి అనుకున్నాడు. ఇదంతా నిజమా? మన శరీరాలలో ఉన్న మనం, దేహంలో ఆత్మగా ఉన్న మనం, ఈ దేహాన్ని విడిచిపెడితే, ఇక్కడే ఈ లోకంలో దెయ్యంగా ఉండిపోతామా? కోరికలు తీరకపోతే ఇక్కడే తిరుగుతామా? అవును అనుకుంటున్నారా, మీరందరూ దీనిని నమ్ముతున్నారా?? చాలా పొరపాటు!

ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతీ ఒక్కరూ దీనినే నమ్ముతున్నారు. కోరిక తీరకుండా మనిషి చచ్చిపోతే వాడి ఆత్మ దెయ్యంగా మారిపోతాడు అనే అబద్ధాన్ని నమ్ముతున్నారు. ఇటీవల ఒక దర్శకుడు సినిమా తీసాడు. నా దేవుడు తీసిన సినిమా హైలెట్ అవ్వాలంటే ఆ విలన్‌ని కూడా మీకు చూపించాలిగా మరి! అసలుసిసలైన దెయ్యమును గూర్చి వాడు చూపించలేదు. అది వాడి తరం కాదు. ఎందుకంటే వాడు దేవుని స్క్రిప్టు దగ్గరికి రాలేదు. వాడు వ్రాసుకున్న స్క్రిప్టులో దేవునికి చోటు లేదు. అందుకే వాడు ఒక అబద్ధాన్ని వ్రాసుకున్నాడు. ఏమిటది? 'రాక్షసుడు' అనే ఈ లోక సంబంధమైన సినిమాలో 'మాస్' అని ఒక

హీరో ఉన్నాడు. ఈ హీరోకు ఒక తండ్రి ఉన్నాడు, తల్లి ఉంది. మాస్ చిన్ననాడు ఆ తల్లిదండ్రులిద్దరూ హత్య చేయబడ్డారు. చనిపోయిన తల్లి వెళ్ళిపోయింది. తల్లికి కోరిక లేదేమో మరి! మాస్ తండ్రి గారు ఇక్కడే ఉండిపోయారు. ఎక్కడ? మన ఆంధ్రప్రదేశ్‌లోనే అట. ఇక్కడ ఉండిపోయిన ఈ తండ్రిగారు సూటు–బూటు, మంచి వ్యవహారంతో నా కొడుకు ఎప్పుడు పెరిగి ప్రయోజకుడు అవుతాడు? నేను నా కొడుకు ద్వారా పగ తీర్చుకోవాలి అనుకుంటున్నాడట. నన్ను, నా భార్యను ఎవరైతే చంపారో వారి మీద పగ తీర్చుకోవాలని ఒక దెయ్యమైపోయాడట. వాడితోపాటు ఇంకా కొన్ని పిల్లదెయ్యాలు కూడా కోరిక తీరక ఇక్కడే తిరుగుతూ ఉన్నాయట. దీనిని లోకసంబంధమైన, లోకదర్శకుడు ఎలా తెరకెక్కించాడో గమనించండి. ఆ తరువాత దేవుడు తెరకెక్కించిన అసలు స్క్రిప్టు మీకు చూపిస్తాను. ఇప్పటివరకూ ఈ దర్శకుడు చూపిస్తున్నది డూప్లికేటు స్క్రిప్టు. ఇందులో ఉన్నది వాస్తవం కాదు. ఇది 100% అబద్ధం. ఇది కేవలం డూప్లికేట్. వీరు దెయ్యాన్ని మీకు గ్రాఫిక్స్ సహాయంతో చూపిస్తారు. ఇదంతా కేవలం వీడియో మాయాజాలం. ఏదో దర్శకుడు నాలుగు డబ్బులు సంపాదించుకోవడానికి క్రొత్త తరహాలో తీసాడు. కానీ, అబద్ధాన్ని తీసాడు. ఈ అబద్ధం వల్ల చాలా మంది దానిని నమ్ముతున్నారు. అసలు సిసలైన ఆ దెయ్యాన్ని, ఆ దెయ్యపు తంత్రములను వారు తెలుసుకోవటం లేదు. అందుకే ఈ గాలి దెయ్యాన్ని, లేని దెయ్యాన్ని గూర్చి వారు ఆలోచిస్తున్నారు. అసలు ఇది దెయ్యమే కాదు. ఇలాంటివేమీ ఇక్కడ లేనే లేవు.

ఒకవేళ ఇదే నిజంగా దెయ్యం అనుకుంటే మీ అందరికీ నేను ఇప్పుడొక బంపర్ ఆఫర్ ఇస్తున్నాను. ఇలాంటి దెయ్యాలన్నింటికీ ఇప్పుడు నేను బంపర్ ఆఫర్ ఇచ్చేస్తున్నాను. ఒకవేళ ఆంధ్రప్రదేశ్‌లో గాని, ఇండియాలోగాని, ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా గానీ, చుట్టుప్రక్కల ఎక్కడైనా గానీ, ఈ ప్రజలు అనుకుంటున్నట్టుగా, లోక సంబంధమైన దర్శకులు చూపిస్తున్న దెయ్యాలేవైనా ఉంటే, పిశాచిలు ఏవైనా ఉంటే, కామిని–డామినీలు ఏమైనా ఉంటే, డూమ్–డామ్‌లు ఏమైనా ఉంటే ఈ రోజు రాత్రికి నాదగ్గరికి వచ్చేయ్యమనండి. నిజంగా దెయ్యాలుంటే రేపు నేను మీ మధ్యలో ఉండను కదా! దెయ్యాలు లేకపోతే నేను మీ మధ్యలోనే ఉంటాను. దెయ్యాలు లేవని నాకు బాగా తెలుసు.

జనవిజ్ఞానవేదిక వారు కూడా ఇంత ఛాలెంజింగ్‌గా దెయ్యాలను గూర్చి చెబుతారు. కానీ, వారు కూడా దేవుని స్క్రిప్ట్ దగ్గరకు రాకపోవడం, దేవుని నమ్మకపోవడం చేత, అసలైన దెయ్యాన్ని గూర్చి ఈ సమాజానికి చెప్పలేరు. అదే వారికీ నాకూ మధ్య ఉన్న గొప్ప తేడా! ఎందుకంటే నేను దేవుని సినిమాను బాగా అర్థంచేసుకున్న వాడిని. దేవుడు ప్రవేశపెట్టిన అసలైన విలన్ మాత్రం నిజంగా ఉన్నాడు. అపవాది ఉన్నాడు, మీ, నా శత్రువు మన మధ్యే ఉన్నాడు. వాడిని అందరూ తెలుసుకోవాలి. వాడి తంత్రములు మీకు అర్థం కావాలి.

ఈ రోజు దేవుడు తీసిన సినిమాలో ఈ అసలైన విలన్ ఎలాంటివాడో మీకు చూపిస్తాను. వాడు చాలా భయంకరమైనవాడు. ఎంత మోసం చేసాడో చూడండి. వాడి అసలు రూపం ఎవరికీ తెలియనివ్వకుండా, చచ్చిపోయిన మీరే దెయ్యాలు, అని మనల్ని నమ్మించాడు. ఇప్పుడు దేవుడు తీసిన స్క్రిప్ట దగ్గరికి మనము వెళ్ళాలి. దెయ్యాన్ని గూర్చి ఏమిటా యధార్థమైన సంగతి? దీని వెనకున్న రహస్యమేమిటి? దేవుని స్క్రిప్టులోనేమో ఇవి దెయ్యాలు కావు అని వ్రాయబడింది. ఇదంతా విన్న తరువాత మీకు కూడా నమ్మాలనిపిస్తుంది కదూ. అసలు సిసలైన ఆ అపవాదిని మీరు కూడా తెలుసుకోవాలని అనిపిస్తుంది కదూ. అదే దేవుని వాక్యమంటే! అయితే వీటి వెనక ఉన్న పరమార్థం ఏమిటి? కోరిక తీరకపోతే మనిషి ఆత్మగా ఇక్కడ తిరగడా? తిరగడు. దెయ్యమై ఇక్కడ సంచరించడా? సంచరించడు. ఒకవేళ తిరుగుతాడు అనుకుంటే చచ్చిన ప్రతీ ఒక్కడు ఇక్కడే తిరగాలి. కోరిక చచ్చిపోయిన మనుష్యులే ఆత్మలవుతారు అని ఒకవేళ మీరనుకుంటే, సినిమాలో చూపించినట్టుగా మీరు ఒకవేళ నమ్మితే, ఆదాము మొదలుకొని ఇప్పటివరకూ చచ్చిన ప్రతీ ఒక్కరూ దెయ్యంగా, ఒక శక్తిగా, మన మధ్యనే ఆత్మలుగా తిరగాలి. తిరుగుతున్నారా? ఏంటండి, కోరికలు తీరకుండా చచ్చిపోయినవారు కొంతమందే ఉంటారుగా. అందరూ కాదుగా. అని ఒకవేళ మీరు పొరపాటు పడొచ్చు. వాడు అపవాది. మిమ్మల్ని ఇలాగే చాలా సులువుగా మోసం చేస్తాడు. వాడికి నేనే సరైన హీరోని. వాడి పప్పులు నా దగ్గర ఉడకవు. కోరిక తీరకుండా ఎవ్వరూ చచ్చిపోవటం లేదా? ఎవరన్నారు?? అందరూ కోరికతోనే చచ్చిపోతున్నారు. చచ్చిపోయే ముందు అందరికీ ఉండే ఒక సామాన్యమైన కోరిక ఏమిటో చెప్పమంటారా? "నేను ఇంకా బ్రతకాలి,

నేను ఇంకా బ్రతకాలి" అనే కోరిక. అందరికీ ఈ కోరిక ఉంటుందా ఉండదా? అందరికీ ఉంటుంది. 110 ఏళ్ళు వచ్చేసాయండి ఒక తాతయ్యకి. మరి ఆ తాతయ్యకి కూడా ఈ కోరిక ఉంటుందా? ఉంటుంది. 'నన్నింకా బ్రతికించు దేవుడా' అంటాడు. చచ్చిపోయే ప్రతీ ఒక్కడికి, చిట్టచివరి కోరికేమిటో తెలుసా? నేనింకా బ్రతికితే బావున్ను, మరొక రోజు నేనింకా బ్రతికితే బావున్ను, మరొక నెల ఇంకా బ్రతికితే బావున్ను, మరొక సంవత్సరం ఇంకా బ్రతికితే బావున్ను అనుకుంటాడు. డాక్టరు చేతులు పట్టుకుంటారు. నన్నెలాగైనా బ్రతికించండి. నా ధనమంతా మీకిస్తాను. నన్ను బ్రతికించండి అంటారు. మరి వారందరూ చచ్చిపోతున్నప్పుడు ఈ కోరికతోనే చచ్చిపోతే, ఎంతమంది ఆత్మలుగా తిరగాలి చెప్పండి? అంటే ఈ దర్శకుడు చెప్పింది, ఆ దెయ్యాన్ని గూర్చి సృష్టించిన ఆ అవాస్తవం - ఇవన్నీ కేవలం పచ్చి అబద్ధాలు. దెయ్యాలను గూర్చి మీరెలా మాట్లాడగలుగుతున్నారండీ? మీకు ఈ జ్ఞానం ఎక్కడ నుండి వచ్చిందండి అని మీరు నన్ను అడిగితే, దేవుడు వ్రాయించిన స్క్రిప్టును నేను ఒళ్ళు దగ్గర పెట్టుకుని చదివాను. మిగిలిన వారందరూ ఎలా చదివారో ఇప్పుడు మీకు అర్ధం కావాలి. నేనెప్పుడూ దేవున్ని అడుక్కునేవాడిని కాదు. నాకు అదిచ్చెయ్, నాకు ఇదిచ్చెయ్ అని అడిగేవాడిని కాదు. ఇంత గొప్ప జ్ఞానమును ఈ సమాజానికి చెబుతున్నాను, నాకేంటి?" అని దేవున్ని అడిగేవాడిని కాదు నేను. తండ్రీ 'నీకోసం నేను ఏం చేయాలో చెప్పు, నేను రెడీ అని అడిగేవాడను. నీ మనసు నాకు చెప్పు. నీకోసం ఏ కార్యక్రమం చేయమంటావో, నీకోసం ఎలా మాట్లాడమంటావో చెప్పు. దానికి నేను సర్వసిద్ధం అని చెప్పేవాడను.

ఇప్పుడు ఆయన స్క్రిప్టును చూద్దాం . ఆయన ఈ ప్రపంచానికి తన స్క్రిప్టు ద్వారా ఏం చెప్పాడో చూడండి. ఈ ప్రపంచం ఎంత గ్రుడ్డిగా ఆయన మాటను అతిక్రమించిందో చూడండి. ఆయన స్క్రిప్టులో దెయ్యాలు అనుకునేవారిని గూర్చి దేవుడు వ్రాయించాడు. **యెషయా 26 : 14**– "చచ్చినవారు మరల బ్రతకరు. ప్రేతలు మరల లేవరు. అందుచేతను నీవు వారిని దండించి నశింపచేసితివి. వారికను స్మరణకు రాకుండ నీవు వారిని తుడిచి వేసితివి". ఎవడు చెప్పాడు నీకు చచ్చిపోయినవాడు ఇక్కడే మా ఇంటి చుట్టూ తిరుగుతున్నాడని? ఈ అబద్ధాన్ని ఎవడు చెప్పాడు నీకు? అది నీ

మానసికరోగం. నీ మనసు పాడైపోయింది. అస్తమానం వాడి గురించే ఆలోచిస్తున్నావు నువ్వు. కాకి రూపంలో వచ్చాడని కొంతసేపు అంటున్నావు. నీవు వేసిన ఎంగిలి ముద్దకు కాకి ఆశపడి గోడ మీదకు వచ్చింది. దానిని చూచి నువ్వు ఏమనుకుంటున్నావ్? కావు కావు మనుకుంటూ వచ్చిన కాకిని చూసి, చచ్చిపోయిన మా తాతగారు వచ్చేసారంటున్నావ్. గతేడాది పోయిన మా నాయనమ్మ వచ్చేసిందంటున్నావ్. మరి వందల సంవత్సరాలుగా మీ కుటుంబంలో పోయినవాళ్ళంతా కాకులుగా రావడంలేదా? కేవలం గత సంవత్సరం పోయిన వారే వస్తున్నారా? ఏంటయ్యా! పిచ్చిపట్టింది నీకు! "చచ్చిపోయినవారు మరలా బ్రతకరు." ఇది దేవుడు గీసిన గీత, ఇది దేవుని శాసనం. దేవుని కట్టడ ఇది. ఆయన స్క్రిప్టు ఇది. నువ్వు ఏం చేయాలన్నా, ఏం మాట్లాడాలన్నా బ్రతికున్నప్పుడే చేయాలి! చచ్చిపోతే ఆత్మ నీ వశంలో ఉండదు, నువ్వు ఎక్కడ ఉండాలో, నీవు ఏమి చేయాలో, నీవు ఎక్కడ ఉండాలో, అది నీ వశమున ఉండదు. అది సర్వేశ్వరుడైన దేవుని వశములోనికి వెళ్ళిపోతుంది. ఆయన నీ ఆత్మను ఎక్కడకు పంపిస్తే, ఆయన నీకు ఎక్కడ స్థలం నిర్ణయిస్తే, అక్కడికి వెళ్ళిపోవాలి తప్ప, నీ ఆత్మ నీ వశంలో లేదయ్యా. ఆకాశమహాకాశాలను కలిగించిన దేవుని స్క్రిప్టు ఇది. ఇది దేవుని సినిమా. ఆయన (దర్శకుడు) చెప్పినట్టుగా నీవుండాలి. "చచ్చినవారు మరలా బ్రతకరు. ప్రేతలు మరలా లేవరు"? ఇప్పుడు మరొక మాటను చూడండి. ఆయన స్క్రిప్టులో కూర్పు కదా, ఎడిటింగ్‌లో మరొక భాగంలో ఆయన వ్రాయించిన మంచిమాటను పరిశీలించండి.

**యోబు 7 : 9–** "మేఘము విడిపోయి అదృశ్యమగునట్లు పాతాళమునకు దిగిపోయిన వాడు మరి ఎప్పుడును రాడు". దేవుడు మనుష్యులను ఒకసారి తలపైకెత్తి చూడమన్నాడు. ఆయన వేసిన సెట్టింగులో ఒకదానిని ఉదాహరణగా చూపిస్తున్నాడు. ఏమిటా  ఉదాహరణ? ఒక్కసారి దట్టమైన మేఘం విడిపోయిందంటే అది మరల కలవదు. అది మరలా అతుకదు. అది వర్షించటానికి వెళ్ళిపోతుంది. గాలిచేత తీసుకుని పోబడుతుంది. భారీ మేఘం విడిపోయిందంటే అది మరలా కలవదు. "మేఘము విడిపోయి అదృశ్యమగునట్లు పాతాళమునకు దిగిపోయినవాడు మరి ఎప్పుడును రాడు". మరి చింత చెట్టు

మీది దెయ్యమెలా వచ్చాడు? లోక సంబంధమైన సినిమాలో ఎలా వచ్చాడు? వీడియోలో గనుక వచ్చాడు. వీడియోలో కావాలనుకుంటే దేనినైనా తీసుకొస్తారు. కానీ నిజ జీవితంలో ఎవ్వడూ రాడు. "మేఘము విడిపోయి అదృశ్యమగునట్లు పాతాళమునకు దిగిపోయినవాడు మరి ఎప్పుడును రాడు. అతడు ఇక ఎన్నడును తన యింటికి రాడు". మీ నాయనమ్మ చనిపోతే మీ ఇంటికి ఇక ఆమె రాదు. "అతని స్థలము అతని మరలా ఎరుగదు". మీ తాతయ్య చనిపోతే మీ ఇంటికి ఇకరాడు. ఈ లోకాన్ని విడిచిపెట్టగానే మనుష్యుల ఆత్మలు సరాసరి క్షణకాలంలో దేవుడు నిర్ణయించిన స్థలానికి వెళ్ళిపోవాలి. దేవుడు ఎంత చక్కగా, ఎంత ఖచ్చితంగా తన స్క్రిప్టులో వ్రాయించాడో చూడండి. మరి విఠలాచారి మొదలుకొని ఈనాటి వరకు వీరందరూ ఈ సమాజానికి ఏమి నేర్పించారు? కోరికలు తీరక చచ్చినవారు చింతచెట్టు ఎక్కుతారా? స్మశానంలో ఉంటారా? సీసాలో బంధించేస్తావా నువ్వు? నీవు బంధించినది పొగనే గాని ఆత్మను కాదు. సాంబ్రాణి పొగ అది. అదే ఆత్మ అని ఎవరిని మోసగిస్తావు? దేవుని స్క్రిప్టు చదివిన నన్ను కాదు. ఈ రోజు శాస్త్రాలను చదివినవాడుకూడా ఇలాంటి వారిచేత మోసగింపబడుతున్నాడు. శాస్త్రాన్ని చదివినవాడు కూడా ఈ రోజు చింతచెట్టు దెయ్యానికి గడగడలాడిపోతున్నాడు. సీసాలో చూపించిన ఆ పొగకి వీడు గడగడలాడిపోయి అది నిజమేనేమో, దెయ్యాలున్నాయేమో అనుకుంటున్నాడు. చిన్నప్పుడు బామ్మ కూడా తనకు తెలియక మనము అల్లరి చేసినప్పుడో, బువ్వ తిననప్పుడో దీనినే చెప్పి భయపెట్టింది. దీనిని మీరు చాలా సినిమాలలో చూసుంటారు. ఏంటయ్యా ఇది? దేవుని స్క్రిప్టు వీరెవ్వరి దగ్గరకు రాలేదు. అది నీ ఆలోచనలలోనికి రాలేదు. అసలైన దెయ్యం చాలా మోసం చేసేసాడు. ఆ దుష్టుడు తెలివిగా తప్పించుకున్నాడు. వాడెక్కడ నీకు తెలిసిపోతాడో అని ఈ దెయ్యాల కథలను నీకు అల్లాడు. దానికి ప్రథమ కారణం మనిషి అజ్ఞానమే, పరిశోధన లేకుండా ఏది పడితే దానిని గ్రుడ్డిగా నమ్మడమే. అసలైన అపవాది ఈ ప్రపంచమంతటినీ మోసగించాడు.

అప్పుడప్పుడు ఈ ప్రపంచం, ఈ సమాజం చెప్పుకుంటున్న మాటలు వింటుంటే నాకు ఆశ్చర్యం కలుగుతుంది. ఒకింత నవ్వొస్తుంది. మేము తారాస్థాయికి వెళ్ళిపోయామని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానములో మేము చాలా

అభివృద్ధి చెందేసామని, రాతియుగం నుండి రాకెట్ యుగానికి వెళ్ళిపోయామని మేకపోతు గాంభీర్యాన్ని మనిషి ప్రదర్శిస్తాడు. మనిషిగా మేము డెవలప్ అయిపోయాం అంటాడు. ఏమిటి మనిషి డెవలప్‌మెంట్? దేవుని స్క్రిప్టు చదవకపోతే, అది మనిషికి అర్ధంకాకపోతే వాడు డెవలప్ చెందినవాడు కాదు. ఇప్పటికీ  మనిషి సీసాలో దెయ్యాన్ని నమ్ముతున్నాడు. మనిషి కోరిక తీరక చచ్చిపోతే, వాడే ఆత్మై తిరుగుతాడని, ఒక అబద్ధాన్ని ఇప్పటికీ నమ్ముతున్నాడు. ఇప్పుడు చెప్పండి, మనిషి అభివృద్ధి చెందినవాడా? ఈ సమాజం అభివృద్ధి చెందినదా? ఆలోచించండి. ఇప్పటికే ఎంతమంది చనిపోలేదు చెప్పండి. సద్దామ్‌హుస్సేన్‌ను ఉరి తీసేసారు. ఉరి తీసేటప్పుడు సద్దామ్‌హుస్సేన్‌కి చాలా మంది మీద పగ ఉంది, కోపం ఉంది, ప్రతీకారం తీర్చుకోవాలని ఉంది. తనను ఉరి తీస్తున్నటువంటి వారందరినీ తాను చంపాలనుకున్నాడు. కానీ, చనిపోయి ఈ కోరికతో తిరిగి దెయ్యమై తన శత్రువులందరినీ చంపగలిగాడా? లేదు. అలాగైతే ఈపాటికి జార్జ్‌బుష్‌ని చంపేయాలి మరి. ఈపాటికి ఒబామాని చంపేయాలి మరి. ఎంతమాత్రం చంపలేదు. ఎందుకంటే పాతాళానికి తన ఆత్మ వెళ్ళిపోయింది. ప్రభాకరణ్ పిళ్ళైని  (తమిళ పులి) చంపేటప్పుడు కూడా, అతడు చాలా ధైర్యశాలి. నన్ను చంపినవారినందరినీ నేను చంపాలి, పగ తీర్చుకోవాలి అనుకున్నాడు. కానీ ఎవరి మీద తన పగను తీర్చుకున్నాడు? గాంధీ గారిని చంపిన గాడ్సే మీద గాంధీగారు పగ తీర్చుకున్నారా? రాజీవ్ గాంధీని చంపిన 'ధాను' మీద రాజీవ్ గాంధీ పగ తీర్చుకున్నారా? నిర్భయను అతి కిరాతకంగా చంపిన ఐదుగురి మీద నిర్భయ పగ తీర్చుకుందా? లేక ఈ దేశంలో ఉన్న సుప్రీంకోర్టు వారికి శిక్ష విధించిందా? అంత గొప్పగొప్పవారే తిరిగి రావటం లేదు. పేరుగాంచిన వారే తిరిగి రావటం లేదు. ఇక మన తాతయ్య, బామ్మ వస్తారంటారా? ఇక్కడే కాకిలా తిరుగుతారంటారా? కాస్త బుర్రపెట్టండి. ఎందుకంటే దేవుని స్క్రిప్టు ఇక్కడ మీరు చదవాలి. ఒక్కసారి దేహాన్ని విడిచిపెట్టి ఆత్మ వెళ్ళిపోయిందంటే, అతనికి దేవుని సినిమా అయిపోయింది. ఇక మరలా అతనికి సినిమా లేదు. అతనికి దేవుడు నిర్ణయించిన స్థలానికి, ఆ లోకానికి తాను వెళ్ళిపోవాలి. ఇది దేవుడు చెప్పిన కట్టడ. దేవుడు విధించిన విధి, నిర్ణయం.

ఎంత గొప్ప మోసం చేసాడు వాడు. ఇంతకీ వాడు తెలియాలి మనకి. వాడిని గూర్చి మనం అర్థం చేసుకోవాలి. ఈ రోజు వాడిని బయటకు లాగాలి. చాలా జిత్తులమారి వాడు. "దేవుడు వ్రాసుకున్న స్క్రిప్టులో ఉన్నట్టుగా చచ్చిపోయిన వారందరూ వెళ్ళిపోతారు. కానీ మరొకడు వచ్చి, కోరిక తీరాక వెళ్ళిపోతారంటాడు. దేవుని స్క్రిప్టు చదవడం అర్థం కాదు గానీ, ఇలాంటి వితండవాదం ప్రశ్నలు వేయడం చాలా మందికి అలవాటు. ప్రతి మనిషీ వెళ్ళిపోతాడు, దేవుడు వ్రాయించినట్టుగానే వెళ్ళిపోతాడు. కానీ, కోరిక తీర్చుకుని వెళ్ళిపోతాడండీ. అంటాడొకడు. కోరిక తీర్చుకుని వెళ్ళడానికి అసలు నీవు గానీ, నేను గానీ, భూమి మీదకి వచ్చిన ప్రతీ మనిషి మరణించిన తరువాత ఎంత సమయంలో వెళ్ళిపోవాలో తెలుసా? పాతాళ లోకానికి ఎంత సమయంలో వెళ్ళాలో తెలుసా? అది తెలిస్తే ఈ మాట ఎవ్వడూ చెప్పడు. ఇలాంటి ప్రశ్నలు వేసేవారు ఉంటారు గనుక దానిని తన స్క్రిప్టులో దేవుడు వ్రాయించాడు. ఇలాంటి వారు ఉంటారా? ఉంటారు. వాడు ఏమంటున్నాడు? అందరూ వెళ్ళాలి. మనుష్యులు చనిపోయిన తర్వాత పాతాళలోకానికి వెళతారు. కానీ, మా సినిమాలో చూపించినట్టుగా కోరిక తీరిన తర్వాత వెళతారు అంటున్నాడు. కోరిక తీరిన తర్వాత వెళతారా? అయితే దేవుని స్క్రిప్టులో ఆయన ఏమి వ్రాయించాడో చూసి, ఆయన మహాజ్ఞానమును అర్థం చేసుకోవాలి.

**లూకా 16 : 22–** "ఆ దరిద్రుడు చనిపోయి దేవదూతల చేత అబ్రహాము రొమ్మున (ఆనుకొనుటకు) కొనిపోబడెను. ధనవంతుడు కూడ చనిపోయి పాతిపెట్టబడెను. 'అప్పుడతడు' పాతాళములో బాధపడుచు" అని వ్రాయబడినది. ఈ ధనవంతుడు ఎంత సమయంలో వెళ్ళిపోయాడో చూడండి. వెంటనే తరువాత వచనంలో ఏమంటున్నాడు. "అప్పుడతడు పాతాళంలో బాధపడుచూ" అని వ్రాయించాడు. చావు, పాతాళలోక ప్రయాణాల మధ్యలో సమయం లేదు. క్షణకాలంలో వెళ్ళిపోయాడు. దరిద్రుడైనా అంతే, ధనవంతుడైనా అంతే. "ధనవంతుడు కూడ చనిపోయి పాతిపెట్టబడెను. అప్పుడతడు పాతాళములో బాధపడుచు" ఇంకా ధనవంతుడు చనిపోయాడన్న సంగతి ఆ ఇంటి వారికి కూడా తెలిసుండదు. కానీ, ధనవంతునికి అప్పుడే వేదన ప్రారంభమైపోయింది. ఈ భూమి మీద దేవుని స్క్రిప్టును సరిగా అతడు నిర్వర్తించలేదు. స్క్రిప్టు ప్రకారం

అతడు సరిగా జీవించలేదు. అతనికి దేవుని వాక్యం తెలియలేదు. అందుకే వెనువెంటనే క్షణకాలంలో అతడు పాతాళానికి వెళ్ళిపోయాడు. ఇప్పుడు చెప్పండి. అంటే వీరందరూ దెయ్యాలు కాదన్నమాట. వీరందరూ మనుష్యుల ఆత్మలు. వీరంతా దేవుని పిల్లలు. దేవుని స్క్రిప్టు జరిగిస్తే పరలోకానికి ఆహ్వానింపబడతారు, లేకపోతే నాశనానికి సిద్ధమౌతారు. మరింతకీ ఆ విలన్ ఎవడు? నిజంగా మీరు ఆలోచించండి. ఆదాము, హవ్వలు భూమి మీద ఉన్నప్పుడు, ఏదెను వనములోకి వాడొచ్చాడుగా. మీకు తెలుసు. మరణించిన మనుష్యులే ఒకవేళ దెయ్యాలుగా మారుతున్నారనుకుంటే, అప్పటికి భూమిమీద ఏ మనిషి చచ్చిపోయాడో చెప్పండి? చచ్చిపోయినవారే దెయ్యాలవుతారని మీరనుకుంటే ఆదాము, హవ్వలు ఏదెను వనములో ఉన్న ఆ సమయానికి ఎవ్వరూ చచ్చిపోలేదే? వీరిద్దరూ మొదటి మానవులే కదా. దెయ్యాల గుట్టును దేవుడు సింపుల్‌గా తేల్చాడు చూడండి. అందుకే స్క్రిప్టు బాగా అర్థం కావాలి. బైబిల్‌లో ఎక్కడ మీరు చూసినా దేవుడు ఒకే ఆలోచనను చెబుతున్నాడు చూడండి. ఆయన మహాజ్ఞానం ఎంత గొప్పదండీ. ఆయన తీసిన సినిమా ఎంత వండర్‌ఫుల్! నిజంగా దెయ్యమైనవాడు ఒక అదృశ్య శక్తి. వాడు దేవుడు పంపించిన ఒక విలన్, ఒక శత్రువు, ఒక అపవాది. మరి వాడు ఎక్కడుంటాడు? ఎలా ఉంటాడు? ఆ రోజు ఘటసర్పము రూపంలో ఆదాము, హవ్వల దగ్గరకు వచ్చాడు. వారిద్దరూ మోసగింపబడ్డారు. మరి ఈ రోజు మా దగ్గరికి ఎలా వస్తాడు? వీడిని ఎలా మేము పసిగట్టాలి? వీడిని మేము ఎలా ఓడించాలి? అనుకుంటున్నారా? ఆయన వ్రాయించిన స్క్రిప్టులో వీడి పట్టులన్నీ దేవుడు మనకు చెప్పాడు.

**2కొరింథీ 11 : 14–** “ఇది ఆశ్చర్యము కాదు, సాతాను తానే వెలుగుదూత వేషము ధరించుకొనుచున్నాడు”. మీరు జాగ్రత్తగా ఆలోచిస్తే, ఇది ఒక సామాన్యమైన సంగతి. మీకు తెలియదు గనుక మీరు ఆశ్చర్యపడవచ్చు. ఇది ఆశ్చర్యము కాదు, ఎవరైతే దెయ్యమో, ఎవరైతే శత్రువో, ఎవడినైతే మనము ఓడించి ఆ మహాలోకానికి వెళ్ళాలో, ఆ సాతాను ఎలా వస్తున్నాడో చూడండి. బూచీ బట్టలు వేసుకుని రావట్లేదు. మీరు ఒంటరిగా ఉన్నప్పుడు మీ దగ్గరికి వచ్చి, డి.టి.ఎస్. సౌండ్‌తో మిమ్మల్ని భయపెట్టటం లేదు. వాడు ఎలా ఉ

న్నాడంటే... మచ్చుకు ఒక ఉదాహరణ చెప్పాడు దేవుడు. “ఇది ఆశ్చర్యము కాదు, సాతాను తానే వెలుగుదూత వేషము ధరించుకొనుచున్నాడు.” వాడు చీకటిలో ఉండడు. వాడి నివాసము స్మశానాలలో కాదు. వాడు నిర్జన ప్రదేశానికి వెళ్ళడు. మనుష్యులు లేకపోతే వాడు అస్సలు ఉండలేడు. ఎక్కడ మనిషి వుంటాడో, అక్కడే వాడికి పని. అక్కడే వాడికి యుద్ధం. అక్కడే వాడుంటాడు. అక్కడే వాని ఉనికి ఉంటుంది. ఇదే మొట్టమొదటి సంగతి, మొట్టమొదటి పాయింట్. ఈ అపవాదిని నేనెలా కనుక్కోవాలి? ఈ అపవాదిని నేనెలా పరీక్షించాలి? నాకు వాడి ఉనికిపట్టు ఎలా తెలియాలి? దేవుడు వ్రాసిన స్క్రిప్టులో వాని గూర్చి ఏమి వ్రాయబడింది?

వాడెక్కడ ఉంటాడో తెలుసా? మనిషి ఎక్కడుంటాడో, అక్కడే వాడుంటాడు. అంటే ఇప్పుడు మీరు హిమాలయాలకు వెళితే వాడు దొరకడు. మీరు స్మశానానికి వెళితే వాడు మీకు దొరకడు. మీరు అడవులలోనికి వెళ్ళిపోతే వాడు మీకు దొరకడు. ఏజెన్సీకి వెళ్ళిపోతే వాడు మీకు దొరకడు. మరెక్కడ ఉంటాడు? ప్రజలు కిక్కిరిసి ఎక్కడుంటారో, అక్కడే వాడు ఉంటాడు. అవును అక్కడే వాడు ఉంటాడు. ఎందుకో తెలుసా? ఎందుకు ఇంత ఖచ్చితంగా చెప్పగలుగుతున్నానో తెలుసా? దేవుడు వ్రాయించిన స్క్రిప్టులో ఈ సంగతి చాలా స్పష్టముగా ఉంది. ఈ రోజు మన మధ్య జరుగుతున్నది కూడా అదే. నేరాలు – ఘోరాలు ఎక్కడ జరుగుతున్నాయో చెప్పండి? హిమాలయాల్లో జరుగుతున్నాయా? లేదా అడవుల్లో జరగుతున్నాయా? కాకినాడలో జరుగుతున్నాయి, విజయవాడలో జరుగుతున్నాయి, హైదరాబాదులో జరుగుతున్నాయి, ముంబాయిలో జరుగుతున్నాయి, ఢిల్లీలో జరుతున్నాయి. బాంబు ప్రేలుళ్లు ఎక్కడ జరుగుతున్నాయి చెప్పండి. ఉగ్రవాదులు వెళ్ళి అడవిలో బాంబు పెట్టుకుంటున్నారా? లేదు అక్కడ పెట్టరు. ముంబాయి సి.ఎస్.టి. స్టేషన్‌లోనే పెడతారు. అక్కడే పెట్టాలి. ఎందుకంటే అలాంటిచోటే జనులు బాగా కిక్కిరిసి ఉంటారు. మనుష్యులు వాడికి బాగా దొరికేస్తారు. తాజ్ హోటల్‌లో పెట్టాలి, నారిమన్ పాయింట్ దగ్గర పెట్టాలి, ఇండియా గేట్ దగ్గర పెట్టాలి, ఢిల్లీలో పెట్టాలి, బెంగుళూరులో పెట్టాలి, హైదరాబాదులో పెట్టాలి, గోకుల్‌చాట్‌లో పెట్టాలి. చూసారా! ఎక్కడుంటాడు వీడని దేవుని స్క్రిప్ట్‌ని అడిగితే

మనిషి ఎక్కడున్నాడో దెయ్యం కూడా అక్కడే ఉంటాడు. మరి, ఎలా ఉంటాడు తండ్రీ? గుర్తుపట్టడానికి వాడికున్న ఆకారమేమిటి? భారీ భయంకరమైన వేషదారణతో ఉంటాడా? కొమ్ములతో ఉంటాడా? కోరలతో ఉంటాడా? గోరులతో ఉంటాడా? పాదాలు వెనక్కి వెళ్ళిపోయినట్టుగా ఉంటాడా? తల విరబోసుకున్నట్టుగా ఉంటాడా? తెల్లచీరతో ఉంటాడా? లేదు, లేదు, లేదు. అది విఠలాచారి సినిమా నాయనా. దేవుడు తీసిన సినిమాలో యదార్థత అలా ఉండదు. దెయ్యం ఎలా ఉంటాడో ఇప్పుడు చూడండి. "ఇది ఆశ్చర్యము కాదు. సాతాను తానే వెలుగు దూత వేషము ధరించుకొనుచున్నాడు. గనుక వాని పరిచారకులు నీతి పరిచారకుల వేషము ధరించుకొనుట గొప్ప సంగతి కాదు". **(2కొరింథీ 11 : 14,15)**

వాడెలా వస్తాడో తెలుసా? నీతి పరిచారకుల వేషంలో వస్తాడట. లోపలున్నది వాడు, పైకి కనిపించేది మాత్రం నీతి పరిచారకుడు. ఇప్పుడు మీకు ఎలా వస్తాడో ఒక ఉదాహరణ చెబుతాను. మన దగ్గరకు ఎన్నికల సమయం వస్తుంది. మన ఇంటి వరకు చాలామంది వస్తారు. కరపత్రాలు పట్టుకుని, తెల్లటోపీలు పెట్టుకుని, తెల్లని వస్త్రములు ధరించుకుని తెలుపు మరియు తెలుపు బట్టలతో వస్తారు. బూటు కూడా తెలుపే, సాక్స్ కూడా తెలుపే. ఇలాంటి వారు మన ఇంటికొస్తారు, చేతులెత్తి దండం పెడతారు. మీ అమూల్యమైన ఓటు హక్కును నాకు ఇచ్చేయండి అంటారు. మీరు నమ్మి వాడికిచ్చారా, 5 యేళ్ళు మరల మీకు కనిపించడు. ఆ ఓటు తీసుకుని మాయమైపోతాడు. మరలా వచ్చాడా? ఎవరైనా మీ దగ్గరకు మరల కృతజ్ఞతతో వచ్చారా? మీ దగ్గరకు ఎన్నికల సమయంలో వచ్చినవారు మరలా మీ దగ్గరకు 5 యేళ్ళ కాలంలో ఎప్పుడైనా వచ్చారా? ఎవ్వరూ రారు. ఎవ్వరూ మీకు దండాలు పెట్టరు. అవసరమైతే మీరే వారి దగ్గరకు వెళ్ళి, "దండాలు బాబయ్యా ఒక్కసారి మిమ్మల్ని చూసే అవకాశం ఇప్పించండయ్యా!" అని అడగాలి. చూసారా, దేవుడు రాసిన స్క్రిప్టు ఎంత గొప్ప నిజాన్ని బయట పెడుతోందో! సాతాను మనిషిలో ప్రవేశించిన తరువాత ఎలా వస్తాడు అనుకుంటున్నారు? నేను దొంగను, నేను దెయ్యాన్ని, నేను మిమ్మల్ని నశింపచేస్తాను. మిమ్మల్ని పట్టి పీడిస్తాను అంటే మీరు వాడిని రానిస్తారా? రానివ్వరు. అందుకే వాడెలా

వస్తున్నాడో తెలుసా? వేషం మార్చేసాడు వాడు. తన వేషం పూర్తిగా మార్చేసాడు. నీతిపరిచారకుల వేషమును వేసుకున్నాడు. ఇది బైబిల్. ఇది దేవుని స్క్రిప్టు. ఇది దేవుని సినిమా. ఎవ్వడూ నిజమైన దెయ్యాన్ని పట్టుకోలేదు. వాడు నీతిపరిచారకుల వేషమును ధరించుకున్నాడు. మీ దగ్గరకు చల్లగా వస్తాడు. మెత్తగా వస్తాడు. మిమ్మును రక్షిస్తానంటాడు. మీకు బాగు చేస్తాను అంటాడు. మేలు చేస్తానంటాడు. మీ నుండి ఏదో ఆశిస్తాడు. వీడు మనిషిలో ఉంటాడా? అవును. వీడొక అదృశ్య శక్తి. మానవ నేత్రాలతో వీడిని మనము చూడలేము.అందుకే వీడు మనిషిలోనికి వెళుతున్నాడు. ఈ అమాయకపు ప్రపంచ జనులేమో దెయ్యం, చింతచెట్టు మీదా, సమాధిలోనూ, పాడుబడిన బంగ్లాలోనూ, సీసాలోనూ, ముగ్గులోనూ, ప్లాస్టిక్ బొమ్మలోనూ, ఉంటుందనుకున్నారు. మంత్రించిన నిమ్మకాయ తొక్కకూడదనుకున్నారు. కాదు కాదు! వాడు మనిషిలో ఉంటాడు. అవునయ్యా సాతాను మనిషిలో ఉంటాడు. దేవుడు తప్ప ఇప్పటివరకు ఈ వాస్తవాన్ని ప్రపంచంలో ఎవ్వడూ చెప్పలేదు. దేవుడే చెప్పాడు. యేసుక్రీస్తువారు తనను వెంబడించిన శిష్యులలో ఒక అగ్రగణ్యున్ని చూసి ఏమని పలికారో తెలుసా?

**మత్తయి 16 : 21-** యేసుక్రీస్తు - ‘‘అప్పటి నుండి తాను యెరూషలేమునకు వెళ్లి పెద్దలచేతను ప్రధానయాజకుల చేతను శాస్త్రుల చేతను అనేక హింసలు పొంది, చంపబడి, మూడవ దినమున లేచుట అగత్యమని యేసు తన శిష్యులకు తెలియజేయ మొదలుపెట్టగా...” యేసు తన శిష్యులతో మాట్లాడుతూ, నా శిష్యులారా, నన్ను ఈ లోకం బ్రతుకనివ్వదు. నేను మంచిని చెప్పడానికి వచ్చాను. దేవుని యొక్క మార్గాన్ని చూపించటానికి వచ్చాను. దేవుని సినిమా చూపించటానికి వచ్చాను. కనుక ఈ లోకం నన్ను బ్రతుకనివ్వదు. హింసలకు గురి చేస్తుంది. చివరకు సిలువ వేస్తుంది. చంపేస్తుంది. ఇది విన్న పేతురు ఏమంటున్నాడో చూడండి. “పేతురు ఆయన చేయి పట్టుకుని– ప్రభువా, అది నీకు దూరమగు గాక, అది నీకెన్నడును కలుగదని ఆయనను గద్దింపసాగెను”. **(మత్తయి 16 : 22)** యేసుక్రీస్తునే గద్దించే స్థాయికి వచ్చేసాడా పేతురు? ఎందుకంటే, పై వచనంలో యేసుక్రీస్తు అన్నాడు కదా. ‘నీకు ఈ మహాజ్ఞానం దేవుడు అనుగ్రహించాడు గనుక నన్ను దేవుని కుమారుడని నీవు చెప్పావు’ అన్నాడు. ఆయన పేతురును గొప్పచేసి, కాస్త హెచ్చించి, కొద్ది

అధికారమిస్తే పేతురు దేవుని స్క్రిప్టునే తప్పుతున్నాడు. యేసుక్రీస్తును పేతురు గద్దిస్తున్నాడు. పేతురు చేపలు పట్టుకుంటుంటే, మిమ్మల్ని మనుష్యులను పట్టు జాలరులనుగా చేస్తాను రండని యేసుక్రీస్తు పిలిచాడు. వారందరికీ మునుపెన్నడూ వారు చూడని గొప్ప జీవితాన్ని ఇచ్చాడు. పేతురు పాలిట యేసుక్రీస్తు ఒక మహానుభావుడు. ఈ పేతురు అది మరిచిపోయాడు. "ప్రభువా అది నీకు దూరముగును గాక" అని ఈ యేసుని గద్దింపసాగెను. అప్పుడు యేసుక్రీస్తు ఏమంటున్నాడో చూడండి. "అయితే ఆయన పేతురు వైపు తిరిగి – సాతానా, నా వెనుకకు పొమ్ము. నీవు నాకు అభ్యంతర కారణమైయున్నావు. నీవు మనుష్యుల సంగతులనే తలంచుచున్నావు గాని దేవుని సంగతులను తలంపక యున్నావని పేతురుతో చెప్పెను". **(మత్తయి 16 : 23)**

యేసుక్రీస్తు మోమాటం లేనివాడు. "సాతానా, నా వెనుకకు పొమ్ము" అని యేసుక్రీస్తు ఎవరిని చూచి అంటున్నాడు అనుకుంటున్నారు?పేతురునే! అక్కడ యేసుక్రీస్తుకి సాతాను ఏమీ తెల్లగా కనిపించటం లేదు. సాతానుకి రూపం ఏమీ లేదు. అందుకే ఆ సందర్భంలో పేతురులోనికి దూరిపోయింది. అపవాది బాగా ఆలోచించింది. వెంటనే పేతురులోనికి వెళ్ళిపోయింది. పన్నెండుమంది శిష్యులలో నేను ఎవరిలో దూరితే వర్కౌఅవుట్ అవుతుంది అని ఆలోచించింది. యేసు ఎవరి మాట వింటాడు? ఎవరు అగ్రగణ్యుడు. వాడినే నేను కాటేయాలి అనుకుంది. పేతురుని అంత సుళువుగా బోల్తా కొట్టించాడా వాడు? ఏమనుకుంటున్నారు వాడిని? వాడు విలన్. వాడు చాలా పెద్ద విలన్. వాడిని గూర్చి యేసుక్రీస్తుకి బాగా తెలుసు. అందుకే యేసు వెంటనే పేతురు వైపు తిరిగి 'సాతానా' అంటున్నాడు చూడండి. 'పేతురూ' అని సంబోధించటం లేదు. 'పేతురూ నా వెనక్కి వెళ్ళు అనటం లేదు. 'సాతానా గో బాక్'. నా వెనకకు పొమ్ము. నీవు మనుష్యుల సంగతులను ఆలోచించుచున్నావు. మనుష్యులు తీసిన సినిమా నీకు అర్థమైపోయింది. దేవుడు తీసిన సినిమా అర్థమయ్యిందా? యేసుక్రీస్తు అదే అన్నాడు చూడండి. 'నీవు నా వెనుకకు పొమ్ము సాతానా. నీవు నాకు అభ్యంతర కారణమైయున్నావు. నీవు మనుష్యుల సంగతులనే తలంచుచున్నావు గానీ, దేవుని సంగతులను తలంపకయున్నావని పేతురుతో చెప్పెను". "పేతురుతో చెప్పెను" అంతేగాని సాతానుతో కాదు.

యేసుక్రీస్తుకి సాతాను అక్కడెక్కడ కనిపిస్తున్నాడు. మీకు, నాకు సాతాను కనిపించడు. మరి ఎక్కడ ఉన్నాడు? దేవుని స్క్రిప్టు ఎక్కడైతే అతిక్రమింపచేస్తున్నాడో, ఎవరి చేత అతిక్రమింపచేస్తున్నాడో వాడిలో ఉన్నాడు. ఈ భూమి మీదకి వచ్చిన మనిషి, ఏ క్షణంలో దేవుని స్క్రిప్టును అతిక్రమిస్తున్నాడో, దేవుని లేఖనాన్ని అతిక్రమిస్తున్నాడో, వాడిలో ఉన్నాడు ఆ దుష్టుడు. వాడిని పట్టుకోవడం చాలా సులభం. నా దగ్గరకు మీరు ఏ మనిషినైనా తీసుకుని రండి. వాడితో 5 నిముషాలు మాట్లాడితే చెప్పేస్తాను, వాడు దెయ్యమో, దేవుని కుమారుడో. నాకు ఆ విద్య వచ్చింది. ఎందుకంటే నేను చాలామందిని చూసాను, చదివాను, అర్థం చేసుకున్నాను. ఎవడు దేవుడో, ఎవడు దెయ్యమో ఇప్పుడు నాకు అర్థమయ్యింది. దెయ్యమంటే చింతచెట్టు మీద ఉన్నది కాదు, కోరికలు తీరని శవం కాదు. దెయ్యమంటే ఎవరో తెలుసా! ఇదిగో సమాజంలో ఉన్న మనుష్యులు. ఈ రోజు మీడియా కూడా ఈ మనుష్యులను క్రూరమృగాలు అంది. ఒక విధంగా అడవిమృగాలు చాలా నయం. అడవిలోనే ఉంటాయి. పచ్చగడ్డిని తింటాయి. జంతువులను వేటాడుకుంటాయి. దెయ్యం పట్టిన మనిషి ఒక క్రూరమృగం. ఒక సైకోగా మారిపోతున్నాడు. సూది సైకో దొరికిన వారందరకీ సూది గుచ్చేస్తున్నాడు. పోలీసు వ్యవస్థ వీడిని ఇంకా పట్టుకోలేకపోయింది. ఈస్ట్ & వెస్ట్ గోదావరీస్ సిరంజీవి ఇంకా దొరకలేదని పేపర్‌వాడు ఇంకా వ్రాస్తూనే ఉన్నాడు. సిరంజీవి ఇంకా దొరకలేదట. నటుడు చిరంజీవి కాదు, 'సిరంజీ'వి సూదిపోటు గాడు. అంటే, వీడు ఎవడన్నమాట. సాతాను పట్టిన మనిషి. సాతాను ఎక్కడున్నాడన్నమాట. సిరంజీవిలో ఉన్నాడు. సిరంజీవిలోనే కాదు, చాలా మందిలో ఉన్నాడు. లంచం తీసుకుంటున్నాడా? అయితే వాడిలో ఉన్నాడు. అబద్ధం ఆడుతున్నాడా? అయితే వాడిలో ఉన్నాడు. ప్రజలకు కీడు చేస్తున్నాడా? అయితే వాడిలో ఉన్నాడు. దేవుని స్క్రిప్టు అతిక్రమించిన ప్రతీ ఒక్కరిలో దెయ్యం ఉన్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే దేవుని వాక్యాన్ని అతిక్రమిస్తున్న ప్రతీ ఒక్కరిలో వాడున్నాడు. వాడు ఈ సగటు మనిషిని జయించేసాడు. ఈ మనిషి వాడికి దాసోహం అయిపోయాడు. వాడినే పూజిస్తున్నాడు. వాడినే అనుకరిస్తున్నాడు.

ప్రియలారా, మీరు ఎప్పుడు ఈశక్తిని తెలుసుకుంటారు? ఎప్పుడు మీరు

వాడిని ఓడిస్తారు? ఎప్పుడు మీరు విజయులౌతారు? ఎప్పుడు మీరు పరలోకానికి ఆహ్వానింపబడతారు? అందుకే దేవుని యొక్క స్క్రిప్టులో ఈ విషయం మీకు అర్థం కావాలని ఈ పాఠం మీకు చెప్పించాడు దేవుడు. ప్రపంచం మోసపోతున్నట్టుగా ఈ పుస్తకాన్ని చదువుతున్న మీరు మోసపోకూడదు. వాడెవడో మీకు తెలియాలి. ఆ అపవాది ఎవడో మీరు అర్థం చేసుకోవాలి. మీరు పసిగట్టాలి. వాడిని మీరు ఓడించాలి. మీ బ్రతుకు కాలంలో వాడిని మీరు మట్టుపెట్టాలి. విజయ పథంలో మీరు దూసుకుని వెళ్ళాలి. దేవుని యొక్క స్క్రిప్టును తు.చ. తప్పకుండా మీరు పాటిస్తూ వెళ్ళిపోవాలి. వాడు చాలా భయంకరుడు. ఈ ప్రపంచానికి  ముప్పు, నాశనం పొంచి ఉంది అంటే, వీడి వల్లనే తప్ప ఇంకెవరి వలనా కాదండి. వాడిని పట్టుకోవాలండి అసలు. వాడిని గూర్చి ఈ సమాజానికి తెలియజేయాలండి. ఈనాడు పేపరా? వార్త పేపరా? సాక్షి టి.వి.నా? ఆంధ్రజ్యోతి టి.వి.నా? వీరందరూ వీడిని గూర్చి చెప్పాలండి ఈ రోజు. ఎవరిని గురించి చెబుతున్నావయ్యా నీవు? ఎవరిని గూర్చి వ్రాస్తున్నావు? క్రైమ్ వాచ్ అంటావు. ఎవరిని గూర్చి చెబుతావు? నేరాలు – ఘోరాలు అంటావు. ఎవరిని గూర్చి చెబుతావు? ఎప్పుడైనా, ఈ అదృశ్య వినాశక శక్తిని గూర్చి ఈ సమాజానికి తెలియజేసిందా ఈ మీడియా? తెలుగు మీడియా, హిందీ మీడియా, పంజాబీ మీడియా, తమిళ మీడియా, మళయాళ మీడియా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇంగ్లీషు మీడియా? వీరంతా మొదట ఈ వార్తనే చెప్పాలి? ఎవ్వరికీ దేవుని స్క్రిప్టు అర్థం కాలేదా? అర్థం కాలేదు. వార్తా పత్రికలో రోజుకి మరలా 16 నుంచి 20 పేజీలు. ఆదివారం నాడు మరలా మనకో పుస్తకం. ఎవరిని గురించి చెబుతున్నావు ఈ సమాజానికి? వారానికి ఒక్కరోజు చెప్పు చాలు. మనుష్యులు కొద్దిగానైనా మారతారు. వాడిని గూర్చి తెలుసుకుంటారు. చూడండి వాడెంత భయంకరమైనవాడో? దేవుడు తన స్క్రిప్టులో ఈ విషయాలన్నింటిని వ్రాయించాడు. మీకు చెప్పాలి ఈ విషయం. లేకపోతే మీరు ఈ విషయం తెలియకుండా వెళ్ళిపోతే చాలా నష్టపోతారు.

**యెషయా 14 : 15–** "నీవు పాతాళమునకు నరకములో ఒక మూలకు త్రోయబడితివే. నిన్ను చూచువారు నిన్ను నిదానించి చూచుచు ఇట్లు తలపోయుదురు". పాతాళానికి వెళ్ళవలసిన వారిలో మొట్టమొదట ఉండేది

ఎవరో తెలుసా? వాడే, ఆ దుష్టుడే. వాడు వెళ్ళిపోతాడు. దేవుడు తీస్తున్న ఈ సినిమా ముగియగానే, యేసు రెండవ రాకడతో దీనికి ముగింపు పలకగానే వాడు వెళ్ళిపోతాడు. పాతాళమునకు ఒక మూలకు వాడు వెళ్ళిపోతాడు. వాడే పాతాళంలో నెం-1. వాడి వెనుక, వాడిచేత జయింపబడిన వారందరూ వెళ్ళిపోతారు. “నీవు పాతాళమునకు నరకములో ఒక మూలకు త్రోయబడితివే. నిన్ను చూచువారు నిన్ను నిదానించి చూచుచు ఇట్లు తలపోయుదురు”. దేవుడు తీసిన సినిమా తెలియని అభాగ్యులు అక్కడికి వెళ్ళిన తరువాత వాడిని చూచి తలబాదుకుంటున్నారు. పాతాళలోకం లోనికి, దేవుని స్క్రిప్టు అతిక్రమించి, వెళ్ళిన ప్రతీ ఒక్కడు ఆ అపవాదిని, ఆ దుష్టశక్తిని చూచిన తరువాత ఇలా తలబాదుకుంటున్నారండి. ‘భూమిమీద ఉండగా, దేనినో దెయ్యం అనుకున్నాము. వీడిని మేము గమనించలేకపోయాము. వీడు నాలోనే ఉన్నాడు, నా భార్యలో ఉన్నాడు, నా భర్తలో ఉన్నాడు. మా పక్కింటివాడిలో ఉన్నాడు, మా ఎదురింటివాడిలో ఉన్నాడు. కానీ ఎవ్వరూ వీడిని గుర్తించలేక మోసపోయారు.’ నిజంగా పాతాళలోకం వెళితే ఇవన్నీ మీకు అర్థమైపోతాయి. దేవుని సినిమా తెలిసిపోతుంది. అక్కడ అప్పుడు వెంటనే వీరందరూ ఎలా తలబాదుకుంటున్నారో చూడండి. దేవుని స్క్రిప్టులో భవిష్యత్తు చెబుతున్నాడు ఆయన. “నిన్ను చూచువారందరూ నిన్ను నిదానించి చూచుచు, ఇట్లు తలపోయుదురు”. ఒక్కసారి నిదానించి చూస్తారట. వారేమంటున్నారో తెలుసా? – “హో, బాబూ నువ్వేనా? నేనిక్కడికి రావటానికి ప్రధానమైన క్యారెక్టర్ నీదేనా? “భూమిని కంపింపజేసి, రాజ్యములను వణికించినవాడు ఇతడేనా?” వీడని తెలిస్తే నేను భూమి మీదనే మారుమనస్సు పొంది ఉండేవాడను. ఈ సినిమా నాకు అక్కడ తెలియలేదు. భూమిని కంపింపజేసాడు. రాజ్యములను వణికించాడు. వీడా? నేనేమో ఆ పాకిస్తాన్ వారు అనుకున్నాను. నేనేమో కసబ్ అనుకున్నాను, నేనేమో ప్రభాకరణ్ పిళ్ళై అనుకున్నాను, నేనేమో చైనావారు అనుకున్నాను, నేనేమో యు.ఎస్.ఎ. వారు అనుకున్నాను. కాదు కాదు నేను బిల్‌లాడెన్ అనుకున్నాను కాదు. వాడిలో ఉన్న ఈ దుష్టుడు. బిన్‌లాడెన్ కూడా అక్కడికి వెళ్ళిపోయిన తర్వాత ఏమంటాడు చెప్పండి? అక్కడికి వెళ్ళిన తర్వాత, వాడిని చూచి ‘ఒరేయ్ నీవల్లేరా నేనిక్కడికి వచ్చేసింది. నీవల్లేరా అంతమందిని నేను

నాశనం చేసి, చంపి, దేవుని ప్రణాళిక నెరవేర్చకుండా ఇక్కడికి వచ్చింది. కేవలం నీవల్లేరా. ప్రపంచమంతా నన్ను దోషి అనుకుంటుంది. నేను శత్రువుననుకుంటుంది. నీవెంత మాయ చేసావురా మాయలమారి అని ఆ దుష్టుని తిట్టిపోస్తాడు. బిన్ లాడెన్‌లో ఉండి వీడి పని కానిచ్చి, అటు తరువాత ఆ బిన్ లాడెన్‌ను చంపించి, అతనిని పాతాళానికి రప్పించి, వీడు మాత్రం చడీచప్పుడూ లేకుండా అక్కడికి వెళ్ళిపోతాడు. పాతాళానికి ఇంతమందిని నువ్వు ఈడ్చుకొని వచ్చావా అని అందరూ వాపోతారు. వెళ్ళిన ప్రతీఒక్కడు ఆ దెయ్యపు శక్తిని చూచిన తరువాత ఇదే మాట చెబుతాడండి. ఇదే మాట చెబుతాడు. చూడండి, ఏమంటున్నాడో. "భూమిని కంపింపజేసి, రాజ్యములను వణికించినవాడు ఇతడేనా? లోకమును అడవిగా జేసి దాని పట్టణములను పాడుచేసినవాడు ఇతడేనా?" వీడా, వీడా, వీడా? అవును. వాడే అసలైన దెయ్యం! అసలైన క్రూరమృగం!!

పాతళలోకం - నరకంలో జరిగే ఆ సన్నివేశం ఇదే! భూమిని ఒక అడవిగా మార్చేసింది వీడేనా? క్రూరమృగాలుగా మనుష్యులను మార్చినవాడు వీడేనా? సైకోగా వాడిని మార్చింది వీడా? అవును. పట్టుబడిన తరువాత పోలీసులు వాడికి శిక్ష విధించారు గానీ, వీడికి(దెయ్యానికి) ఎవ్వరూ, ఎప్పుడూ శిక్ష విధించలేదు. విధించరు. ఈ భూమి మీద వాడు దొరకడు కదా! ఇంకా క్రిందికి చూడండి. "తాను చెరపట్టినవారిని తమ నివాసస్థలమునకు పోనియ్యనివాడు ఇతడేనా?" చూసారా! ఒక్కసారి మిమ్మును చెరపట్టాడంటే, మిమ్మును మీ నివాస స్థలానికి వెళ్ళనివ్వడు. ఏది మీ నివాసస్థలం? అదే పైనున్న పరలోకం. అసలు మనం అక్కడికే వెళ్ళాలి. మనం దేవుని స్క్రిప్టును చక్కగా పాటిస్తే, స్క్రిప్టు ప్రకారం మనం నిర్వర్తిస్తే, మనము వెళ్ళాల్సింది పరలోకమే. అది మన నివాస స్థలం. జనులను తమ నివాస స్థలమునకు పోనియ్యనివాడు, చెరపడితే తానున్న లోకానికి ఈడ్చుకొని పోయేవాడు వీడా? వీడేనా అసలు విలన్? వీడేనా అసలు శత్రువు? వీడే. వీడు మీకు అర్థమైతే, వాడితో మీరు యుద్ధం చేయాలి. వీడు మీకు అర్థమైతే, నేనిప్పుడు చేస్తున్నట్టుగా, వాడితో మీరు పోరాటాన్ని కొనసాగించాలి. అసలు శత్రువు ఎవరో మీకు అర్థం కావాలి. ఈ ప్రపంచానికి మీరు ఆ శత్రువును, ఆ దెయ్యాన్ని తెలియజేయాలి. ఆ

సాతానును మీరు ప్రపంచానికి చెప్పాలి. పట్టి ఇవ్వాలి. ప్రియమైనవారలారా! ఇది దేవుడు తీసిన సినిమా.

ఎంతోమంది దెయ్యాలను గూర్చి సినిమాలు తీసారు. దేవుడు తీసిన సినిమాలో ఇప్పుడు మీకు అసలైన దెయ్యం కనిపించింది. మంచి నిర్ణయం తీసుకోండి. మీ బ్రతుకును మార్చుకోండి. ఆయన స్క్రిప్టు పాటించటానికి మీరు ఆలోచించండి. దేవుని ఇష్టాన్ని నెరవేర్చండి. లోకంలో ఉన్నదంతయూ శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము. దీనికి మించింది లోకములో లేదు. ఈ లోకం తీసిన సినిమాలో లేదు. దీనికి మించింది ఏదీ లేదు. అంతా నాశనమే. మరి దేవుడు తీసిన స్క్రిప్టులో, దేవుడు తీసిన సినిమాలో ఏముందో తెలుసా? చివరిగా ఆ మాటను చూచి, ఆనందిస్తూ చదివి, ఈ భాగానికి ముగింపును పలుకుదాం.

**1యోహాను 2 : 15–** "ఈ లోకమునైనను, లోకములో ఉన్నవాటినైననూ ప్రేమింపకుడి". లోకాన్ని ప్రేమించకండి. అది క్షణకాలం మీ కళ్ళముందు కనబడే క్రొత్త బంగారులోకమే! కానీ, అది నిత్యం ఉండేది కాదు. మిమ్మల్ని నాశనానికి తీసుకుని వెళ్ళిపోతుంది. ఆ దుష్టుని మాయలో మీరు పడకండి. "ఈ లోకమునైననూ లోకములో ఉన్నవాటినైననూ ప్రేమింపకుడి. ఎవడైననూ లోకమును ప్రేమించినయెడల తండ్రి ప్రేమ వానిలోనుండదు." దేవుడు తీసే సినిమా వానిలో జరగదు. ఎవడు లోకాన్ని ప్రేమించినా, వాడు తండ్రి యొక్క కుమారుడు కాడు. లోకములో ఏముందయ్యా? లోకంలో ఏముందో చెప్పు. లోకములో ఉన్నదంతా దేవుడు మూడు పదాలలో తేల్చేసాడు. ఆయన స్క్రిప్టు వ్రాసాడు కదండీ. ఇది ఆయన సినిమా కదండీ. లోకములో ఉన్నది ఏది మీరు చెప్పినా ఈ మూడు కేటగిరిలలోని ఒకదానిలోనికి రావలసిందే. ఏమిటది?చూడండి. "లోకంలో ఉన్నదంతయు, అనగా శరీరాశయు, నేత్రాశయు, జీవపుడంబమును". కంటికి కనిపించినదంతా కావాలనుకునేవాడు ఒకడు. శరీరం కోరుకున్నదానిని కావాలి, నెరవేర్చుకోవాలి అని అనుకునేవాడు ఒకడు. నేనే గొప్ప, నేనే నెం.1 అనుకునేవాడు మరొకడు. ఇవి లోకములో నుంచి వచ్చాయి. లోకములో ఉన్నవాటిని మీరు ప్రేమించకండి. మీరు దేవున్ని ప్రేమించండి. ఆయన స్క్రిప్టును అనుసరించండి. "లోకములో ఉన్నదంతయు

అనగా శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము తండ్రి వలన పుట్టినవి కావు, అవి లోకసంబంధమైనవి". నేను పోటుగాడిని అనుకుంటున్నాడా? నా కంటికి కనిపించిందంతా నాది అనుకుంటున్నాడా? నా శరీరంతో అనేకమైన వాటిని నేను అనుభవించాలి అనుకుంటున్నాడా? అది తండ్రి వలన పుట్టింది కాదు. "లోకము, దాని ఆశయు గతించిపోవుచున్నవి". ఈ సినిమాలన్నీ గతించిపోతాయి. ఈ రీల్లన్నీ కాల్చివేయబడతాయి. ఈ మెమొరీకార్డులన్నీ మసి చేయబడతాయి. కానీ, దేవుని స్క్రిప్టు ఎప్పటికీ నిలిచి ఉండేది. "లోకము, లోకములో ఉన్నదంతయు, లోకపు ఆశయు గతించిపోవును. కానీ, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరము నిలుచును." మీరు ఉండవలసిన, మీ స్వస్థలమైన, మీ నివాసస్థలమైన ఆ పరలోకానికి మీరు వెళ్ళి, నిరంతరమూ మీరు నిలిచిపోవాలి. అదే నా కోరిక, అదే మీ తండ్రి కోరిక! మీ తండ్రి మానవ సమాజానికి చెప్పాలనుకున్న కోరిక!!


ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్

క్రైస్ట్ చర్చ్ - సామర్లకోట - 8978414178.

## దేవుడు తీసిన సినిమా - 4

ఇక మనం కన్‌క్లూజన్ లోనికి వెళదాం. ఇది ముగింపు భాగం. ఇప్పటి వరకూ 3 భాగాల దేవుడు తీసిన సినిమాలో అన్నీ చూసాం. లొకేషన్ చూసాం, సెట్టింగ్స్ చూసాం. వాటికున్న నియమ నిబంధనలు చూసాం. ప్రధాన పాత్రధారులను చూసాం. విలన్‌ను (శత్రువును) చూసాం. ఇకమరి చూడాల్సింది ఎవరిని? హీరోనే (కధానాయకుడు). ఒక విధంగా చెప్పాలంటే దేవుడు తాను వ్రాసుకున్న స్క్రిప్టులో మనిషే మొట్టమొదటి హీరో. కానీ, ఆ మనిషి ఏమైపోయాడు? ఒక బలమైన శత్రువును తన మీదికి పంపించేసరికి మనిషి ఏమైపోయాడు? పారిపోయాడు. ఏదెను వనంలో ఉండే అర్హతను కోల్పోయాడు. దేవుని దగ్గర ఉండగలిగాడా? అంటే హీరోగా ఉండేందుకు ఒక మనిషిని దేవుడు ఈ భూమి మీద ప్రవేశపెట్టినప్పుడు, ఆ మనిషి తన హీరోయిజాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. మీరు జాగ్రత్తగా ఆలోచించాలి.

మొదటి మనిషి నుంచి నేటి వరకు ప్రతీ ఒక్కరూ తమ హీరోయిజాన్ని నిలబెట్టుకోలేకపోయారు. అలాంటి పరిస్థితులలో దేవుడు చాలా బాధపడ్డాడు. ఎంత బాధపడి ఉండాలి చెప్పండి. ఆయన వేసుకున్న ఈ సెట్టింగు, ఆయన నిర్ణయించిన ఈ లొకేషన్, వీటన్నింటినీ చూస్తే అదేమీ చిన్నా చితకా కాదు కదా. ఒకరోజు, రెండ్రోజులు, మూడ్రోజులు ఉండేది కాదది. ఒక మంచి భారీ ప్రణాళిక. ఒక్క క్షణంలో తన తప్పుతో హీరోలుగా ఉండవలసిన మొదటి మనిష్యులైన ఆదాము, హవ్వలు దేవుని ప్రణాళిక అంతటినీ నీరుగార్చేసారు. అందుకే దేవుడు మరీ మరీ చెప్పాడు. ఏమనంటే, ఏదెను తోటలో ఉన్న ప్రతీ వృక్ష ఫలాన్ని ఆదాము, హవ్వలు నిరభ్యంతరంగా తినవచ్చు. కానీ, వారు తినకూడనిది ఒకే ఒక్క వృక్షఫలం. ఏవండీ, ఇలా చేయడం కష్టమా, సులభమా? అది చాలా సుళువు. ఎందుకంటే తినకూడనివి ఎన్ని? ఒకే ఒక్క వృక్షఫలం. ఒకే ఒక్క చెట్టు దగ్గరికి వెళ్ళ కూడదు. తోటలోని చెట్లన్నీ మీవే అన్నాడు. తోటలోనున్న వృక్షఫలములన్నీ మీకోసమే అన్నాడు. ఎన్నుంటాయి చెప్పండి! దేవుడు వాటిని కలిగించాడు. ఆయన కలిగించినటువంటి ఆ సృష్టిలో, ప్రతీది

పవిత్రమైనది. మంచిది. అప్పటికి ఇంకా ఇంతగా కాలుష్యం లేదు. పొల్యూషన్ లేదు. కార్బైడ్ కొట్టేవారు లేరు. ఈ రోజు చూడండి. ఆపిల్‌కాయ తినాలంటే అందరికీ భయం. ఒకప్పుడు డాక్టరు గారు ఏమి చెప్పారు. 'రోజుకో ఆపిల్ తిను, ఈ రోగాలకు దూరంగా ఉండు' అన్నారు. ఈ రోజు ఆపిల్ తింటే రోగాలన్నీ దగ్గరికి వచ్చేస్తున్నాయట. ఎందుకు? వాటికి విషపూరితమైన రసాయనాలను కొట్టేస్తున్నారు. వాటి మీద వాక్స్ పూసేస్తున్నారు. ఆ రోజు ఏదెను తోటలో ఉన్న ప్రకృతి అలాంటిది కాదు. అసలు కార్బైడ్ పెట్టడానికైనా ఆక్కడ ఎవరున్నారు? దానిని ముగ్గించి, అమ్ముకోవడానికి, లాభం చేసుకోవడానికి? అక్కడ ఉన్నది ఇద్దరే ఇద్దరు. వారే ఆదాము, హవ్వలు. వారి చుట్టూ ఉన్నదంతా మంచే. మరి వాటిని తింటూ వాటిని ఆస్వాదిస్తూ, దేవుడు వ్రాసిన స్క్రిప్టుకు తగ్గట్టుగా బ్రతుకకుండా, దేవుడు తినవద్దన్న ఆ ఒక్కచెట్టు దగ్గరికే వారు ఎందుకు వెళ్ళారు చెప్పండి?

నా ప్రియ సహోదరులారా! ఒక సహోదరుడు వచ్చి నాతో ఇలా అంటున్నాడు. "అంతా బాగానే ఉంది కానీ ఈ లోక సంబంధమైన సినిమాలను ఎందుకు ఉదాహరణలుగా తీసుకుంటున్నారు? అని అడిగాడు. సినీ క్లిప్పింగ్స్‌ను ఎందుకు వినియోగించుకున్నారు? అని అడుగుతూ, మీరు బాగా సినిమాలు చూస్తున్నారా" అని సందేహాన్ని వెళ్లబుచ్చుతున్నాడు. చూసారా! దేవుడు తీసిన సినిమాను అర్థం చేసుకోకుండా, తన బ్రతుకును మార్చుకోకుండా ఎలాంటి ప్రశ్నను వేస్తున్నాడో! ఇలాంటి మాటలను విన్నప్పుడు ఒకింత అసహనానికి గురైనా, అమాయకులు కదా అని మరలా వారికి సహనముతో వాక్యము చెప్పడానికి ప్రయత్నించాలి. నీకెన్ని రిఫరెన్సులు చెప్పాను? ఎంత మహాజ్ఞానం చెప్పాను? నీ తలకెక్కిందా? నీఒంటికి పట్టిందా? లేదు! నీవు మారవా? నీ బ్రతుకు మార్చుకోవా? "మీరు సినిమాలు చూస్తారా?" అని అడిగాడు చూడండి. నేనెందుకయ్యా సినిమాలు చూస్తాను? నాకు అంత తీరిక ఎక్కడిది? ఈ లోకాన్ని ఎలా అపవాది బారి నుండి కాపాడాలో అని నిరంతరము ఆలోచిస్తున్నాను. నేను నాకు తెలిసిన దేవున్ని ఈ లోకానికి తెలియజెప్పాలి. అది కూడా చాలా యుక్తిగా తెలియజెప్పాలి. నేను చాలా నిష్కపటుడనై తెలియజెప్పాలి. మూడు భాగాలలో మీరు ఎన్నో సంగతులను విన్నారు, చూశారు. దేవుడు తీసిన

సినిమాకు అవసరమైనది మాత్రమే నేను మీకు యుక్తిగా వివరించాను. మనము పాములవలె యుక్తి కలిగినవారుగా ఉండాలి. అదే సమయములో పావురము వలె నిష్కపటులుగా కూడా ఉండాలి. దేవుడు స్వాతంత్ర్యం ఇచ్చాడు కదా అని, మన దగ్గర మహాజ్ఞానం ఉన్నది కదా అని, ఆయన స్క్రిప్టు మనకు అర్ధమైంది కదా అని, మనము దేవుని వాక్యాన్ని తప్పుగా ప్రకటించకూడదు. దానిని మన స్వార్ధ ప్రయోజనాల కొరకు వినియోగించుకోకూడదు. దేవుడు మనలను పావురముల వలె నిష్కపటులుగా ఉండండి అన్నాడు. నేను యుక్తిగానూ, నిష్కపటముగానూ ఉండాలి. నేనే సినిమాలు చూస్తే ఎలా? నాకు దేవుడు పరలోకమును ఇస్తాడా? నేను దేవుని ఇష్టాన్ని నెరవేర్చాలి. మీరే ఆలోచించండి. 3 భాగాలలో మీరు నేర్చుకున్న ప్రతీ సంగతిని మీ జ్ఞాపకములో ఉంచుకోండి. అది మీకు అవసరమైనది. మీరు దేహాన్ని విడిచిపెట్టేస్తే, మీకు వెంటనే ఇదంతా అర్ధమైపోతుంది. ఇవన్నీ పూర్తిగా అర్ధమైపోతాయి. మీకు ఎవ్వరూ చెప్పనక్కరలేదు. ఈ దేహములో ఉన్నారు గనుకే మీరిలా ఉన్నారు. మీరిలా మాట్లాడుతున్నారు. మీరిలా దేవుని వాక్యాన్ని త్రోసేస్తున్నారు. నేను ఈ లోకానికి దేవుని గూర్చి తెలియజెప్పాలి. చాలా యుక్తిగా తెలియజెప్పాలి. నిష్కపటుడనై తెలియజెప్పాలి. యేసుక్రీస్తు తన శిష్యులను లోకంలోనికి పంపిస్తూ ఏమి చెప్పారో తెలుసా? **మత్తయి 10 : 16** వ వచనములో యేసు తన శిష్యులతో – "తోడేళ్ళ మధ్యకు గొఱ్ఱెలను పంపినట్టు, మిమ్మును పంపిస్తున్నాను." అందుకే ఆ మాటను బట్టి నేను కూడా ఈ రోజు ఎలాంటివాడనో తెలుసా! లోకమునకు దేవుని వాక్యమును ప్రకటించటానికి వెళ్ళేముందు, నేను ఎలాంటివాడనో తెలుసా! ఒక గొఱ్ఱెలాంటి వాడిని. ఇది ఒక పోలిక. మరి నా చుట్టూ ఉన్నవారందరూ ఎవరనుకుంటున్నారు? తోడేళ్ళు. అవి మామూలు తోడేళ్ళు కాదు. క్రూరమైన తోడేళ్ళు. అందుకే యేసు చెప్పాడు. "క్రూరమైన తోడేళ్ళ మధ్యకు గొఱ్ఱెలను పంపించినట్టుగా మిమ్మల్ని పంపిస్తున్నాను. కనుక నా శిష్యులారా! మీరు ఎలా ఉండాలంటే... పాముల వలె వివేకులును, పావురము వలె నిష్కపటులునై యుండుడి." అన్నాడు. దేవుని వాక్యమును ప్రకటించేటప్పుడు పామువలె వివేకమును ప్రదర్శించమన్నాడు. అందుకే మీకు లోకసంబంధమైన సినిమాలో ఈ దర్శకులు తీసిన కొన్ని సినిమాలలోని సన్నివేశాలను ఉదాహరణగా

తీసుకున్నాను. దేవుని సినిమాను అర్థమయ్యేలా చెప్పడానికి ఒక పోలికగా చూపించాను. అంతేగాని, ఒక హీరోయిన్‌ని గూర్చో, అశ్లీలతనో మీకు చూపించానా? ఒక అసభ్యకరమైన సన్నివేశం చూపించానా? ఒక డ్యూయెట్ చూపించానా? దేవుని మర్యాద తెలపడానికి ఒకటి అవసరమయ్యింది. అందుకే మీకది చూపించవలసి వచ్చింది. దానిని నమ్ముతారనో, దానిని విని ఆనందిస్తారనో కాదు. నా సహోదరుడా, నా సహోదరీ! ఆలోచించు, ఈ ప్రపంచమంతా గ్రుడ్డితనంలో ఉందని, మరణిస్తే మనుష్యుల ఆత్మలే ఇక్కడ తిరుగుతాయనే ఒక పచ్చి అబద్ధాన్ని నమ్ముతుందని, మీకు మరొక లోక సంబంధమైన సినిమా సన్నివేశాన్ని చూపించవలసి వచ్చింది. అలాగని ఆ సినిమా మొత్తమంతా చూపించానా మీకు? కేవలం దేవుడు తీసిన సినిమాకు అవసరమైనది మాత్రమే యుక్తిగా చూపించాను. మనము పాములవలె యుక్తి కలిగినవారుగా ఉండాలి. అదే సమయములో పావురముల వలె నిష్కపటులముగా కూడా ఉండాలి.

ఒకప్రక్క దేవుని యొక్క స్క్రిప్ట్ అంతా పాడవుతోంది. మొట్టమొదటి మనిషి హీరోయిజాన్ని ప్రదర్శించవలసిన వాడు ఎలా మారిపోయాడో చూడండి. ఇద్దరూ ఆ తోట మధ్యలో ఉన్న, దేవుడు తినవద్దని చెప్పిన, ఆ వృక్షము దగ్గరికే వెళ్లారు. దానిని తిన్నారు. హవ్వ మొట్టమొదట తిని ఆ తర్వాత ఆదాముకి ఇస్తే "మై డియర్ ఈవ్, నేను తీసుకుంటాను. భార్యవు కదా!" అని ఇద్దరూ కలిపి తిన్నారు. అప్పుడు దేవుడు తన స్క్రిప్టును చూసుకున్నాడు. స్క్రిప్టు ప్రకారం ఇప్పుడు వీరిద్దరినీ ఏమి చేయాలి? ఏదెను తోట నుండి వెళ్లగొట్టాలి. నిత్యత్వాన్ని వీరికి తొలగించేయాలి. వీరికి మరణం సంప్రాప్తిస్తుంది. వీరు మరణిస్తారు. వీరు మరలా మట్టైపోతారు. అయితే, మరి దేవుని స్క్రిప్టును ఎవరు పండిస్తారు? ఆదామును హీరో అనుకున్నాడు. హవ్వను హీరోయిన్ అనుకున్నాడు. వీరిద్దరూ తాను వ్రాసుకున్న మాటలన్నింటినీ, భూమి మీద నెరవేరుస్తారని అనుకుని, వీరికి నిత్యజీవాన్ని అనుగ్రహించి ఒక మంచి ఏదెను వనములో, జీవవృక్ష ఫలములు కలిగినటువంటి ఆ మంచి ప్రదేశంలో, ఆ తోటలో వారిని ఉంచాడు. కానీ, వీరేం చేసారు? దేవుని వాక్యాన్ని అతిక్రమించారు. ఆయన స్క్రిప్టును అతిక్రమించారు. అలా వచ్చిన ప్రతీ మనిషి, వారి గర్భాన పుట్టుకుంటూ వచ్చిన

ప్రతీ మనిషి, మరణం బారిన పడ్డాడు. కొంతమంది మాత్రమే, వారిమట్టుకు వారు సాతాను నుంచి తప్పించుకుని, శేషముగా నీతిమంతులుగా ఉన్నారు. ఈ కొద్ది మందికి మాత్రమే ఈ స్క్రిప్టు అర్ధమయ్యింది. అలాంటి వారిని వేళ్ళమీద లెక్కపెట్టచ్చు. అందులో ఒక  హేబెలు ఉన్నాడు, ఒక హనోకు ఉన్నాడు. అందులో ఒక నోవాహు ఉన్నాడు, ఒక అబ్రహాము ఉన్నాడు. అందులో ఒక మోషే ఉన్నాడు, ఒక దావీదు ఉన్నాడు. ఇలా కొంతమంది నీతిమంతులు మాత్రమే దేవుని స్క్రిప్టును పాటించారు. వీరు కూడా వారిని వారు మాత్రమే కాపాడుకోగలిగారు తప్ప మనుష్యులందరి కొరకు ప్రాణం పెట్టి రియల్ హీరోగా మారలేకపోయారు.  మిగిలిన కోకొల్లలుగా ఉన్న మనుష్యులు అందరూ వారసత్వంగా వచ్చిన ఆ అతిక్రమమునే పాటించారు. నిత్యాగ్నిలోనికి జారిపోయారు. ఇప్పుడెవరు రావాలి చెప్పండి? అసలైన హీరో రావాలి. దేవుని స్క్రిప్టు పండించేవాడు రావాలి. దేవుని కంట కన్నీరు తుడిచేవాడు రావాలి. దేవుడు వేసుకున్న ఇంత భారీ ప్రణాళికను బట్టి, పరలోకానికి తన పిల్లలు రావాలి. మనుష్యులచేత దేవుని స్క్రిప్టును పాటింపచేసేవాడు రావాలి. అంతేకదా!

అలాంటి సందర్భములోనే యేసుక్రీస్తు దేవునితో, తండ్రీ! నన్ను పంపించు అన్నాడు. అప్పటికి యేసుక్రీస్తు పరలోకమందు ఉన్నాడు. యేసుక్రీస్తు అంటే, 2000 సంవత్సరాల క్రితం పుట్టినవాడు కాదు. ఈ సృష్టి పుట్టినప్పటికే ఆయన ఉన్నాడు. పరలోకమందు తండ్రియైన దేవునితోపాటు ఆయన ఉన్నాడు. ఆ తండ్రి పడుతున్న బాధంతా ప్రతిరోజూ చూస్తున్నాడాయన. ఒక పక్క కోట్లాది దేవదూతలు హల్లెలూయ, హల్లెలూయ, హల్లెలూయ, ప్రైజ్ ద లార్డ్ అని గాన ప్రతి గానములు చేస్తున్నారు. ఎందుకు? దేవదూతలకు ఇక మరో పని లేదు. సువార్త ప్రకటన అనే పని దేవదూతలకు లేదు. సత్క్రియలు చేయడం దేవదూతల పనికాదు.  కేవలం, దేవునికి సేవ చేసుకోవడమే వాటి పని. దేవుడు రోజూ ఆ దేవదూతలు వైపు చూడటం. హల్లెలూయ, హల్లెలూయ, ప్రభువును స్తుతించుడి, ప్రభువును స్తుతించండి అని అవి చెప్పడం. కానీ దేవుని పిల్లలు పరలోకానికి రాలేక విలన్ బారిన పడటం. తద్వారా దేవునికి విచారం. ఇదే యేసుక్రీస్తు భూమిమీదకు రానంత వరకు రోజూ జరుగుతున్న తంతు. ఒకవైపు స్క్రిప్టు పాడైపోతుంటే, ఆదాము మొదలుకొని ప్రతి మనిషీ మరణిస్తుంటే, కోకొల్లలుగా

మనుష్యులందరినీ ఆ అపవాది మట్టుపెడుతుంటే, భూమి మీదకి వచ్చిన ప్రతీ ఒక్కరినీ ఈ శత్రువైనవాడు నేల రాచేస్తుంటే, తోకతో కొట్టేస్తుంటే, దేవునికి సంతోషమెక్కడ? ఎంతమంది దేవునికి కాకుండా పోతున్నారో చూడండి. ఈ రోజు సభ్య సమాజంలో నీతిమంతులుగా ఎంతమంది ఉన్నారు చెప్పండి? నేను చెప్పిన మాటలు నిజం కాదా? వాడు ప్రతీ ఒక్కడినీ ఆవహించలేదా? విద్య నేర్చుకున్న వారిని ఆవహించాడు. అధికారంలో ఉన్నవారిని ఆవహించాడు. అందచందాలు కలిగినవారిని ఆవహించాడు. డబ్బున్నవారిని ఆవహించాడు. పేదవారిని ఆవహించాడు. ప్రతీ ఒక్కరినీ ఆవహించాడు. చిన్న పిల్లవాడు తల్లిగర్భము నుండి బయటకు రాగానే గెంతులేస్తున్నాడు. సినిమా పాటలు చూసి, సినిమా సౌండ్ వినగానే గెంతులతో వాడి అవయవాలు ఒక రిథమ్‌తో కదిలిపోతున్నాయ్. దేవుడు ముందుగానే అన్నాడు. 'మీ యొక్క హృదయంలోని చెడుతనం, ఇప్పుడు పుట్టింది కాదు. మీరు పెరిగిన తరువాత పుట్టింది కాదు. బాల్యంలోనే మీకు వచ్చేసింది. "నరుల హృదయాలోచన వారి బాల్యము నుండి చెడ్డది" అన్నాడు. **(ఆదికాండము 8:21 లో)** అంటే దేవుడు బాధపడుతున్నాడు కదా! యుక్తవయస్సుకి వచ్చిన తరువాత వీరు చెడిపోవడం లేదు. నడివయసుకి వచ్చిన తరువాత వీరు చెడిపోవడం లేదు. బాల్యదశలోనే వీరు పాడవుతున్నారు. చిన్నపిల్లలు ఎవరి దగ్గరకైనా మీరు దగ్గరికి వెళ్ళండి. వారు ఒక్కొక్కసారి మాట్లాడితే మనం మన చెవులు మూసుకోవాలి. వినరాని బూతులు మాట్లాడతారు. మరల వాడెంత ఉంటాడో తెలుసా? భూమికి జానెడు కూడా ఉండదు. పట్టుమని వాడికి 5 ఏళ్ళు ఉండవు. వాడు తన చిన్ననాడే ఈ సమాజాన్ని చూసి నేర్చుకుంటున్నాడు. తనచుట్టూ ఉన్న మీడియాను చూస్తున్నాడు. ఈ సమాజాన్ని గమనిస్తున్నాడు. పాఠశాలకు వెళుతున్నాడు. ఫ్రెండ్స్ ఏం మాట్లాడుతున్నారో వింటున్నాడు. పక్కింటివారు, ఇరుగుపొరుగు వారు ఎలా ప్రవర్తిస్తున్నారో చూస్తున్నాడు. దేవుని పేరు చెప్పుకుని అందరూ ఎలాంటి విద్రోహక కార్యక్రమాలు జరిగిస్తున్నారో చూస్తున్నాడు. తైతక్కలు ఎలా ఆడుతున్నారో చూస్తున్నాడు. ఇవన్నీ చూసి, వాడు వీటన్నింటినీ తన లోనికి ఇంజెక్ట్ చేసుకుంటున్నాడు. అందుకే వాడు తన బాల్యము నుండి చెడిపోతున్నాడు. మరి వీరిని రక్షించాలా? వద్దా? అందుకే యేసుక్రీస్తువారు

తండ్రిని అడుగుతున్నారు. 'తండ్రీ ఈ ప్రపంచమంతటికీ నాథా! ఈ మనుష్యులను రక్షించటానికి నన్ను పంపించు. ఆదాము మొదలుకొని ఇప్పటివరకు, నన్ను నీవు పంపించకపోతే నీతిమంతులు ఎవ్వరూ నీ సన్నిధికి చేరలేరు. ఈ స్క్రిప్టు ఎవ్వరికీ తెలియదు. నేను వెళితేనే వారికి అర్థమౌతుంది. నేను పాటించి, వారికి ప్రకటించి వస్తాను. నేను అందరిలాగా ప్రకటించి వచ్చేసేవాడిని కాదు. నేను పాటిస్తాను. ప్రకటిస్తాను' అన్నాడు. యేసు చేసింది అదేనండి. ఈ రోజు దేవుని వాక్యాన్ని లోకములోనికి తీసుకుని వెళుతున్నవారు ప్రకటిస్తున్నారేమో కానీ పాటించటం లేదండి. నిజంగా ప్రతీ ఒక్కరు పాటించి ప్రకటిస్తే, వారే దేవునికి కుమారులు. వారే దేవుని తరపున వచ్చిన బోధకులు. పాటించకపోతే, నీవు ప్రకటించినా ప్రయోజనం లేదు. ఆ రోజు శాస్త్రులు, ప్రధాన యాజకులు, సద్దూకయ్యులు, పరిసయ్యులు - అందరూ ఈ సంతతికి చెందినవారే. చెప్పటానికేమో నీతిసూత్రాలు, చెయ్యటానికేమో అంతా వేషధారణ. అందరి దగ్గరా వారు వందనములు కోరుకుంటారు. పెద్ద పీఠలను అధిరోహిస్తారు. వాటినే కోరుకుంటారు. రక్షరేకులను వెడల్పుగా చేసుకుంటారు. వారి చెంగులు పెద్దవిగా చేసుకుంటారు. అందరిచేత ఘనత కోరుకుంటారు. దేవుడు ఇవన్నీ వ్రాయించాడు. ఈ రోజు జరుగుతున్నదంతా అదే.

యేసుక్రీస్తు తండ్రితో మాట్లాడుతున్నాడు. "తండ్రీ నన్ను పంపించు అంటున్నాడు." దేవుని స్క్రిప్టులో ఆ మాటను చూద్దాం. యెషయా 6 : 8– "అప్పుడు – నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవునని ప్రభువు సెలవియ్యగా వింటిని. అంతట నేను– చిత్తగించుము నేనున్నాను నన్ను పంపుమనగా." రూపకాలంకారములో, ఒక ప్రవచనముగా ప్రవక్తయైన యెషయా, యేసుక్రీస్తును గూర్చి మాట్లాడుతున్నాడు. పరలోకంలో జరిగిన ఒక సన్నివేశాన్ని రూపక అలంకారంలో చెబుతున్నాడు. రాజైన ఉజ్జియా సందర్భంలో... దేవుని కార్యక్రమాన్ని ముగించడానికి దేవదూతలు వెళ్ళలేవు కదా. దేవదూతలకు హల్లెలూయా, ప్రైజ్ ద లార్డ్ తప్ప ఏం తెలీదు. దేవదూతలకు శరీరం లేదు. దేవదూతలు దేవుని సేవను అక్కడ పరలోకములో మాత్రమే చేయగలవు తప్ప, ఈ భూమి మీద దేవుని యొక్క సేవను జరిగించటానికి స్క్రిప్టు అలా వ్రాయబడలేదు. దేవునికీ, మనకూ సేవ చేయటానికి దేవదూతలు

సృష్టింపబడ్డాయి తప్ప, దేవుని పనిని జరిగించలేవు. దేవుని కుమారులుగా అవి మారలేవు. మనకే ఆ ఆధిక్యత ఉంది. మనకే ఆ అవకాశం ఉంది. అదే పరలోకము వెళ్ళే అవకాశం. దేవుని కుమారులుగా మారే అవకాశం. మీ యోగ్యతను మీరు మర్చిపోకండి. దేవదూతల కంటే మీరందరూ గొప్పవారు. కనుక, దేవుడు అడుగుతున్నాడు. "నా నిమిత్తం ఎవడు పోవును? ఆదాము ఫెయిల్ అయిపోయాడు. ఆ తరువాత వచ్చిన అనేకమంది ఫెయిల్ అయిపోయారు. మరి మానవాళిని ఎవరు రక్షిస్తారు? నా స్క్రిప్టును ఎవరు చెబుతారు వీరికి? నేను వ్రాసుకున్నానని, ఇందులో ఉన్న దాని ప్రకారం వారి పాత్రలను వారు పోషించాలని ఎవరు చెబుతారు ఈ లోకానికి? అని దేవుడు తన మనసులో గోడు వెల్లబుచ్చుతున్నప్పుడు యేసు వెంటనే అంటున్నాడు చూడండి. "అంతట నేను – చిత్తగించుము నేనున్నాను నన్ను పంపుము... అంటున్నాడు. తండ్రీ నన్ను ఈ లోకానికి పంపించు. ఆదాము నీ నమ్మకాన్ని వమ్ము చేసాడు. నీ సంకల్పాన్ని సమాధి చేసేసాడు. అనతి కాలములోనే ఆదికాండము 1వ అధ్యాయము, 2 అధ్యాయంలో, నీ సృష్టి ప్రారంభాన్ని గూర్చి వ్రాసావు. 3వ అధ్యాయం వచ్చేసరికి ఆదాము దెయ్యానికి దొరికిపోయాడు. కొంతకాలమైనా దేవునికి సంతోషాన్ని ఇవ్వలేకపోయాడు. కానీ నీవు నన్ను పంపితే నీ నమ్మకాన్ని వమ్ము చేయను అంటున్నాడు యేసుక్రీస్తు. అందుకే 'నేనున్నాను, నన్ను పంపించు' అన్నాడు. అప్పుడు తండ్రి యేసుక్రీస్తుని పంపించటానికి రంగం సిద్ధం చేసాడు. అయితే దేవుని కుమారుడే భూమి మీదకి వెళ్ళాలి అన్నమాట. భూమి మీద ఆ దెయ్యాన్ని ఓడించటం ఇక ఎవరి తరమూ కాదు.

మనుష్యులందరూ బాల్యము నుండి చెడిపోయినవారు. ఒక కథానాయకుడుగా ఆ దెయ్యాన్ని మట్టుపెట్టాలంటే, సాతానుని ఓడించాలంటే, నా కుమారుడు భూమి మీదకు వెళ్ళాలి అనుకున్నాడు దేవుడు. ఆయనే యేసుక్రీస్తు. ఇప్పటివరకు మీరు యేసుక్రీస్తంటే ఎవరని విన్నారో నాకు తెలీదు. రోగాలు తీర్చేవాడని విన్నారా? ఉద్యోగం లేకపోతే ఉద్యోగం ఇచ్చేవాడని విన్నారా? ఆపదలో ఆదుకునే ఆపద మొక్కులవాడని విన్నారా? కాదు. యేసుక్రీస్తంటే అతడు కాదు. మీరనుకున్న ఆ యేసు(డూప్లికేట్) వేరన్నమాట.

ఇప్పుడు నేను చెప్పే యేసు, రియల్ యేసుక్రీస్తు. ఏ తండ్రి దగ్గరైతే కుమారునిగా ఉన్నాడో, ఏ కుమారుడైతే తండ్రి యొక్క రచనను నెరవేర్చటానికి లేఖనానుసారంగా భూమి మీదకి వచ్చాడో, ఆయనను నేను ఇప్పుడు మీకు పరిచయం చేస్తున్నాను. ఇప్పటి వరకు ఈ ప్రపంచమంతా డూప్లికేట్ యేసునే నమ్మింది. ఎందుకంటే నేను కూడా చాలాసార్లు బోధకుల ప్రసంగాలు చూస్తున్నపుడు వారి మాటలలో అందరిదీ ఇదే తప్పుడు బోధ. యేసు నిన్ను పిలుచుచున్నాడు. నీకు రోగాలున్నాయా తీర్చేస్తాం. నీకేమైనా దెయ్యాలు పట్టేసాయా, వదిలించేస్తాం. నీకేమైనా రుగ్మతలున్నాయా? కష్టాలున్నాయా? పోగొట్టేస్తాను రా! ప్రార్ధన చేస్తాను, రా! అంటూ దేవునికి భిన్నముగా మాట్లాడుతున్నారు. ఎప్పుడైనా దేవుని స్క్రిప్టును ఉన్నది ఉన్నట్టుగా చెప్పారా? యేసు ఎందుకు వచ్చాడో చెప్పారా? మరి యేసుక్రీస్తు అలాగని రోగాలు తీర్చలేదా? దెయ్యం పట్టిన వారిలోని దెయ్యాలను వెళ్ళగొట్టలేదా? అని నన్నడిగితే, అవన్నీ ఆయన ఎందుకు చేసాడనుకుంటున్నారు? దేవుని వాక్యమును స్థిరపరచడానికి మాత్రమే. పరలోకమునుండి వచ్చినవాడు దైవకుమారుడని జనులు ఆయనను విశ్వసించాలి అంటే ఇవన్నీ ఆయన చేయటం ఆనాడు తప్పని సరి అయింది. కానీ, ఆయన ప్రధాన కర్తవ్యం. భూమి మీద దేవుని స్క్రిప్టును నెరవేర్చటం. ఆ తరువాత ఈ స్వస్థతలు, అద్భుతాలు అన్నీ మిగిలిన చిన్న చిన్న పనులు. యేసుక్రీస్తును ఆనాటి ఆ సమాజం నమ్మాలంటే ఆయనను దైవకుమారుడుగా ప్రతిఒక్కరూ అంగీకరించాలంటే, ఆయనొక రాజ కుటుంబంలో పుట్టలేదే! ఆయన ఒక పేదవాడుగా పుట్టాడు. ఆయనొక స్త్రీ యందు పుట్టాడు. మనమందరం తల్లిదండ్రులకు పుట్టాము. ఆయనను ఆ విషయములో కూడా దేవుడు తగ్గించేసాడు. 'నీవు తల్లిదండ్రులకు పుట్టకూడదు. ఒక అబలకు పరిశుద్ధాత్మని సహాయముతో నీవు పుట్టాలి. నీ పుట్టుక దగ్గర నుండి ప్రతిదానిని నేను తగ్గించేస్తాను. నీవు కడు బీద కుటుంబంలో పుట్టాలి. వడ్రంగి కుటుంబంలో పుట్టాలి. నీ జననం జరిగినపుడు, ప్రసవ వేదన పడుతున్నటువంటి ఆ స్త్రీ నీకు జన్మనిస్తున్నపుడు, నీకు భూమిపై ఎవ్వరూ స్థలమివ్వరు. మరి భూమి మీదకు వెళతావా?' అని దేవుడు యేసును అడిగితే ఆయన అన్నిటికీ శిరస్సు వంచి నమస్కరించి ఈ భూమిమీదకు వచ్చాడు.

దేవుడు తన స్క్రిప్టును అలాగే వ్రాసుకున్నాడు. యేసుక్రీస్తును హేరోదు కుటుంబములో పుట్టించలేదు, కైసరు కుటుంబములో పుట్టించలేదు. ఒకవేళ పుట్టించాలి అనుకుంటే దేవుడు పుట్టించగలడు. ఒకవేళ అలా పుడితే యేసుక్రీస్తుకి ఎన్ని రాజవైభవాలో చెప్పండి. ఒక కైసరు చక్రవర్తి కుటుంబములో ఒక రాజకుమారునిగా పుడితే, ఒక హేరోదు కుటుంబములో మహా చక్రవర్తికి కుమారునిగా పుడితే, పుట్టుకతోనే చక్రవర్తి అవుతాడు. కానీ, యేసుకు దేవుడు ముందే చెప్పేసాడు, నా కుమారుడా, నువ్వు వెళ్లాలంటే నీకు కొన్ని కండిషన్స్ ఉన్నాయి. నీవు బీదరాలైన కన్య మరియ కడుపున పుట్టాలి. యోసేపుకి కుమారుడని నీవు యెంచబడతావు. ఆ యోసేపు కూడా బీదవాడు. పైగా వారిద్దరూ జనసంఖ్య కోసం వెళుతున్నప్పుడు నీ పుట్టుక జరుగుతుంది. ఈ ప్రసవవేదన, ఈ నొప్పులు, ఇవన్నీ వారు మార్గములో ఉన్నప్పుడే వస్తాయి. ఆ మరియ ఆరుబయటే నిన్ను కంటుంది. అలాంటి జననం ఏ పశువులకో, పక్షులకో ఉంటుంది తప్ప, మనుషులలో ఎవ్వరికీ ఉండదు. అనాథలైతే కనీసం సత్రం అయినా ఇస్తారు. అడుక్కునే వారికి ఎవరికైనా సత్రంలో చోటిస్తారు. నెలలు నిండాయని చెప్పి, ప్రసవ సమయం దగ్గరైనప్పుడు ఎవరైనా కాస్త స్థలమిస్తారు. కానీ ఆ రోజు యేసు జననానికి సత్రములో కూడా చోటు లేదంటే మీరు నమ్మగలరా?? లోకాన్ని, సాతానును జయించడానికి వచ్చిన యేసుక్రీస్తు ఇంత దయనీయ పరిస్థితులలో భూమిమీదకు రావాలా? అవును. అందుకే ఇది దేవుడు తీసిన సినిమా!

ఈ రోజు ఎన్నో ప్రభుత్వాసుపత్రులున్నాయి. 108, 104 వాహనాలు నిరంతరం ఎక్కడ పడితే అక్కడ తిరుగుతున్నాయి. కానీ ఆనాడు సత్రంలో కూడా యేసుకు చోటులేదు. యేసు తల్లిదండ్రులకు సత్రంలో కూడా దేవుడు చోటివ్వలేదు. ఆరుబయటనే కని, ఆ తరువాత తీసుకెళ్ళి ఒక పశువుల పాకలో పరుండబెట్టాలి. దీనినంతటినీ ఒప్పుకుంటావా అని యేసును దేవుడు అడిగినప్పుడు, “ఒప్పుకుంటాను తండ్రీ, నీ స్క్రిప్టులో ఏమి వ్రాయించావో దానిని నేను తు.చ. తప్పకుండా పాటిస్తాను. నన్ను భూమి మీదకు పంపు. భూమి మీదకు వెళ్ళిన తరువాత నీ స్క్రిప్టు తప్ప దేనినీ నేను పాటించను. దేనినీ నేను చూడను అన్నాడు యేసుక్రీస్తు. అలాగే వచ్చాడాయన. పేదరికాన్ని

అనుభవించాడాయన. రిక్త హస్తాలతో వచ్చాడాయన. అలాగని ఆయన ఎందుకూ పనికిమాలిన వాడని అనుకోకండి. ఆయన ఆ గొప్ప అదృశ్యశక్తి యొక్క, ఆ మహాశక్తియైన దేవుని యొక్క కుమారుడు. ఈ ప్రకృతిలో కలిగియున్నదేదియూ యేసుక్రీస్తు లేకుండా కలుగలేదు. అదీ ఆయన పవర్. ఎవరాయన? ఆయనే యేసుక్రీస్తు. ఎప్పుడైనా విన్నారా? యేసుక్రీస్తుని గూర్చి ఇలా. ఇప్పుడు మీరు తెలుసుకోవాలి. నిజాన్ని ఎవ్వరూ ఎక్కువ కాలం సమాధి చేయలేరు. యేసుక్రీస్తును బాగా అర్ధం చేసుకోండి. ఇది మతం కాదు. ప్రపంచ మానవాళి అంతటికీ దేవుడు తన స్క్రిప్టును అర్ధం తెలియజేసేలా తన కుమారుని పంపించాడు.

**గలతీ 4 : 4–** "అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను". సుమారు 2000 సంవత్సరాల క్రితం దేవుడు తన కుమారుని పంపించవలసిన కాలము పరిపూర్ణమయింది. ఎందుకంటే మనుష్యులు కోకొల్లలుగా నాశనానికి వెళ్ళిపోతున్నారు. కాలము పరిపూర్ణము ఎప్పుడైందో తెలుసా? దేవుని దగ్గర ఆ సమయం ఎప్పుడొచ్చిందో తెలుసా? దేవుడు తన కుమారుడిని పంపించవలసిన ఘడియులు ఎప్పుడు ప్రారంభమయ్యాయో తెలుసా? సరిగ్గా ఇప్పటి నుంచి మీరు వెనక్కి వెళితే, సుమారు 2000 సంవత్సరాల క్రితం జరిగిన సందర్భం ఇది. అప్పుడు కాలము పరిపూర్ణమయింది. ఆ ఘడియ వచ్చింది. "కాలానికి విభజన చేయాలి" అంటే నా కుమారుని పంపాలి. నా కుమారుడు వెళితే ఆయనను బట్టి ఈ కాలం లెక్కింపబడుతుంది. క్రీ.శ. (క్రీస్తు శకము) & క్రీ.పూ.(క్రీస్తు పూర్వము) గా కాలము విభజింపబడి, నా కుమారుడే కాలానికి దిక్కు కావాలి అనుకున్నాడు దేవుడు. ఈ ప్రపంచంలో అందరూ దీనిని ఒప్పుకుని తీరాలి. ఈ రోజున్న ప్రపంచం క్రీస్తు శకం, క్రీస్తు పూర్వం అని ఒప్పుకుందా? లేదా? వారు క్రీస్తును ఒప్పుకోకపోయినా క్రీస్తును బట్టి వచ్చిన కాలాన్ని ఒప్పుకోవాలి!

ఈ లోకం అసలైన యేసును నమ్మదు. ఎందుకంటే ఈయనను ఒక 'మతం' అనుకుంది కదా! అది మనకి సంబంధించినది కాదు అనుకుంది. బైబిల్ మనకు సంబంధించినది కాదు అనుకున్నారు. అదొక మత గ్రంథం అనుకున్నారు. ఇది దేవుని స్క్రిప్టు అని ఎవరికీ అర్ధం కాలేదు. యేసుక్రీస్తు దేవుని కుమారుడు. సర్వ ప్రపంచానికి మహాజ్ఞానాన్ని నేర్పించటానికి వచ్చాడని

ఎవ్వరికీ అర్థం కాలేదు. ఆయన రోగాలు తీస్తాడేమో అనుకుని, మా దేవుడు కూడా రోగాలు తీస్తాడు కనుక ఆయన దగ్గరకే వెళ్ళటం ఎందుకు? ఇక్కడే సర్దుకుపోదామని కొంతమంది ఆగిపోయారు. ఈ తప్పుడు బోధల వల్ల ఎందరికో ఈ యేసు దూరమైపోయాడు. ఆయన వచ్చింది రోగాలు తీర్చటానికి కాదు. భూమి మీద రోగస్తులు పెరిగిపోతున్నారని, కుష్ఠ రోగులు పెరిగిపోతున్నారని... ఏం చేయాలా అని దేవుడు అనుకుంటే రాలేదు ఆయన. పిచ్చివాళ్ళారా! భూమి మీద ఎయిడ్స్ వచ్చేసింది, మరి యేసూ నువ్వు లేకపోతే ఎవరు నివారణ చేస్తారు? మందు లేదట దానికి! అందుకే నువ్వు వెళ్ళాలి అని దేవుడు యేసును పంపించాడనుకుంటున్నారా? లేదు. యేసు భూమి మీదకి వచ్చింది దేవుని స్క్రిప్టు నెరవేర్చటానికి, మనుష్యులకు మహాలోకాన్ని ఇవ్వటానికి. ఈ పనిని ఎవ్వరూ చేయలేరు. అందుకే వచ్చాడాయన. రోగాల కోసమే అయితే, దేవుడు ప్రకృతిలో ఒక మందు పెట్టి, ఆ మందు తీసుకోండి అని చెప్పాలి. దేవుడు ఎన్ని మందులు ప్రకృతిలో పెట్టలేదు? దేవుడు పెన్సిలిన్‌ను పుట్టించాడు. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ దానిని కనుగొన్నాడు. దేవుడు సృష్టించాడు – శాస్త్రవేత్తలు కనుగొన్నారు. కనుగొన్నాడు అంటే అర్థం ఏమిటి? ఉన్న దానిని కనుగొనడం. వస్తువు ఎక్కడో పెట్టేసాం. దొరకలేదు. కొంత కాలానికి దొరికింది. దీనిని నేను కనుగొన్నాను అంటాము కదా! శాస్త్రవేత్తలు చేసేది కూడా అదే! ప్రకృతిలో వస్తువును పెట్టినవాడు ప్రపంచానికి లెక్క లేదు. వస్తువును సృష్టించినవాడు ప్రపంచానికి లెక్కలేదు. కానీ పెట్టిన వస్తువును కనుగొన్నవానికి ఈ ప్రపంచం నీరాజనాలు పలికింది. దేవుని గూర్చి ఎవరు చెప్పారండీ? శాస్త్రవేత్తల గురించి చెప్పారు. పిల్లల పాఠ్యపుస్తకాలలో, 1వ తరగతి, 5వ తరగతి, 7వ తరగతి, 10వ తరగతి, ఇంటర్మీడియెట్, ఇంజనీరింగ్ పుస్తకాలలో ఎవరి పేర్లున్నాయి? చూడండి... ఆరిస్టాటిల్, రూథర్‌ఫోర్డ్, నీల్స్‌బోర్, ఆర్కిమెడిస్, ఐన్‌స్టీన్, ...! దేవుడు ఎక్కడ, దేవుడు ఎక్కడ? ప్రతీ పుస్తకంలో దేవుని పేరుండాలి. ఈ సృష్టిలో ప్రతీ దానికి మూలం దేవుడు. ప్రతీ దానికి సృష్టికర్త దేవుడు. దీనిని మర్చిపోయావా? ఇది మూల పాఠం! ఇది చాలా చిన్న విషయం? దీనిని ఎందుకు మర్చిపోయావు? నీవు శ్వాస పీలుస్తున్నావంటే దానికి కారణం దేవుడు. నీవు ఉనికి కలిగివున్నావంటే దానికి కారణం దేవుడు. దేవుడు అనే మూడక్షరాల

పదమంటే ఎందుకయ్యా నీకు అంత శత్రుత్వం? నీకెందుకంత చులకన? నీవు మరణిస్తే, ఈ దేహాన్ని విడిచిపెడితే, ఆ దేవుడేగా నీకు పరలోకమివ్వాలి. ఆ దేవుడేగా నీకు నిత్యజీవాన్ని అనుగ్రహించాలి. దేవుడంటే అంత చులకనా? అందుకే ఆ దేవుని పవర్ ఏమిటో చూపించటానికి యేసుక్రీస్తు ఈ లోకములోనికి అడుగుపెట్టాడు. చూడండి ఏమంటున్నాడో!

"కాలము పరిపూర్ణమయినప్పుడు దేవుడు తన కుమారుని భూమి మీదకి పంపెను". దేవుడు తన కుమారుని పంపించాడే తప్ప పుట్టించాడని అక్కడ వ్రాయలేదు చూడండి. ఆయన తన కుమారుని పంపించాడు. 'వెళ్ళు నాయానా! వెళతాను అన్నావు వెళ్ళు. నీకు సౌకర్యాలుండవు. నీవు పేద కుటుంబములో పుట్టాలి. నక్కలకు బొరియలుంటాయి. ఆకాశపక్షులకు కూడా గూళ్లు ఉంటాయి. నీకు మాత్రం నివాసం ఉండదు. వెళతావా? అని అడిగినప్పుడు 'వెళతాను తండ్రీ, నేను రెడీ! అన్నాడు. 'ఐతే వెళ్లు'. "కాలము పరిపూర్ణమయినప్పుడు దేవుడు తన కుమారుడిని పంపించాడు. "ఆయన స్త్రీ యందు పుట్టి మనము దత్తపుత్రులము కావలెను అని" అక్కడ నుండి వచ్చేటప్పుడే ఈ ఆలోచనతో వచ్చాడండీ యేసుక్రీస్తు. మనుష్యులందరూ దేవునికి కాకుండా పోయారు. అపవాది చేతిలో ఓడిపోతున్నారు వీరందరూ. ఇప్పుడు నేను వెళ్ళి, మొట్టమొదట అపవాదిని ఓడించాలి. ఆ తరువాత వీరందరిచేత వాడిని ఓడింపచేయాలి. అదే యేసుక్రీస్తు ముందుగా అనుకుని వచ్చిన విధానం. ఎంత గొప్పవాడో చూడండి. ఆయన వచ్చి, ఆయన ఒక్కడే ఓడించి వెళ్ళిపోలేదు. పని ముగించుకుని తన చేతులు దులుపుకొని వెళ్ళిపోలేదు. 'తండ్రీ నన్ను పంపించు. నేను వెళతాను, నేను వెళ్ళి వాడిని ఓడించి వచ్చేస్తాను. మిగిలినదంతా నాకెందుకు? ఏదో నీ కన్నీరు చూడలేక, నీ స్క్రిప్టు ఎవరూ నెరవేర్చటం లేదని అంటున్నావని, నన్ను పంపించు నేను వెళతాను. శరీరధారిగా నేను వెళతాను. మనిషిగా నేను బ్రతుకుతాను. నాకు ఏ సౌకర్యం వద్దు. నేను ఆ దుష్టుడిని ఓడిస్తాను. ఆ సాతానుని నేను ఓడిస్తాను. తిరిగి వచ్చేస్తాను అన్నాడా? కాదు. వాడిని ఓడించిన తర్వాత నీ పిల్లలలో ఎవరైతే నన్ను అంగీకరిస్తారో, ఎవరైతే నన్ను ధరించుకుంటారో, ఎవరైతే నాలా బ్రతుకుతారో, అలాంటి ప్రతీ ఒక్కడు వాడిని ఓడించేలా చేసి వస్తాను అన్నాడు. అదండీ యేసుక్రీస్తు చేసింది. ఎంత గొప్పగా

ఆలోచించాడు చూడండి. మరి మనం పరలోకం వెళ్ళాలంటే ఆయన ఇలా చెయ్యాలా? వద్దా? ఇలా ఆలోచించాలా? వద్దా? ఇంత జ్ఞానమును ఆయన మనకు ఇవ్వాలా? వద్దా? అందుకే వచ్చాడు యేసుక్రీస్తు. ఆయన ఒక్కడే దేవుని స్క్రిప్ట్ నెరవేర్చి వెళ్ళిపోతే ప్రయోజనం ఏముంది చెప్పండి? అందుకే మీలో నేను ఉంటాను అన్నాడు. మీరు నన్ను ధరించుకోవాలి అన్నాడు. పైపైన రూపంలో కాదు. మీ లక్షణాలలోనికి యేసుక్రీస్తు వచ్చేయాలి. ఆయనలా మీరు బ్రతకాలి. అప్పుడు మీరు దుష్టుని ఓడించగలరు. యేసుక్రీస్తు ఎలా ఓడించాడో ఒక ఉదాహరణ ద్వారా మీరు చూడండి. యేసుక్రీస్తు తన జీవితకాలంలో ప్రతిక్షణం అపవాదిని ఓడించాడు. ఒక ఉదాహరణ ద్వారా మీరు ఆ పోటీ చూడాలి! హీరో – విలన్‌ల మధ్య ఆ రసవత్తరమైన ఫైట్ మీరు చూడాలి! యేసుక్రీస్తుకు, అపవాదికి మధ్య ఫైట్!!

**మత్తయి 4 : 2–** లో యేసుక్రీస్తు బాప్తిస్మం పొందిన తరువాత ఏం జరిగిందో చూడండి. "నలువది దినములు, నలువది రాత్రులు ఉపవాసముండిన పిమ్మట ఆయన ఆకలిగొనగా..." ఆయన ఎంత గొప్పవాడో చూడండి. తన శరీరాన్ని అదుపులో ఉంచుకోవడానికి దేవుని కోసం, స్క్రిప్టు నెరవేర్చటం కోసం నలువది పగళ్లు, నలువది రాత్రులు ఆయన తిండి మానేసాడు. "పిమ్మట ఆయన ఆకలిగొనగా..." ఆ శోధకుడు సరైన సమయానికి వచ్చాడు. సరైన సమయంలో యేసు దగ్గరకు వచ్చాడు. వాడు కనిపించడు. వాడు చాలా భయంకరుడు. యేసు దగ్గరికి వచ్చి, డైరెక్ట్‌గా పోటీ పడిపోతున్నాడేమో చూడండి. లేదు. మరి ఏమంటున్నాడు? యేసు దగ్గర కూడా వాడిది అదే ప్రయోగం. వాడు చాలా మెత్తగా వస్తాడు. ఆ శోధకుడు యేసు దగ్గరికి వచ్చి, "ఆకలిగొని ఉన్నావు కదా! ఈ రాళ్లున్నాయి. రొట్టెలుగా చేసుకుని తిను. నీకు ఉచిత సలహా ఇచ్చాను. నేనేమీ నీ విరోధిని కాదు" అన్నాడు. ఎంత భయంకరుడు వాడు? మనం అయితే ఏం చేస్తాం చెప్పండి? మన దగ్గర నిజంగా యేసుక్రీస్తుకున్న అదే పవర్ ఉంటే, రాళ్ళను రొట్టెలుగా చేసుకునే శక్తి మనకే ఉంటే, 40 రోజుల బట్టి మనకు తిండి లేకపోతే, శోధకుడు మన దగ్గరకొచ్చి, కనిపించే విస్తారమైన రాళ్ళన్ని రొట్టెలుగా చేసుకుని, కలబడి మెక్కెయ్ అన్నాడనుకోండి! ఏం చేస్తాం మనము? "అయ్యో బాబోయ్, ఈ సూత్రం నాకు తెలియక, ఆ ఆలోచన నాకు

రాక ఇంతవరకూ వెయిట్ చేసాను. నువ్వు వచ్చి చెప్పావుగా. రా, ఇద్దరం వెళ్ళి తినేద్దాం అంటారు." కానీ, యేసు అలా చేయలేదు. యేసు దగ్గర రాళ్ళను రొట్టెలుగా చేసుకునే ఆ పవర్ ఉంది. ఎందుకంటే కలిగియున్నది ఏదియూ ఆయన లేకుండా కలుగలేదు. అందుకే అపవాది ఆ మాటను ప్రయోగించింది. కానీ, ఆయన దానిని వినియోగించటం లేదు. యేసు ఏమన్నాడో చూడండి. ఇదొక పోటీ, ఇదొక యుద్ధం. అపవాదిపై యుద్ధం ఎలా చెయ్యాలో మీరు చూడండి.

"అందుకాయన – మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోట నుండి వచ్చు ప్రతీమాట వలనను జీవించును అని వ్రాయబడియున్నదనెను." **(మత్తయి 4 : 4)** అందుకాయన – "నీవు చెప్పిన ఈ మాటను పాటించి, దేవుని స్క్రిప్టు అతిక్రమించమంటావా? జానెడు పొట్ట కోసం దేవున్ని అతిక్రమించమంటావా? దేవుని కంట కన్నీరు చూసి వచ్చినవాడనయ్యా నేను. నేను మనిషిలాంటివాడని కాదు. మనిషిలా దేవుని స్క్రిప్టును నేను అతిక్రమించను. ఏ పరిస్థితులలోనైనా సరే. చచ్చిపోతాను గానీ, దేవుని స్క్రిప్టు బ్రతుకుతుంది. దేవునికి ఆయన హామీ ఇచ్చాడు. అందుకే "మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదు" అని చెప్పి వాక్యమును నెరవేరుస్తున్నాడు. వాక్యమును జ్ఞాపకం చేస్తున్నాడు అక్కడ. "మనుష్యుడు రొట్టె వలన మాత్రం కాదు, దేవుని నోట నుండి వచ్చు ప్రతీ మాట వలన జీవించునని వ్రాయబడియున్నది". దేవుని స్క్రిప్టులో ఉంది ఇదంతా. ఇప్పుడు అపవాదికి అర్థమైపోయింది. "అబ్బో! మనిషి దగ్గర ప్రయోగించినటువంటి ప్రయోగాలు నేను చేస్తే, నా పప్పులిక్కడ ఉడకవు. ఇప్పుడు నేను దేవుని స్క్రిప్టు చూడాలన్నమాట." ఇప్పుడు అపవాది వచ్చి స్క్రిప్టును తిరగవేసింది. దానికి దేవుని స్క్రిప్టుతో పనేమిటి చెప్పండి? దానికి దేవుని వాక్యంతో పనేంటి చెప్పండి? కానీ, వాక్యము దగ్గరకు వచ్చాడు. స్క్రిప్టు అర్జెంటుగా తిరగేసాడు. దేవుని స్క్రిప్టులో ఏముంది? ఆ... వీడికొక వాక్యం దొరికింది అందులో. చూడండి.

"అంతట అపవాది పరిశుద్ధ పట్టణమునకు ఆయనను తీసుకొనిపోయి, దేవాలయ శిఖరమున ఆయనను నిలువబెట్టి – నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము – ఆయన నిన్ను గూర్చి తన దూతలకాజ్ఞాపించును. నీ

పాదమెప్పుడైనను రాతికి తగులకుండ వారు నిన్ను చేతులతో ఎత్తికొందురు. అని వ్రాయబడియున్నదని ఆయనతో చెప్పెను". నేను ఈ సారి నా మాటలు చెప్పటం లేదు. స్క్రిప్టులో ఉన్నదే చెప్పాను". ఏమిటది? వాడుకూడా దేవుని స్క్రిప్టులో ఉన్నదానిని జ్ఞాపకం చేస్తున్నాడు చూడండి. "ఆయన నిన్ను గూర్చి తన దూతలకాజ్ఞాపించును, నీ పాదమెప్పుడైనను రాతికి తగులకుండ వారు నిన్ను తమ చేతులతో ఎత్తికొందురు అని వ్రాయబడియున్నదని ఆయనతో చెప్పెను." **(మత్తయి 4 : 5-7)** 'యేసుక్రీస్తూ, నువ్వు దేవుని స్క్రిప్టే కదా పాటిస్తావు! దేవుని స్క్రిప్ట్ అంటే, నీకు అంత గొప్ప విషయం కదా! అయితే స్క్రిప్టులో ఉన్నదే చెప్పాను. ఎక్కడుందో తెలుసా ఇది? **కీర్తనలు 91:12** లో వ్రాయబడి ఉంది". అక్కడున్న మాటను పట్టుకున్నాడండి వీడు. అంటే... అపవాది బైబిలు బోధిస్తాడా? వీడు, మామూలు శత్రువు కాదు. అందుకే మీకు చెప్పాను. మీకు విలన్ అని చెప్పాను చూసారా. వాడు మామూలువాడు కాదు. జిత్తులమారి. మీరు ఏమీ తెలుసుకోకుండా, అమాయకంగా 'నేను వాక్యమే చూస్తాను. వాక్యమే నెరవేరుస్తాను' అన్నారనుకోండి. మిమ్మల్ని వాక్యంతోనే కొట్టేస్తాడు. కొంతమందికి ఒక అలవాటు ఉంటుంది. స్క్రిప్టు ప్రకారమే వెళతారు కానీ, వారికి ఏమీ తెలియదు". వారు బైబిల్ ఎలా చదువుతారంటే ఇలా తీస్తారు పుస్తకం, ఇలా తమ వ్రేలు పెడతారు. ఆ వ్రేలు దగ్గర ఏ వాక్యం వస్తే అదే ఆ రోజు వారికి కంఠస్థ వాక్యం. అదే ఆ రోజు వారికి పాఠం. మీరు అలా వ్రేలు ఎక్కడ పెడితే, అదే చదివితే, అపవాది మీకు ఏ వాక్యం ఇస్తుందో తెలుసా! "పోయి ఉరి పెట్టుకొనెను **(మత్తయి 27:5)**" అని ఇస్తుంది. దానిని పాటించేస్తావా? బైబిలులో ఉందిగా మరి ఆ మాట. బైబిలు సరిగ్గా ప్రయోగించటం రావాలి. దేవుని స్క్రిప్టు సరిగ్గా ప్రయోగించటం మనకు రావాలి. ఆనాడు యేసుక్రీస్తు దగ్గర అపవాది ఏం చేస్తుందో తెలుసా! ఆయనను మోసగించాలని చూసింది. దేవాలయ శిఖరమునకు ఆయనను తీసుకుని వెళ్ళి, 'నీవు క్రిందికి దూకు". స్క్రిప్టులో ఏమని వ్రాయబడిందో తెలుసా! నీవు దేవుని కుమారుడవు గనుక దేవుని కుమారుని యొక్క కాలి పాదాలకు రాయి తగలకుండా దేవదూతలు వచ్చి నిన్ను ఎత్తి పట్టుకుంటారని వ్రాయబడి వుంది. కనుక నువ్వు దూకేయ్, దూకేయ్ అని తొందరపెడుతోంది. అప్పుడు మరలా స్క్రిప్టులో ఉన్న మరొక వాక్యమును

తీసి యేసుక్రీస్తు అపవాదితో పోటీకి సిద్ధపడ్డాడు. యుద్ధం చేసి దానిని ఎలా ఓడిస్తున్నాడో చూడండి. వాక్యమే చెప్పారు కదా అని, ఆ వాక్యములో పరిశోధన కనుక మీకు లేకపోతే, మీరు ఖచ్చితంగా బోల్తా పడతారు. దేవుని వాక్యం పిస్టల్ లాంటిది. దీనితో శత్రువును కాల్చొచ్చు, మనలను మనమే కాల్చుకోవచ్చు. ఇది ఒక కత్తి లాంటిది. ఆ కత్తిని పీక తెగ్గోయడానికీ వాడొచ్చు, కూరగాయలు తరుగుకోవడానికి వాడొచ్చు. జాగ్రత్తగా వినియోగించడమే రావాలి. ఇది మామూలు ఖడ్గం కాదు, రెండంచుల వాడిగల ఖడ్గం. సరిగా వినియోగించకపోతే మిమ్మల్ని కూడా కోసేస్తుంది. వాక్యం అర్థం కాకపోతే దేవుని నుంచి మిమ్మల్ని దూరం చేసేస్తుంది. అందుకే యేసుక్రీస్తు ఈ యుద్ధమును ఆ రోజు మన కొరకే జరిగించాడు. స్క్రిప్టులో వ్రాయబడిన దానిని మరలా అపవాదితో చెబుతున్నాడు. అందుకు యేసు – "ప్రభువైన నీ దేవుని శోధింపవలదని మరొకచోట వ్రాయబడినది". 'దానిని వెళ్ళి చూస్కో'. అన్నాడు. అపవాదికి మతిపోయింది. ఇక అపవాదికి స్క్రిప్టుతో పని లేదు. తాను చెప్పిన ఆకలిని తీర్చుకునే రొట్టెల కార్యక్రమానికీ యేసుక్రీస్తు తలొగ్గటం లేదు. ఇప్పుడేం చేయాలి? లోకరాజ్యాలన్నిటినీ ఈయనకి ఇచ్చేద్దాం అనుకున్నాడు. ఇక నాకేం వద్దు. ఎందుకంటే యుద్ధంలో ఇదే వాడి చివరి ప్రయత్నం. యేసుని గనుక నేను మట్టుపెడితే, యేసుని గనుక తాను ఓడిస్తే.. ఇక ప్రపంచంలో తాను అందరినీ ఓడించేసినట్టే". ఇక అపవాది యొక్క చివరి ప్రయత్నం చూడండి.

లోకరాజ్యాలు, వాటి వైభవాలు అన్నిటినీ చూపించి, నీ దేవుడు నీకెంత ఇచ్చాడయ్యా? నీకేమి ఇచ్చాడయ్యా అసలు? నీవు పుట్టినప్పుడు నీ తల్లికి ఈ భూమిమీద స్థలం లేదు. నీవు తినడానికి పట్టెడన్నం లేదు. అనేకమంది శాస్త్రులు, ప్రధానయాజకులు, పరిసయ్యులు, సద్దూకయ్యులు నిన్ను చంపటానికి నిన్ను వెతుకుతున్నారు. నీ మరణం చాలా భయంకరంగా ఉంటుంది. ఈ లోకం నిన్ను బ్రతకనివ్వదు. ఇంత అమాయకుడవైతే చాలా కష్టం. అందుకే, నా పాదములకు మ్రొక్కు. ఈ రాజ్యములన్నిటినీ నీకు ఇచ్చేస్తాను. చివరి అవకాశమును ఫైనల్‌గా ఇచ్చేసింది. ఇదే దాని చివరి అస్త్రం. ఒక బంపర్ ఆఫర్ చూసారా! వాడు ఎంత తెలివైనవాడో! అంటే చివరకు మిమ్మల్ని పరలోకం చేరనివ్వకుండా చేయటానికి మీకు ఏ ఆఫరైనా ఇచ్చేస్తాడు. మిమ్మల్ని దేవుని

నుండి వేరు చేయడానికి సి.ఎమ్. పదవినైనా ఇచ్చేస్తాడు. పి.ఎమ్. పదవైనా ఇచ్చేస్తాడు. ఎలాగూ మీరు అంత వరకూ రానివ్వరులెండి. క్రింద స్థాయిలోనే వాడికి సాష్టాంగ నమస్కారం చేసేస్తారు. ఎక్కడనుకుంటున్నారు? సర్పంచ్ పదవి దగ్గర చేసేస్తారు. మహాప్రభో! ఒక గ్రామ సర్పంచ్ పదవి మాకు ఇప్పించు. దేవుడూ లేదూ, దెయ్యం లేదూ, ఈ దేవుని స్క్రిప్టుకి ఒక నమస్కారం అంటారు. మీకు సి.ఎమ్. పదవి వరకూ ఎందుకు? కానీ ఆనాడు యేసుక్రీస్తుకైతే, సకల రాజ్యాలను చూపించింది. వాటి వైభవం చూపించింది. నీవు నా పాదములకు మ్రొక్కితే, నీకు ఇచ్చేస్తానంది. ప్రభువైన నీ దేవునికి మ్రొక్కకు. దేవుని స్క్రిప్ట్ అది. ఇక్కడ కూడా నీకు స్క్రిప్టేనా! లోకమంతా నీకిచ్చేస్తాను అన్నా ఇంకా స్క్రిప్టును పట్టుకుని వదలవా? ఆ లేఖనాలను పట్టుకుని వదలవా? అని అంటున్నప్పుడు యేసుక్రీస్తు అనే ఆ మహానుభావుడు దేవుని స్క్రిప్టును బ్రతికించడానికి పలికిన మాటేమిటో తెలుసా? ఆ యుద్ధంలో చివరి దెబ్బను దెయ్యానికి ఎలా ఇస్తున్నాడో తెలుసా? అందుకు యేసు – సాతానా పొమ్ము, ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను. అని వ్రాయబడియున్నదనెను. ఆయనకు తప్ప ఇక ఎవ్వరికీ మ్రొక్కకూడదు అని చెప్పినప్పుడు ఇక అపవాది ఏమీ చేయలేక అశక్తుడై ఆయనను విడిచి వెళ్ళిపోయాడు. ఆదాము మొదలుకొని యేసుక్రీస్తు వచ్చినంత వరకు ఈ భూమిమీద అపవాది ఇలాంటి మనుష్యుని ఏ కాలమందునూ, ఏ ప్రదేశమందునూ చూడలేదు. చావు దెబ్బ తిని ఆయనను విడిచి అక్కడ నుంచి వెళ్ళింది. ఇక యేసును చంపేవరకూ ఆ దెయ్యం నిద్రపోలేదు. భూమి మీద యేసును చంపించడానికి కుటిలోపాయాన్ని పన్నుతోంది. దేవుని స్క్రిప్ట్ ఎలా పాటిస్తాడో చూస్తాను అనుకుని వెళ్ళిపోయింది. యేసుక్రీస్తు యొక్క చివరి రక్తపు బొట్టు వరకూ పిండుతాను అనుకుంది. మాంసపు ముద్దగా పిండుతాను అనుకుంది. దేవుని స్క్రిప్టును యేసు పాటిస్తాడా! స్క్రిప్టు ఎలా పాటిస్తాడో చూస్తాను అని వీరావేశంతో పోయింది. ఎంతోమంది మనుష్యులు వాడి చేతిలో బలైపోయారు. వాడు అప్పటికే ఎందరినో మట్టుపెట్టాడు. వాడికెవ్వరూ తేడా లేదు. వాడికెవ్వరూ లెక్క లేదు. దేవుని కుమారుడు కనుక వాడి బలం సరిపోవటం లేదు అనుకుంది. అయితే, యేసుక్రీస్తు మీద వాడి పోటీ చివరి వరకూ

కొనసాగుతూనే ఉంటుంది. యేసుక్రీస్తు కూడా బస్తీ మే సవాల్. ఆయన కూడా సిద్ధం. నువ్వెన్ని ప్రయోగాలు చేసినా, నువ్వు ఎంత కలబడినా, నీవు ఎంత భయంకరంగా నా మీద యుద్ధం చేసినా, నేను నీ మీద గెలుస్తూనే ఉంటాను అంటున్నాడు యేసుక్రీస్తు. ఎందుకంటే, దేవుని స్క్రిప్టు ఆయన కళ్ళ ముందు కనిపిస్తుంది. యేసు తన తల్లిదండ్రుల కోసమో, తన కుటుంబం కోసమో, తన జాతికోసమో, తన దేశం కోసమో బ్రతికేవాడు కాదు. బంధువర్గాల కోసం ఆయన ఆలోచించటం లేదు. లోకకళ్యాణం కోసం ఆయన వచ్చాడు. 12 ఏళ్ళప్పుడే ఆయన యెరూషలేము పండుగకు వచ్చి, యెరూషలేము దేవాలయంలో బోధకుల మధ్య కూర్చుని ప్రశ్నలడుగుతూ వారందరినీ ఆశ్చర్యంతో ముంచెత్తుతున్నాడు. అప్పటికే యేసుక్రీస్తు దేవుని పనిలోనికి వచ్చేసాడు. పరలోకపు తండ్రి పనిలో నిమగ్నమైపోయాడు. యేసు ఈ భూమి మీదకి వచ్చింది, దేవుని స్క్రిప్టు నెరవేర్చటానికి. అనేక మందికి దానిని తెలియజేయడానికే తప్ప మరి దేనికోసమో కాదని రూఢిగా తెలుసుకోండి. చూడండి, ఆయన ఎందుకు వచ్చానని చెబుతున్నాడో చూడండి.

**మార్కు 1 : 38–** "ఆయన - ఇతర సమీప గ్రామములలోను నేను ప్రకటించునట్లు వెళ్లుదము రండి. యిందు నిమిత్తమే గదా నేను బయలుదేరి వచ్చితినని వారితో చెప్పెను". "నేను ఇతర సమీప గ్రామములలో ప్రకటించునట్లు' అంటున్నాడంటే, ఏమి ప్రకటించటానికి? స్క్రిప్టును ప్రకటించటానికి. ఎందుకొచ్చాడో వ్రాయించాడు చూడండి. 'ఇందు నిమిత్తమే గదా' అన్నాడు. అందరూ పొరపాటు పడతారని ముందే ఆయన చెబుతున్నాడు. యేసుక్రీస్తు రొట్టెలు పెట్టడానికో, నీళ్ళను ద్రాక్షారసంగా మార్చటానికో, స్వస్థతలు చేయటానికో, రోగాలు తీర్చటానికో, ఇందుకే వచ్చాడని మీరు అనుకుంటారని, శిష్యులతో ఏమంటున్నాడో తెలుసా? 'నేను ఇందు నిమిత్తమే వచ్చాను. తండ్రితో ఆ వాగ్దానమును నేను చేసాను. అనేకమందికి ఆయన స్క్రిప్టు చెబుతూ నేను దానిని పాటిస్తూ, చివరకు భూమిమీద దేవుని స్క్రిప్టును ముగించటానికి నేను వచ్చాను. ఎవరూ చేయలేని ఆ పనిని సాధించటానికి నేను వచ్చాను. అందుకే మనం వెళదాం రండి, అని అన్నాడు ఆనాడు తన శిష్యులతో. ఇదే ఆయన ప్రధాన లక్ష్యం! ఆయన ఈ పనిలో ఉన్నప్పుడు, దారిలో ఒక గ్రుడ్డివాడు 'యేసూ,

నన్ను కరుణించు' అని అరుస్తున్నాడు. అందుకే ఆ గ్రుడ్డివానికి కళ్ళు ఇచ్చాడు. 'యేసూ, నాకు కాళ్ళు ఇవ్వు' అని ప్రాధేయపడుతున్నాడు. అందుకే ఆ కుంటివానికి కాళ్ళిచ్చాడు. 'మా కుమార్తె చనిపోయింది' అని రోదిస్తున్నారు. అందుకే చనిపోయిన శవాన్ని తిరిగి లేపాడు. కానీ, ఆయన యొక్క ప్రధానమైన ఉద్దేశ్యం ఏమిటో తెలుసా! ఈ దేవుని స్క్రిప్టును అందరికీ చెప్పాలి. ఈ స్క్రిప్టు తెలియకే ఈ రోజు చాలామంది నాశనమైపోతున్నారు. దేవుడు తీసిన సినిమా ఎవ్వరికీ అర్థం కాలేదు. వారి వారి పాత్రను సరిగ్గా పోషించటం లేదు. దుష్టుని చేతిలో బలైపోతున్నారు. వాడు ప్రతీ ఒక్కరినీ ఓడిస్తున్నాడు. అందుకే 'యేసు– నేను ప్రతీ ఒక్కరికీ ప్రకటించునట్లు వెళ్లుదము రండి' అన్నాడు. ఈ స్క్రిప్టు అర్థం కాకపోతే నాశనానికి వెళ్ళిపోతారు. వారు ఎంత గొప్పవారైనా సరే. వారు ఎంత చదువుకున్న వారైనా సరే. వారు ఎంత అధికారము కలిగినవారైనా సరే. స్క్రిప్టు అర్థం కాకపోతే చాలా ప్రమాదం. యేసుక్రీస్తువారి మాటలలో దానిని కూడా ఒక్కసారి చూడండి.

**మార్కు 12 : 24–** "అందుకు యేసు – మీరు లేఖనములను గాని దేవుని శక్తిని గాని యెరుగకపోవుట వలననే పొరబడుచున్నారు! అన్నాడు. సద్దూకయ్యులు, ఆ రోజు సమాజంలో ఒక గొప్ప స్థాయి కలిగినవారు. వారి మాటకు ఎదురులేదు. వారు చెప్పినదే వేదం. వారు ఎల్లప్పుడూ ధర్మశాస్త్రాన్ని పఠించేవారు. వారు యేసు దగ్గరికి వచ్చి, పునరుత్థానము లేదని వాదిస్తూ, యేసును వ్యంగ్యంగా ఒక ప్రశ్న వేస్తున్నారు. దానికి సమాధానంగా యేసుక్రీస్తు వారితో ఏమంటున్నారో తెలుసా! "మీరు లేఖనములను గానీ, దేవుని శక్తిని గానీ ఎరుగక పొరబడుచున్నారు". ఈ ప్రపంచం పొరపాటు పడింది. ఈ సభ్య సమాజం పొరపాటు పడింది. ఎందుకో తెలుసా! దేవుని స్క్రిప్టు అర్థంకాక! లేఖనములు అర్థం కాకపోతే ప్రతీ ఒక్కరూ పొరపాటు పడతారు. ఆ లేఖనములు లోకానికి తెలియజెప్పటానికే యేసు వచ్చాడు. ఆ లేఖనములు ప్రకటించాడు, పాటించాడు. చివరిగా ఆయన తన దేహాన్ని విడిచిపెట్టి ఆయన వెళ్ళిపోవాలి. తండ్రి అప్పగించిన పనిని పూర్తి చేసి వెళ్ళిపోవాలి. స్క్రిప్టు నెరవేర్చాలి. ఇక సిలువ మీద ఉన్నప్పుడు ఆయన పలుకుతున్న మాటలలో, నేను తండ్రి దగ్గరికి వెళ్ళిపోవాలి అంటున్నాడు. ఆయన ఆత్మ తండ్రి దగ్గరికి వెళ్ళిపోవాలి. దేహాన్ని

ఇక్కడే విడిచిపెట్టేస్తాడు. కానీ, యేసు తిరిగి లేస్తాడు. అపవాది, ఈ యూద సమాజం యేసును చంపాననుకుంటున్నారు. కానీ, తిరిగి లేవబోయే రోజు, మూడు రోజులలోనే జరుగుతుంది. యేసు చనిపోయిన తరువాత ఎక్కువ రోజులు వారు ఎదురుచూడవలసిన అవసరం లేదు. ఎందుకంటే, లేఖనములలో వ్రాయబడింది. యేసుక్రీస్తు దేవుని స్క్రిప్టును యధాతథంగా పాటిస్తే, లేఖనానుసారంగా భూమి మీద తు.చ. తప్పకుండా ఆయన బ్రతికితే, ఆయన మరణించిన తరువాత మూడు దినములలో తిరిగి దేవుడు యేసును లేపుతాడు. అది దేవుడు యేసుకిచ్చిన ఆఫర్. పరలోకమందున్న తండ్రి యేసుకి చెప్పిందేమిటో తెలుసా! నీవు నిజంగా ఈ స్క్రిప్టు పాటిస్తే, నీవు నిజంగా భూమిమీద దేనినీ కోరుకోకుండా, దుష్టునిచేతిలో ఓడిపోకుండా నా పరువు నిలబెడితే, నా స్క్రిప్టు కాపాడితే...పరలోకములో తిరిగి తన తండ్రి కుడి పార్శ్వమున ఆసీనుడవుతాడు. భూమి మీద మనుష్యులందరూ పొరపాటు పడుతున్నారు. భూమి మీద మనుష్యులందరూ స్క్రిప్టును అతిక్రమిస్తున్నారు. ఇప్పుడు తప్పు ఎవరిది అనుకోవాలి? దేవుడు వ్రాయించిన స్క్రిప్టు తప్పా? అతిక్రమిస్తున్న మనుష్యులది తప్పా? దేవుడు తన స్క్రిప్టు గొప్పదని నిరూపించుకోవాలిగా. తన స్క్రిప్టును పాటించటానికి మనిషిగా పుట్టినవాడు సరిపోతాడని దేవుడు నిరూపించుకోవాలిగా. అందుకే తన కుమారుని పంపించాడు. యేసూ నువ్వు వెళ్ళి నా స్క్రిప్టు పాటిస్తే, మనుష్యులందరికీ బుద్ధి వస్తుంది. లేకపోతే వారు నా స్క్రిప్టుని నిందిస్తారు. ఇంత కఠినమైన స్క్రిప్ట్ అయితే ఎవరు పాటిస్తారు? అని నా స్క్రిప్టుని, నన్ను నిందిస్తారు వారు. కనుక నువ్వు వెళ్లాలి. దానిని నెరవేర్చాలి. నెరవేర్చిన తరువాత నీకు నేను ఇచ్చే ఆ గొప్ప భాగ్యం ఏమిటో తెలుసా! మూడు దినములలో నిన్ను తిరగి లేపుతాను. నీవు యుగయుగములకు సజీవుడవైయుంటావు. నీ దేహాన్ని చంపగలరు తప్ప, నీ ఆత్మను చంపలేరు. నిన్ను తిరిగి లేపి మహిమ శరీరముతో వారందరకీ చూపిస్తాను. ఎప్పటికీ ఈ ప్రపంచానికి నువ్వు ఒకే ఒక్క దిక్కుగా ఉంటావు అన్నాడు. మనుష్యులందరికీ చిట్టచివరి దిక్కు క్రీస్తు యేసే. పరలోకానికి మనుష్యులు రావాలంటే దిక్కు ఆయనే. మార్గమాయనే, జీవమాయనే. యేసు తిరిగి లేచిన తరువాత ఏమంటున్నాడో చూడండి.

**లూకా 24 : 44-** "అంతట ఆయన - మోషే ధర్మశాస్త్రములోను ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేరవలెనని నేను మీయొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని వారితో చెప్పెను". ఏమన్నాడో చూడండి యేసు! ఎందుకొచ్చాడో చూడండి యేసు! యేసు చివరిగా చెబుతున్న మాటేమిటో చూడండి. దేవుని స్క్రిప్టు నా యెడల జరిగింది అన్నాడు. అదేనా కోరుకున్నాడు తండ్రి? అదే కోరుకున్నాడు! దీనికి మించినది ఇంకేమి కోరుకున్నాడు ఆయన? మీ దగ్గర నుంచి పళ్లు, ఫలహారాలు ఆయనకు వద్దు. మీ దగ్గర నుండి చిల్లర పైసలు, చెల్లని కాగితాలు ఆయనకొద్దు. ఎందుకవి? మీరు తయారు చేసుకున్న కాగితాలు ఆయనకు ఎందుకయ్యా? మీరు తయారుచేసుకున్న ఆస్తి ఐశ్వర్యాలెందుకయ్యా ఆయనకి? మీకే ఇచ్చాడు ఆయన తినమని. మీకే అన్నీ ఇచ్చేసాడు. ఆహారపదార్థాలు అన్నీ మీకే. యాపిల్స్ మీవే, బనానాస్ మీవే, కొకొనట్స్ మీవే, అన్నీ మీవే. మళ్ళీ మీరు ఆయనకు తెచ్చి ఇవ్వడం ఏమిటి? బలియు, అర్పణయు నేను కోరను అని చెప్పే రిఫరెన్సులు చాలా ఉన్నాయి. ఇక్కడ చాలామందికి సందేహం రావచ్చు. దేవుడు అర్పణ తీసుకోడా? కయీను ఇచ్చాడుగా, హేబెలు ఇచ్చాడుగా అనుకుంటున్నారా! అది ధర్మశాస్త్ర కాలం. ఆ తరువాత దేవుడు తన స్క్రిప్టులో వ్రాయించాడు.**(హెబ్రీ 5 : 7)** మీకు ఆ మాట తెలియదు. బైబిలులో ఒకే ఒక్కమాట, సాతాను పట్టుకున్నట్లుగా, మీకు తెలిసిన మాటనే పట్టుకుని వ్రేలాడకండి. సాతాను ప్రయోగించిన 'నీ పాదమెప్పుడూ రాతికి తగలకుండా దేవదూతలు నిన్ను పట్టుకుంటారన్న' మాట కీర్తనలలో వ్రాయబడిందే మరి. ఆ మాట పట్టుకుని సాతాను యేసు దగ్గరికి వస్తే, వాడిని ఆయన ఓడించేసాడు. మీకు బైబిల్ అంతా రావాలి. బైబిల్‌లో దేవుని యొక్క స్క్రిప్టు మీకు పూర్తిగా అర్థంకావాలి. దేవుని మనసు మీకు పరిపూర్ణంగా తెలియాలి. ఆయన మీ దగ్గర నుండి ఎందుకు కోరుకుంటాడు? వద్దు. ఆయనకు మీరు ఏమీ ఇవ్వక్కరలేదు. కానీ, మీరు ఆయనకు కావాలి. మీ దగ్గరున్నవి ఆయనకు వద్దు. మీరే ఆయనకు కావాలి. మీరు ఆ స్క్రిప్టును నెరవేర్చాలి. అందుకే యేసు ఏమన్నాడో చూడండి. "మోషే ధర్మశాస్త్రములోనూ, ప్రవక్తల గ్రంథములలోనూ, కీర్తనలలోనూ నన్ను గూర్చి వ్రాయబడినవన్నీ నెరవేరినవి" అన్నారు. ఎవరు

నెరవేర్చారు? యేసుక్రీస్తు నెరవేర్చారు. ఇప్పటివరకూ ఎవ్వరూ నెరవేర్చలేదు. దేవుని స్క్రిప్టు పూర్తిగా నెరవేర్చినవాడు యేసు ఒక్కడే. అందుకే చాలా గొప్పగా చెప్పాడండి ఆయన ఈ మాట. “నేను మీతో బ్రతికున్నప్పుడు కూడా ఇదే మాట చెప్పాను. అవి నెరవేరవలెనని మీతో చెప్పిన మాట, ఇదిగో ఇప్పుడు మీరు జ్ఞాపకం చేసుకోండి. నెరవేరినవి” అన్నాడు తిరిగి లేచిన యేసుక్రీస్తు. ఆయన దేవుడప్పగించిన పనిని ముగించాడు. ఆయన శత్రువును ఓడించాడు. అపవాది, ఆయనను భూమిమీద సిలువపై చంపితే, తాను గెలుస్తానేమో అనుకున్నాడు. లేదు. యేసుని అపవాది చంపలేదు. యేసు తనకు తానుగా తన ప్రాణమిచ్చాడు. దుష్టుడు ఆయనను చంపలేదు. లేఖనానుసారముగానే, ఆయన దెబ్బలు తిన్నాడు, ఆయన గాయముల పాలయ్యాడు, ఆయన సిలువ మీద మరణించాడు. అది కూడ దేవుని స్క్రిప్టులో ఉన్నది గనుక నెరవేర్చాడు. యేసుని చంపాలంటే, నువ్వు ఎంత? ఆఫ్టర్‌ఆల్ సాతాను. అది వాడి ప్రతాపం కాదు. వాడు మనకైతే ఒక పెద్ద దుష్టశక్తి కావచ్చు. యేసు దగ్గరికి వచ్చేసరికి ఆఫ్టర్‌ఆల్ పనికిమాలిన దేవదూత అది. పరలోకమందు ఒకప్పుడు గర్వపడిన దేవదూత అది. దేవునిపై తిరుగుబాటు చేసిన ఒక దుష్టదేవదూత అది. అందుకే యేసుక్రీస్తు వాడిని ఓడించాడు. సాతాను అందరినీ బోల్తా కొట్టించాడు. యేసుక్రీస్తు దెయ్యాన్ని బోల్తా కొట్టించాడు. యేసుక్రీస్తు సిలువ మీద మరణించినప్పుడు ఆయన శక్తి లేనివాడు అనుకుంది ఈ లోకం. నిస్సహాయుడు అనుకుంది ఈ లోకం. తనను తాను బ్రతికించుకోలేడా అని ఆ రోజు ఆ మార్గాన వెళుతున్న వారందరూ యేసుని చూచి తలలూపుచు అపహసించారు. కానీ, యేసు అవన్నీ గమనిస్తున్నాడు. పిచ్చోళ్లారా! మిమ్మును దెయ్యం ఆవహించాడు. అందుకే మీరు ఏమంటున్నారు? నన్ను నేను రక్షించుకోలేనా అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. నేను మరణించాలన్నది దేవుని స్క్రిప్టులో ఉన్నది. అందుకే నేను మరణిస్తున్నాను. నేను స్వయంగా నా ప్రాణమును పెడుతున్నాను. దేవుని స్క్రిప్టు నెరవేరుస్తున్నాను నేను. ఇదిగో తిరిగి లేచాను. మూడో దినమున తిరిగి లేచాను అన్నాడు. చనిపోయి లేచినవాడు ప్రపంచంలో ఎవడున్నాడండీ? చరిత్రను తిరగవేసి చెప్పండి. చరిత్రలో చనిపోయి తిరిగి లేచినవాడు ఎవడైనా ఉన్నాడా? నా యేసుతప్ప! మీరు నమ్మిన యేసుతప్ప!

ఎవ్వడూ లేడు. ఎందుకు లేచాడాయన? ఏదో గొప్పతనం పొందడానికి కాదు. ఏదో ప్రజల చేత దేవుడు అని పిలిపించుకోవడానికి కాదు. గుడులు కట్టించుకోవడానికి కాదు. మిమ్మును రక్షించటానికి అన్న విషయం మీరు మరచిపోకండి. మిమ్మును కాపాడటానికే అని మీరు మరచిపోకండి. మన కోసమే వచ్చాడాయన. మన కోసం ప్రాణం పెట్టాడాయన. అందుకే అపొస్తలుడైన పౌలు తరువాతి కాలములో ఎఫెసీయులకు పత్రిక వ్రాస్తూ ఏమంటున్నాడో చూడండి.

**ఎఫెసీ 4 : 14–** "అందువలన మనమిక మీదట పసిపిల్లలమై యుండి, మనుష్యుల మాయోపాయముల చేత వంచనతోను, తప్పు మార్గమునకు లాగు కుయుక్తితోను, గాలికి కొట్టుకొని పోవునట్లు, కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొనిపోవుచు అలల చేత ఎగురగొట్టబడిన వారమైనట్లుండక" అన్నాడు. మరి ఎలా ఉండాలి? "ప్రేమ కలిగి, సత్యము చెప్పుచూ, క్రీస్తు వలె ఉండుటకు మనం అన్ని విషయములలో ఎదగాలి". ప్రేమ కలిగి, సత్యము చెప్పుచూ ప్రతి విషయంలో మీరు యేసుక్రీస్తును పోలినవారుగా ఉండాలి అన్నాడు. యేసుక్రీస్తును పోలినవారుగా ఉండాలని వ్రాయించాడు చూడండి. ఇంతకీ ఈ స్క్రిప్ట ప్రకారం మనం ఏమి చేయాలి? యేసు వచ్చాడు. దేవుని కోరికను నెరవేర్చాడు. దేవుని స్క్రిప్ట పూర్తి చేసాడు. ఆయన తిరిగి సమాధి నుండి లేచి, వెళ్ళిపోయాడు. ఇప్పుడు మన బాధ్యత ఏంటి? మనం ఏమి చేయాలి? దేవుని సినిమా ద్వారా, మనం ఏమి నేర్చుకోవాలి? మనం మన మన పాత్రలను పోషించాలి. మరచిపోయిన మన పాత్ర దేవుడు గుర్తు చేసాడు(నాలుగు భాగాలలో). మనం ఎక్కడున్నామో గుర్తు చేసాడు. మన పాత్రంతా ఇక్కడే ఉందండి. నటనంతా భూమి మీదే ఉంది. అటు పరలోకంలో పాత్రలు లేవు. ఇటు పాతాళంలో పాత్రలు లేవు. అక్కడా అంతా రియల్సే. మరి పాత్రలు ఎక్కడున్నాయి? ఇక్కడే ఉంది పాత్ర. నేను మణికుమార్ అనే పాత్రలో ఒదిగిపోయాను. మీరు మీ పాత్రల్లో ఒదిగిపోయారు. ఏమి చేయాలని? మీ పాత్రను ఎలా పోషించాలని? క్రీస్తు వలె ఉండుటకు మీరు వచ్చారు. ది ఈస్ ఫైనల్. యేసుక్రీస్తు వలె ఉండుటకే మీరు ఈ భూమి మీదకు వచ్చారు. ప్రేమ కలిగి, సత్యము చెప్పుచూ ప్రతీ ఒక్కరినీ భూమి మీద బ్రతికిస్తూ, మీ జీవితంలో

ఒక ప్రధానమైన కర్తవ్యమును, దేవుడు వ్రాసుకున్న దానిని నెరవేర్చుటకు మీరు వచ్చారు. దానిని యేసు ప్రకటించాడు, పాటించాడు. అదే మీకు నేర్పించాడు. ఆయనను ధరించుకోమంటున్నాడు. పైపైన వేషంలో కాదు. పైపైన మాటలలో కాదు. మీ ప్రవర్తనలో, మీ క్రియలలో యేసును ధరించుకోవాలి. యేసును ధరించుకోవడమంటే జడను ఏపుగా పెంచుకోవటం కాదు. రెండు చేతులు ఇలా.. చూపించటం కాదు. కరుణామయుడు చిత్రంలో విజయ్‌చందర్ లా! మరేమిటి? యేసును ధరించు కోవాలంటే దేవుని స్క్రిప్టు పాటించాలి. ప్రేమ కలిగి, సత్యము చెప్పాలి. మిమ్మును చూచిన ఈ లోకం, 'ఒకనాటి యేసుక్రీస్తులా ఉన్నావయ్యా నీవు' అని చెప్పాలి. నిన్ను చూస్తే, ఒకనాడు యేసుని లేఖనాలలో చూసినట్టుగా ఉంది, అన్నట్టుగా మీ బ్రతుకును మార్చుకోగలరా? మిమ్మును గూర్చి ఈ సమాజం అలా చెప్పగలిగేటట్టుగా మీ నడవడికను మార్చుకోగలరా? మార్చుకోవాలి. అది అసాధ్యం మాత్రం కాదు. సాధ్యమే. ఈ అపవాదిని ఓడించడం మనకు సాధ్యమే. మన చేతుల్లో రెండంచులు వాడిగా ఉన్న ఖడ్గం ఉన్నప్పుడు ఎవరండి మనకు ఎదురు నిలబడేది? ఆ అపవాది తంత్రములు ఎదురించుటకు, వాడిని ఓడించుటకు మీరు శక్తివంతులు కావాలి. అందుకే ఈ వాక్యాన్ని సర్వాంగకవచంగా మీరు ధరించుకోవాలి. ప్రేమ కలిగి, సత్యము చెప్పుచూ, ఈ లోకానికున్న ఈ రుగ్మతలన్నిటినీ మీరు తొలగించాలి. పోరాడాలి. మీ జీవితంలో ప్రధానమైన కర్తవ్యం అదే. మిమ్మును దేవుడు పంపించింది అందుకే. ఆ పరలోకమనే రియల్స్ లోనికి మనం వెళ్ళిపోదాం. ఈ నటనను విడిచిపెట్టి, ఈ పాత్రను విడిచిపెట్టి దేవుడిచ్చిన ఆయుష్కాలము తీరిపోయిన తరువాత, దేవుని స్క్రిప్టును మనం ముగించి అక్కడికే వెళ్ళిపోవాలి. పాతాళానికి జారిపోకూడదు. దేవుని ఇష్టాన్ని పూర్తిగా నెరవేర్చాలి. ఆ యేసుక్రీస్తు తిరిగి రాబోతున్నాడు. ఆ ప్రధానమైన సుప్రీమ్ హీరో, కొదమ సింహముగా తిరిగి రాబోతున్నాడు. మనలను అందరినీ హీరోలుగా చేయడానికి ఆయన భూమి మీదకి వచ్చి చేసిన కార్యక్రమం ఇప్పటి వరకు మీరు చదివారు. ఆయన సుప్రీమ్ హీరో. ఆయన గొప్ప హీరో. హీరోలందరికీ ఆయన ఇప్పుడు మెగా హీరో. మరలా మనచేత దేవుని స్క్రిప్టును నెరవేర్చటానికి మనలను అందరినీ దేవుని వాక్యములో కడుతున్నాడాయన. మహాజ్ఞానాన్ని బోధిస్తున్నాడాయన.

అందుకే బైబిల్ అనే 66 పుస్తకాలలో, తన మనసంతా వ్రాయించాడు. తన ఇష్టమంతటినీ తెలియజేసాడు. దేవుడు ఏదీ దాచుకోలేదు. అందుకే మీరు దీనిని నెరవేర్చాలి. దేవుని ఇష్టప్రకారం మీరు బ్రతకాలి. చివరిగా ఆ తీర్పు ఎలా ఉంటుందో, ఆ భవిష్యత్తు ఎలా ఉంటుందో కూడా మీకు చెప్పేస్తాను. ఎందుకంటే మరలా నా మాటలు వినే అవకాశం రాకపోవచ్చు. మీరు చదవాలన్నా ఆ గొప్ప అవకాశం కలుగకపోవచ్చు. ఆయన తిరిగి వచ్చినప్పుడు ఆ ముగింపు ఎలా ఉండబోతుందో ఆ పరిస్థితి ఎలా ఉంటుందో చెబుతాను.

**ప్రకటన 20 : 11–** "మరియు ధవళమైన మహా సింహాసనమును దాని యందు ఆసీనుడైయున్న యొకనిని చూచితిని, భూమ్యాకాశములు ఆయన సముఖము నుండి పారిపోయెను." ఇది భవిష్యత్తు. మీరు చూస్తున్న ఈ భూమి, మీరు చూస్తున్న ఈ ఆకాశము, ఈ సెట్టింగులన్నీ ఏమయిపోయాయి? పారిపోయాయి. అంటే దేవుని సినిమా ముగింపుకొచ్చిందన్న మాట. సినిమా ముగింపుకి రాగానే దర్శకుడు ఏం చేస్తాడు? అందరినీ పిలుస్తాడు. టెంట్‌లు వేసినవాళ్ళను, మైక్ పెట్టినవాళ్ళను, లైటింగ్ పెట్టినవాళ్ళను అందరినీ పిలిచి పేకప్ చేయమంటాడు. ఎవరిది వారు పేకప్ చేసేసుకోండి. కెమెరా పేకప్. లైటింగ్ పేకప్. మైకు పేకప్. బరకాలు పేకప్. కుర్చీలు పేకప్. అందరూ పేకప్. దేవుడు వేసినటువంటి ఈ లోకేషన్, దేవుని యొక్క సృష్టి అంతా పేకప్. భూమీ వెళ్ళిపో, ఆకాశమా వెళ్ళిపో. ధవళమైన మహా సింహాసనం వచ్చేసింది. తిరిగి లేచిన ఆ యేసుక్రీస్తు రాబోతున్నాడు చూడండి. "భూమ్యాకాశములు ఆయన సముఖమునుండి పారిపోయెను. వాటికి నిలువ చోటు కనబడకపోయెను." 'ఎక్కడ ఉండమంటావు ప్రభువా మమ్మల్ని'? అన్నప్పుడు 'మీరు నా కంటికి కనిపించకూడదు' అన్నాడు. ఎందుకంటే మిమ్మల్ని చూసి చూసి, కన్నీరు కార్చి కార్చి, భూమి మీద నా పాత్ర జరగక ఎంత వ్యధపడ్డానో, ఎంత బాధ పడ్డానో! కానీ, ఈ రోజు ముగింపు! ది కన్‌క్లూజన్. ఈ రోజు వారి వారి పాత్రలు నెరవేర్చి యేసుక్రీస్తు వలె మారిన నా పిల్లలందరూ నా దగ్గరకు రాబోతున్నారు. ఎవరు స్క్రిప్టు నెరవేర్చారో, ఎవరు యేసులా మారిపోయారో, ఎవరు భూమి మీద సత్యమును ప్రేమ కలిగి చెప్పారో, వారందరినీ నేను స్వీకరించబోతున్నాను. మిగిలినవారందరినీ తోసేస్తాను అంతే. ఊడ్చేస్తాను అంతే.

ఎందుకంటే ఈ చెత్త నాకవసరం లేదు అన్నాడు. మీ ఇంటిలో చెత్తను మీరు ఉంచుకుంటారా? ఒక వస్తువు మీరు కొనుక్కున్నప్పుడు, అది విరిగిపోయిందనుకోండి, పని చేయటం లేదనుకోండి ఉంచుకుంటారా? బఠాణీలవాడు వస్తాడు. వాడిని పిలుస్తారు, ఇచ్చేస్తారు. వాడు కూడా ఇది నాకు వద్దంటే మున్సిపాలిటీ డ్రమ్ములో వేసేస్తారు. బహుశా 10,000 రూపాయలు పెట్టి కొనుక్కుని ఉండవచ్చు. మీకు దాని వలన ఇక ఉపయోగం లేదు మరి. అది పనిచేయటం లేదు కదా. అలాంటప్పుడు దానికి ఇంటిలో స్థలం వేస్టు. దేవుడు కూడా అంతే. ముగింపుకొచ్చేసరికి ఎవరు దేవుని కోసం బ్రతికారో, వారు సంఖ్యలో కొద్దిగా ఉన్నా సరే, వారిని మాత్రమే స్వీకరిస్తాడు. వారితో పాటుగా ఆయన లోకానికి వెళ్ళిపోతాడు. అక్కడ అంతా రియల్స్. మిగిలిన వారంతా పాతాళానికి జారిపోతారు. మీరలా ఉండకూడదు. నామాటలు విని, దేవుని యొక్క సంగతులు తెలుసుకుని, దేవుని సినిమా చూసిన తరువాత కూడా మీరు పాతాళానికి వెళ్ళిపోయారంటే ఇక మిమ్మల్ని ఎవరు రక్షిస్తారు చెప్పండి? లోకంలో ఎవ్వడూ మిమ్మల్ని రక్షించడు. అందరూ స్వార్థపరులే. ఆ విషయం మీకు బాగా తెలుసు. నాకూ తెలుసు. మరలా వారిని గూర్చి చెప్పుకోవడం ఎందుకు? ఇక్కడ దేవుని స్క్రిప్టు చదువుకుందాం.

**ప్రకటన 20 : 12–** "మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడియుండుట చూచితిని." ఒక్కసారి దేవుడు తన స్క్రిప్టు పాటించనివారిని చూస్తున్నాడు. కొద్దివారేమి, గొప్పవారేమి, మృతులైన వారందరూ అక్కడకు వచ్చేసారు. ఒక్కసారి జస్ట్ వారినందరినీ చూసాడు. అభాగ్యులారా! నాశనానికి వెళ్ళిపోతున్నారు. అపవాది చేత ఓడింపబడ్డారు" "అప్పుడు గ్రంథములు విప్పబడెను." తన దగ్గరున్న పుస్తకాలను దేవుడు తెరిచాడు. అయన దగ్గరున్నవన్నీ స్క్రిప్టులే. ఆయన దగ్గర రచనలే రచనలు. ఆయన పరలోకంలో తెగ రాసేస్తున్నాడండి పుస్తకాలు. ఆయన చాలా గొప్ప రచయిత. "అప్పుడు గ్రంథములు విప్పబడెను. మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను. ఆ గ్రంథములయందు వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి." ఆయన ఎంత మంచి సిస్టమ్ పెట్టుకున్నాడో చూడండి. పాతాళానికి జారిపోతున్నవారు మారు

మాట్లాడకుండా, తిరిగి వారు పల్లెత్తు మాట మాట్లాడకుండా ఉండటానికి మనిషి చేసిన అకృత్యాలన్నింటినీ తన పుస్తకాలలో ఆయన భద్రపరిచాడు. 'పాతాళానికి నన్నెందుకు పంపించేస్తున్నావు ప్రభో! అని చాలామంది గోల పెట్టేస్తారు అక్కడ. తండ్రీ, నన్ను మాత్రం అక్కడికి పంపించకు. అది మహా వేదన. అక్కడ ఉన్నది రోదన, అగ్ని! దయచేసి ఒక్కసారి, ఈ సారికి మాత్రమే కనికరించవా? అని అడిగేవారు చాలామంది అక్కడ ఉంటారు. అప్పుడు మీ పేరిట దేవుని దగ్గర ఒక పుస్తకం వ్రాయబడి ఉంది. ఆ పుస్తకంలో మీరు చేసిన ప్రతీ క్రియా ఉంది. అది ప్రేమ కలిగి సత్యం చెప్పిన క్రియా? అది భూమి మీద లోకంలో మీరు లోకాశకు లోనై బ్రతికిన క్రియా? "గ్రంథములు విప్పబడెను, జీవగ్రంధమను వేరొక గ్రంథము విప్పబడెను." జీవగ్రంధములో ఎవరైతే ప్రేమ కలిగి సత్యము చెప్పి క్రీస్తును ధరించుకున్నారో వారి పేర్లు మాత్రమే వ్రాయబడ్డాయి. మరి విప్పబడిన మిగిలిన గ్రంథములలో... మనము మన తల్లిగర్భము నుండి బయటకు వచ్చిన రోజు నుండి మరల మట్టికి చేరినంత వరకు చేసిన ప్రతీ పని, మన పేరిట వ్రాయబడింది. ఉదాహరణకు, 'మణికుమార్ – నీవు పుట్టిన దగ్గర నుండి చచ్చినంత వరకు నీవు ఎవరి కోసం బ్రతికావు? ఏ క్రియలు చేసావు? ఎవరి ఇష్టాన్ని నెరవేర్చావు? నా స్క్రిప్టు పాటించావా? నీవు పాటిస్తే జీవగ్రంథంలో నీ పేరు ఉండాలి. మణికుమార్ అనే పేరు ఉందో లేదో చెక్ చేయండి అంటాడు దేవుడు. రైట్! వుందా, అయితే నీకు పరలోకానికి ఆహ్వానం! మరల మరొక వ్యక్తి, నీ పేరు లేదా అయితే నీవు పాతాళానికి పోవాలి. దేవుని దగ్గర గ్రంథములు విప్పబడెను. అందులో వ్రాయబడియున్నవి ఏమిటో తెలుసా? మన క్రియలు. నేను చేసిన పని ఎవ్వరూ చూడటం లేదు అని అనుకుంటున్నారా? ఒక ప్రక్కన వ్రాసేస్తున్నాడాయన. ఆయన ప్రతి దానిని లిఖింపచేస్తున్నాడు. మీరు పలికిన ప్రతి మాటా అందులో ఉంటుంది. మీరు విన్నది ప్రతీది అందులో ఉంటుంది. మీరు నడచిన ప్రతీ అడుగు అందులో ఉంటుంది. మీ 60 సంవత్సరాల జీవిత చరిత్ర అందులో ఉంటుంది. సి.సి. కెమెరాలు తెలుసుగా మీకు? ఆ రోడ్డున పోయే ప్రతీ ఒక్కరి ఫుటేజ్‌ని అవి రికార్డు చేస్తూ ఉంటాయి. భూమి మీద మనిషికే అంత పరిజ్ఞానం ఉంటే, రోడ్డు మీద వెళ్ళే ప్రతీ ఒక్కరినీ కాప్చర్ చేయగలుగుతుంటే, ఎ.టి.ఎమ్. లోనికి వచ్చిన ప్రతీ ఒక్కరినీ కాప్చర్

చేయగలుగుతుంటే, ఆయన కాప్చర్ చేయలేడా? సృష్టి అంతా సి.సి. కెమెరాలే ఉన్నాయి. మీరు చిట్ట చీకటిలో ఏ కార్యమును చేసినా ప్రతీదీ రికార్డింగ్ అవుతుంది, ప్రతీది లిఖింపబడుతుంది. అది మీ పేరిట లిఖింపబడుతుంది. మీ పేరు వ్రాసుకోవటం, ఆ పేరు క్రింద మీ క్రియలు వ్రాసుకోవటం షరా మామూలే అక్కడ. అప్పుడు గ్రంథములు విప్పబడెను. ముగింపు చూడండి. కన్‌క్లూజన్ చూడండి ఎలా ఉందో. "ఆ గ్రంథముల యందు వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి. సముద్రము తనలోనున్న మృతులను అప్పగించెను. మరణమును, పాతాళలోకమును వాటి వశముననున్న మృతులను అప్పగించెను." ఎవడూ తప్పింపబడడానికి వీలు లేదు. సముద్రంలో చచ్చిన వాడైనా, రోడ్డు మీద చచ్చినవాడైనా, ఆసుప్రతిలో చచ్చినవాడైనా, ప్రతీ ఒక్కరూ అక్కడికి వచ్చేసారు. స్క్రిప్టు నెరవేర్చిన, నెరవేర్చని ప్రతీ ఒక్కరూ అక్కడికి వచ్చారు. చివరికి "వారిలో ప్రతివాడు తన క్రియల చొప్పున తీర్పుపొందెను. మరణమును, మృతుల లోకమును అగ్ని గుండములో పడవేయబడెను. ఈ అగ్ని గుండము రెండవ మరణము".

మొదటి మరణము మనందరికీ వస్తుంది. దాని గురించి భయపడకండి. రెండవ మరణానికి మీరు భయపడాలి. రెండవ మరణమును మీరు పొందకూడదు. నిత్యజీవానికి వెళ్ళవలసినవారు మీరు. స్క్రిప్టు పాటించి, నిత్యజీవానికి ఆహ్వానింపబడవలసినవారు మీరు. ఎందుకయ్యా రెండవ మరణానికి వెళ్ళిపోతారు? ఎందుకయ్యా కోరుకుంటున్నారు దానిని. నిజానికి ఈ రెండవ మరణానికి ఎవ్వరూ వెళ్ళకూడదు. ఆ అగ్నిగుండము రెండవ మరణము. కానీ, ఎవడైతే దేవుని ఇష్టాన్ని నెరవేర్చలేదో వాడు రెండవ మరణానికి వెళ్ళవలసిందే. వాడు నిత్యాగ్ని నరకములోనికి జారవలసిందే. వాడు యుగముగములు బాధను అనుభవించవలసిందే. "ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్టు కనబడనియెడల వాడు అగ్ని గుండములో పడవేయబడెను". **(ప్రకటన 20 : 15)**

ది బుక్ ఆఫ్ లైఫ్ *{The Book of Life}*, జీవగ్రంథములో మీపేరుందా? *{This is God's Movie. This is Conclusion}* దేవుడు తీసిన ఈ సినిమాలో చివరిగా ఆయన చెబుతున్నదేమిటో తెలుసా? ముగింపులో ఆయన మీకు

ఇస్తున్న హెచ్చరిక ఏమిటో తెలుసా? నా జీవగ్రంథంలో మీ పేరుందా? అని అడుగుతున్నాడు. గుండెలమీద చేయి వేసుకుని చెప్పండి, నా పేరుందని! ఏమీ ఫరవాలేదు. మీరిప్పుడు చెప్పలేకపోయినా, మీకు దేవుడు ఒక మంచి అవకాశం కల్పించాడు. 4 భాగాలు మీరు చూసారు, చదివారు. ఒక చక్కని నిర్ణయం తీసుకోండి. మీ మనసును పూర్తిగా మార్చుకోండి. ఇకమీదట నేను బ్రతికితే దేవుని స్క్రిప్టుకి అనుకూలంగా బ్రతకాలి, లేకపోతే మరణమే మేలు అనుకున్నంతగా బ్రతకండి. మొదటి శతాబ్ధంలో అపొస్తలుడైన పౌలు అదే అనుకున్నాడు. "నామట్టుకైతే బ్రతకుట క్రీస్తే, చావైతే లాభం" అన్నాడు. మనము క్రీస్తు కొరకు బ్రతుకుతున్నప్పుడు చావైతే లాభం. ఎందుకంటే జీవగ్రంథమందు మన పేరుంది. యేసుక్రీస్తు జయించినవాడు. ఆయన అపవాదిని జయించినవాడు. భూమి మీదకి వచ్చిన ప్రతీ ఒక్కడు జయించకపోతే జీవగ్రంథంలో వాని పేరుండదు.

**ప్రకటన 3 : 21-** "నేను జయించి నా తండ్రితోకూడ ఆయన సింహాసనమునందు కూర్చుండియున్న ప్రకారము..." అని చెప్పాడు చూడండి. యేసుక్రీస్తు జయించాడు. జయించాను అనగానే ఎవరిని జయించాడు? 3వ భాగములో నేను చెప్పిన ఆ దెయ్యాన్ని, ఆ దుష్టుని జయించాడు. నేను జయించి నా తండ్రితో కూడా ఆయన సింహాసనమందు కూర్చున్నాను అని అంటున్నాడు. తండ్రి వెంటనే జయించిన వారికి తన సింహాసనం ఇచ్చేస్తున్నాడు. యేసుక్రీస్తు సాతానును ఎందుకు జయించాడో తెలుసా! ఆయనకు ఈ సింహాసనం అంతకు ముందు లేదని కాదు. భూమి మీద మరియ గర్భమందు పుట్టక ముందు కూడా ఆయనకు ఆ సింహాసనం ఉంది. కానీ, ఆ సింహాసనాన్ని విడిచిపెట్టి భూమి మీదకి వచ్చి, వాడిని జయించి మరలా అక్కడికి వెళ్ళింది ఎందుకో తెలుసా! నీ కోసం, నా కోసం, మన అందరి కోసం మాత్రమే అని ఎప్పుడూ మరిచిపోవద్దు. 'జయించే ప్రతీ ఒక్కడిని తనతోపాటు తన తండ్రి సింహాసనమందు కూర్చోబెడతాడు. మీకు ఆ అవకాశమును యేసుక్రీస్తు కల్పిస్తున్నాడు. జయించే ప్రతీ ఒక్కడు ఆయనవలె జయించాలి అంటున్నాడాయన. అప్పుడు మీకు కూడా ఆయన తన సింహాసనాన్ని ఇస్తానని అంటున్నాడు. ఇప్పుడు చెప్పండి. ఎవరు దేవుని కొరకు బ్రతకాలి? ఎవరు

దేవుని ఇష్టాన్ని నెరవేర్చాలి? ఎవరు దేవుని కార్యక్రమాలను చేయాలి? పిలుపు కలిగినవారా? లేక అందరూనా? ఎవరికైతే నిత్యజీవముపై ఆశ ఉన్నదో వారందరూ దేవుని స్క్రిప్ట్‌ను పాటించాలి. ఇందులో ఏ బేధమూ లేదు. మీకు నిజంగా పిలుపు కావాలనుకుంటే, ఇదిగో ఇప్పుడు నేను పిలుస్తున్నాను. దేవుని పక్షాన ఈ పిలుపును స్వీకరించండి. ఎవరికి పరలోకం కావాలో, వారు జయించి తీరాలి. ఎవరికి దేవునియొక్క లోకము కావాలో, ఎవరు నిత్యత్వాన్ని కోరుకుంటున్నారో వారి పేరు జీవగ్రంథంలో ఉండి తీరాలి. యేసుక్రీస్తు జయించి చూపించాడు. మనమూ జయించాలి. ఇక ఆ ఉండబోయే క్రొత్త లోకం ఎలా ఉంటుందో తెలుసా? చివరిగా ముగింపులో ఆ మాటలను చదువుకుని ఆనందముతో క్రీస్తుతో ప్రయాణిద్దాం.

ప్రకటన **21 : 1–** లో చూడండి. ఆ క్రొత్త భూమి, ఆ క్రొత్త ఆకాశమును గూర్చి కూడా చెబుతున్నాడు. మీరు ఈ భూమి, ఈ ఆకాశమును మాత్రమే చూసారు. మీరు దీనిని కోరుకున్నారు. కానీ ఆ క్రొత్త భూమి, ఆకాశములు ఎలా ఉన్నాయో, ఆ భవిష్యత్తు ఎలా ఉందో చూడండి. మీరు నిజంగా జయించినవారైతే మీకు ఏమి ఇవ్వబోతున్నాడో ముందుగానే ఆయన శాంపిల్‌గా చెబుతున్నాడు చూడండి. “అంతట నేను క్రొత్త ఆకాశమును, క్రొత్త భూమిని చూచితిని. మొదటి ఆకాశమును మొదటి భూమియు గతించిపోయెను.” మునుపటి ఆ సెట్టింగ్ అంతా దేవుడు తీసేసాడు. ముందు ఉన్న ఆ టెంట్ అంతా దేవుడు మడిచేసాడు. ఆకాశమును పరిచిన దేవుడు, ఇప్పుడు మడిచాడు. మరి ఇప్పుడేం వచ్చాయి? క్రొత్త ఆకాశము మరియు క్రొత్త భూమి. అవే పరలోకానికి సంబంధించినవి!

ప్రకటన **21 : 1–** “సముద్రము ఇకను లేదు. మరియు నేను నూతనమైన యెరూషలేము అను ఆ పరిశుద్ధ పట్టణము తన భర్త కొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తె వలె సిద్ధపడి పరలోకమందున్న దేవునియొద్ద నుండి దిగి వచ్చుట చూచితిని. అప్పుడు – ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉన్నది, ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలైయుందురు.” అక్కడ దుష్టుడు లేడు. అక్కడ ఇక యుద్ధము లేదు. మీ తండ్రి మీతో ఉన్నాడు. మీ తండ్రితో మీరు మీ కాలాన్ని గడుపుతారు. మీరు దేవుని ప్రజలుగా, ఆయన

కుమారులుగా ఉంటారు. లోకమందు ఉన్నట్టుగా కాదు. నిత్యానందముతో, సంతోషముగా ఉంటారు. చూడండి ఇంకా ఏమంటున్నాడో... "ఆయన వారి కన్నుల నుండి ప్రతీ బాష్పబిందువును తుడిచివేయును. మరణము ఇక ఎన్నడూ ఉండదు. దు:ఖమైనను, ఏడ్పైనను, వేదనయైనను ఇక ఉండదు. మొదటి సంగతులు గతించిపోయెనని సింహాసనములో నుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని." ఇంతటితో దేవుడు సినిమా ముగింపబడింది. అందుకే దానిని మొదటి సంగతులు అన్నాడాయన. ఆ మొదటి సంగతులే ఈ నాలుగు భాగములలో మీరు చూసిన దేవుడు తీసిన సినిమా. ఆ మొదటి సంగతులు గతించిపోయెను. ఆ క్రొత్త భూమి, ఆ క్రొత్త ఆకాశము కోసం మీరు ఎదురుచూడాలి. మరల చెబుతున్నాను... జయించిన వారికే ఈ అవకాశం! ఇదే దేవుడు తీసిన సినిమా!!

ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్

క్రైస్ట్ చర్చ్ – సామర్లకోట – 8978414178.

## దేవుడు తీసిన సినిమా - ప్రశ్నలు

1. దేవుడు సినిమాను తీస్తాడా? వివరించండి?
2. దేవుడు తీసిన సినిమాలో మీ పాత్రను ఎలా పోషించాలి?
3. దేవుడు తీసిన సినిమాలో పాత్రధారలను గూర్చి వివరించండి?
4. సినిమా అంటే ఏమిటి? ప్రపంచ సినిమా చరిత్రను తెలియజేయండి?
5. దేవుడు తీసిన సినిమాలో ప్రతినాయకుని(విలన్) గూర్చి వివరించండి?
6. దేవుడు తీసిన సినిమాలో కథానాయకుని(హీరో) గూర్చి వివరించండి?
7. దేవుడు తీసిన సినిమా ముగింపును సవివరముగా తెలియజేయండి.
8. లోకమర్యాద ఎలా ఉంది? దేవుని మర్యాద ఎలా ఉండాలి? వివరించండి?
9. దేవుడు తీసిన సినిమాలో లొకేషన్ మరియు సెట్టింగ్స్‌ను గూర్చి వివరించండి?
10. దేవుడు తీసిన సినిమాకు మూల కథ ఏమిటి? సవివరముగా తెలియజేయండి.
11. దేవుడు తీసిన సినిమాకు ఖర్చెంత? అయినా ప్రపంచవ్యాప్తంగా ఎందుకు విడుదల కాలేదు?
12. లోకసంబంధమైన సినిమాలో విలన్, దేవుని సినిమాలో విలన్‌ల మధ్య ప్రధానమైన వ్యత్యాసమును వివరించండి?